బుధవారం 19-7-2023

సత్యమేవ జయతే


సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 118

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL




'సంక్షేమ పథకాల అమలే సర్కారు పని తీరుకు కొలమానం'



సెన్సెక్స్ @ 67,000

ఐటీ షేర్లు రాణించడంతో స్టాక్ సూచీల కొత్త రికార్డుల ర్యాలీ నాలుగోరోజూ కొనసాగింది. ఉదయం సెన్సెక్స్ 239 పాయింట్ల లాభంతో 66,829 వద్ద, నిఫ్టీ 77 పాయింట్లు పెరిగి 19,788 వద్ద మొదలయ్యాయి.

- వివరాలు 13లో



నేడు అఖిల పక్ష సమావేశం

ఈ నెల 20 నుంచి పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు మొదలవుతున్న వేళ కేంద్ర ప్రభుత్వం అఖిలపక్ష భేటీ నిర్వహించనుంది.

- వివరాలు 6లో



ఊమెన్ చాందీ కన్నుమూత

కాంగ్రెస్ సీనియర్ నేత, కేరళ సీఎంగా రెండు సార్లు పనిచేసిన ఊమెన్ చాందీ కన్నుమూశారు. బుధవారం అంత్యక్రియలు జరుగుతాయి.

- వివరాలు 6లో



ఐరాసలో మోదీ ప్రసంగం

ఐక్యరాజ్యసమితి సర్వప్రతినిధి సభ వార్షిక అత్యున్నత సమావేశంలో భారత ప్రధాని మోదీ ప్రసంగించనున్నారు.

- వివరాలు 6లో



'గిన్నిస్'లోకి సాత్విక్ స్మాష్...

యోనెక్స్ సంస్థ టెస్టులో గంటకు 565 కి.మీ. వేగంతో దూసుకెళ్లిన షటిల్. భారత డబుల్స్ స్టార్ ప్లేయర్ ఘనత.

- వివరాలు 12లో



బెంగళూరులో జరిగిన విపక్షాల భేటీలో పాల్గొన్న నేతలు సిద్ధరామయ్య, హేమంత్ సోరెన్, మమతా బెనర్జీ, రాహుల్‌గాంధీ, మల్లికార్జున ఖర్గే, శరద్‌పవార్, సీతారాం ఏచూరి, జైరాం రమేశ్, రాజా, అరవింద్ కేజ్రీవాల్ తదితరులు

బెంగళూరులో ఇండియా | కలిసి ఓడిస్తాం!

'ఇండియా' వర్సెస్ మోదీ.. ఇదే విపక్షాల సమరనాదం

- బెంగళూరు భేటీలో 'సామూహిక సంకల్పం'
- కూటమి పేరు ఇండియన్ నేషనల్ డెవలప్‌మెంటల్ ఇంక్లూజివ్ అలయన్స్... పార్టీల మధ్య సమన్వయ సాధన తదితరాలకు 11 మందితో కమిటీ
- ముంబైలో జరిగే భేటీలో కన్వీనర్ ఎంపిక, కీలక నిర్ణయాలు
- ప్రచార నిర్వహణ తదితరాలకు ఢిల్లీలో కూటమి సచివాలయం
- కూటమి సారథ్యం ఎవరిదన్నది మాత్రం ప్రస్తుతానికి సస్పెన్స్
- 'ఇండియా'ను సవాలు చేసే దమ్ము బీజేపీకి ఉందా!: మమత
- బీజేపీ ప్రభుత్వంపై 420 సెక్షన్ విధించామన్న దీదీ
- విపక్షాలన్నింటికీ దేశమే కుటుంబం: మోదీపై ఉద్ధవ్ విసుర్లు

బెంగళూరు: 26 విపక్ష పార్టీలు సమైక్యంగా 2024 లోక్‌సభ ఎన్నికల సమరనాదం చేశాయి. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ సారథ్యంలోని ఎన్డీఏ కూటమిని ఓడించడమే ఏకైక లక్ష్యంగా ఒక్క తాటి పైకి వచ్చాయి. ఇండియా (ఇండియన్ నేషనల్ డెవలప్‌మెంటల్ ఇంక్లూజివ్ అలయన్స్) పేరుతో కొత్త కూటమిగా ఆవిర్భవించాయి. సమైక్యతా ప్రయత్నాల్లో భాగంగా సోమవారం బెంగళూరులో మొదలైన విపక్షాల రెండు రోజుల భేటీ మంగళవారం సాయంత్రం ముగిసింది. కాంగ్రెస్‌తో పాటు తృణమూల్ కాంగ్రెస్, డీఎంకే తదితర 26 పార్టీల అధినేతలు, అగ్ర నేతలు పలు అంశాలపై నాలుగు

మిగతా 6వ పేజీలో ▶

'ఇండియా'పై యుద్ధానికి దిగితే... గెలుపెవరిదో అందరికీ తెలుసు

2024 ఎన్నికల ఫలితాలపై రాహుల్ జోస్యం

మాది ప్రత్యామ్నాయ ఎ'జెండా'

'ఇండియా' కూటమి జాయింట్ డిక్లరేషన్

6లో



ఢిల్లీలో మంగళవారం ఎన్డీయే మిత్రపక్షాల నేతలతో ప్రధాని నరేంద్ర మోదీ. చిత్రంలో నితిన్ గడ్కరీ, రాజ్‌నాథ్‌సింగ్, పళనిస్వామి, రాందాస్ అథవాలే, చిరాగ్ పాశ్వాన్, పవన్‌కల్యాణ్, జేపీ నడ్డా, ఏక్‌నాథ్ షిండే, అమిత్‌షా తదితరులు

ఢిల్లీలో ఎన్డీయే | మళ్లీ గెలుస్తాం!

ప్రజల ఆకాంక్షలను నెరవేర్చింది ఎన్డీయేనే

- విపక్షాల 'ఇండియా' కూటమిపై మోదీ విసుర్లు
- అది యూపీఏకే మరో రూపమంటూ ఎద్దేవా
- దేశ ప్రయోజనాలే మాకు పరమావధి
- ఎన్డీయే భేటీలో మోదీ ప్రసంగం
- సమావేశానికి 38 పార్టీలు హాజరు

న్యూఢిల్లీ: 'ఇండియా' పేరిట కొత్త రాజకీయ కూటమికి శ్రీకారం చుట్టిన విపక్షాలపై ప్రధాని నరేంద్ర మోదీ పదునైన విమర్శలతో విరుచుకుపడ్డారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీ దూకుడుకు క్లీం వేసేందుకు అవి నిర్వహించిన బెంగళూరు భేటీకి దీటుగా ఎన్డీయే కూటమి కూడా భాగస్వామ్య పక్షాలన్నింటితో మంగళవారం హస్తినలో పూర్తిస్థాయి బలప్రదర్శనకు దిగింది. ఏకంగా 38 పార్టీలు పాల్గొన్న ఎన్డీయే సమావేశాన్ని ఉద్దేశించి మోదీ మాట్లాడారు. ''అప్పటి యూపీఏనే ఇప్పుడు 'ఇండియా' అయింది. 'పక్షవాత' విధానాలను అవలంబించడం వల్లే యూపీఏ కూటమి 2014లో ఓటమి పాలైంది. నాడు ప్రధాని (మన్మోహన్ సింగ్)ని మించిన హైకమాండ్, కుంటుబడిన పాలనా విధానాలు, అంతర్గత స్పర్థలు, అంతులేని అవినీతి, భారీ కుంభకోణాలమయంగా నాటి యూపీఏ పాలన కొనసాగింది. కూటములు కట్టే సంస్కృతి దేశంలో చాన్నాళ్లుగా ఉంది. కానీ ప్రతికూల, హానికర కూటములు మన దేశంలో నెగ్గవు, నెగ్గలేవు'' అని జోస్యం చెప్పారు.

కూల్చేందుకే కూటములు కట్టింది

కూల్చేందుకే కూటములు కట్టడం కాంగ్రెస్ పార్టీ నైజమని మోదీ దుయ్యబట్టారు. '1990ల్లో దేశాన్ని అస్థిరపరిచే కుట్రతో కాంగ్రెస్

మిగతా 6వ పేజీలో ▶



కుటుంబం వలన.. కుటుంబం కోసం..

- ఇదే ప్రతిపక్ష నేతల నినాదం: మోదీ
- బెంగళూరు భేటీని చూసి జనం నవ్వుకుంటున్నారు

6లో

న్యూస్‌రీల్

11 ఎకరాలు ఎలా కేటాయించారు?



కోకాపేటలోని అత్యంత విలువైన 11 ఎకరాల భూమిని భారత్ రాష్ట్ర సమితికి కేటాయించడంపై రాష్ట్ర ప్రభుత్వానికి, ఆ పార్టీకి హైకోర్టు నోటీసులు జారీచేసింది. కేటాయింపుపై కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది.

- వివరాలు 10లో

భారీ నష్టాల్లో ఉత్తర డిస్కం



టీఎస్ఎన్పీడీసీఎల్ భారీ నష్టాలతో కొట్టుమిట్టాడుతోంది. కాళేశ్వరం ఎత్తిపోతల పథకానికి సరఫరా చేసిన విద్యుత్‌కి సంబంధించిన బకాయిలు భారీగా పేరుకుపోతున్నాయని అధికార వర్గాలు చెబుతున్నాయి.

- వివరాలు 2లో

ఇక స్థానిక భాషల్లోనే ఉన్నత విద్య



ఉన్నత విద్యలో ప్రాంతీయ భాషలకు ప్రాధాన్యతనివ్వాలని యూజీసీ నిర్ణయించింది. ఉన్నత విద్య పాఠ్య పుస్తకాలను ప్రాంతీయ భాషల్లో తర్జుమా చేయాలని రాష్ట్రాల ఉన్నత విద్యామండళ్లకు సూచించింది.

- వివరాలు 3లో

కారు దిగేనా.. 'చేతి'కొచ్చేనా!?



హైదరాబాద్ మాజీ మేయర్ తీగల కృష్ణారెడ్డి, ఆయన కోడలు, రంగారెడ్డి జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి త్వరలోనే కాంగ్రెస్‌లో చేరనున్నారనే ప్రచారం జరుగుతోంది.

- వివరాలు 2లో



మనం 'భారత్' అని పెట్టుకుంటే పోలా...!



నిజామాబాద్ జిల్లా చిక్లి గ్రామ శివారులో పొలాల్లోకి చేరిన వర్షపు నీరు

రాష్ట్రానికి రెడ్ అలర్ట్

నేడు, రేపు భారీ నుంచి అతిభారీ వర్షాలు

- రాష్ట్రవ్యాప్తంగా ముసురుపట్టింది. మంగళవారం ఉదయం నుంచీ పలు జిల్లాల్లో వర్షాలు కురుస్తూనే ఉన్నాయి. బుధ, గురువారాల్లో పలుచోట్ల భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఈ నేపథ్యంలో రెడ్ అలర్ట్ జారీ చేసినట్లు పేర్కొంది.

5లో

ఆగస్టు 1న మహారాష్ట్రకు కేసీఆర్

- సామాజిక కార్యకర్త అన్నాభావు సాఠే పుణ్యతిథికి హాజరు
- అదే రోజు బీఆర్ఎస్‌లో చేరనున్న సాఠే కుటుంబసభ్యులు
- అంబాబాయి మందిరంలో పూజలు... వచ్చే నెలలో షోలాపూర్, పుణేల్లో సభలు



సాక్షి, హైదరాబాద్: భారత్ రాష్ట్ర సమితి కార్యకలాపాలను జాతీయ స్థాయిలో విస్తరించేందుకు అత్యంత ప్రాధాన్యతనిస్తున్న పార్టీ అధినేత, సీఎం కె.చంద్రశేఖర్‌రావు ఆగస్టు 1న మహారాష్ట్రలో పర్యటించనున్నారు. ప్రముఖ సామాజిక కార్యకర్త, రచయిత అన్నాభావు సాఠే వర్ధంతి కార్యక్రమంలో పాల్గొననున్నారు. అన్నాభావు

మిగతా 2వ పేజీలో ▶

ఇక ఆరోగ్యశ్రీ డిజిటల్ కార్డులు

- ఆరోగ్యశ్రీ పరిమితి రూ.2 లక్షల నుంచి రూ.5లక్షలకు పెంపు
- వరంగల్ ఎంజీఎంలోనూ కాక్లియర్ ఇంప్లాంట్ సర్జరీలు
- డయాలసిస్ సేవల కోసం ప్రత్యేక సాఫ్ట్‌వేర్: మంత్రి హరీశ్‌రావు



సాక్షి, హైదరాబాద్: కొత్త ఆరోగ్యశ్రీ డిజిటల్ కార్డులను రూపొందించి స్థానిక ప్రజాప్రతినిధుల ద్వారా జిల్లాల్లోని లబ్ధిదారులకు అందజేయాలని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు ఆదేశించారు. మంగళవారం ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్ కార్యాలయంలో ఆరోగ్యశ్రీ బోర్డు సమావేశం జరిగింది. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ పరిమితి రూ.2లక్షల నుంచి రూ.5లక్షలకు పెంచినందున కొత్త ఆరోగ్యశ్రీ డిజిటల్ కార్డులను రూపొందిస్తున్నామని చెప్పారు. అందుకోసం లబ్ధిదారుల ఈ-కేవైసీ

మిగతా 3వ పేజీలో ▶

రూ.231 కోట్లు కొట్టేశారు!

బోధన్ నకిలీ చలాన్ల కుంభకోణం కేసులో చార్జిషీట్ దాఖలు

- అధికారులతో కుమ్మక్కైన ప్రైవేట్ ట్యాక్స్ కన్సల్టెంట్లు
- చలాన్లు కట్టకుండా కట్టినట్లు చూపించి సొంత ఖాతాల్లోకి మళ్లింపు
- 123 మంది సాక్షుల వాంగ్మూలాలు సేకరించిన సీఐడీ
- 22మంది వాణిజ్య పన్నుల అధికారులు సహా మొత్తం 34 మంది అరెస్టు



సాక్షి, హైదరాబాద్/బోధన్: బోధన్ నకిలీ చలాన్ల కుంభకోణం కేసులో ఎట్టకేలకు చార్జిషీట్ దాఖలైంది. 2017 నుంచి ఆరేళ్ల పాటు సుదీర్ఘంగా దర్యాప్తు చేసిన తెలంగాణ సీఐడీ అధికారులు ఇటీవల కరీంనగర్‌లోని ఏసీబీ ప్రత్యేక కోర్టులో చార్జిషీట్ దాఖలు చేసినట్లు సీఐడీ అడిషనల్ డీజీ మహేశ్‌భగవత్ వెల్లడించారు. ఈ కేసులో మొత్తం 34 మంది నిందితులను అరెస్టు చేశారు. వీరిలో 22 మంది వాణిజ్య పన్నుల విభాగానికి చెందిన అధికారులే.మొత్తం 123 మంది సాక్షులను విచారించినట్టు చార్జిషీట్‌లో పేర్కొన్నారు. 68 రకాల సాఫ్ట్‌వేర్ మెటీరియల్‌తో పాటు 143 డాక్యుమెంట్లు, మూడు ఆడిట్ రిపోర్టులను సాక్ష్యాలుగా కోర్టుకు సమర్పించారు. ఈ కుంభకోణంలో నిందితులు మొత్తం రూ.231.22 కోట్లు ప్రభుత్వ ఖజానా నుంచి కొల్లగొట్టినట్టు తేల్చారు. దీనికి సంబంధించి 2005 నుంచి 2016 వరకు బోధన్, నిజామాబాద్ వాణిజ్య పన్నుల శాఖలో పని చేసిన అధికారుల వివరాలు సీఐడీ సేకరించింది.

ఇలా దోచేశారు..

వాణిజ్య పన్నులశాఖ బోధన్ సర్కిల్‌లో జరిగిన నకిలీ చలాన్ల

మిగతా 3వ పేజీలో ▶

నేడు కాంగ్రెస్ లంచ్ భేటీ!

ఎంపీ కోమటిరెడ్డి నివాసంలో భేటీ కానున్న కాంగ్రెస్ ముఖ్యులు

- హాజరు కానున్న ఠాక్రే, రేవంత్, భట్టి, ఉత్తమ్ తదితరులు
- పార్టీలో చేరికలకు లైన్‌క్లియర్ అయ్యే అవకాశం
- రేపు ఢిల్లీకి రేవంత్ బృందం.. ఖర్గేను కలవనున్న పార్టీలో చేరే నేతలు

2లో



కొల్లాపూర్‌లో ప్రియాంక సభ వాయిదా 2లో

కాంగ్రెస్‌లో చేరినందుకే కక్ష సాధింపు చర్యలు

బీఆర్ఎస్‌పై పొంగులేటి ఆరోపణలు

- 13 ఏళ్ల క్రితం ఎస్సార్ గార్డెన్స్ నిర్మించా
- అప్పుడు సర్వే చేయకుండా ఇప్పుడు బురదజల్లే యత్నం... కబ్జా అని తేలితే ఆ భూమి అంతా రాసిస్తా..

2లో



పొంగులేటి సోదరులకు హైకోర్టు ఊరట 2లో

క్లుప్తంగా...

వచ్చే ఎన్నికల్లోనూ కాంగ్రెస్‌కు 'పవర్' హాలిడే

రైతు సమావేశంలో మంత్రి పువ్వాడ



సాక్షిప్రతినిధి, ఖమ్మం: తప్పుడు ప్రచారం చేస్తూ ప్రజలను అయోమయానికి గురిచేస్తున్న కాంగ్రెస్ పార్టీకి వచ్చే ఎన్నికల్లోనూ పవర్ హాలిడే తప్పదని రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ అన్నారు. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి అవగాహనా రాహిత్యంతోనే మాట్లాడుతున్నా రని విమర్శించారు. ఖమ్మం నియోజకవర్గంలోని వి.వెంకటాయపాలెంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో నిర్మించిన 300 మెట్రిక్ టన్నుల గోడౌన్, షాపింగ్ కాంప్లెక్స్‌ను మంగళవారం మంత్రి ప్రారంభించారు. అనంతరం రైతు వేదిక వద్ద ఏర్పాటు చేసిన రైతుల సమావేశంలో పువ్వాడ మాట్లాడుతూ 3 గంటలపాటే విద్యుత్ ఇస్తామని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టగలదా అని ప్రశ్నించారు.

రేవంత్ మానసిక రోగి..

కాంగ్రెస్ అధిష్టానానికి బీఆర్ఎస్ నేత దాసోజు లేఖ



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి మానసిక రోగిలా ట్రాన్స్‌జెండర్లు, బీసీలు, పేద రైతులను అవమానిస్తున్నారని బీఆర్ఎస్ నేత దాసోజు శ్రవణ్ అన్నారు. రేవంత్‌రెడ్డిని సమాజం నుంచి బహిష్కరించి క్వారంటైన్‌లో పెట్టాలని సూచించారు. ఈ మేరకు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, మాజీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ, ప్రధాన కార్యదర్శి ప్రియాంకా గాంధీకి దాసోజు శ్రవణ్ మంగళవారం బహిరంగ లేఖ రాశారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన అధ్యక్ష పదవిని దుర్వినియోగం చేస్తూ డబ్బులు వసూలు చేస్తున్నారని, తన అనుచరులతో వ్యాపారవేత్తలను బెదిరిస్తున్నా రని లేఖలో పేర్కొన్నారు. రేవంత్‌ను వెంటనే అధ్యక్ష పదవి నుంచి తొలగించాలని కోరారు.

రాజకీయాల్లో హత్యలుండవ్.. ఆత్మహత్యలే

దాసోజునుద్దేశించి మల్లు రవి వ్యాఖ్య



సాక్షి, హైదరాబాద్: రాజకీయాల్లో హత్యలుండవని, ఆత్మహత్యలే ఉంటాయని, బీఆర్ఎస్ నేత దాసోజు శ్రవణ్ కూడా ఆ కోవకు చెందినవారేనని టీపీసీసీ ఉపాధ్యక్షుడు మల్లు రవి అన్నారు. మంగళవారం ఆయన గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడుతూ టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిపై ఏఐసీసీకి దాసోజు ఫిర్యాదు చేయడం చూస్తుంటే ఆయన ఇంకా కాంగ్రెస్‌లోనే ఉన్నాననే భ్రమలో ఉన్నట్లుందని ఎద్దేవా చేశారు. రాజకీయాల్లో బూతులు తిట్టే సంప్రదాయం సీఎం కేసీఆర్ నుంచే వచ్చిందని, తిట్లు తిట్టడంలో ఆయన ఒక యూనివర్సిటీ పట్టభద్రుడని విమర్శించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేకనే బీఆర్ఎస్ ఇలాంటి చర్యలకు పాల్పడుతోందన్నారు.

రేవంత్‌ను విమర్శిస్తే ప్రజలు క్షమించరు

టీపీసీసీ అధికార ప్రతినిధి బోరెడ్డి అయోధ్యరెడ్డి



సాక్షి, హైదరాబాద్: సమస్యలపై పోరాటం చేస్తున్న టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిని విమర్శిస్తే ప్రజలు క్షమించరని, కాంగ్రెస్ పార్టీని విమర్శించిన వారు చరిత్ర హీనులుగా మిగిలిపోతారని టీపీసీసీ అధికార ప్రతినిధి బోరెడ్డి అయోధ్యరెడ్డి అన్నారు. మంగళవారం గాంధీభవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ..దాసోజు శ్రవణ్ తన నోటి దురుసుతో రేవంత్‌రెడ్డిపై వ్యాఖ్యలు చేశారని, డబుల్ బెడ్రూం ఇళ్లు, దళితులకు మూడెకరాలు, దళిత ముఖ్యమంత్రి గురించి అడిగితే తప్పా అని ప్రశ్నించారు. కేసీఆర్ కుటుంబాన్ని ఎవరూ తిట్టకపోతే దాసోజుకు నిద్రపట్టనట్లు ఉందని ఎద్దేవా చేశారు.

మూడు పంటలు.. 24 గంటల కరెంటు అబద్ధమే

ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ వ్యాఖ్యలే నిదర్శనం: వైఎస్ షర్మిల



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం గొప్పగా చెప్పుకుంటున్న మూడు పంటలు – 24 గంటల కరెంటు నినాదం పచ్చి అబద్ధమని, అందుకు ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ వ్యాఖ్యలే నిదర్శనమని వైఎస్సార్ తెలంగాణ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల పేర్కొన్నారు. పనికి రాని ప్రాజెక్టులకు రూ.వేల కోట్ల కరెంట్ బిల్లులు కట్టే దొర రైతులకు సరిపడా కరెంట్ మాత్రం ఇవ్వడం లేదని మంగళవారం ట్విట్టర్ వేదికగా ధ్వజమెత్తారు. కాళేశ్వరం ప్రాజెక్టుతో కోటి ఎకరాల మాగాణికి నీళ్లిచ్చామని దొర చెప్తుంటే...నారుమడికైనా కాసిన్ని నీళ్లు లేవని రైతులు వాపో తున్నారని ఎద్దేవా చేశారు. సీఎం కేసీఆర్ కట్టిన కాళేశ్వరం 'గోదారి నీళ్లను గోదారిలో ఎత్తిపోయడానికే'సరి అని విమర్శించారు. రూ.38 వేల కోట్లతో దివంగత మహానేత వైఎస్సార్ కట్టాలనుకున్న తెలంగాణ జీవధార ప్రాణహిత – చేవెళ్లను రీడిజైన్ చేసి కల్వకుంట్ల కుటుంబానికి కమీషన్ల ధారగా మార్చారన్నారు.

భారీ నష్టాల్లో ఉత్తర డిస్కం

టీఎస్ఎన్పీడీసీఎల్ త్రైమాసిక ఆడిట్ నివేదిక వెల్లడి



ఏటీ అండ్ సీ నష్టాలు అంటే..?

సాంకేతిక లోపాలు, విద్యుత్ చౌర్యంతో డిస్కంలకు జరిగే నష్టాలను విద్యుత్ రంగ పరిభాషలో.. ట్రాన్స్‌మిషన్ అండ్ డిస్ట్రిబ్యూషన్ (టీ అండ్ డీ) నష్టాలంటారు. సాంకేతిక లోపాలు, విద్యుత్ చౌర్యంతో పాటు వసూలుకాని విద్యుత్ బిల్లులను కలిపి..అగ్రిగేట్ టెక్నికల్ అండ్ కమర్షియల్ లాసెస్ (ఏటీ అండ్ సీ లాసెస్) అంటారు.

36 శాతానికి ఎగబాకిన ఏటీ అండ్ సీ నష్టాలు

- 81 శాతం నష్టాలతో చరిత్ర సృష్టించిన పెద్దపల్లి డివిజన్
- కరీంనగర్ రూరల్, భూపాలపల్లిలో 70 శాతానికి పైగా నష్టాలు
- పలు డివిజన్లపై కాళేశ్వరం ప్రాజెక్టు విద్యుత్ బిల్లుల బకాయిల భారం!

సాక్షి, హైదరాబాద్:

ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (టీఎస్ఎన్పీడీసీఎల్) భారీ నష్టాలతో కొట్టుమిట్టాడుతోంది. 2023 జనవరి 1– మార్చి 31 మధ్య కాలానికి సంబంధించి సంస్థ తాజాగా ప్రకటించిన 'త్రైమాసిక విద్యుత్ ఆడిట్' నివేదిక ఈ విషయాన్ని వెల్లడించింది. సంస్థ పరిధిలోని 17 జిల్లాల/విద్యుత్ సర్కిళ్లలో మొత్తం 38 విద్యుత్ డివిజన్లుండగా.. డివిజన్ల వారీగా విద్యుత్ సాంకేతిక, ఆర్థిక నష్టాల మొత్తాలను (ఏటీఅండ్‌సీ లాసెస్)ను సంస్థ ఈ నివేదికలో పొందుపరిచింది. మూడు డివిజన్లలో పరిధిలో ఈ నష్టాలు ఏకంగా 70–80 శాతానికి ఎగబాకినట్లు నివేదిక పేర్కొంది. అంటే ఈ డివిజన్లకు సరఫరా చేసిన మొత్తం విద్యుత్‌కు గాను కేవలం 20–30 శాతం బిల్లులు మాత్రమే వసూలయ్యాయన్నమాట. ముఖ్యంగా కాళేశ్వరం ఎత్తిపోతల పథకానికి సరఫరా చేసిన విద్యుత్‌కి సంబంధించిన బిల్లులను రాష్ట్ర ప్రభుత్వం ఎప్పటికప్పుడు చెల్లించకపోవడంతో పెద్దయెత్తున బకాయిలు పేరుకుపోతున్నాయని అధికార వర్గాలు చెబుతున్నాయి.

స్థూలంగా 36 శాతం నష్టాలు

గత త్రైమాసికంలో టీఎస్ఎన్పీడీసీఎల్ మొత్తం రూ.4,726.60 కోట్ల విద్యుత్ బిల్లులను జారీ చేయగా, రూ.3,203.89 కోట్లను (67.78శాతం) మాత్రమే వసూలు చేసుకోగలిగింది. అంటే 36.33 శాతం ఏటీ అండ్ సీ నష్టాలు నమోదయ్యాయి. డిస్కంల సుస్థిర మనుగడ కోసం ఏటీ అండ్ సీ నష్టాలను 2019–20 నాటికి 6 శాతానికి తగ్గించుకోవాలని ఉదయ్ పథకం కింద కేంద్రం లక్ష్యంగా నిర్దేశించింది. అయినా రాష్ట్ర డిస్కంలు అంతకంతకు నష్టాల్లో కూరుకుపోతున్నాయి.

వసూలు కాని 'ఇతర' కేటగిరీ బిల్లులు

గృహాలు, వాణిజ్యం, పారిశ్రామిక కేటగిరీల వినియోగదారులు 90 నుంచి 100 శాతం విద్యుత్ బిల్లులు చెల్లిస్తున్నట్టు త్రైమాసిక విద్యుత్ ఆడిట్ నివేదిక తెలిపింది. ఇతర కేటగిరీలో మాత్రం చాలా డివిజన్లలో ఒక శాతం బిల్లులు కూడా వసూలు కావడం లేదు. ఈ డివిజన్ల పరిధిలోని కాళేశ్వరం వంటి ఎత్తిపోతల పథకాలకు సంబంధించిన పంప్‌హౌస్‌ల విద్యుత్ కనెక్షన్లు ఇతర కేటగిరీలోనే ఉన్నాయి.

పెద్దపల్లిలో 80%.. కరీంనగర్ రూరల్‌లో 78.99% నష్టాలు

పెద్దపల్లి డివిజన్‌లో విద్యుత్ సాంకేతిక, వాణిజ్య నష్టాల మొత్తం ఏకంగా 80.18 శాతానికి ఎగబాకి రాష్ట్ర విద్యుత్ రంగ చరిత్రలోనే కొత్త రికార్డును సృష్టించింది. ఈ డివిజన్‌లో గత త్రైమాసికంలో రూ.435.08 కోట్ల విద్యుత్ బిల్లులను జారీ చేయగా, కేవలం రూ.89.63 కోట్లు (20.6%) మాత్రమే వసూలయ్యాయి. డివిజన్ పరిధిలో 1,71,002 విద్యుత్ కనెక్షన్లుండగా, 421.55 మిలియన్ యూనిట్ల (ఎంయూ) విద్యుత్ సరఫరా చేశారు. 15.95 ఎంయూల (3.78 శాతం) ట్రాన్స్‌మిషన్ అండ్ డిస్ట్రిబ్యూషన్ నష్టాలు (టీ అండ్ డీ లాసెస్) పోగా, మిగిలిన 405.6 ఎంయూల విద్యుత్‌ను వినియోగించినందుకు గాను వినియోగదారులకు రూ.435.08 కోట్ల బిల్లులు జారీ చేశారు.

- కరీంనగర్ రూరల్ డివిజన్‌లో 78.99 శాతం ఏటీఅండ్‌సీ నష్టాలు నమోదయ్యాయి. అక్కడ రూ.445.67 కోట్ల బిల్లులకు గాను రూ.96.28 కోట్లు (21.6%) మాత్రమే వసూలయ్యాయి.
- భూపాలపల్లిలో 71.2 శాతం ఏటీఅండ్‌సీ నష్టాలు వచ్చాయి. అక్కడ రూ.205.7 కోట్ల బిల్లులకు గాను రూ.80.19 కోట్లే (38.98 శాతం) వసూలయ్యాయి. ఇక అక్కడ టీ అండ్ డీ నష్టాలు సైతం 26.13 శాతంగా ఉన్నాయి. చౌర్యం/సాంకేతిక లోపాలతో ఏకంగా 99.35 ఎంయూల విద్యుత్ నష్టం జరిగింది.
- ములుగు డివిజన్‌లో 61.58 శాతం ఏటీ అండ్ సీ నష్టాలు వచ్చాయి. అక్కడ రూ.122.36 కోట్ల బిల్లులకు గాను రూ.48.97 కోట్లు (40.02 శాతం) మాత్రమే వసూలయ్యాయి.
- కరీంనగర్ డివిజన్‌లో 48.86 శాతంఏటీఅండ్‌సీ నష్టాలు నమోదయ్యాయి. అక్కడ రూ.444.12 కోట్ల బిల్లులకు గాను రూ.218.46 కోట్లు (49.10%) మాత్రమే వసూలయ్యాయి.
- మంథని డివిజన్‌లో 44.12 శాతం ఏటీఅండ్ సీ నష్టాలున్నాయి. అక్కడ రూ.328.8 కోట్ల బిల్లులకు గాను రూ.144.48 కోట్లు (43.94%) మాత్రమే వసూలయ్యాయి. హన్మకొండ రూరల్‌లో 34.54 శాతం ఏటీఅండ్ సీ నష్టాలు వచ్చాయి. అక్కడ రూ.177.25 కోట్ల బిల్లులకు గాను రూ.124.79 కోట్లు (70.4శాతం) మాత్రమే వసూలయ్యాయి. మరో 7.04 శాతం టీ అండ్ డీ నష్టాలున్నాయి. పైన పేర్కొన్న ఈ డివిజన్లలోనే కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించిన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల, ఎల్లంపల్లి పంప్‌హౌస్‌లతో పాటు దేవాదుల, సమ్మక్క సాగర్ వంటి భారీ లిఫ్టులు కూడా ఉన్నాయి.

ఆగస్టు 1న మహారాష్ట్రకు కేసీఆర్

▶ మొదటి పేజీ తరువాయి

జన్మించిన సాంగ్లి జిల్లాలోని వటేగావ్‌లో ఆయన చిత్రపటానికి కేసీఆర్ నివాళులర్పిస్తారు. ఈ సందర్భంగా సాఠే కోడలు, మనవడితో పాటు వివిధ పార్టీలకు చెందిన నేతలు బీఆర్ఎస్‌లో చేరతారు. స్థానికంగా అధిక సంఖ్యలో ఉండే మాంగ్ లేదా మాతంగ్‌గా పిలిచే ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన అన్నాభావు సాఠే వర్ధంతి కార్యక్రమంలో పాల్గొంటున్న తొలి సీఎం కేసీఆర్ అని బీఆర్ఎస్ వర్గాలు వెల్లడించాయి. కాగా సాఠే మహారాష్ట్రలో పలు సామాజిక ఉద్యమాలకు నేతృత్వం వహించారు. ఇలా వుండగా అదే రోజు మధ్యాహ్నం కొల్హాపూర్‌లోని అంబాబాయి (మహాలక్ష్మీ) దేవాలయంలో కేసీఆర్ ప్రత్యేక పూజలు చేస్తారు. ఈ పర్యటనకు సంబంధించి ఒకటి రెండురోజుల్లో పూర్తి షెడ్యూల్ వెలువడుతుందని బీఆర్ఎస్ వర్గాలు వెల్లడించాయి.

షోలాపూర్ సభ వాయిదా

బీఆర్ఎస్ సత్తా చాటేలా ఈనెల 30న షోలాపూర్‌లో సుమారు మూడు లక్షల మందితో భారీ బహిరంగ సభను నిర్వహించాలని కేసీఆర్ తొలుత ప్రణాళిక రూపొందించారు. సభ నిర్వహణ బాధ్యతలను మంత్రి హరీశ్‌రావుకు అప్పగిస్తున్నట్లు కూడా ప్రకటించారు. అయితే వర్షాలు కురుస్తుండటం, వ్యవసాయ పనులు ముమ్మరంగా సాగుతున్న నేపథ్యంలో షోలాపూర్ సభను వచ్చే నెలకు వాయిదా వేయాలని సీఎం నిర్ణయించారు. సాంగ్లి, కొల్హాపూర్ పర్యటన ముగిసిన తర్వాత వచ్చే నెలలో షోలాపూర్‌తో పాటు పుణేలో భారీ బహిరంగ సభలు నిర్వహించాలని భావిస్తున్నారు. ఇప్పటికే సుమారు 15 జిల్లాలు, 27 లోక్‌సభ నియోజకవర్గాల పరిధిలో బీఆర్ఎస్‌కు క్షేత్ర స్థాయి వరకు నిర్మాణం జరిగినట్లు సమాచారం. మహారాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటివరకు 15 లక్షల మంది క్రియాశీల సభ్యులు (పదాధికారులు) చేరగా, ఇందులో 6 లక్షల మంది ఆన్‌లైన్‌లో, 9 లక్షల మంది ప్రత్యక్షంగా సభ్యత్వం స్వీకరించారు. క్షేత్ర స్థాయిలో జనరల్, మహిళ, రైతు, యువత, కార్మిక తదితర విభాగాలకు సంబంధించి తొమ్మిది కమిటీల చొప్పున ఏర్పాటయ్యాయి. త్వరలో క్రియాశీల సభ్యులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించేందుకు బీఆర్ఎస్ సన్నాహాలు చేస్తోంది. ఇప్పటికే ముగ్గురు మాజీ ఎంపీలు, సుమారు డజను మంది మాజీ ఎమ్మెల్యేలు బీఆర్ఎస్ గూటికి చేరుకోగా, వందల సంఖ్యలో సర్పంచ్‌లు, పదుల సంఖ్యలో జిల్లా పరిషత్ సభ్యులు పార్టీలో చేరినట్లు స్థానిక నేతలు చెప్తున్నారు.

ఓ సిట్టింగ్ ఎంపీ చేరే అవకాశం?

మహారాష్ట్రలో నెలకొన్న రాజకీయ అస్థిరతను అనుకూలంగా మలుచుకుని పార్టీ బలోపేతానికి పావులు కదుపుతున్న కేసీఆర్‌తో.. అక్కడి సిట్టింగ్ ఎమ్మెల్యేలు పలువురు పార్టీలో చేరికలపై సంప్రదింపులు జరుపుతున్నారు. మహారాష్ట్రకు చెందిన ఓ సిట్టింగ్ ఎంపీ కూడా ఇటీవల కేసీఆర్‌తో భేటీ అయ్యారు. జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్.. మహారాష్ట్ర నేతల చేరికల కోసం జరుపుతున్న సంప్రదింపుల్లో కీలకంగా వ్యవహరిస్తున్నట్లు సమాచారం.

వారం రోజుల్లో డీఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వాలి

- లేదంటే ప్రగతి భవన్‌ను ముట్టడిస్తాం
- సీఎం కేసీఆర్‌కు ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి లేఖ



సాక్షి, హైదరాబాద్: వారం రోజుల్లో డీఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వాలని లేదంటే కాంగ్రెస్ పార్టీ తరపున ప్రగతిభవన్‌ను ముట్టడిస్తామని కాంగ్రెస్ ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ మేరకు ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావుకు ఆయన మంగళవారం లేఖ రాశారు. 2020లో అసెంబ్లీ సాక్షిగా టీచర్ పోస్టుల భర్తీ చేస్తామని ప్రకటన చేసినా ఇప్పటివరకు అమలుకు నోచుకోలేదని మండిపడ్డారు. రూ.లక్షలు పెట్టి కోచింగ్ తీసుకుని ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్నారని, కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో ఉద్యోగాల్లేక వయోపరిమితి దాటిపోతూ లక్షలాదిమంది నిరుద్యోగులు ఆందోళన చెందుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నీళ్లు, నిధులు, నియామకాలు నినాదంతో సాగిన ఉద్యమ ఆకాంక్షలు ఎక్కడ నెరవేరాయో చెప్పాలని నిలదీశారు. అమరవీరుల త్యాగ ఫలితం ఇదేనా? సకల జనులు కొట్లాడి సాధించుకున్న తెలంగాణ ఇందుకేనా? అంటూ ప్రశ్నించారు. ఉమ్మడి ఏపీలో ఆరు నెలలకు ఒకసారి టెట్, రెండేళ్లకు ఓసారి డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చేవారని గుర్తు చేశారు. మిగులు రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చారని, అనవసర ఆర్భాటాలకు పోయి ప్రజాధనం వృథాచేశారని ఆరోపించారు.

కాంగ్రెస్‌లో చేరినందుకే కక్ష సాధింపు చర్యలు

- బీఆర్ఎస్‌పై పొంగులేటి ఆరోపణలు
- 13 ఏళ్ల క్రితం ఎస్ఆర్ గార్డెన్స్ నిర్మించా
- అప్పుడు సర్వే చేయకుండా ఇప్పుడు బురదజల్లే యత్నం
- కబ్జా చేశానని తేలితే ఆ భూమి అంతా రాసిస్తా..



మొదటిసారిగా గాంధీభవన్‌కు వచ్చిన పొంగులేటికి శాలువాకప్పి ఆహ్వానిస్తున్న రేవంత్ రెడ్డి. చిత్రంలో మల్లు రవి

సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్‌లో చేరానన్న కారణంతో బీఆర్ఎస్ తనపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని టీపీసీసీ ప్రచార కమిటీ కో చైర్మన్, మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఆరోపించారు. ఖమ్మం జిల్లా కేంద్రంలో ఎస్సార్ గార్డెన్స్ పేరుతో ఫంక్షన్ హాల్‌ను తాను 13 ఏళ్ల క్రితం నిర్మించానని, అప్పుడు సర్వేలు చేయకుండా ఇప్పుడు తనపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన తర్వాత తొలిసారిగా మంగళవారం భారీ సంఖ్యలో కార్యకర్తలతో కలిసి ఆయన గాంధీభవన్‌కు వచ్చారు. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, మాజీ ఎంపీ మల్లు రవి తదితరులు ఆయనకు స్వాగతం పలికారు. కొద్దిసేపు రేవంత్‌రెడ్డితో భేటీ అయిన పొంగులేటి తర్వాత మల్లు రవి, పిడమర్తి రవి, బానోతు విజయాబాయి, కోటూరి మానవతారాయ్ తదితరులతో కలిసి విలేకరులతో మాట్లాడారు.

కల్వకుంట్ల కుటుంబం రాజులా పాలిస్తోంది..

కాంగ్రెస్ ప్రచార కమిటీ కో చైర్మన్‌గా తనకు బాధ్యతలు అప్పగించిన ఏఐసీసీ, పీసీసీ నేతలకు పొంగులేటి కృతజ్ఞతలు తెలిపారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకువచ్చేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని చెప్పారు. తాను 20 గుంటల భూమిని కబ్జా చేశానంటూ.. ఇప్పుడు సర్వేల పేరుతో బీఆర్ఎస్ తనకు నోటీసులు ఇప్పిస్తోందని తెలిపారు. తాను ఆ భూమిని కబ్జా చేశానంటే ఎవరూ నమ్మరని, దీనిపై తాను న్యాయస్థానాన్ని ఆశ్రయించానని వివరించారు. తాను భూమిని కబ్జా చేసినట్లు తేలితే ఆ భూమి మొత్తం రాసిస్తానని సవాల్ చేశారు. అయినా కబ్జాలకు పాల్పడడం బీఆర్ఎస్‌లో ఉన్నప్పుడు ఒకలా, కాంగ్రెస్‌లో చేరినప్పుడు మరోలా ఉంటుందా అని ప్రశ్నించారు. రాష్ట్రాన్ని కల్వకుంట్ల కుటుంబం రాజులాగా పాలిస్తోందని, హామీలు ఇవ్వడం, పథకాలను ప్రారంభించడం తప్ప అమలు చేయడం లేదని విమర్శించారు. బీఆర్ఎస్ నేతలు అధికార మదంతో మాట్లాడుతున్నారని, సోనియాగాంధీ తెలంగాణ ఇవ్వకుంటే కల్వకుంట్ల కుటుంబం ఎక్కడ ఉండేదని ప్రశ్నించారు. అయినా కేసీఆర్ ఒక్కడు దీక్ష చేస్తేనే రాష్ట్రం వచ్చిందా? అని నిలదీశారు. అనంతరం ఆయన ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావ్ ఠాక్రే, ఏఐసీసీ కార్యదర్శి రోహిత్ చౌదరిలను మర్యాదపూర్వకంగా కలిశారు.

వారిద్దరూ జోడెద్దుల్లాంటి వారు

పార్టీ ప్రచార కమిటీ కో చైర్మన్‌గా నియమితులైన పొంగులేటికి రేవంత్ శుభాకాంక్షలు తెలిపారు. త్వరలోనే మాజీ మంత్రి జూపల్లి కూడా కాంగ్రెస్‌లో చేరతారని, ఈ నెల 20న జరగాల్సిన ఆయన చేరిక సభ వర్షాల కారణంగా వాయిదా వేస్తున్నామని, ఈ నెలాఖరులోగా లక్షలాది మందితో నిర్వహించే సభలో జూపల్లి పార్టీలో చేరతారని చెప్పారు. పొంగులేటి, జూపల్లిలు కాంగ్రెస్ పార్టీకి జోడెద్దుల్లాంటి వారని రేవంత్ వ్యాఖ్యానించారు.

కారు దిగేనా.. 'చేతి'కొచ్చేనా!?

మాజీ ఎమ్మెల్యే తీగల పార్టీ మార్పుపై ఊహాగానాలు

- పీసీసీ చీఫ్ రేవంత్‌తో భేటీ అయ్యారంటూ ప్రచారం
- అలాంటిదేమీ లేదంటున్న మాజీ మేయర్
- మహేశ్వరం రాజకీయాల్లో ఇప్పుడు అవే వాదనలు



సాక్షి, రంగారెడ్డి జిల్లా: హైదరాబాద్ మాజీ మేయర్, మహేశ్వరం నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి, ఆయన కోడలు ప్రస్తుత జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి త్వరలోనే కారు దిగి హస్తం గూటికి చేరుకోనున్నారనే వాదనలు ఊపందుకున్నాయి. అధికార బీఆర్ఎస్ పార్టీలో తమకు ప్రాధాన్యత ఇవ్వడం లేదని, గౌరవం లేని చోట తాము ఎలా ఉండగలమని..? ఇప్పటికే ఆయన పలుమార్లు అసంతృప్తి వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో తాజాగా పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డిని రహస్యంగా కలిసి, పార్టీలో చేరే అంశంపై చర్చించినట్లు రాజకీయ వర్గాల్లో జోరుగా ప్రచారం జరుగుతోంది. అయితే ఈ ప్రచారాల్లో ఏ మాత్రం వాస్తవం లేదని ఆయన చెబుతున్నా.. జరుగుతున్న పరిణామాలు 'తీగల' మార్పును సూచిస్తున్నాయని అంటున్నారు.

మరో మాజీ మంత్రి కూడా..

తీగల దారిలోనే ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు చెందిన మరో ఇద్దరు ముఖ్యనేతలు కూడా పార్టీని వీడేందుకు సిద్ధంగా ఉన్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. మాజీ ఎమ్మెల్యే, మాజీ మంత్రి, ప్రస్తుతం రెండు జిల్లాలకు చెందిన స్థానిక సంస్థల్లో కీలక నేతలు కూడా ఈ నెల 20న ఢిల్లీకి వెళ్లి పార్టీ అధినేత రాహుల్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరే అవకాశం ఉన్నట్లు తెలిసింది. ఇప్పటికే జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కప్పాటి పాండురంగారెడ్డి, సీనియర్ నేత కొత్త మనోహర్‌రెడ్డి బీఆర్ఎస్‌ను వీడిన విషయం తెలిసిందే.

సబితతో పొసగక..

టీడీపీ నుంచి రాజకీయ అరంగేట్రం చేసిన తీగల కృష్ణారెడ్డి...మాజీ సీఎం చంద్రబాబు హయాంలో హైదరాబాద్ నగర మేయర్‌గా పనిచేశారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత 2014లో టీడీపీ తరపున మహేశ్వరం నియోజకవర్గం నుంచి పోటీ చేసి ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఆ తర్వాత బీఆర్ఎస్‌లో చేరారు. 2018 ఎన్నికల్లో ఇదే స్థానం నుంచి మళ్లీ పోటీ చేసి అప్పటి కాంగ్రెస్ అభ్యర్థి పటోళ్ల సబితా ఇంద్రారెడ్డి చేతిలో ఓటమి పాలయ్యారు. కాంగ్రెస్ నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందిన సబిత ఆ తర్వాత అధికార బీఆర్ఎస్‌లో చేరారు. జిల్లా నుంచి ప్రస్తుతం మంత్రి మండలికి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. గత కొంతకాలంగా మంత్రికి..మాజీ ఎమ్మెల్యేకు మధ్య అస్సలు పొసగడం లేదు. ఓటమి పాలైనంత మాత్రాన ఇంతలా అవమానిస్తారా? గౌరవం లేని చోట ఎలా ఉండగలను? అంటూ ఆయన ఇటీవల బహిరంగంగానే తన ఆవేదనను వెళ్లగక్కారు. అవకాశం దొరికిన ప్రతిసారీ మంత్రికి వ్యతిరేకంగా బహిరంగంగానే ఆరోపణలు గుప్పిస్తూ వస్తున్నారు.

నేడు కాంగ్రెస్ లంచ్ భేటీ!

- ఎంపీ కోమటిరెడ్డి నివాసంలో సమావేశమవనున్న టీ కాంగ్రెస్ ముఖ్యులు
- హాజరు కానున్న ఠాక్రే, రేవంత్, భట్టి, ఉత్తమ్ తదితరులు
- రేపు ఢిల్లీకి రేవంత్ బృందం.. ఖర్గేను కలవనున్న పార్టీలో చేరే నేతలు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర కాంగ్రెస్ ముఖ్య నేతలు బుధవారం హైదరాబాద్‌లో సమావేశం కానున్నారు. భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి నివాసంలో జరిగే ఈ సమావేశానికి రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావ్ ఠాక్రే, టీపీసీసీ అధ్యక్షుడు ఎ. రేవంత్‌రెడ్డి, సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క, నల్లగొండ ఎంపీ ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ బి. మహేశ్‌కుమార్‌గౌడ్, సీనియర్ ఉపాధ్యక్షుడు మల్లు రవి తదితరులు హాజరు కానున్నారు. పార్టీ అంతర్గత వ్యవహారాలను చర్చించేందుకే పార్టీ ముఖ్యులను కోమటిరెడ్డి లంచ్‌కు ఆహ్వానించారని తెలియవచ్చింది. త్వరలో పార్టీలో చేరే నాయకుల విషయంలో ఉన్న సమస్యలను పరిష్కరించుకొనే దిశగా చర్చలు జరిపేందుకే ఈ భేటీ జరగనుందని తెలుస్తోంది. ఈ భేటీ తర్వాత రేవంత్‌రెడ్డితోపాటు ఠాక్రే, ఇతర ముఖ్యులు ఢిల్లీ వెళ్లనున్నారు. గురువారం వారు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను కలవనున్నారు. ప్రియాంకా గాంధీ సమక్షంలో జూపల్లి, కూచుకుళ్ల బృందంతోపాటు రంగారెడ్డి, మహబూబ్‌నగర్, నల్లగొండ జిల్లాలకు చెందిన పలువురు నేతలు కూడా వారితోపాటు వెళ్లి ఖర్గేను కలుస్తారని తెలుస్తోంది. ఈ జాబితాలో రంగారెడ్డి జిల్లాకు చెందిన ఓ మాజీ మంత్రి, ఆయన సతీమణి, మాజీ ఎమ్మెల్యే, మహ బూబ్‌నగర్‌కు చెందిన మాజీ ఎమ్మెల్యే, ఖమ్మం జిల్లాకు చెందిన మాజీ ఎమ్మెల్సీ, నల్లగొండకు చెందిన మాజీ ఎమ్మెల్యే, ఓ కార్పొరేషన్ మాజీ చైర్మన్, ప్రముఖ ట్రావెల్స్ అధినేత, ఆదిలాబాద్‌కు చెందిన మరో కీలక నేత ఉన్నట్లు తెలుస్తోంది. బుధవారం భేటీ అనంతరం కోమటిరెడ్డి నివాసంలోనే విలేకరుల సమావేశం ఏర్పాటు చేస్తారని, ఈ సమావేశంలో పార్టీలో చేరికలపై కాంగ్రెస్ నేతలు స్పష్టతనిస్తారని గాంధీభవన్ వర్గాలు చెబుతున్నాయి.

కొల్లాపూర్‌లో ప్రియాంక సభ వాయిదా

- వర్షాలే కారణమని చెప్పిన టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్
- ఈ నెల 23, 25, 28 తేదీల్లో ఏదో ఒకరోజు నిర్వహించే అవకాశం

సాక్షి, హైదరాబాద్: నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్‌లో ఈ నెల 20న జరగాల్సిన కాంగ్రెస్‌సభ వాయిదా పడింది. మాజీమంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి పార్టీలో చేరేందుకు ఏఐసీసీ అగ్రనేత ప్రియాంకాగాంధీ సమక్షంలో నిర్వహించాలనుకున్న ఈ సభను వర్షాల కారణంగా వాయిదా వేస్తున్నట్టు టీపీసీసీ అధ్యక్షుడు ఎ.రేవంత్‌రెడ్డి వెల్లడించారు. అయితే, సభకు ప్రియాంకాగాంధీ హాజరవుతారని తొలుత చెప్పినప్పటికీ, ఆమె వచ్చే అవకాశం లేనందున ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే వస్తారనే చర్చ జరిగింది. కానీ, ఖమ్మం సభకు అగ్రనేత రాహుల్‌గాంధీ వచ్చిన నేపథ్యంలో కొల్లాపూర్ సభకు ప్రియాంకాగాంధీ రావడమే సరైందని భావించిన టీపీసీసీ నేతలు ఆ మేరకు కొల్లాపూర్‌సభను వాయిదా వేయాలని నిర్ణయించారనే చర్చ గాంధీభవన్ వర్గాల్లో జరుగుతోంది. ఈ నెల 20వ తేదీ తర్వాత ప్రియాంక సమయం కోరగా, 23, 25, 28 తేదీల్లో ఏదో ఒకరోజు సభ ఏర్పాటు చేసుకోవచ్చని, తేదీ ఖరారయిన తర్వాత అధికారికంగా వెల్లడిస్తామని ఏఐసీసీ వర్గాల నుంచి సమాచారం వచ్చినట్టు తెలిసింది.

టీపీసీసీ ఆస్తుల పరిరక్షణకు కమిటీ

సాక్షి, హైదరాబాద్: టీపీసీసీ ఆస్తుల పరిరక్షణ కోసం మాజీ మంత్రి పి.సుదర్శన్‌రెడ్డి చైర్మన్‌గా, సొదారాం గంగారం కన్వీనర్‌గా ఆరుగురు సభ్యులతో కూడిన కమిటీ ఏర్పాటైంది. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ ఆమోదం తెలపడంతో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ బి. మహేశ్‌కుమార్ గౌడ్ ఉత్తర్వులిచ్చారు. ఈ కమిటీలో పార్టీ నేతలు జి. నిరంజన్, కె.దయాసాగర్‌రావు, పొన్నం అశోక్‌గౌడ్, ఎం. రాంచంద్రారెడ్డి, టి.బెల్లయ్య నాయక్, ఎం.ఎ. ఫహీమ్‌లను సభ్యులుగా ఉన్నారు.

బీఆర్ఎస్ నేతలు వేల ఎకరాలు ఆక్రమించారు

బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రవీణ్ కుమార్



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా బహుజన్ సమాజ్ పార్టీ వేగంగా విస్తరిస్తోందని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.ఎస్.ప్రవీణ్ కుమార్ అన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న గజ్వేల్ నియోజకవర్గం నుంచి సీపీఐ, పీడీఎస్‌యూ, బీసీ యువజన సంఘాల నాయకులతో పాటు సికింద్రాబాద్, నాగర్‌కర్నూల్, సంగారెడ్డి తదితర నియోజకవర్గాలకు చెందిన పలువురు మంగళవారం బీఎస్పీ కార్యాలయంలో ప్రవీణ్ కుమార్ సమక్షంలో ఆ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ నాయకులు హైదరాబాద్‌లోని దాదాపు 30 వేల ఎకరాల భూములను ఆక్రమించుకుని రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాల ప్రజలు వందకు 99 మంది ఉన్నారని, కానీ సంపద ఒక శాతం ఉన్న ఆధిపత్య వర్గాల చేతిలోనే ఉందని పేర్కొన్నారు. దీనంతటికీ కారణం అణగారిన వర్గాలకు అధి కారం లేక పోవడ మేనని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఈ నెల 30న దేవరకొండ నియోజకవర్గంలో నిర్వహించనున్న గిరిజన మహిళల రాజకీయ చైతన్య సదస్సును విజయవంతం చేయాలని కోరారు.

పొంగులేటి సోదరులకు హైకోర్టులో ఊరట



సాక్షి, హైదరాబాద్: ఖమ్మం శివారు వెలుగుమట్లలోని ఎస్ఆర్ గార్డెన్ వివాదంలో మాజీ ఎంపీ, టీపీసీసీ ప్రచార కమిటీ కో కన్వీనర్ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఆయన సోదరుడు ప్రసాద్‌రెడ్డికి హైకోర్టులో ఊరట లభించింది. ఈ వివాదానికి సంబంధించి హైకోర్టు స్టేటస్ కో ఆదేశాలు జారీ చేయడంతో పాటు తదుపరి ఉత్తర్వులిచ్చే వరకు 20 గుంటల భూమిలో ఎలాంటి చర్యలు చేపట్టవద్దని ఆదేశించింది.

సర్వే చేపట్టాలని నోటీసులు...

ఎస్ఆర్ గార్డెన్‌లో నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు చెందిన భూమి ఉందని...సర్వే చేపట్టాలని శ్రీనివాస్‌రెడ్డి సోదరుడు ప్రసాద్‌రెడ్డికి ఈ నెల 14న అధికారులు నోటీసులు జారీ చేశారు. ఈ నోటీసులను సవాల్ చేస్తూ ప్రసాద్‌రెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. గతంలో ఈ కోర్టు జారీ చేసిన ఆదేశాలకు విరుద్ధంగా అధికారుల నిర్ణయం ఉందని, సహజ న్యాయసూత్రాలను కూడా ఉల్లంఘించారంటూ పిటిషన్‌లో పేర్కొన్నారు. తమకు సంబంధించిన భూమిలో అధికారులు జోక్యం చేసుకోకుండా ఆదేశాలివ్వాలని, నోటీసులను కొట్టివేయాలని కోరారు. దీనిపై జస్టిస్ విజయ్‌సేన్‌రెడ్డి మంగళవారం విచారణ చేపట్టి స్టేటస్ కో ఆదేశాలు జారీ చేశారు. తదుపరి విచారణను ఆగస్టు 1కి వాయిదా వేయడంతోపాటు ఆ విచారణ నాటికి సర్వే నివేదికను అందజేయాలని పేర్కొన్నారు.

క్లుప్తంగా...

1,654 మంది గెస్ట్ లెక్చరర్ల నియామకానికి ఉత్తర్వులు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో 1,654 మంది అతిథి అధ్యాపకుల(గెస్ట్ లెక్చరర్లు) నియామకానికి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ మేరకు ఇంటర్మీడియెట్ కమిషనర్ నవీన్ మిత్తల్ మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. నియామక మార్గదర్శకాలను విడుదల చేశారు. ప్రభుత్వం అతిథి అధ్యాపకులకు ఒక్కో పీరియడ్ నిమిత్తం రూ.390 చెల్లిస్తుంది. నెలకు 72 పీరియడ్లకు మాత్రమే అనుమతిస్తుంది. దీంతో వారికి రూ.28,080 చొప్పున వేతనం అందుతుంది. జిల్లా కలెక్టర్ నేతృత్వంలో జిల్లా ఇంటర్ విద్యా శాఖ అధికారి, ఆయా కాలేజీల ప్రిన్సిపాళ్లు సభ్యులుగా నియామక కమిటీని ఏర్పాటుచేస్తారు. జిల్లాల్లో కాలేజీలవారీగా ఖాళీలను ఈ నెల 19న వెల్లడిస్తారు. 24లోగా అన్ని అర్హతలున్న అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలి. 26వ తేదీన దరఖాస్తులను పరిశీలించి మెరిట్ అభ్యర్థుల జాబితా రూపొందిస్తారు. జిల్లా కలెక్టర్ 28న ఎంపికైన గెస్ట్ లెక్చరర్ల జాబితా వెల్లడిస్తారు. నియమించిన అతిథి అధ్యాపకులు వచ్చే నెల 1న సంబంధిత కాలేజీల ప్రిన్సిపాళ్లకు రిపోర్టు చేయాలి. గతంలో పనిచేసిన అతిథి అధ్యాపకులను తిరిగి కొనసాగించకపోవడంతో వారిలో ఆందోళన నెలకొంది. అయితే కోర్టు ఉత్తర్వులకు అనుగుణంగా కొత్త నియామక ప్రక్రియ అనివార్యమైందని అధికారిక వర్గాలు చెబుతున్నాయి.

నీట్ పరీక్షకు ఉచిత కౌన్సెలింగ్

సాక్షి, హైదరాబాద్: నీట్ పరీక్షకు హాజరవుతున్న విద్యార్థులకు ఉచితంగా మెరిట్ కౌన్సెలింగ్ ఇవ్వనున్నట్లు మెటామైండ్ నీట్ అకాడమీ డైరెక్టర్ మనోజ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. 2024లో నీట్ రాయాలనుకునే విద్యార్థులు ఈ నెల 21వ తేదీన హైదరాబాద్‌లోని తమ అకాడమిలో జరిగే కార్యక్రమానికి హాజరవ్వాలని కోరారు. వివరాలకు 7032264910, 8522958575 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

20న సివిల్ సర్వీసెస్ విజేతలతో ముఖాముఖి

సాక్షి, హైదరాబాద్: సివిల్ సర్వీసెస్ విజేతలతో 'ఇన్‌స్పైర్- 2023' పేరిట ఈ నెల 20న ఉస్మానియా యూనివర్సిటీలోని ఠాగూర్ ఆడిటోరియంలో ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు టీఎస్‌బీసీ ఎంప్లాయిబిలిటీ స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ట్రైనింగ్ సెంటర్ డైరెక్టర్ డి.శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. సివిల్స్ సాధించే క్రమంలో ఎదురైన అనుభవాలను విద్యార్థులతో పంచుకుంటారని వెల్లడించారు.

క్షుద్ర రాజకీయాల వలలో చిక్కుకోవద్దు: ఎర్రబెల్లి



సాక్షి, హైదరాబాద్: పారిశుద్ధ్య కార్మికులు వెంటనే తమ ఆందోళనలు విరమించాలని పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు మంగళవారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. కొన్ని రాజకీయ పార్టీలు చేసే క్షుద్ర, స్వార్థ రాజకీయాల వలలో పడొద్దని హితవు పలికారు. అసిస్టెంట్ పంచాయతీ కార్యదర్శులుగా గుర్తింపునివ్వాలని కొందరు క్వాలిఫైడ్ కార్మికులు కోరుతున్నారని, పారిశుద్ధ్య కార్మికుల ఇతర డిమాండ్లను కూడా ప్రభుత్వం పరిశీలిస్తోందని చెప్పారు. గత ప్రభుత్వాల హయాంలో రూ.500, వెయ్యి కూడా లేని కార్మికుల వేతనాన్ని, తెలంగాణ వచ్చాక కేసీఆర్ రూ.8,500కు పెంచారని.. ఈ మధ్యే దశాబ్ది ఉత్సవాల సందర్భంగా మరో వెయ్యి పెంచిన ఘనత కేసీఆర్‌దేనని పేర్కొన్నారు.

ఇక స్థానిక భాషల్లోనే ఉన్నత విద్య

- పుస్తకాలను ఆంగ్లం నుంచి తర్జుమా చేయండి
- ఏఐసీటీఈ ప్రత్యేక సాఫ్ట్‌వేర్
- అనువాదిని చేత ట్రాన్స్‌లేషన్
- ఉన్నత విద్యా మండళ్లకు యూజీసీ మార్గదర్శకాలు



సాక్షి, హైదరాబాద్: ఉన్నత విద్యలో ప్రాంతీయ భాషలకు ప్రాధాన్యతనివ్వాలని యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ నిర్ణయించింది. ఈ ప్రక్రియను వేగంగా ముందుకు తీసుకెళ్లేందుకు సిద్ధమైంది. ఇందులో భాగంగా రాష్ట్రాల పరిధిలోని ఉన్నత విద్య పాఠ్య పుస్తకాలను ప్రాంతీయ భాషల్లో తర్జుమా చేయాలని రాష్ట్రాల ఉన్నత విద్యా మండళ్లకు సూచించింది. జాతీయ విద్యా విధానం-2020లో భాగంగా ఈ నిర్ణ యం తీసుకున్నట్టు పేర్కొంది. కీలక మైన ఉన్నత విద్య లో ప్రమాణాలు మెరుగవ్వాలంటే, బోధన, పాఠ్య పుస్తకాలు స్థానిక భాషల్లోనే ఉండాలని కేంద్రం జరిపిన అధ్యయ నాల్లో వెల్లడైంది. దీనివల్ల సబ్జెక్టుపై విద్యా ర్థులకు పట్టు లభిస్తుందని, ఫలితంగా విద్యార్థి ఉన్నత విద్యను పూర్తి చేసేలోగా మార్కెట్ అవసరాలకు అనువైన నైపుణ్యాన్ని సంపాదిస్తాడని ఎన్ఈపీ-2020లో పేర్కొన్నారు. దీన్ని ముందుకు తీసుకెళ్ళడానికి ముందుగా పాఠ్య పుస్తకాలను స్థానిక భాషల్లో తర్జుమా చేయా లని భావించారు. దీనికోసం అఖిల భారత సాంకేతిక విద్యామండలి (ఏఐసీటీఈ) ఆర్టిఫీషి యల్ ఇంటిలిజెన్స్ టెక్నాలజీ ఆధారంగా 'అనువాదిని' అనే ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను రూపొందించింది. దీన్ని అన్ని రాష్ట్రాలూ ఉపయోగించుకుని డిగ్రీ, ఇంజనీరింగ్‌తో పాటు అన్ని రకాల ఉన్నత విద్య పాఠ్యపుస్తకాలను ఆయా రాష్ట్రాల మాతృభాషల్లో తర్జుమా చేయాలని సూచించింది. అయితే, ఇంగ్లిష్, స్థానిక భాషను ఎంచుకోవడం విద్యార్థి ఐచ్ఛికమే. తెలుగు మీడియం ఉంటే ప్రత్యేక తరగతి బోధన చేపట్టాల్సి ఉంటుంది. ఈ క్రమంలో పాఠ్యపుస్తకాల తర్జుమాకు కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొంటూ యూజీసీ మార్గదర్శకాలు విడుదల చేసింది.

డిగ్రీలో మొదలైంది... ఇంజనీరింగ్‌పై త్వరలో నిర్ణయం



ఎన్ఈపీ-2020లో భాగంగా స్థానిక భాషల్లో పుస్తకాల ప్రచురణపై తెలంగాణ ఉన్నత విద్యా మండలి దృష్టి పెట్టింది. తెలుగు అకాడమి ద్వారా పుస్తకాల తర్జుమా చేయిస్తున్నాం. సాంకే తిక విద్యకు సంబంధించిన పుస్తకాలపై త్వరలో ఉన్నత స్థాయి సమీక్ష జరిపి, నిర్ణయం తీసుకుంటాం.

– ప్రొఫెసర్ ఆర్ లింబాద్రి (ఉన్నత విద్యామండలి చైర్మన్)

ప్రత్యేక బోధకులుండేలా చూడాలి..

స్థానిక భాషలో బోధన అంశాన్ని ముందుకు తెచ్చేటప్పుడు కాలేజీల్లో బోధకుల సంఖ్య పెంచాలి. ఇంగ్లిష్, తెలుగు మీడియాలను వేర్వేరుగా బోధించడం ఒకే అధ్యాపకుడికి సాధ్యం కాదు. దాని వల్ల ప్రతికూల ఫలితాలు వస్తాయి.

– డాక్టర్ వి బాలకృష్ణ, సాంకేతిక, వృత్తి విద్య ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు)

ఇక ఆరోగ్యశ్రీ డిజిటల్ కార్డులు

▶ మొదటి పేజీ తరువాయి

ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. నిమ్స్ స్పెషలిస్టు డాక్టర్ల ద్వారా ఆరోగ్యశ్రీ కేసుల మెడికల్ ఆడిట్ నిర్వహించాలని సూచించారు.

కోఠి ఈఎన్టీ ఆసుపత్రికి రూ.1.30 కోట్ల ప్రోత్సాహకం

కోవిడ్ సమయంలో ఎక్కడా చేయని విధంగా రికార్డు స్థాయిలో 856 బ్లాక్ ఫంగస్ సర్జరీలు విజయవంతంగా నిర్వహించిన కోఠి ఈఎన్టీ ఆసుపత్రికి రూ.1.30 కోట్ల అదనపు ప్రోత్సాహకం ఇవ్వనున్నట్లు మంత్రి వెల్లడించారు. మూగ, చెవిటి పిల్లలకు చికిత్స అందించి బాగు చేసే కాక్లియర్ ఇంప్లాంట్ సర్జరీలు ప్రస్తుతం కోఠి ఈఎన్టీ ఆసుపత్రిలో ప్రభుత్వం ఉచితంగా అందిస్తోందన్నారు. ఈ తరహా సేవలను వరంగల్ ఎంజీఎం ఆసుపత్రిలోనూ అందుబాటులోకి తెచ్చేందుకు కమిటీ ఏర్పాటు చేయనున్నామని తెలిపారు. కిడ్నీ బాధితులకు మరింత నాణ్యంగా డయాలిసిస్ సేవలు అందించేందుకు ఆన్‌లైన్ పర్యవేక్షణ చేసే విధంగా ప్రత్యేక సాఫ్ట్ వేర్ రూపొందించి, వినియోగించడానికి ఆరోగ్యశ్రీ బోర్డు అనుమతి ఇచ్చిందన్నారు. దీంతోపాటు ఆరోగ్యశ్రీ రోగులకు ఫేస్ రికగ్నిషన్ సాఫ్ట్ వేర్ వినియోగానికి కూడా అనుమతి ఇచ్చిందని వెల్లడించారు. బయోమెట్రిక్ విధానం వల్ల కొంత ఇబ్బందులు ఎదురవుతున్న నేపథ్యంలో మరింత పారదర్శకంగా ప్రజలకు సేవలు అందించేందుకు ఈ విధానం తేవాలని నిర్ణయించిందని తెలిపారు. ఆరోగ్యశ్రీ ప్యానెల్ బృందంలో ఉన్న కాంట్రాక్టు డాక్టర్ల వయోపరిమితిని 65 ఏళ్ల నుంచి 70 ఏళ్లకు పెంచుతూ నిర్ణయం తీసుకున్నట్టు హరీశ్ రావు వెల్లడించారు. సమావేశంలో ఆ శాఖ కార్యదర్శి రిజ్వీ, ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్ సీఈవో విశాలాచ్చి, సీఎం ఓఎస్డీ గంగాధర్, డీఎంఈ రమేష్ రెడ్డి, ప్రజారోగ్య సంచాలకుడు డాక్టర్ గడల శ్రీనివాసరావు, టీవీవీపీ కమిషనర్ అజయ్ కుమార్, నిమ్స్ డైరెక్టర్ బీరప్ప పాల్గొన్నారు.

ప్రైవేటు మాయకు చెక్ పెట్టండి

'సాక్షి' కథనంపై మంత్రి సబిత సమీక్ష

- ఇంటర్ ప్రవేశాల్లో డేటా సేకరించాలి
- డేటా ఇవ్వని కాలేజీలపై జరిమానాలు
- క్యాంపస్ మారిస్తే గుర్తింపు రద్దు?
- పాఠ్యపుస్తకాలు ఇవ్వకపోవడంపై సబిత అసంతృప్తి



సాక్షి, హైదరాబాద్: విద్యార్థులను చేర్చుకుని కూడా ఇంటర్ బోర్డ్‌కు ప్రవేశాలు చూపని ప్రైవేటు కాలేజీలపై కఠినంగా వ్యవహరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. 27లోగా ప్రతి విద్యార్థి అడ్మిషన్ వివరాలను పంపేలా జిల్లా ఇంటర్ అధికారులు చర్యలు తీసుకోవాలని విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి ఆదేశించారు. 'ఇంటర్ లెక్కల్లో కాలేజీల మాయ' శీర్షికతో 'సాక్షి'లో మంగళవారం ప్రచురితమైన కథనంపై మంత్రి సబితా ఇంద్రారెడ్డి ఉన్నతాధికారులతో సమీక్షించారు. 2లక్షల మంది టెన్త్ పాసయిన విద్యార్థులు ఎక్కడ చేరారు? వారి వివరాలు తెలియజేయాలని ఆమె అధికారులను కోరారు. ప్రైవేటు కాలేజీల్లో విద్యార్థులు చేరినా, వాటి డేటా ఇంటర్ బోర్డ్‌కు చేరలేదనే విషయాన్ని అధికారులు మంత్రి దృష్టికి తెచ్చినట్టు తెలిసింది. ఈ నేపథ్యంలో ఇంటర్ బోర్డ్ కార్యదర్శి నవీన్ మిత్తల్ అధికారులతో చర్చించారు.

పనులు పూర్తికాకపోతే ఎలా: సబిత

రాష్ట్ర వ్యాప్తంగా ఇంటర్మీడియట్ కళాశాలల్లో అవసరమైన నూతన భవనాలు, అదనపు గదులు, టాయిలెట్ల నిర్మాణం కోసం రూ.60 కోట్లు మంజూరు చేసినా సకాలంలో పనులు పూర్తి చేయకపోవడం పట్ల మంత్రి సబిత అసంతృప్తి వ్యక్తం చేశారు. విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి పనులు పూర్తి చేయాలని ఆదేశించినా, ఇంకా పూర్తి కాకపోవడంతో ప్రతీ వారం పనుల పురోగతిని సమీక్షించాలని నవీన్ మిత్తల్‌కు సూచించారు. కళాశాల నిర్వహణ అవసరాలకోసం, ల్యాబ్‌ల ఆధునీకీకరణ వంటి పనుల కోసం మరో రూ.4.43 కోట్లు మంజూరు చేశామని, వీటిని వెంటనే చేపట్టాలని ఆదేశించారు.

శుక్రవారంలోగా పుస్తకాలు అందాలి

విద్యార్థులకు ఇంకా పాఠ్యపుస్తకాలు అందకపోవడంపై సంబంధిత అధికారులపై మంత్రి సబితా ఇంద్రారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. పుస్తకాలను వివిధ జిల్లాలకు సరఫరా చేయడానికి ఆర్టీసీపైనే ఆధారపడకుండా ప్రయివేట్ ఆపరేటర్ల సహాయంతో శుక్రవారం నాటికి చేరేవిధంగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. మారుమూల జిల్లాల్లో అత్యధిక శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధిస్తుండగా అన్ని వనరులు ఉండి కూడా హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ వంటి జిల్లాలు వెనుకబడి ఉండటం సమర్థనీయం కాదన్నారు. సమావేశంలో విద్యా శాఖ కార్యదర్శి వాకాటి కరుణ, వివిధ జిల్లాల ఇంటర్ విద్యా శాఖ అధికారులు పాల్గొన్నారు.

డేటా పంపకపోతే విద్యార్థికి రూ.500 చొప్పున కాలేజీకి జరిమానా

ఈ నెల 27లోగా ప్రైవేటు కాలేజీల్లో చేరిన విద్యార్థుల డేటా పంపాలని, అలా చేయకుండా తర్వాత పంపితే నెలాఖరు వరకూ ఒక్కో విద్యార్థికి రూ.500 చొప్పున కాలేజీపై జరిమానా విధించాలని బోర్డ్ అధికారులకు మిత్తల్ సూచించారు. ఆ గడువు కూడా దాటితే విద్యార్థికి రూ. వెయ్యి చొప్పున కాలేజీపై జరిమానా విధించాలని తెలిపారు. ఆఖరి నిమిషం వరకూ వేచి చూసి ఆ తర్వాత సెక్షన్లు పెంచుకోవడం, ఒక క్యాంపస్‌లో ప్రవేశాలు, మరో క్యాంపస్‌లో అడ్మిషన్లు చేపట్టే ప్రైవేటు కాలేజీలపై నిఘా పెట్టాలని, ఇలాంటి చర్యలకు పాల్పడే యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకోవాల్సిందేనని, అవసరమైతే సదరు కాలేజీ అనుమతి కూడా రద్దు చేసే అంశాన్ని పరిశీలించాలని జిల్లా అధికారు లను ఇంటర్ బోర్డ్ కార్యదర్శి నవీన్ మిత్తల్ ఆదేశించారు.

రూ .231 కోట్లు కొట్టేశారు!

▶ మొదటి పేజీ తరువాయి

కుంభకోణం రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. పన్నులు చెల్లించకుండానే నకిలీ చలాన్లు సృష్టించి కోట్ల రూపాయలు కొట్టేశారు. వ్యాపారాలు చేసేవారు వాణిజ్య పన్నుల శాఖ ద్వారా ప్రభుత్వానికి పన్ను చెల్లించాల్సి ఉంటుంది. ఈ పన్నులు చలానా రూపంలో చెల్లిస్తారు. ప్రతి చలానాకు ప్రత్యేక నంబర్ ఉంటుంది. ఖజానా (ట్రెజరీ)లో ఈ నంబర్ వేయించుకుని ప్రభుత్వం అనుమతించిన బ్యాంకులో పన్ను మొత్తాన్ని జమ చేయాలి. దీనిని తమకు అనుకూలంగా మార్చుకున్న ట్యాక్స్ కన్సల్టెంట్ శివరాజ్, అతడి కుమారుడు సునీల్‌లు బోధన్ వాణిజ్య పన్నులశాఖ కార్యాలయ సిబ్బందితో కుమ్మక్కయ్యారు. పన్నులు చెల్లించకుండానే చెల్లించినట్టుగా నకిలీ చలాన్లు సృష్టించారు. కొంత మొత్తాన్ని చెల్లించి ఎక్కువ మొత్తంలో చెల్లించినట్టు చూపారు. ఒకరు చెల్లించిన చలానాతోనే పదుల సంఖ్యలో వ్యాపారులు, పలు వ్యాపార సంస్థలు చెల్లించినట్టుగా రికార్డులు సృష్టించారు. వ్యాపారుల సొమ్మును పక్కదారి పట్టించి తమ సొంత ఖాతాల్లోకి మళ్లించుకున్నారు. ప్రభుత్వ ఖజానాకు చిల్లుపెట్టారు. ఎక్కడికక్కడ అధికారులను తమ దారికి తెచ్చుకుని ఏళ్ల తరబడి ఈ కుంభకోణం కొనసాగించారు. అయితే నిజామాబాద్ జిల్లా బోధన్ సర్కిల్ సీటీఓ ఎల్.విజయేందర్ బోధన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో 2017 ఫిబ్రవరి 2న చేసిన ఫిర్యాదుతో ఈ మొత్తం వ్యవహారం వెలుగులోకి వచ్చింది. దీంతో ప్రభుత్వం ఈ కేసును సీఐడీకి అప్పగించింది.దర్యాప్తులో ఉద్యోగుల అవినీతి బాగోతానికి సంబంధించి పక్కా సాక్ష్యాలు లభించాయి. ఫోర్జరీ, మోసం, క్రిమినల్ బ్రీచ్ ఆఫ్ ట్రస్ట్, నేరపూరిత కుట్ర, లంచం తీసుకోవడం వంటి నేరాలు ఉండడంతో ఐపీసీ, అవినీతి నిరోధక చట్టంలోని పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. సీఐడీలోని ఆర్థిక నేరాల విభాగం డీఎస్పీ ఎస్.శ్యామ్ ప్రసాద్‌రావు దర్యాప్తు అధికారిగా వ్యవహరించారు.

కేసు నీరుగార్చే యత్నాన్ని బయటపెట్టిన 'సాక్షి'..

ఈ భారీ కుంభకోణం దర్యాప్తులో ఆద్యంతం అనేక మలుపులు చోటు చేసుకున్నాయి. చలాన్లు పెట్టేందుకే నిందితులు ఏకంగా ఓ ఇంటిని అద్దెకు తీసుకున్నారు. ఆ ఇంటి నిండా చలాన్లు ఉండటాన్ని దర్యాప్తు అధికారులు గుర్తించారు. మరోవైపు దర్యాప్తును నీరుగార్చేందుకు ఏకంగా ఐఏఎస్ స్థాయి అధికారి ఒకరు ప్రయత్నించిన విషయాన్ని 'సాక్షి' వెలుగులోకి తెచ్చింది. ఆ తర్వాతే కేసు దర్యాప్తులో వేగం పెరిగింది. తీగలాగితే డొంక కదిలిన చందంగా వాణిజ్య పన్నుల విభాగానికి చెందిన అనేకమంది అధికారుల పాత్ర వెల్లడైంది. ఈ క్రమంలో సీఐడీ విచారణాధికారికి కోటి రూపాయల ఎరవేశారు. ఈ నేపథ్యంలో సీఐడీ డీఎస్పీ విజయ్‌కుమార్‌ను ప్రభుత్వం సస్పెండ్ చేసింది.

అరెస్టు అయ్యింది వీరే..

ఈ కుంభకోణానికి కీలక సూత్రధారులుగా ఉన్న సింహాద్రి లక్ష్మీ శివరాజ్ (ఏడాది క్రితం మరణించాడు), అతని కుమారుడు సింహాద్రి వెంకట సునీల్‌లను సీఐడీ అరెస్టు చేసింది. వీరిద్దరు నిజామాబాద్ పట్టణంలో సేల్స్ ట్యాక్స్ ప్రైవేటు ఆడిటర్లుగా ఉంటూ ఈ కుంభకోణానికి తెగబడ్డారు. వీరితో పాటు వారి సిబ్బంది విశాల్ పాటిల్ అలియాస్ విశాల్ కాంతిపాటిల్, కమ్మర రామలింగం అలియాస్ రామ లింగడు, నారాయణదాస్ వెంకట కృష్ణమాచారి, ఎస్.సత్యవెంకట కృష్ణకుమార్ అలియాస్ పంతులు, ఎం.మల్లేశ్, గంగొనే రాకేశ్, మడపల్లి రమణ, వంగల శ్రీనివాస్, మహ్మద్ నజీముద్దీన్ అలియాస్ అబీబుద్దీన్, అగ్రోజుల రాజేశ్ కూడా ఉన్నారు. వాణిజ్య పన్నుల శాఖ అధికారులు.. రాథోడ్ ధర్మ విజయకృష్ణ, ఎ. వేణుగోపాల స్వామి, బి.హనుమంతు సింగ్, ధరణి శ్రీనివాసరావు,టి.పూర్ణచంద్రారెడ్డితో పాటు బోధన్ సర్కిల్ అసిస్టెంట్ కమర్షియల్ ట్యాక్స్ ఆఫీసర్లు ఆర్.కిషన్, కె.నాగేశ్వర్ రావు, కె.విజయకుమార్, ఎస్.రత్నకుమారి, బీఎస్ ఇందిర, జె.రాజ య్య, ఎస్.సాయిలు, సీనియర్ అసిస్టెంట్ లు సి.స్వర్ణలత, కె.అరుణ్‌రెడ్డి, బి.పీరాజీ, రవీంద్ర బాబు, ఆర్.బాలరాజు, జూని యర్ అసిస్టెంట్లు చంద్రహాస్, ఆర్.వినోద్‌కుమార్, బి.రంగారావు, ఎల్.బజరంగ్, సి.శ్రీధర్‌లు కుంభకోణంలో కీలకంగా వ్యవహరించారు.

ఆయన్ను భరించలేకున్నాం

- పీఆర్ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ సుల్తానియా వ్యవహారశైలిపై అధికారులు, ఉద్యోగుల ఆగ్రహం
- ఎర్రబెల్లికి తెలంగాణ సీఈవోలు, డిప్యూటీ సీఈవోల సంక్షేమ సంఘం వినతిపత్రం

సాక్షి, హైదరాబాద్: పంచాయతీ రాజ్ శాఖ ముఖ్యకార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా వ్యవహారశైలిపై ఆ శాఖ ఉన్నతాధి కారులు, ఉద్యోగులు తీవ్ర అసంతృప్తి, ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్ష ణమే ఆయన వ్యవహారశైలి మార్చుకునేలా జోక్యం చేసుకోవాలని మంత్రి దయాకర్‌రావును తెలంగాణ సీఈవోలు, డిప్యూటీ సీఈవోల సంక్షేమ సంఘం విన్నవించింది. ఈ మేరకు ఓ వినతిపత్రం మంత్రికి సమర్పించింది.

సానుకూల వాతావరణం చెడిపోతోంది: తెలంగాణ ఏర్పడ్డాక సీఎం కేసీఆర్, మంత్రి ఎర్రబెల్లి తీసుకున్న చర్యలతో దీర్ఘకాలంగా ఉన్న సర్వీసు, పరిపాలనా పరమైన సమస్యలు పరిష్కారమై అన్ని స్థాయిల్లో ప్రమోషన్లు, పోస్టింగ్‌లతో అధికారులు, ఉద్యోగుల్లో సానుకూల వాతావరణం ఏర్పడిందని ఆ సంఘం సభ్యులు వెల్లడించారు. అయితే కొంతకాలంగా సుల్తానియా వ్యవహారశైలి, అధి కారులు, ఉద్యోగుల పట్ల ప్రదర్శిస్తున్న అనుచిత వైఖరితో ఈ సానుకూల వాతా వరణమంతా దెబ్బతిందని మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. టెలీ, వీడియో కాన్ఫ రెన్స్‌లలో అధికారులు, ఉద్యోగుల పట్ల ఆయన అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని ఆరోపించారు. క్షేత్రస్థాయి అధికారుల స్పందన, వారి వైపు నుంచి అభిప్రా యాలు తీసుకోకుండానే పరుషంగా వ్యవహరిస్తుండడంతో అవమానాలు ఎదుర్కోవాల్సి వస్తోందన్నారు. చిన్న చిన్న కారణాలతో డీఆర్‌డీవోలు, డీపీవో లను సైతం సస్పెన్షన్ లేదా ప్రభుత్వానికి సరెండర్ చేయ డం వంటి పరిణామాలు అధికారులను తీవ్ర ఒత్తిళ్లకు, అయోమయానికి గురి చేస్తున్నాయని తెలియజేశారు. పీఆర్ శాఖ అధికారులు, ఉద్యోగుల్లో తీవ్ర అసంతృప్తి నెలకొందని, తక్షణమే మంత్రి ఎర్రబెల్లి జోక్యం చేసుకుని పనిచేసే వాతావరణం కల్పించాలని కోరారు.

సాక్షి

బుధవారం, 19 జూలై 2023

హాలీవుడ్ సంక్షోభం

అవును... హాలీవుడ్ సంక్షోభంలో చిక్కుకుంది. ఆరు దశాబ్దాల పైచిలుకు తర్వాత రచయితలు, నటీనటులు మళ్ళీ ఏకకాలంలో సెట్స్‌కు దూరం జరిగారు. సినిమాలు, టీవీ షోల నిర్మాణం ఒక్కసారిగా ఆగింది. జీతభత్యాల పెంపు సహా పలు అంశాలపై నిర్మాతల కూటమి (అలయన్స్ ఆఫ్ మోషన్ పిక్చర్ అండ్ టెలివిజన్ ప్రొడ్యూసర్స్)తో చర్చలు విఫలమై మే 2 నుంచి రచయితలు సమ్మె బాట పట్టారు. రెండు నెలల తర్వాత తాజాగా ఈ జూలై 13 నుంచి వేలాది నటులూ జత కలిశారు. సరైన జీతం, మెరుగైన పని పరిస్థితుల డిమాండ్లు తీరకపోవడంతో నటులూ పిడికిలి పైకెత్తారు. ఇక, రచన, నటనలో కృత్రిమ మేధ (ఏఐ) వినియోగాన్ని నటీనటుల సంఘం (ఎస్ఏజీ), రచయితల సంఘం (డబ్ల్యూజీఏ)... రెండూ వ్యతిరేకిస్తున్నాయి. సమ్మెకు అదీ ఒక ప్రధాన కారణమే. జంట సమ్మెల ప్రభావం చిత్రనిర్మాణంలోని ఇతర విభాగాల్లో, అనుబంధ పరిశ్రమల్లోని వేలమందిపైనా పడింది. కార్మికులంతా వీధిన పడ్డారు. అందుకే, ఇది వట్టి వినోదానికి మించిన విషయం.

సీఈఓలకు లక్షల డాలర్లిస్తూ, రచయితలు, నటుల దగ్గరకొచ్చేసరికి నష్టాలొస్తున్నాయంటూ బీద అరుపులు అరవడం హాలీవుడ్‌లోనూ ఉన్నదే. 2000లో అన్నీ కలిపి హాలీవుడ్ వినోద పరిశ్రమకు 500 కోట్ల డాలర్ల లాభాలొస్తే, నెట్‌ఫ్లిక్స్ చేరికతో 2019కి అది 3 వేల డాలర్లకు దూసుకుపోయింది. రచయితల సంపాదన మాత్రం తగ్గిపోయింది. గత దశాబ్దకాలంలో రచయిత కమ్ నిర్మాత హోదాలోని వారి సగటు జీతం 4 శాతం మేర తగ్గింది. ద్రవ్యోల్బణంతో చూసుకుంటే, ఏకంగా 23 శాతం క్షీణించింది. తాజా స్ట్రీమింగ్ శకం ప్రకంపనలు రచనావృత్తిని తాకాయి. 2000లో టీవీ సీజన్ రైటర్లకు ఏటా 42 వారాల పని దొరికేది. స్ట్రీమింగ్‌తో సీజన్లు తగ్గి, 20 వారాలకు పడిపోయింది.

11,500 మంది సభ్యులున్న రచయితల సంఘంతో మూడేళ్ళకోసారి నిర్మాతల కూటమి కొత్త జీతభత్యాల ఒప్పందం కుదుర్చుకుంటుంది. వార్నర్ బ్రదర్స్, డిస్కవరీ లాంటి భారీ స్టూడియోలు, నెట్‌ఫ్లిక్స్, పీకాక్ లాంటి పలు స్ట్రీమింగ్ వేదికలు ఆ నిర్మాతల్లో భాగమే. ఈసారి మే1తో కొత్త ఒప్పందం రావాలి. ఆరు వారాలు చర్చించినా ఫలితం లేకపోయింది. జీతం, పింఛన్, స్ట్రీమింగ్‌లో పదే పదే ప్రసారంతో రచయితలకు అదనంగా చేయాల్సిన అవశేష చెల్లింపులు (రాయల్టీలు) వగైరా ఎటూ తెగకపోవడంతో కలం కార్మికులు సమ్మె సైరన్ మోగించారు. స్థూలంగా నటీనటులకూ ఇలాంటి సమస్యలే. చర్చలు ఫలించక నటీనటుల సంఘం సైతం తాజాగా షూటింగ్‌లకు దూరం జరిగింది. గత నవంబర్‌లో రంగప్రవేశం చేసిన ఛాట్‌జీపీటీ సైతం సృజనాత్మక రంగాలను కుదిపేస్తోంది. సమీప భవిష్యత్తులో ఏఐతో తమ పొట్ట కొట్టకుండా రక్షణ ఉండాలని రచయితల, నటుల డిమాండ్.

ప్రస్తుతం స్ట్రీమింగ్ వేదికలు పెరిగాయి. కంటెంట్ దాహం తీరట్లేదు. దీన్ని అదనుగా చేసుకొని ఏఐ లాంటి వాటి శిక్షణకు తమ స్క్రిప్టులను వినియోగించరాదనీ, తమ రచనల నుంచి కొత్తవి సృష్టించడానికి ఏఐని వాడరాదనీ సృజనకారుల డిమాండ్. నటులు సైతం అనుమతి లేకుండా, పరిహారమివ్వకుండా ఏఐతో తమ రూపాలనూ, స్వరాలనూ సృష్టించి నటింపజేయరాదంటున్నారు. అది సమంజసమే. నిర్మాతలు మాత్రం నేపథ్యంలోని నటీనటుల స్కాన్లను తీసుకొనే హక్కు తమకు ఉండాలంటున్నారు. తద్వారా వారి రూపాలను ఏఐతో సృష్టించి శాశ్వతంగా వాడుకోనివ్వాలని కోరుతున్నారు. అప్పుడిక పారితోషికమివ్వకుండానే పని జరిగిపోతుందనేది నిర్మాతల ఎత్తు. దీని పైనే తీవ్ర అభ్యంతరం. వెరసి, యావత్ సినీ చరిత్రలోనే రెండో పర్యాయం హాలీవుడ్ స్తంభించింది.

2007లో వంద రోజుల పాటు రచయితల సమ్మెతో ఒక్క క్యాలిఫోర్నియాకే 210 కోట్ల డాలర్ల మేర నష్టం వాటిల్లింది. ఇప్పుడీ జంట సమ్మెలెంత నష్టం తెస్తాయో? రీషూట్లు, ప్రచారాలు, ప్రీమియర్లకు నటులు దూరమయ్యేసరికి పూర్తయిన సినిమాలకూ ఇబ్బందే. టీవీ షోల కథ సరేసరి. ఎమ్మీ అవార్డుల ప్రదానం లాంటివీ వెనక్కిపోతాయి. వాటి కన్నా ముఖ్యం సాధారణ కార్మికుల పరిస్థితి. 1960లో నటులు, రచయితలు ఒకేసారి సమ్మె చేసినప్పుడు నటీనటుల సంఘానికి సారథి నటుడు, తర్వాత అమెరికా అధ్యక్షుడైన రొనాల్డ్ రీగన్. అయితే ఈసారి సమ్మె ప్రత్యేకమైనది. సాంకేతికతదే పైచేయి అయి, పని స్వభావం, సుస్థిరతపై ప్రభావం పడేవేళ యాజమాన్యానికీ, శ్రామికులకూ మధ్య బంధాల పునర్వ్యవస్థీకరణ అవసరమని గుర్తు చేస్తున్న సమ్మె ఇది. ఛాట్ జీపీటీతో పని చౌక గనక రచయితలు, ఎడిటర్లు, ఫోటోగ్రాఫర్ల లాంటి వైట్‌కాలర్ ఉద్యోగాలు పోతాయని భయం.

అలాగని అంతర్జాల యుగంలో నియంత్రణలతో టెక్నాలజీని అడ్డగలమా అంటే అనుమానమే. ఎవరికీ దెబ్బ తగలకుండా మధ్యేమార్గంలో పోవడం విజ్ఞత. దర్శక దిగ్గజం క్రిస్టఫర్ నోలన్ అన్నట్టు తారల సంగతెలా ఉన్నా, ఏఐతో రచయితల, చిన్న నటీనటుల పొట్టకొట్టడం భావ్యం కాదు. నిజానికి, రచన, నటన లాంటి సృజనాత్మక కృషికి మేధ కన్నా మానసిక స్పందన ముఖ్యం. మనిషైతేనేం, మెషిన్నైతేనేం అంతా ఒకటేనని కొందరు అనుకోవచ్చు. అననూవచ్చు. భవిష్యత్తులో అలాంటి ఏఐ ఆధారిత సినిమాలు రావచ్చు. కొత్త ఒక వింతగా ఆకట్టుకోనూవచ్చు. కానీ, ఏ సృజన ఎందుకు గొప్పదవుతుందో, ఎలా జనాదరణ పొందుతుందో యంత్రాలు, డేటాలు చెప్పగలవా? నకిలీ నటులు, కంప్యూటర్ రచయితలతో తయారైన ఏఐ చిత్రాలు నిజమైన సినిమాల అనుభూతిని అందించగలవా? కొద్దికాలానికి ఈ కృత్రిమ మేధాసృష్టి విసుగెత్తవచ్చు. అయితే, అప్పటికే అంతా ఆలస్యమైపోతుంది. హాలీవుడ్‌లో సమ్మె చేస్తున్నవారి ఆవేదన అదే!

సంస్కృతంలో వాళ్లెందుకు రాయరు?

విశ్లేషణ



ప్రొ॥ కంచ ఐలయ్య షెపర్డ్

సంస్కృతాన్ని ఇష్టపడే కొందరు భారతీయ అమెరికన్లు తమ పుస్తకాలను సంస్కృతంలో ఎందుకు రాయరు? వీరు ఆంగ్లంలో రాస్తూనే, ఆ భాషను వలసవాదమంటూ దాడి చేస్తారు. చారిత్రకంగా సంస్కృతాన్ని కొందరు రచయితలే నియంత్రించారు. వారు దాని ప్రాప్యతను, విస్తృతిని పరిమితం చేశారు. శూద్రులకు ఆ భాషలో చదవడానికి, రాయడానికి గల అవకాశాన్ని నిరాకరించారు. కానీ, ఇప్పుడు వాళ్లు సామాజికపరమైన లేదా విద్యాపరమైన ప్రాముఖ్యం కలిగిన పుస్తకాలు రాయడానికి సంస్కృతాన్ని ఉపయోగించడం లేదు. అలా సంస్కృత అంతర్ధానానికి చైతన్యవంతంగా బాధ్యత వహిస్తున్నారు. అయినా ఆ అంతర్ధానానికి మాత్రం మిగిలిన ప్రపంచాన్ని నిందిస్తూ ఉంటారు.

దాదాపుగా భారతీయ అమెరికన్లతో కూడిన రాజీవ్ మల్హోత్రా నేతృత్వంలోని బృందం ఇటీవల 'టెన్ హెడ్స్ ఆఫ్ రావణ: ఎ క్రిటిక్ ఆఫ్ హిందూఫోబిక్ స్కాలర్స్' పుస్తకాన్ని ప్రచురించింది. ఇంగ్లిషులో రాసిన ఈ పుస్తకం... ఈ రచయితతో సహా రొమిల్లా థాపర్, ఇర్ఫాన్ హబీబ్, శశిథరూర్, రామచంద్ర గుహ, దేవదత్ పట్నాయక్, షెల్డన్ పొలాక్, వెండీ డోనిగర్, ఆడ్రీ ట్రూష్కే, మైకేల్ విట్జెల్‌లను విమర్శించింది. మల్హోత్రా బృందం ఈ పండితులను పౌరాణిక పాత్ర అయిన రావణుడితో పోల్చింది. ఈ పండితులు ప్రాచీన సంస్కృత పుస్తకాలు ప్రబోధించిన ధర్మాన్ని చంపేశారని ఆరోపించింది. 'చారిత్రక రావణుడికి మల్లే ఈ పండితుల రచనల్లో నేడు చాలామంది హిందువులు అధర్మంగా భావిస్తున్న అంశాలు ఉన్నాయి కాబట్టే ఈ పుస్తకంలో పది మంది సమకాలీన విద్వాంసులను లక్ష్యంగా' ఎంచుకున్నట్లు మల్హోత్రా తన పరిచయంలో పేర్కొన్నారు.

ఈ పుస్తకంలో లక్ష్యంగా ఎంచుకున్న నలుగురు విదేశీ పండితులు సంస్కృత భాషపై కృషి చేశారు. చాలాకాలం వివిధ పాశ్చాత్య విశ్వ విద్యాలయాలలో సంస్కృత భాషను బోధించారు. మరోవైపు, మల్హోత్రాకు అమెరికాలో 'ఇన్ఫినిటీ ఫౌండేషన్' అనే ఆర్థిక నెట్‌వర్క్ ఉంది. ఈ పుస్తకాన్ని ప్రచురించిన ఢిల్లీలోని 'గరుడ ప్రకాశన్' సంస్థనూ నడుపుతున్నారు.

ఇప్పుడు ప్రశ్న ఏమిటంటే: సంస్కృతాన్ని ఇష్టపడే ఈ భారతీయ అమెరికన్లు తమ పుస్తకాన్ని సంస్కృతంలో ఎందుకు రాయలేదు? వీరు ఆంగ్లంలో రాస్తూనే, ఆ భాషను వలసవాదమంటూ దాడి చేస్తారు. సంస్కృతాన్ని గొప్ప ప్రపంచ సజీవ భాష అంటారు, కానీ ఆ భాషలో ఏ గ్రంథాన్నీ రాయరు. సంస్కృతాన్ని మృత భాష అని షెల్డన్ పొల్లాక్ సరిగ్గానే అన్నారు. తమ దైనందిన జీవితంలో సంస్కృతాన్ని ఉపయోగించే, అందులో భావ వ్యక్తీకరణ చేసే కుటుంబాలు ఎన్ని ఉన్నాయి? ఒక భాషను స్థానికంగా మాట్లాడేవారు లేనప్పుడు భాష మరణిస్తుంది. ఆధిపత్య నియంత్రణను కొనసాగించడానికి సంస్కృతాన్ని ఉపయోగించే వ్యక్తుల సమూహమే ఆ భాషను చంపేసింది. చారిత్రకంగా సంస్కృతాన్ని కొందరు రచయితలే నియంత్రించారు. వారు దాని ప్రాప్యతను లేదా విస్తృతిని పరిమితం చేశారు. శూద్రులకు ఆ భాషలో చదవడానికి లేదా రాయడానికి గల అవకాశాన్ని నిరాకరించారు.

సామాజికపరమైన లేదా విద్యాపరమైన ప్రాముఖ్యం కలిగిన పుస్తకాలు రాయడానికి సంస్కృతాన్ని ఇప్పుడు వాళ్లు ఉపయోగించడం లేదు. అలా సంస్కృత అంతర్ధానానికి చైతన్యవంతంగా బాధ్యత వహిస్తున్నారు. కానీ ఆ అంతర్ధానానికి మిగిలిన ప్రపంచాన్ని నిందిస్తూ ఉంటారు. ఇతర సంస్కృతులకు చెందిన యూదుల వంటివారు తమ



ఆధునిక పుస్తకాలను హీబ్రూలో రాస్తున్నారు. యువల్ నోవా హరారీ ప్రభావవంతమైన రచన 'సేపియన్స్– ఎ బ్రీఫ్ హిస్టరీ ఆఫ్ హ్యూమన్ కైండ్'ను మొదట హీబ్రూలోనే రాశారు. అలాగే గ్రీకులు గ్రీకు భాషలో రాస్తారు. అరబ్బులు అరబిక్‌లోనే రాస్తారు. బ్రాహ్మణ వాదులు మాత్రం సంస్కృతంలో రాయరు. శూద్ర, దళిత, ఆదివాసీ ప్రజానీకాన్ని మోసం చేయడానికి మాత్రమే సంస్కృతాన్ని పొగడటాన్ని నేటికీ కొనసాగిస్తున్నారా?

బ్రాహ్మణవాద మేధావులకు ఆరెస్సెస్, బీజేపీ ఆర్థికంగా, సంస్థాగతంగా మద్దతు ఇస్తున్నాయి. భారతదేశ వ్యవసాయ చేతివృత్తుల చరిత్రను విస్మరిస్తూ సంస్కృత గతాన్ని మాత్రమే వీరు కీర్తిస్తున్నారు. వివిధ విభాగాలలో ప్రపంచవ్యాప్తంగా అందుబాటులో ఉన్న జ్ఞానాన్నంతటినీ సంస్కృత గ్రంథాలైన వేదాలు, ఉపనిషత్తులు, బ్రాహ్మణాలు, రామాయణం, మహాభారతాల నుండే దొంగిలించారనే భావనను ప్రచారం చేస్తారు. బ్రాహ్మణవాద శాస్త్రవేత్తలు కూడా ఆధునిక విజ్ఞాన శాస్త్రాలన్నీ ప్రాచీన సంస్కృత పుస్తకాలలో ఉన్నాయని పేర్కొన్నారు. ఈ పండితుల్లో ఎంతమంది సంస్కృతంలో ఆ పుస్తకాలను చదివారు? సంస్కృతంలో ఇంత అపారమైన సృజనాత్మక శక్తి ఉన్నట్లయితే, ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా విస్తరించి ఉన్న భారతీయ మేధావులు... ప్రపంచ తాత్విక, మేధాపరమైన రచనలను హరారీ వంటి వ్యక్తులకు ఎందుకు వదిలివేస్తున్నారు?

భారతదేశ చరిత్ర పొడవునా సంస్కృతాన్ని 'మాతృభాష'గా కాకుండా 'పితృభాష'గా పరిగణిస్తూ వచ్చారు. సంస్కృతాన్ని ద్విజ కుటుంబాలలో కూడా మాతృభాషగా మారడానికి అనుమతించలేదని గుర్తుంచుకోవాలి. తల్లి, ఆమె బిడ్డల మధ్య సంభాషణతో సహా ఇంటిలో రోజువారీ జీవితంలో ఒక భాషను క్రమం తప్పకుండా ఉపయోగిస్తే మాత్రమే దానిని 'మాతృభాష'గా పరిగణించవచ్చు. కులీన గృహాలలో కూడా సంస్కృతాన్ని మాతృభాషగా మారడానికి అనుమతించనప్పుడు, ఉత్పత్తి వర్గాల్లో దాన్ని స్వీకరించే ప్రశ్న తలెత్తదు.

ఈ పరిస్థితుల దృష్ట్యా, నాగరికతకు రక్షణకర్తలుగా తమను తాము గుర్తించుకునే ఈ భారతీయ అమెరికన్ల సమూహం... సంస్కృతంలో తమ పుస్తకాలను ఎందుకు రాయడం లేదని ప్రశ్నించాల్సి ఉంది. ఈ బృందం ప్రధానంగా అమెరికా, యూరప్, కెనడా, ఆస్ట్రేలియాల్లో నివసిస్తున్న వ్యక్తులలోని భారతీయ ఆలోచనా విధానాన్ని నిర్వలసీకరించడం, ఆర్థిక వనరులను సమీకరించడం లక్ష్యంగా పెట్టుకుంది. కానీ, భారతదేశంలో స్థాపించిన సంస్కృత పాఠశాలలు, సంస్కృత విశ్వవిద్యాలయాలకు వారు తమ పిల్లలను ఎందుకు పంపరు? బదులుగా వారు తమ పిల్లలను ప్రతిష్ఠాత్మకమైన అమెరికన్ విశ్వవిద్యాలయాలకు మాత్రమే ఎందుకు పంపాలని భావిస్తున్నారు?

'టెన్ హెడ్స్ ఆఫ్ రావణ' పుస్తకాన్ని రచించిన ఈ వ్యక్తులు, సంస్కృత పుస్తకాల నుండి వచ్చిన భారతదేశ నాగరికత మా లాంటి ఎవరికీ తెలియదని ఆరోపించారు. నాగరికత అంటే వారి దృష్టిలో అర్థం ఏమిటి? పుస్తకాల ద్వారా నాగరికతను నిర్మించవచ్చా? సంస్కృత పుస్తకాలకు చెందిన ఏదైనా అనువాదాన్ని చదివితే... శూద్ర, దళిత, ఆదివాసీ వర్గాల నుండి సామాజిక శక్తులు ఏవీ లేవని అది సూచిస్తుంది. ఇవి యుద్ధం, యజ్ఞాలు, క్రతువుల చుట్టూ కేంద్రీకృతమై ఉన్నాయి. ఆహార ఉత్పత్తి, సేకరణ, జంతువుల మేతకు చెందిన వ్యవస్థలను ఈ పుస్తకాలలో ఏ కోశానా పొందుపర్చలేదు. ఈ హిందూత్వ రచయితలతో సహా మానవులందరూ శూద్ర వ్యవసాయాధారిత ప్రజానీకం ఉత్పత్తి చేసే ఆహారంతోనే జీవిస్తున్నారని గుర్తించడం ముఖ్యం. ఆ 'సంస్కృత యుగం'లో భూమిని పండించిన వారి గురించి, జంతువుల మేత ద్వారా మాంసాన్ని, పాలను ఉత్పత్తి చేసిన వారి గురించి ఎప్పుడూ రాయలేదు.


హాస్యాస్పదంగా, ఈ భారతీయ అమెరికన్ కులీన వర్గాలు, ప్రత్యేకించి అమెరికాలో కుల వ్యతిరేక చట్టాలను వ్యతిరేకించే ఇన్ఫినిటీ ఫౌండేషన్ సభ్యులు తమను తాము 'మేధావులైన క్షత్రియులు'గా పేర్కొంటారు. అది కులతత్వం కాదా? మరోవైపున వీరి సంస్కృత యుగం పట్ల దళితులు, ఆదివాసీలు, శూద్రులకు ఏ మాత్రం ఆసక్తి లేదు. ఇంగ్లిష్ యుగంలోకి వెళ్లాలనీ, జ్ఞానోత్పత్తికి సంబంధించిన అన్ని కేంద్రాల నుండి ఈ శక్తులను స్థానభ్రంశం చేయాలనీ, ఆహార ఉత్పత్తి, జ్ఞానోత్పత్తి మధ్య సంబంధాన్ని ప్రతిష్ఠించాలనీ వారు కోరుకుంటున్నారు. ఇది అమృత్ కాల్ కాదు; నిజానికి ఇది శూద్ర కాలం. ఈ యుగంలో సంస్కృత పుస్తకాలలో వర్ణించినట్లుగా ఉత్పత్తి అనేది లోకువైనది కాదు; ఇక్కడ ఉత్పత్తి చాలా పవిత్రమైనది.

వ్యాసకర్త ప్రముఖ రచయిత, సామాజిక కార్యకర్త

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

పదాలతో పోరు



ప్రతిపక్షాలు తమ కూటమిని 'ఇండియా' అంటున్నాయి: ఇండియన్ నేషనల్ డెవలప్‌మెంటల్ ఇంక్లూజివ్ అలయెన్స్! విస్తరణ రూపంలో ఇది నోరు తిరగని మాటే; కానీ ఇది తక్కున గుర్తుండిపోయే సంక్షిప్త పదాల కాలం కదా! ఇప్పటికి ఇది ఇండియా వర్సెస్ ఎన్డీయే: ఎవరు గెలిచినా, భారత్ అనే ఇండియా గెలుస్తుంది.

– రాజ్‌దీప్ సర్దేశాయ్, జర్నలిస్ట్

ఇంత చెత్తా?



నీళ్ల గ్లాసును ఎండలో పెడితే ఆ నీటిలోకి విటమిన్–డి రాదు (వీడియో షేర్ చేశారు). కానీ లైకుల కోసం ఇలాంటి చెత్త వీడియోలు చేస్తున్నారు. ఇంకా ఘోరం ఏమిటంటే, దీన్ని వేలమంది నమ్ముతారు. ఇలాంటి కంటెంటుకు ఉన్న డిమాండుకు తగ్గట్టుగా ఇలాంటి వాళ్లు సరఫరా చేస్తున్నారు.

– కార్తీక్, ఎండోక్రైనాలజిస్ట్

తర్వాతి కథ?



వివాహ సంబంధ పోస్టులను ఎగతాళి చేయొద్దు. తెల్లగా, చూడ్డానికి బాగుండి, ఇంట్లో ఉండటానికి ఇష్టపడే సంప్రదాయ ఐటీ అమ్మాయిని అబ్బాయిలూ; 27 ఏళ్లు, ఆరడుగుల ఎత్తు, యేడాదికి యాభై లక్షల సంపాదన ఉండి, తన తల్లిదండ్రులతో ఉండాలని బలవంత పెట్టని అబ్బాయిని అమ్మాయిలూ కోరుకుంటారు. అవును, ముందు అలాగే మొదలవుతుంది...

– సాయి స్వరూప, అసిస్టెంట్ ప్రొఫెసర్

బోరు బోరు



మోదీకి ఇప్పటికీ ఎదురు లేదని ప్రతిపక్ష కూటమి సమావేశాలు బహిర్గతపరుస్తున్నాయి. పదేళ్లపాటు ప్రతిపక్షంలో కూర్చుండి కూడా వాళ్లు కొత్త ఆలోచనలు, కొత్త ముఖాలు, కొత్త కథనాలతో రాలేదు.

– తవ్లీన్ సింగ్, కాలమిస్ట్

భారత్ వర్సెస్ ఇండియా



అంటే 2024 ఎన్నికల పోరు ఇండియా వర్సెస్ భారత్ కానుందా? మనకు తెలిసిన మోదీ కచ్చితంగా ఈ పోలిక మీద ఆడుకుంటారు: ఒకటేమో విదేశీ వ్యుత్పత్తి, మరొకటేమో ఈ నేల మూలాల్లో ఉన్నది. చూద్దాం ఏం జరగనుందో!

– సుహేల్ సేఠ్, నటుడు

ప్రవేశాలు తగ్గడానికి కారణాలివీ!

1990 దశకంలో ప్రభుత్వ ఇంటర్ కళాశాలలో సీటు దొరకాలంటే కష్టంగా ఉండేది. ఎమ్మెల్యే స్థాయి ప్రజా ప్రతినిధులు సైతం ఇంటర్ లో సీటు కోసం సిఫార్సు చేసే పరిస్థితి! ఆ రోజుల్లో డివిజన్‌కు ఒకటి రెండు ఇంటర్ కళాశాలలు మాత్రమే ఉండేవి. అందునా అవి కూడా కొన్ని ఉన్నత పాఠశాలల్లో కలిసి షిఫ్ట్ విధానంలో పని చేసేవి. ఇక ఉపన్యాసకులు కూడా అరకొరగా ఉండేవారు. అర్హులైన ప్రభుత్వ ఉపాధ్యాయులే పార్ట్ టైమ్‌గా పాఠాలు చెప్పేవారు. పదవ తరగతి ఇంటర్ పరీక్షల ఫలితాలు కూడా సాధారణ స్థాయిలోనే ఉండేవి. విద్యార్థుల చదువులకు, ఫలితాలకు విద్యార్థులే బాధ్యత వహించే రోజులు అవి. అటువంటి రోజుల్లో కూడా ప్రభుత్వ కళాశాలల్లోనే చదవడానికి విద్యార్థులు పోటీలు పడేవారు.

ప్రస్తుతం రెండు తెలుగు రాష్ట్రాల్లో కూడా 2002 నుంచి మండలానికి ఒక ప్రభుత్వ జూనియర్ కళాశాల, పూర్తి వసతులు, ప్రత్యేక పక్కా భవనాలు, సంపూర్ణ స్థాయిలో బోధకులు... వీటన్నిటికీ తోడు విద్యార్థుల ఉత్తీర్ణతకు బోధకులే పూర్తి బాధ్యత వహించే పరిస్థితి. ఇలాంటి పరిస్థితుల్లో కూడా ప్రస్తుతం తెలంగాణలో మొదటి సంవత్సరం అడ్మిషన్ల లక్ష్యం 90,000కు గాను ఇప్పటికీ 47,000 మందే చేరారు. విద్యా సంవత్సరం ప్రారంభమై నెల రోజులు కావస్తున్నా కొత్త అడ్మిషన్లు పెరగలేదు. 2000 సంవత్సరం నుంచి ప్రామాణిక విద్యను అందించే ప్రభుత్వ కళాశాలలకు ప్రైవేటు కళాశాలల పోటీ ప్రారంభమై 2019 కరోనా వరకు కొనసాగింది. అనేక ఆకర్షణలతో గ్రామీణ విద్యార్థుల్ని సైతం ప్రైవేటు కళాశాల తన వైపు తిప్పుకుంది. దీంతో ప్రభుత్వ కళాశాలల్లో అడ్మిషన్ల సంఖ్య తగ్గుముఖం పడుతూ వచ్చింది. అయినా 2000 సంవత్సరం నుంచి ఇంటర్ విద్యా వ్యవస్థలో ఏర్పాటు చేసిన 'కాంట్రాక్టు ఉపన్యాసకుల' వ్యవస్థతో ప్రభుత్వ కళాశాలలో విద్యా విధానం అన్ని ఆటంకాలను ఎదుర్కొంటూ కూడా ప్రైవేట్ కళాశాలలకు దీటుగా నిలిచింది. రెండు దశాబ్దాల పాటు ప్రభుత్వ కళాశాలను కంటికి రెప్పలా కాపాడుకుంటూ వచ్చింది. అలాంటి నిస్వార్థ విద్యా సేవకుల సేవలను గుర్తించిన తెలంగాణ ప్రభుత్వం సంబంధిత ఉపన్యాసకులను క్రమబద్ధీకరించిన తరువాత, వారు గతంకన్నా మించిన ఉత్సాహంతో పని చేస్తున్నారు. అయినా ప్రభుత్వ కళాశాలల్లో ప్రవేశాల సంఖ్య ఎందుకు పెరగటం లేదన్నదే అందరి ప్రశ్న.



తెలంగాణ రాష్ట్రంలో 406 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఉండగా ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, కులాల వారీగా ఏర్పాటు చేసిన 'గురుకుల విద్యాలయాల' సంఖ్య గణనీయంగా పెరుగుతూ వచ్చింది. వీటికి తోడు 'కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాలు' వచ్చాయి. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, ప్రభుత్వ జూనియర్ కళాశాలల సంఖ్య నిష్పత్తి శాస్త్రీయంగా ఉన్నా... ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన పదవ తరగతి విద్యార్థులంతా ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లోనే ఇంటర్ చదివే పరిస్థితి లేదు. దీనికి తోడు సాధారణ ఇంటర్ కోర్సుల కన్నా వృత్తి విద్యా కోర్సులకు, ఐటీఐ, పాలిటెక్నిక్ వంటి వృత్తి విద్యల వైపు విద్యార్థులు ఆసక్తి చూపుతున్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంత ప్రభుత్వ కళాశాలల్లో భోజన వసతి, రవాణా సౌకర్యాలు లేమి కూడా అడ్మిషన్ల కొరతకు ఒక కారణంగా భావించాలి. కులాల వారి గురుకుల విద్యాలయాలు, కస్తూరిబా గాంధి విద్యాలయాల్లో గల విలువైన భోజన, వసతి, సౌకర్యాలు దృష్ట్యా గ్రామీణ విద్యార్థులంతా అటుగా మొగ్గు చూపుతున్నారు. ఈ అన్ని కారణాలూ సాధారణ ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ప్రవేశాలు తగ్గడానికి కారణాలు. వీటిలో కూడా తగిన సౌకర్యాలు, వసతులూ కల్పిస్తే ప్రవేశాలు పెరగవచ్చు.

డా॥ అమ్మిన శ్రీనివాసరాజు
సీనియర్ ఉపన్యాసకుడు । 77298 83223

పేదరికం తరుగుతున్నా అసమానతలే

అభిప్రాయం



డా॥ తిరునాహరి శేషు

అభివృద్ధి చెందుతున్న దేశాలలో పేదరికం ఒక విష వలయంగా ఏర్పడి ఆ దేశాలను అభివృద్ధి చెందకుండా అడ్డుపడుతోందని ప్రఖ్యాత ఆర్థికవేత్త 'రాగ్నర్ నర్క్సే' అన్నారు. ప్రపంచంలో భారతదేశం లాంటి అభివృద్ధి చెందుతున్న దేశాలు పేదరికంతో సహా ఎన్నో ఆర్థిక సమస్యలతో బాధ పడుతున్నవే. పేదరికం అనేక సమస్యలతో కార్యకరణ సంబంధాన్ని కలిగి ఉంటుంది. అది నిరుద్యోగం, అసమానతలు, జనాభా పెరుగుదల వంటివాటికి మూల కారణం. అందుకే దశాబ్దాలుగా అభివృద్ధి చెందుతున్న దేశాలు పేదరికాన్ని నిర్మూలించడానికి ఒక రకంగా యుద్ధం చేస్తున్నాయనే చెప్పాలి. అయితే గత 15 సంవత్సరాలలో భారత దేశంలో సుమారు 41.4 కోట్ల మంది పేదరికం నుండి బయటపడ్డారని 'యూనివర్సిటీ ఆఫ్ ఆక్స్‌ఫర్డ్'తో కలిసి 'యూఎన్‌డీపీ' విడుదల చేసిన 'గ్లోబల్ మల్టీ డైమెన్షనల్ ఇండెక్స్' నివేదిక చెబుతోంది. 2005లో 55.1 శాతంగా ఉన్న పేదరికం 2021 నాటికి 16.4 శాతానికి తగ్గిందని చెప్పింది. అలాగే 15 సంవత్సరాల క్రితం 64.5 కోట్ల మంది పేదరికంలో ఉంటే 2021 నాటికి 23 కోట్లకు పేదవాళ్లు తగ్గారని నివేదిక వెల్లడి చేసింది. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విస్తృతంగా దేశంలో అమలు చేస్తున్న పేదరిక నిర్మూలన కార్యక్రమాలు, ఉపాధి కల్పన, స్వయం ఉపాధి కల్పన కార్యక్రమాలు, నిరుద్యోగ నిర్మూలన కార్యక్రమాలు, సామాజిక భద్రతా కార్యక్రమాలు, సంక్షేమ పథకాల వలన పేదరికం తగ్గిందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. 2005 తరువాత వచ్చిన 'ఉపాధి హామీ' చట్టం, కోవిడ్ లాంటి విపత్కర పరిస్థితులలో పేదలను ఆదుకోవటానికి చేపట్టిన 'గరీబ్ కల్యాణ్ అన్న యోజన' వంటివి పేదరికాన్ని తగ్గించడానికి దోహదం చేశాయని చెప్పవచ్చు.

'వరల్డ్ బ్యాంక్' అంచనాల ప్రకారంగా భారతదేశంలో 10 శాతం పేదరికం ఉంటే, యూఎన్‌డీపీ ప్రకారంగా 16.4 శాతం ఉంది. 'నీతి ఆయోగ్' 25 శాతం పేదరికం ఉంది అంటోంది. అలాగే నీతి ఆయోగ్ ప్రకారంగా బిహార్‌లో పేదరికం 52 శాతంగా ఉంటే, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాలతో పాటు ఈశాన్య రాష్ట్రాలలో పేదరికం 30 శాతం కంటే ఎక్కువగానే ఉంది. అంతర్జాతీయ సంస్థలతోపాటు నీతి ఆయోగ్ లాంటి దేశీయ సంస్థలు భారతదేశంలో పేదరికం తగ్గుతోందని చెబుతూనే, మరొకవైపు దేశంలో నిరుద్యోగం, ఆదాయ అసమానతలు, సంపద కేంద్రీకరణలు పెరిగిపోతున్నాయని చెబుతున్నాయి. 'సెంటర్ ఫర్ మానిటరింగ్ ఇండియన్ ఎకానమీ' ప్రకారం 2023 ఏప్రిల్ మాసంలో భారత దేశంలో 8.11 శాతం నిరుద్యోగం నమోదయ్యింది. అలాగే 2023 'ఆక్స్ ఫామ్' నివేదిక ప్రకారం దేశంలోని 40 శాతం సంపద కేవలం ఒక్క శాతం సంపన్నుల చేతిలో కేంద్రీకృతమై ఉంది. దీన్ని బట్టి దేశంలో ఒకవైపు నిరుద్యోగం, ఆదాయ అసమానతలు, సంపద కేంద్రీకరణ పెరిగిపోతుంటే మరొకవైపు పేదరికం ఎలా తగ్గుతుందనే సందేహాలు కలగక మానవు.



భారతదేశంలో బహుశా మధ్య తరగతి కుటుంబాలు పెరగటం పేదరికం తగ్గటానికి ఒక కారణం కావచ్చు. ప్రస్తుతం భారతదేశంలో 31 శాతం మిడిల్ క్లాస్ జనాభా ఉందని ఇది 2047 నాటికి 102 కోట్లకు పెరుగుతుందని 'ప్రైస్' సంస్థ విడుదల చేసిన 'రైజ్ ఆఫ్ ఇండియా మిడిల్ క్లాస్' నివేదిక వెల్లడి చేసింది. ఇలా మధ్యతరగతి జనాభా పెరగటం వలన 2047 నాటికి భారత్ అభివృద్ధి చెందిన దేశంగా అవతరించి పేదరికం కనిష్ఠ స్థాయికి చేరుకుంటుందని ఒక అంచనా. భారత ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన నివేదిక ప్రకారంగా రైతు కుటుంబాల నెలసరి సగటు ఆదాయం కేవలం 10,084 రూపాయలు మాత్రమే. కాబట్టి రైతుల ఆదాయాలను ప్రభుత్వాలు రెట్టింపు చేయగలిగితే భారత్‌లో ఇప్పుడున్న పేదరికం మరింత తగ్గే అవకాశం ఉంటుంది.

వ్యాసకర్త అసిస్టెంట్ ప్రొఫెసర్, కాకతీయ విశ్వవిద్యాలయం । 98854 65877

వృథా ప్రయాస

వ్యర్థమైపోయిన భారీగా శుభ్ర పరిచే ఒక ప్రక్రియను చెప్పడానికి 'గజస్నానం' అనే నానుడిని ఉపయోగిస్తారు తెలుగులో. 'ఏనుగుకు చేయించిన స్నానం వలె' అనే అర్థంలో 'హస్తిస్నానమివ' అనే ప్రయోగం క్రీ.శ.1300ల ప్రాంతం నాటి నారాయణ పండితుని 'హితోపదేశం', (మిత్రలాభము, 18వ శ్లోకం)లో కనపడుతుంది.

ఒక ఏనుగుకు కష్టపడి స్నానం చేయించాడు దాని మావటీడు. గట్టుమీదికి చేరి నాలుగు అడుగులు ముందుకు వేసిందో లేదో, అలవాటు ప్రకారం దారిలో కనపడిన దుమ్మును చూడగానే తొండంతో ఎత్తి ఒంటి నిండా చల్లుకోకుండా ఉండలేకపోయింది ఆ ఏనుగు. అప్పటిదాకా కష్టపడి చేయించిన స్నానం కాస్తా వృథా ప్రయాసగా మిగిలినట్లే కదా! చూస్తున్న మావటివాడు, చేసేదేమీ లేక 'మామూలుగా జరిగేదేగా!' అనుకుంటూ, తనలో తాను ఒక నవ్వు నవ్వుకుని ఊరుకుంటాడు. 'గజస్నానం' అనే నానుడికి సంక్షిప్తంగా చెప్పుకోదగిన వివరణ అది.



'స్నానంబు ల్నదులందు జేయుట గజస్నానంబు చందంబగున్/ మానంబొప్ప బఠించు వేదమటవీ మధ్యంబులో నేడ్పగున్/నానా హోమము లెల్ల బూడిదలలో నన్నేల్పు నెయ్యై చను/న్నీనామోక్తియు నీపదాబ్జ రతియున్లేకున్న, నారాయణా!' అని పోతన రచనగా ప్రసిద్ధమైవున్న 'నారాయణ శతకము'లోని 62వ పద్యంలో 'గజస్నానం' అనే నానుడితో పాటుగా మరికొన్ని వినసొంపైన నానుడుల ప్రయోగంతో ఒక గొప్ప సత్యం అర్థవంతంగా చెప్పబడింది.

సామాన్య జనుల సంభాషణలలో 'అరణ్య రోదనం' అని వినిపించే ప్రసిద్ధమైన నానుడి, పై పద్యంలో 'అటవీ మధ్యంలో ఏడ్పు' అనే రూపం తీసుకుంది. ఎంతగా ఏడ్చి మొరపెట్టుకున్నా ఎవరూ వినలేని రోదనకు మహత్తరమైన అక్షరరూపం అది. అలాగే 'బూడిదలో పోసిన పన్నీరు' అనే నానుడి 'హోమంలో ఆవిరైపోయిన నెయ్యి'లా దర్శనమిచ్చింది. ఇలా, నదులలో పదే పదే చేసే స్నానాలూ, పరమ నిష్ఠగా కూర్చుని చేస్తున్నామనుకున్న నానా విధ హోమాలూ, వేద పఠనాలూ, అన్నీ శ్రీమన్నారాయణుని నామజపం లేకుండానూ, ఆయన పాదసేవ లేకుండానూ చేస్తే, కేవలం వృథా ప్రయాసలుగా మిగులుతాయి సుమా! అని హెచ్చరికగా చెప్పడం పై పద్యంలో పోతన మహాకవి ఉద్దేశం.

– భట్టు వెంకటరావు

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు, అధిక శ్రావణ మాసం, తిథి: తిథి శు.విదియ రా.2.14 వరకు, తదుపరి తదియ, నక్షత్రం: పుష్యమి ఉ.7.05 వరకు, తదుపరి ఆశ్లేష, వర్జ్యం: రా.9.15 నుండి 11.02 వరకు, దుర్ముహూర్తం: ప.11.41 నుండి 12.32 వరకు, అమృతఘడియలు: లేవు ; రాహుకాలం: ప.12.00 నుండి 1.30 వరకు, యమగండం: ఉ.7.30 నుండి 9.00 వరకు, సూర్యోదయం: 5.38, సూర్యాస్తమయం: 6.34.

మోదీ మళ్లీ వస్తే దేశం నాశనమే

- ఏఐఏడబ్ల్యూయూ జాతీయ అధ్యక్షుడు విజయరాఘవన్



మాట్లాడుతున్న విజయరాఘవన్ చిత్రంలో జూలకంటి రంగారెడ్డి, బి.వెంకట్

నాగార్జునసాగర్: ప్రధానికి విదేశీ పర్యటనలు, విమానాల కొనుగోలు తప్ప.. ప్రజల కష్టాలు, ధరల పెరుగుదల పట్టడం లేదని, మోదీ మళ్లీ గెలిస్తే దేశం నాశనమవుతుందని అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం (ఏఐఏడబ్ల్యూయూ) జాతీయ అధ్యక్షుడు విజయ రాఘవన్ అన్నారు. నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్ విజయవిహార్‌లో రెండు రోజుల పాటు జరిగే ఆ సంఘం జాతీయ కమిటీ సమావేశాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా విజయరాఘవన్ మాట్లాడుతూ.. ఒక పక్క వరదలు, మరో పక్క పెరిగిన ధరలతో దేశ ప్రజలు అల్లాడుతున్నారని, మోదీ మాత్రం విదేశీ పర్యటనలు చేస్తున్నారని విమర్శించారు. బడ్జెట్‌లో నిధులు తగ్గిస్తూ భవిష్యత్‌లో ఉపాధి హామీ పథకమే లేకుండా చేయాలని మోదీ ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. దేశవ్యాప్తంగా వ్యవసాయ కార్మిక సంఘం చేపట్టిన ఉద్యమాలు, పోరాటాలపై చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందించనున్నట్లు తెలిపారు. రైతులు, ఉపాధి హామీ కార్మికులను సమీకరించి ఉద్యమాలు చేపట్టాలని పిలుపు నిచ్చారు. ఆ సంఘం కేంద్ర కమిటీ సభ్యుడు నారి అయిలయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం ఆల్‌ఇండియా ప్రధాన కార్యదర్శి బి.వెంకట్, సహాయ కార్యదర్శి ఎంపీ శివదాసన్, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.వెంకటరాములు పాల్గొన్నారు.

గుండెపోటుతో అల్లుడు.. తట్టుకోలేక మామ మృతి

తాండూరు టౌన్: గంటల వ్యవధిలోనే అల్లుడు, మామ గుండెపోటుతో మృతిచెందారు. ఈ ఘటన వికారాబాద్ జిల్లా తాండూరు పట్టణంలో మంగళవారం చోటుచేసుకుంది. తాండూరు బృందావన్ కాలనీకి చెందిన మోయిన్ అహ్మద్(39) ఫైనాన్స్ వ్యాపారం చేస్తూ, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఆయన సోమవారంరాత్రి పట్టణంలోని గొల్లచెరువు ప్రాంతంలో ఉన్న మామ మున్నాభాయ్(65) ఇంటికి వెళ్లి నిద్రపోయాడు. మంగళవారం ఉదయం ఎంతకూ నిద్రలేవకపోవడంతో కుటుంబసభ్యులు వెంటనే తాండూరు ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే ఆయన గుండెపోటుతో మృతి చెందాడని వైద్యులు తెలిపారు. ఇంటికి తీసుకువచ్చిన అల్లుడి మృతదేహాన్ని చూసి మున్నాభాయ్ ఒక్కసారిగా కుప్పకూలాడు. వెంటనే అతన్ని ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కొన్నిగంటల వ్యవధిలోనే మామ, అల్లుడు హఠాన్మరణం చెందడంతో ఆ కుటుంబం శోకసంద్రంలో మునిగింది.

కీలక మావోయిస్టు లొంగుబాటు

- పార్టీ డిప్యూటీ కమాండర్ హోదాలో ఉన్న శివాజీ
- ఎస్పీ సహా 45 మంది జవాన్లపై దాడిలో పాత్ర
- పెళ్లి చేసుకోవడంతో పార్టీలో డీప్రమోట్..

చర్ల: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో 45 మంది జవాన్లను హతమార్చిన ఓ మావోయిస్టు కాంకేర్ జిల్లాలో బీఎస్ఎఫ్ పోలీసుల ఎదుట మంగళవారం లొంగిపోయాడు. బీజాపూర్ జిల్లాకు చెందిన సున్నూ మడవి అలియాస్ శివాజీ మావోయిస్టు పార్టీ ప్లాటూన్ నంబర్ 5లో డిప్యూటీ కమాండర్‌గా పని చేస్తున్నాడు. పార్టీలో పనిచేసే ఓ మహిళా మావోయిస్టును వివాహం చేసుకోవడంతో పార్టీ డీప్రమోట్ చేసి గంగులూరు ఏరియా కమిటీకి పంపింది. ఆ సమయంలో అతడికి అగ్రనాయకుల వేధింపులు ఎదురవడంతో పార్టీ నుంచి పారి పోయి ఇంటికి వచ్చాడు. గ్రామంలో అప్పటికే లొంగిపోయిన కొందరు మావోయిస్టులు.. మళ్లీ పార్టీలోకి వెళ్లవద్దని, నేరుగా పోలీసుల ఎదుట లొంగిపోవాలని సూచించడంతో కాంకేర్‌లోని బీఎస్ఎఫ్ 135 బెటాలియన్ పోలీసు అధికారులను ఆశ్రయించాడు.

బాలల సంఘం నుంచి డిప్యూటీ కమాండర్‌గా

శివాజీ తొలుత 2005లో మావోయిస్టు పార్టీతో సంబంధాలు పెంచుకుని బాలల సంఘంలో చేరాడు. 2006లో కాంకేర్ జిల్లాలోని పార్తాపూర్ ఏరియా కమిటీ సభ్యుడిగా, ఆ తర్వాత మిలటరీ ప్లాటూన్ కంపెనీ నంబర్ 5కు డిప్యూటీ కమాండర్‌గా నియమితులయ్యాడు. అతని పై రూ.3 లక్షల రివార్డు ఉంది. 2009లో మదనవాడలో ఎస్పీ వినోద్ చౌబేతో సహా 29 మంది జవాన్లను, 2006లో దంతెవాడలో 8 మంది సీఐఎఫ్ జవాన్లపై దాడి చేసి హతమార్చిన ఘటనలో మడవి అలియాస్ శివాజీ పాల్గొన్నాడు.



అడ ప్రాజెక్టు గేట్ ఎత్తివేత



ములుగు జిల్లా ఏటూరు నాగారం మండలం అల్లంవారిఘణపురం వద్ద ప్రవహిస్తున్న కనుగులవాగు (ఇన్‌సెట్‌లో) అంబులెన్సులో గర్భిణిని ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం

కరుణించిన వరుణుడు

- రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో విస్తారంగా వర్షాలు
- గోదావరి, ప్రాణహితలోకి వరద ప్రవాహం
- చేలకు ఊపిరి.. ఆనందంలో అన్నదాత

సాక్షి నెట్‌వర్క్: గత కొన్ని రోజులుగా రాష్ట్రానికి ముఖం చాటేసిన వరుణుడు ఎట్టకేలకు కరుణించాడు. ఆందోళనలో ఉన్న అన్నదాతను ఆనందంలో ముంచెత్తుతూ ఎండుతున్న చేలకు ఊపిరి పోశాడు. ఉపరితల ద్రోణి ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా మంగళవారం ఉదయం నుంచి రాత్రి దాకా విస్తారంగా వర్షాలు కురిశాయి. దీంతో ఇన్ని రోజులు బోసిపోయిన చెరువులు, కుంటలు జలకళ సంతరించుకుంటున్నాయి. వాగులు, వంకలు వరదతో ఉరకలెత్తుతున్నాయి. పలుచోట్ల వాగులు అలుగుపారుతున్నాయి. వివిధ ప్రాజెక్టుల్లోకి క్రమంగా ప్రవాహాలు చేరుతున్నాయి.

వాగుల్లో వరద ఉధృతి: ములుగు జిల్లాలోని ఏటూరునాగారం, వాజేడు, వెంకటాపురం తదితర ఏజెన్సీ ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిశాయి. ఏటూరునాగారం మండలంలోని ఎలిశెట్టిపల్లి–చెల్పాక గ్రామానికి మధ్యలో ప్రవహిస్తున్న దయ్యాలవాగు (జంపన్నవాగు)తోపాటు వెంకటాపురం (కే) మండలంలోని కంకలవాగు, రాచపల్లి వాగులు ఉప్పొంగుతున్నాయి. దీంతో ఆయా గ్రామాల్లో రాకపోకలు నిలిచిపోయాయి. కన్నాయిగూడెం మండలంలోని దొంగలగుట్ట వాగు రహదారిపై ఉధృతంగా ప్రవహిస్తోంది. అదేవిధంగా ఏడాగుల కలయికతో హనుమంతుని వాగు పొంగి పొర్లుతోంది. వాగులు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో అవతలి వైపున ఉన్న వివిధ గూడేల్లోని గర్భిణులను ముందస్తుగా ఏటూరునాగారం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ప్రాణహిత పరవళ్లు..

జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వరం వద్ద మహారాష్ట్ర నుంచి తరలివస్తున్న ప్రాణహిత నది గోదావరితో కలిసి పరవళ్లు తొక్కుతోంది. మంగళవారం సాయంత్రం కాళేశ్వరం వద్ద పుష్కర ఘాట్‌ను తాకుతూ ఉధృతంగా ప్రవహిస్తోంది.

తడిసి ముద్దయిన ఉమ్మడి ఆదిలాబాద్

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో సోమవారం రాత్రి నుంచి మంగళవారం రాత్రి వరకు 8.2 సెంటీమీటర్ల మేర వర్షపాతం నమోదైంది. కుమురం భీం (అడ) ప్రాజెక్టులో ఒక గేటును 0.10 మీటర్ల మేర పైకెత్తి 208 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 10.393 టీఎంసీలు కాగా ప్రస్తుతం 5.629 టీఎంసీల నీరుంది. మరోవైపు నిజామాబాద్ జిల్లాలోని కమ్మర్‌పల్లి, భీమ్‌గల్, సిరికొండ, నవీపేట్, తదితర మండలాల్లో భారీ వర్షం కురిసింది. అత్యధికంగా కమ్మర్‌పల్లి మండలంలో 8.2 సెంటీమీటర్ల వర్షం కురిసింది. కామారెడ్డి పట్టణం నుంచి రాజంపేట మండలం మీదుగా మెదక్ జిల్లా కేంద్రానికి వెళ్లే రోడ్డుపై కొండాపూర్ శివారులో వంతెన నిర్మాణ పనులు కొనసాగుతుండగా తాత్కాలికంగా వేసిన రోడ్డు వర్షానికి కొట్టుకుపోయింది. దీంతో రాకపోకలు నిలిచిపోయాయి. పెద్ద కొడప్‌గల్ మండలంలో పోచారం గ్రామానికి వెళ్లే రోడ్డుపై ఉన్న కాజ్‌వేపై భారీగా వరద చేరడంతో రాకపోకలకు అంతరాయం కలిగింది.

ప్రాణ, ఆస్తినష్టం జరగకుండా చూడండి: సీఎస్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో వర్షాల నేపథ్యంలో ప్రాణ, ఆస్తినష్టం జరగకుండా చర్యలు చేపట్టాలని అధికారులు, వివిధ జిల్లాల కలెక్టర్లను సీఎస్ శాంతికుమారి ఆదేశించారు. మంగళవారం రాత్రి వివిధ శాఖల ఉన్నతాధికారులతో కలసి భద్రాద్రి కొత్తగూడెం, జనగామ, కామారెడ్డి, కరీంనగర్, ఖమ్మం, మహబూబాబాద్, ములుగు, పెద్దపల్లి, సిద్దిపేట, వరంగల్, హనుమకొండ జిల్లాల కలెక్టర్లతో సీఎస్ టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు.

ఆ జలాలు మావే

- తేల్చి చెప్పిన తెలంగాణ
- తాగునీటికి 5 టీఎంసీల సాగర్ జలాలు కోరిన ఏపీ
- త్రిసభ్య కమిటీ భేటీకి తెలంగాణ దూరం
- సమావేశం తర్వాత కృష్ణా బోర్డుతో తెలంగాణ ఈఎన్సీ భేటీ
- హైదరాబాద్ తాగునీటికి సాగర్ నిల్వలు అవసరమని స్పష్టీకరణ
- తీరని సాగర వివాదం!

సాక్షి, హైదరాబాద్: నాగార్జునసాగర్ జలాశయంలోని కొద్దిపాటి నీళ్లు తెలంగాణ, ఏపీ రాష్ట్రాల మధ్య కొత్త వివాదాన్ని రేకెత్తించాయి. తాగునీటి అవసరాల కోసం 5 టీఎంసీల నీటిని సాగర్ కుడికాల్వ ద్వారా ఏపీకి విడుదల చేయాలని ఆ రాష్ట్రం చేసిన విజ్ఞప్తిపై మంగళవారం కృష్ణా నది యాజమాన్య బోర్డు(కేఆర్ఎంబీ) నిర్వహించిన త్రిసభ్య కమిటీ సమావేశం కొత్త వివాదానికి వేదికైంది. కేఆర్ఎంబీ సభ్య కార్యదర్శి డీఎం రాయిపురే నేతృత్వంలో మధ్యాహ్నం 3.30 గంటలకు వర్చువల్‌గా జరిగిన సమావేశంలో ఏపీ జలవనరుల శాఖ సి.నారాయణరెడ్డి పాల్గొనగా, తెలంగాణ ఈఎన్సీ సి.మురళీధర్ గైర్హాజరయ్యారు. ఏపీ ఈఎన్సీ నారాయణరెడ్డి ఈ సమావేశంలో మాట్లాడుతూ సాగర్ కుడికాల్వకి తాగునీటి కోసం 5 టీఎంసీలను విడుదల చేయాల్సిందేనని పట్టుబట్టారు. తెలంగాణ ఈఎన్సీ హాజరు కానందున నీటి విడుదలపై ఇండెంట్ జారీ చేయలేమని త్రిసభ్య కమిటీ కన్వీనర్ డీఎం రాయిపూరే స్పష్టం చేశారు. మళ్లీ త్రిసభ్య కమిటీ సమావేశం నిర్వహిస్తామని పేర్కొన్నట్టు తెలిసింది.

బోర్డుతో తెలంగాణ ఈఎన్సీ భేటీ..

త్రిసభ్య కమిటీ సమావేశం ముగిసిన తర్వాత తెలంగాణ ఈఎన్సీ సి.నారాయణరెడ్డి ప్రత్యేకంగా కృష్ణా బోర్డు అధికారులను కలిసి చర్చించారు. సాగర్‌లో నిల్వలు అడుగంటిపోయాయని, ప్రస్తుతం ఎగువ ప్రాంతం నుంచి కృష్ణా నదికి ఎలాంటి వరద ప్రవాహం లేదని బోర్డుకు వివరించారు. గతేడాది శ్రీశైలం, నాగార్జునసాగర్ జలాశయాల నుంచి తమ వాటాకి మించి కృష్ణా జలాలను ఏపీ వాడుకుందని... హైదరాబాద్ జంట నగరాల తాగునీటి, భగీరథ అవసరాల కోసం తాము సాగర్‌లో తమ వాటా నీళ్లను మిగిల్చి ఉంచామని స్పష్టం చేశారు.

సీఎం కేసీఆర్‌తో చర్చించిన తర్వాతే నిర్ణయం

సాగర్‌లో ప్రస్తుతం 517 అడుగుల వరకే నిల్వలున్నాయని, 510 అడుగులకు తగ్గితే హైదరాబాద్ నగరానికి నీళ్లను సరఫరా చేసే అప్రోచ్ కాల్వకు నీళ్లు అందవని నారాయణరెడ్డి పేర్కొన్నారు. సీఎం కేసీఆర్‌ను సంప్రదించిన అనంతరం ఆయన అనుమతితో ఏపీకి 5 టీఎంసీల నీటిని విడుదల చేసే అంశంపై తమ నిర్ణయాన్ని తెలియజేస్తామని వివరించినట్టు తెలిసింది. తాగునీటి అవసరాల కోసం ఏపీకి 5 టీఎంసీలు అవసరం లేదని అభ్యంతరం తెలిపినట్టు సమాచారం.

హెచ్ఎం బదిలీ ఆపాలి

- దత్తత పేరుతో డబ్బులు వసూలు చేసిన ఎస్ఎంసీ చైర్మన్‌ను తొలగించాలి
- పొనుగోడు జెడ్పీహెచ్ఎస్ విద్యార్థుల ఆందోళన



పొనుగోడు జెడ్పీహెచ్ఎస్ ఎదుట ఆందోళన చేస్తున్న విద్యార్థులు

గూడూరు (మహబూబాబాద్ జిల్లా): మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం పొనుగోడు జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు పూల్‌సింగ్ బదిలీని ఆపివేయాలని, డబ్బులు వసూలు చేస్తున్న పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ (ఎస్ఎంసీ)ను తొలగించాలని కోరుతూ మంగళవారం ఆ పాఠశాల విద్యార్థులు ఆందోళన చేపట్టారు. ఐదేళ్ల క్రితం పొనుగోడుకు చెందిన ఓ వ్యక్తి గ్రామంలోని హైస్కూల్‌ను దత్తత తీసుకున్నారని అప్పట్నుంచి విద్యా కమిటీ చైర్మన్‌ను ఎన్నుకున్నారని తెలిపారు. ఆ దత్తత తీసుకున్న వ్యక్తి ఆదేశానుసారం గెస్ట్ టీచర్లను నియమించి వేతనాలు చెల్లిస్తున్నారని వివరించారు. అయితే దత్తత తీసుకున్న వ్యక్తి ఆదేశాల ప్రకారం ఎస్ఎంసీ కమిటీ చైర్మన్ గత రెండేళ్లుగా అభివృద్ధి పేరుతో పేద విద్యార్థుల నుంచి రూ.6 వేలు చొప్పున వసూలు చేశారని తెలిపారు. ఆ డబ్బులు హెచ్ఎం వద్దగానీ, జాయింట్ అకౌంట్‌లోగానీ జమ చేయకుండా విద్యా కమిటీ చైర్మన్ వ్యక్తిగతంగా ఉపయోగించుకున్నారని ఆరోపించారు. ఆ డబ్బుల లెక్కలు అడిగిన హెచ్ఎం పూల్‌సింగ్‌ను బెదిరిస్తున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో పాఠశాల విద్యార్థులు, తల్లిదండ్రులు హైస్కూల్ ఎదుట ఆందోళనకు దిగారు. తమ సమస్యను పరిష్కరించాలని కోరుతూ గ్రామ సర్పంచ్ ఇంటికి వెళ్లి ర్యాలీగా వెళ్లి వినతిపత్రం సమర్పించారు. అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేయగా...విచారణ చేసి చర్యలు చేపడతామని చెప్పడంతో విద్యార్థులు ఆందోళన విరమించారు.

బెదిరింపు కాల్స్ రావడంతో అజ్ఞాతంలోకి

- ఎమ్మెల్యే మైనంపల్లి నన్ను చంపాలని చూశారు
- ఆయన అనుచరులు నన్ను వెంబడించారు
- మేడ్చల్ డీసీపీ కార్యాలయంలో మీడియాతో రియల్టర్ తిరుపతిరెడ్డి



మాట్లాడుతున్న తిరుపతిరెడ్డి

కుత్బుల్లాపూర్/బచ్చన్నపేట/అల్వాల్: బెదిరింపు కాల్స్ వచ్చినందునే తాను అజ్ఞాతంలోకి వెళ్లానని రియల్టర్ ముక్కెర తిరుపతిరెడ్డి తెలిపారు. భూమి వ్యవహారంలో ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు తనను కిడ్నాప్ చేసి చంపాలని యత్నించారని, ఎనిమిది సార్లు బెదిరింపు కాల్స్ వచ్చాయని చెప్పారు. ఆరురోజుల క్రితం అదృశ్యమైన ఆయన.. నాటకీయ పరిణామాల మధ్య పేట్‌బషీరాబాద్ సమీపంలోని మేడ్చల్ డీసీపీ కార్యాలయంలో మంగళవారం ప్రత్యక్షమయ్యారు. తనకు ఎదురైన సమస్యలను మేడ్చల్ డీసీపీ సందీప్ గోనె, పేట్‌బషీరాబాద్ ఏసీపీ రామలింగరాజులకు వివరించారు. అనంతరం డీసీపీ కార్యాలయ ఆవరణలో మీడియాతో మాట్లాడుతూ.. పోలీసులకు ఫిర్యాదు చేసినా ఎమ్మెల్యే ఒత్తిడితో తనకు సాయంచేయడానికి ముందుకురాలేదని చెప్పారు. కేసు రిజిస్టర్ చేయకుండా అల్వాల్ ఎస్‌హెచ్ఓ గంగాధర్ సమయం వృథా చేశారని ఆరోపించారు. అందుకే అజ్ఞాతంలోకి వెళ్లానని, అయినా మైనంపల్లి అనుచరులు తనను చంపాలని నార్కట్‌పల్లి వరకు వెంబడించారని, వారి కంటపడకుండా ఆటోలో తప్పించుకున్నానని చెప్పారు. ఆపై విజయవాడ వెళ్లి స్నేహితుల సహాయంతో కొద్దిరోజులు అక్కడున్నానని, ఆపై వైజాగ్ వెళ్లి తలదాచుకున్నానని వివరించారు. హైకోర్టు అడ్వొకేట్ సలహామేరకు డీసీపీ కార్యాలయానికి వచ్చానన్నారు. మైనంపల్లి హనుమంతరావుతో తన కుటుంబానికి ప్రాణ హాని ఉందన్నారు. తన భూమిని లాక్కునేందుకు మైనంపల్లి ప్రయత్నిస్తున్నారని, సదరు భూమి తనది కాదని నిరూపిస్తే ఆయనకే గిఫ్ట్‌గా ఇస్తానని చెప్పారు.

అంతా ఫేక్..

తిరుపతిరెడ్డి చెప్పిందంతా ఫేక్ అని సైబరాబాద్ పోలీసులు తెలిపారు. 'ఎమ్మెల్యే మైనంపల్లి కాల్ చేశారు, కిడ్నాప్‌నకు యత్నించారు' అంటూ తిరుపతిరెడ్డి చేసిన ఆరోపణలపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు. తిరుపతిరెడ్డి సీడీఆర్‌లో ఎటువంటి కాల్స్ లేవని గుర్తించారు. ల్యాండ్ కేసులో తిరుపతిరెడ్డిపైనే ఓ మహిళ ఫిర్యాదు చేసిందని, ఈ కేసులో దర్యాప్తు కొనసాగుతోందని పోలీసులు వెల్లడించారు. అయితే... కిడ్నాప్ పేరుతో స్టేషన్ ఎదుట ఆందోళన నిర్వహించిన తిరుపతిరెడ్డి కుటుంబ సభ్యులు, మద్దతుదారులపై కేసుల నమోదు చేసే అంశాన్ని పరిశీలిస్తున్నామని అల్వాల్ సీఐ ఉపేందర్ వెల్లడించారు.

బండలు పరవాలని పిలిచి.. చావ బాదారు!

- బషీరాబాద్ పీఎస్‌లో దారుణం
- బాధితుడి పరిస్థితి విషమం, ఉస్మానియా ఆస్పత్రికి తరలింపు



నగేశ్‌కు ఉస్మానియాలో చికిత్స చేస్తున్న వైద్యుడు

బషీరాబాద్: పోలీస్‌స్టేషన్‌లో బండలు పరిచే పని ఉందని పిలిపించిన పోలీసులు ఓ గని కార్మికుడిని తీవ్రంగా కొట్టారు. ఈ ఘటన వికారాబాద్ జిల్లా బషీరాబాద్ పీఎస్‌లో మంగళవారం జరిగింది. బాధితుడి తల్లి శాంతమ్మ తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలోని ఇందిరానగర్‌లో ఉంటున్న వడ్డె నగేష్(33) నాపరాతి గనుల్లో కార్మికుడిగా పనిచేస్తున్నాడు. ఇదే కాలనీకి చెందిన పోతుగంటి నర్సప్ప, అనసూయ దంపతుల వద్ద తన ఇంటి పత్రాలు తాకట్టు పెట్టి, ఏడాది క్రితం రూ.30 వేలు అప్పు తీసుకున్నాడు. వడ్డీతో కలిపి రూ.80 వేలు అవుతున్నా.. తిరిగి చెల్లించడం లేదని నర్సప్ప భార్య అనసూయ మంగళవారం పోలీసులకు తెలిపింది. పోలీస్ స్టేషన్‌లో స్వీపర్‌గా పనిచేస్తున్న ఆమె ఫిర్యాదు విషయాన్ని సీరియస్‌గా తీసుకున్న హెడ్ కానిస్టేబుల్ మల్లేశం.. నగేశ్‌కు ఫోన్ చేసి, పీఎస్‌కు రమ్మన్నారు. వచ్చీరాగానే డబ్బులు ఎందుకు ఇవ్వలేదంటూ దూషించారు. అంతటితో ఆగకుండా తీవ్రంగా కొట్టడంతో కిందపడిపోయిన నగేశ్ తలకు తీవ్ర గాయమైంది. స్పృహతప్పి పడిపోయిన బాధితున్ని వెంటనే స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా.. పరిస్థితి విషమంగా ఉందని తాండూరు జిల్లా ఆస్పత్రికి పంపించారు. అక్కడ వైద్య పరీక్షలు నిర్వహించిన డాక్టర్లు తలలో రక్తం గడ్డకట్టిందని వెంటనే ఉస్మానియా ఆస్పత్రికి రిఫర్ చేశారు. ప్రస్తుతం నగేశ్ పరిస్థితి ఆందోళనకరంగా ఉందని బాధిత కుటుంబసభ్యులు తెలిపారు. ఘటనపై బాధితుడి తల్లి వడ్డే శ్యామమ్మ సదరు కానిస్టేబుల్‌పై పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఫిట్స్ వచ్చి పడిపోయాడు: ఎస్ఐ

పోలీస్ స్టేషన్‌లో పనిచేసే స్వీపర్ ఫిర్యాదు చేస్తే నగేశ్‌ను పిలిపించామని స్టేషన్‌కు వచ్చాక నగేశ్ ఫిట్స్ వచ్చి పడిపోవడంతో ఆస్పత్రికి తరలించామని ఎస్ఐ వేణుగోపాల్‌గౌడ్ తెలిపారు. స్టేషన్‌లో నగేశ్‌ను ఎవరూ కొట్టలేదన్నారు. అయితే ఈ విషయాన్ని బయటకు చెప్పొద్దని, ఏదైనా ఉంటే మాట్లాడుకుందామని పోలీసులు తమను మభ్యపెట్టారని బాధితుడి బంధువులు ఆరోపిస్తున్నారు.

కేంద్రం వైఫల్యంతోనే 'బాలాసోర్' ఘటన

ఆగస్టు 10న పార్లమెంటు ముందు మహాధర్నా
ఎంప్లాయీస్ సంఘ్ జాతీయ కార్యదర్శి మర్రి రాఘవయ్య



సికింద్రాబాద్: రైల్వే కార్మికుల హక్కుల పరిరక్షణలో కేంద్ర ప్రభుత్వం, రైల్వే బోర్డు పూర్తిగా విఫలమయ్యాయని దక్షిణ మధ్య రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ జాతీయ ప్రధాన కార్యదర్శి మర్రి రాఘవయ్య విమర్శించారు. ఆయన సికింద్రాబాద్‌లోని ఎంప్లాయీస్ సంఘ్ కార్యాలయంలో మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ క్రమేణా వివిధ విభాగాలను కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల నియామకాల పేరుతో రైల్వేశాఖను కేంద్ర ప్రభుత్వం పూర్తిగా ప్రైవేటీకరిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన పలు నియామకాల ఫలితమే.. బాలాసోర్ రైలు ప్రమాదమని స్పష్టం చేశారు. స్వీయ తప్పిదంతో 300 మంది ప్రయాణికుల మృతికి కారణమైన కేంద్ర ప్రభుత్వం.. ప్రమాదానికి కార్మికుల తప్పిదమే కారణమని పేర్కొంటుండటం శోచనీయమన్నారు. రైలు ప్రమాద ఘటనలతో అయినా రైల్వేబోర్డు, కేంద్ర ప్రభుత్వం కళ్లు తెరవాలని, నియామకాలపై నిషేధం ఎత్తి వేసి ఉద్యోగ ఖాళీలను తక్షణమే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర నిరంకుశ వైఖరికి నిరసనగా ఆగస్టు 10న పార్లమెంట్ భవనం ముందు మహాధర్నాకు నిర్ణయం తీసుకున్నామని చెప్పారు.

రాష్ట్రానికి రెడ్ అలర్ట్

- తెలంగాణలో నేడు, రేపు భారీ నుంచి అతిభారీ వర్షాలు
- హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడి
- గత 24 గంటల్లో అత్యధికంగా 9 సెంటీమీటర్ల వర్షపాతం

అత్యంత భారీ వర్షాలు కురిసే జిల్లాలు
మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, ఖమ్మం

భారీ నుంచి అతిభారీ వర్షాలు
సిద్దిపేట, జనగాం, నిజామాబాద్, పెద్దపల్లి, జగిత్యాల, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, మెదక్, సంగారెడ్డి, కామారెడ్డి, వికారాబాద్, యాదాద్రి భువనగిరి.

భారీ వర్షాలు..
ఆదిలాబాద్, కుమురంభీం, మంచిర్యాల, నిర్మల్, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, మెదక్, మేడ్చల్ మల్కాజిగిరి, సంగారెడ్డి, రంగారెడ్డి

మోస్తరు నుంచి భారీ వర్షాలు..
హైదరాబాద్ సహా చుట్టుపక్కల ప్రాంతాలు. మిగతా ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు.

సాక్షి, హైదరాబాద్: ఒడిశాను ఆనుకొని ఉన్న జార్ఖండ్ ప్రాంతంలో అల్పపీడనం ఏర్పడింది. దీనికి అనుబంధంగా ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది. దీని ప్రభావంతో తెలంగాణలో బుధ, గురువారాల్లో అనేకచోట్ల భారీనుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఈ నేపథ్యంలో రెడ్ అలర్ట్ జారీ చేసినట్లు పేర్కొంది. మరోవైపు గత 24 గంటల్లో ములుగు జిల్లా వెంకటాపూర్, తాడ్వాయి, ఏటూరు నాగారం, గోవిందరావుపేట, వెంకటాపురంలలో అత్యధికంగా 9 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. అదే జిల్లా పేరూరు, హనుమకొండ జిల్లా పరకాలలో 8 సెంటీమీటర్ల మేర వర్షం కురిసింది. రేగొండ, ఎల్లారెడ్డిపేట, భీంగల్, ఆత్మకూరు, గంగాధర, చొప్పదండి, చందుర్తి, ములుగు, హుజూరాబాద్, చిట్యాల, శాయంపేటల్లో 7 సెంటీమీటర్ల చొప్పున వర్షపాతం రికార్డయింది. మంగళవారం ఉదయం నుంచి అనేక జిల్లాల్లో వర్షాలు కురుస్తూనే ఉన్నాయి.

కమీషన్లు వచ్చే ప్రాజెక్టులపైనే సీఎంకు మక్కువ

ప్రాజెక్టులపై రౌండ్ టేబుల్ సమావేశంలో పలువురు వక్తలు



మాట్లాడుతున్న జస్టిస్ చంద్రకుమార్ చిత్రంలో ఆకునూరి మురళి

పంజగుట్ట: కమీషన్లు వచ్చే ప్రాజెక్టులపైనే ముఖ్యమంత్రి కేసీఆర్‌కు మక్కువని, ప్రజలకు ఉపయోగపడే ప్రాజెక్టులను మాత్రం పక్కకు పెడుతున్నారని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. రాష్ట్రం ఏర్పడి తొమ్మిదేళ్లయినా.. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనే 52 శాతం పూర్తయిన ఎస్ఎల్‌బీసీ సొరంగం గ్రావిటీ ప్రాజెక్టును ఇప్పటికీ పూర్తిచేయకపోవడం అందుకు నిదర్శనమన్నారు. తెలంగాణ సకల జనుల వేదిక, తెలంగాణ జల సాధన సమితి సంయుక్త ఆధ్వర్యంలో ఎస్ఎల్‌బీసీ సొరంగం గ్రావిటీ కాలువ నిర్మాణంలో నల్లగొండకు జరిగిన అన్యాయం దశ దిశ లేని డిండి ఎత్తిపోతల ప్రాజెక్టు అనే అంశంపై మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ప్రొ.వినాయక్ రెడ్డి, నైనాల గోవర్ధన్‌ల అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జస్టిస్ చంద్రకుమార్, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి, కాంగ్రెస్ నాయకులు చెరుకు సుధాకర్, పలువురు రిటైర్డ్ ఇంజనీర్లు మాట్లాడారు. తెలంగాణ ఉద్యమంలో ఫ్లోరైడ్ గురించి, నల్లగొండ నీటి ఇబ్బందుల గురించి పదేపదే మాట్లాడిన కేసీఆర్.. ఎస్ఎల్‌బీసీలో కమీషన్లు రావని ఇప్పుడు దాన్ని పట్టించుకోవడం లేదన్నారు. రెండు వేల కోట్లు ఖర్చుపెడితే పూర్తయ్యే ప్రాజెక్టును వదిలేసి కరెంటు బిల్లుకే 3 వేల కోట్లు ఖర్చుపెట్టిన ఘనత ఆయనదని ఎద్దేవా చేశారు. ఎస్ఎల్‌బీసీ, డిండి ప్రాజెక్టులను త్వరగా పూర్తిచేయాలని, ప్రాజెక్టులకోసం నీటిపారుదల కమిషన్ ఏర్పాటు చేసి, అందులో నిష్ణాతులైన ఇంజనీర్లను నియమించాలని వారు డిమాండ్ చేశారు. తుమ్మిడిహట్టిని నిర్మించకుండా కాళేశ్వరం నిర్మించి తెలంగాణను కొల్లగొట్టారన్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఇంజనీర్లు లక్ష్మీనారాయణ, విఠల్‌రావు, సాధినేని వెంకటేశ్వర్‌రావు, కోటేశ్వర రావు, అంబటి నాగయ్య, సాంబశివరావు, మురళీధర్ గుప్తా, సోగరాబేగం, అన్వర్ ఖాన్, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

జేఎన్‌జే సొసైటీ భూమిని అప్పగించాల్సిందే

- మహాధర్నాలో అఖిలపక్ష నేతలు





మాట్లాడుతున్న ఈటల, మల్లు రవి

లక్డీకాపూల్: జేఎన్‌జే హౌసింగ్ సొసైటీకి కేటాయించిన స్థలాన్ని అప్పగించాలంటూ జర్నలిస్టులు మంగళవారం ఇందిరాపార్కు వద్దనున్న ధర్నా చౌక్‌లో మహా ధర్నా నిర్వహించారు. జర్నలిస్టుల మహాధర్నాలో కాంగ్రెస్, బీజేపీ, సీపీఎం, సీపీఐ, ఆమ్ ఆద్మీ పార్టీలతోపాటు వివిధ ప్రజాసంఘాలు పాల్గొని మద్దతు ప్రకటించాయి. సుప్రీం కోర్టు తుది తీర్పును అమలు చేయకుండా కాలయాపన చేస్తున్న ప్రభుత్వం తీరును ఎండగట్టాయి. కాంగ్రెస్ పార్టీ సీనియర్ ఉపాధ్యక్షుడు డాక్టర్ మల్లు రవి మాట్లాడుతూ గత నాలుగు దఫాలుగా కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాలే జర్నలిస్టులకు ఇళ్ళ స్థలాలు ఇచ్చాయన్నారు. 16 ఏళ్ల క్రితమే జర్నలిస్టులు ఈ భూములను కొనుగోలు చేసినప్పటికీ, కోర్టు కేసుల కారణంగా ఇప్పటివరకు ఆలస్యమైందని, ఇప్పుడు సుప్రీంకోర్టు తుది తీర్పు ఇచ్చినప్పటికీ ప్రభుత్వం సొసైటీకి ఆ స్థలాలను స్వాధీనం చేయకపోవడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు.

నిజంగా దురదృష్టకరం: ఈటల

నాడు తెలంగాణ కోసం పోరాడిన జర్నలిస్టులు నేడు తాము కొనుక్కున్న ఇళ్ల స్థలాల కోసం రోడ్డెక్కి ధర్నాలు చేయడం దురదృష్టకరమని బీజేపీ ఎన్నికల ప్రచార కమిటీ చైర్మన్, శాసనసభ్యుడు ఈటల రాజేందర్ అన్నారు. 2008లో రూ.2 లక్షల పెట్టి కొన్న స్థలాలను వారికి అప్పగించకుండా ఎందుకు తొక్కి పెడుతున్నారని ప్రశ్నించారు. జర్నలిస్టులు కొనుగోలు చేసిన భూమిని లాక్కోవాలని ప్రభుత్వం చూడడం దుర్మార్గమన్నారు.

జేఎన్‌జే సభ్యుల పోరాటం సహేతుకమైనదే

కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు వి.హనుమంతురావు, బీజేపీ మాజీ ఎమ్మెల్సీ ఎన్.రాంచందర్ రావు, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు డి.జి.నరసింహా రావు, సీపీఐ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కె.సాంబశివరావు, బీజేపీ మహిళా మోర్చా అధ్యక్షురాలు గీతా మూర్తి, తెలంగాణ ఆత్మగౌరవ వేదిక కన్వీనర్ ఇందిరాశోభన్, పీఓడబ్ల్యూ నేత సంధ్య, విమలక్క, ఆప్ నేత రాములు గౌడ్ మాట్లాడుతూ జేఎన్‌జే సభ్యుల పోరు సహేతుకమైనదేనని సంఘీభావం ప్రకటించారు.

క్లుప్తంగా...

ఐరాసలో సెప్టెంబర్‌లో మోదీ ప్రసంగం

ఐక్యరాజ్యసమితి: ఐక్యరాజ్యసమితికి చెందిన సర్వప్రతినిధి సభ వార్షిక అత్యున్నత సమావేశంలో ప్రధాని మోదీ ప్రసంగించనున్నారు. సెప్టెంబర్ ఐదున 78వ ఐరాస సర్వప్రతినిధి సభ ప్రారంభమవుతుంది. 19వ తేదీన సభ సాధారణ చర్చ మొదలవనుంది. సంప్రదాయం ప్రకారం తొలిరోజు బ్రెజిల్, ఆ తర్వాత అమెరికా అగ్రనేతలు ప్రసంగిస్తారు. 22వ తేదీన మధ్యాహ్నం సెషన్‌లో భారత ప్రధాని నరేంద్ర మోదీ మాట్లాడతారు. అదేరోజు ఉదయం సెషన్‌లో పాకిస్తాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ ప్రసంగిస్తారు. వారంపాటు జరిగే ఈ సమావేశాల్లో ప్రపంచ నేతలు సుస్థిరాభివృద్ధి లక్ష్యాలపై సదస్సు, పర్యావరణ లక్ష్యాల సదస్సు, సాధారణ చర్చ ఇలా పలు కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. 'ఈ ఏడాది సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సదస్సులో ప్రపంచ నేతలు చేసే ప్రసంగాలు, నిర్దేశించుకునే లక్ష్యాలతో ప్రపంచం 2023నాటికల్లా మరింత పారదర్శకంగా, ప్రగతి పథంలో దూసుకుపోనుంది' అని ఐరాస ఒక ప్రకటనలో పేర్కొంది. సాధారణ చర్చ మొదటి రోజే ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ ప్రసంగించనున్నారు. మోదీ ప్రసంగించిన మరుసటి రోజు రష్యా విదేశాంగ మంత్రి సెర్గీ లావ్రోవ్ మాట్లాడతారు. మరోవైపు అదేనెల తొమ్మిది, పది తేదీల్లో ఢిల్లీలో భారత్ సారథ్యంలో ప్రతిష్టాత్మకమైన జీ20 నేతల శిఖరాగ్ర సదస్సు జరగనుంది. ఈ భేటీకి జీ20 దేశాల అగ్రనేతలు విచ్చేయనున్నారు.

బిహార్‌లోని 40 ఎంపీ సీట్లూ ఎన్‌డీయేకే

చిరాగ్ పాశ్వాన్

న్యూఢిల్లీ: 2024 లోక్‌సభ ఎన్నికల్లో బిహార్‌లోని మొత్తం 40 సీట్లనూ ఎన్‌డీయేనే గెలుచుకుంటుందని లోక్ జన్‌శక్తి పార్టీ(రాం విలాస్) నేత చిరాగ్ పాశ్వాన్ చెప్పారు. లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించిన వివిధ అంశాలపై హోం మంత్రి అమిత్ షా, బీజేపీ చీఫ్ నడ్డాలతో చర్చలు సానుకూలంగా జరిగాయన్నారు. అందుకే ఎన్‌డీయేలో చేరినట్లు మంగళవారం మీడియాతో అన్నారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో హాజీపూర్ నుంచి పోటీ చేస్తానన్నారు. ప్రస్తుతం హాజీపూర్ స్థానం నుంచి రాం విలాస్ పాశ్వాన్ తమ్ముడు, కేంద్ర మంత్రి పశుపతి కుమార్ పరాస్ ప్రాతినిధ్యం వహిస్తుండటం గమనార్హం. చిరాగ్ పాశ్వాన్ వ్యాఖ్యలపై మంత్రి పశుపతి కుమార్ స్పందించారు. రాం విలాస్ పాశ్వాన్ రాజకీయ వారసుణ్ని తానేనని, హాజీపూర్‌ను చిరాగ్‌కు ఇచ్చే ప్రశ్నేలేదని కుండబద్దలు కొట్టారు.

కుటుంబం వలన.. కుటుంబం కోసం..

ఇదే ప్రతిపక్ష నేతలనినాదం
- ప్రధాని మోదీ విసుర్లు
- అది అవినీతిపరుల సమ్మేళనమని ప్రజలనుకుంటున్నారు
- వారి భేటీని చూసి జనం నవ్వుకుంటున్నారు

పోర్ట్ బ్లెయిర్: 2024 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని ఐక్యంగా ఎదుర్కొనే లక్ష్యంతో 26 విపక్ష పార్టీలు నిర్వహించిన బెంగళూరు సమావేశాలపై ప్రధాని నరేంద్ర మోదీ సునిశితమైన విమర్శనాస్త్రాలు సంధించారు. దాన్ని అవినీతిపరుల సమ్మేళనంగా ప్రజలు చెప్పుకుంటున్నారన్నారు. 'కుటుంబం వలన.. కుటుంబం చేత.. కుటుంబం కోసం..' అనేదే ప్రతిపక్షాల ఏకైక మంత్రమని ఎద్దేవా చేశారు. ప్రధాని మంగళవారం పోర్ట్‌బ్లెయిర్‌లోని వీర సావర్కర్ ఎయిర్‌పోర్టులో నిర్మించిన ఇంటిగ్రేటెడ్ టెర్మినల్ బిల్డింగ్‌ను వర్చువల్‌గా ప్రారంభించారు. 'ఇటీవల బెంగాల్‌లో పంచాయతీ ఎన్నికల సమయంలో తీవ్రమైన హింస జరిగింది. వివిధ ఘటనల్లో కనీసం 39 మంది చనిపోయారు. వారిలో ఎక్కువ మంది అధికార టీఎంసీకి మద్దతుగా నిలిచిన కారణంగా ప్రాణాలు పోగొట్టుకున్నవాళ్లే. సొంత కేడర్‌పై దాడులు జరిగినా వామపక్షాలు, కాంగ్రెస్ కిమ్మనకుండా ఉన్నాయి. తమిళనాడులోని డీఎంకే ప్రభుత్వంపై అవినీతి కేసులున్నా ఈ పార్టీలు క్లీన్‌చిట్ ఇచ్చేశాయి. ఇలాంటి 26 ప్రతిపక్షాల నేతలు ఒకే చోటికి చేరిన వైనం చూసి ప్రజలు నవ్వుకుంటున్నారు. ఇది అత్యంత అవినీతిపరుల సమ్మేళనమని అనుకుంటున్నారు. బెంగళూరు సమావేశం అవినీతికి గుర్తుగా, అవినీతిని ప్రోత్సహించేందుకు జరుగుతున్న భేటీ అని అనుకుంటున్నారు. అందుకే మళ్లీ 2024లో మన ప్రభుత్వాన్నే తీసుకురావాలని ప్రజలు ఇప్పటికే నిర్ణయానికి వచ్చేశారు' అని ప్రధాని తెలిపారు. 'దేశంలోని పేద కుటుంబాల బిడ్డలు అభివృద్ధిలోకి రావడం వీరికి ఇష్టం లేదు. వీరి ఉమ్మడి కనీస కార్యక్రమం సొంత కుటుంబాల అవినీతిని పెంచుకోవడమే. ఇదే వారి సిద్ధాంతం, ఎజెండా'అని ప్రధాని నిప్పులు చెరిగారు. ప్రజల చేత, ప్రజల కొరకు, ప్రజలే ఎన్నుకొనే ప్రభుత్వ విధానాన్ని ప్రజాస్వామ్యం అంటారు..కానీ, ఈ అనువంశిక పార్టీల మంత్రం మాత్రం.. కుటుంబం చేత, కుటుంబం కొరకు, కుటుంబాల వలన అనేదే. వాళ్ల దృష్టిలో కుటుంబానికే మొదటి స్థానం.. దేశానికి అందులో చోటు లేదు'అని ప్రధాని ఎద్దేవా చేశారు.

కులవాద, అవినీతి విషాల విక్రయం

అవినీతి, వంశ రాజకీయాలు లేకుంటే స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత దేశం ఎంతో అభివృద్ధి సాధించి ఉండేదని మోదీ అన్నారు. ''ఈ దుస్థితికి కారణమైన వారు ఇప్పుడు మరోసారి తమ దుకాణాలు తెరిచి కులవాదం, అవినీతి అనే తమ విషాన్ని అమ్ముతున్నారు. వీటితో రూ.20 లక్షల కోట్ల కుంభకోణం గ్యారెంటీ. ఈ దుకాణాల్లోకి వెళ్లాలంటే అవినీతిపరుడై ఉండటమే అర్హత. ఎక్కువ అవినీతిపరులను ఇక్కడ మార్గదర్శకుడిగా భావిస్తుంటారు. కోట్లాది రూపాయల అవినీతికి పాల్పడిన వారిని సన్మానిస్తున్నారు. కుటుంబసభ్యులందరూ అవినీతికేసుల్లో బెయిల్‌పై ఉంటే వాళ్లకు మరింత గౌరవం దక్కుతుంది'' అంటూ ఆయన నేరుగా ఎవరి పేరూ ప్రస్తావించకుండా విమర్శలు సంధించారు.

ఇండియాపై యుద్ధానికి దిగితే... గెలుపెవరిదో అందరికీ తెలుసు

2024 ఎన్నికల ఫలితాలపై రాహుల్ జోస్యం ● త్వరలో 'ఇండియా' యాక్షన్ ప్లాన్ రూపొందిస్తామని వెల్లడి

బెంగళూరు: వచ్చే సార్వత్రిక ఎన్నికల పోరాటాన్ని 'భారత్‌కు, ప్రధాని నరేంద్ర మోదీకి మధ్య జరగబోయే పోరు'గా కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్‌గాంధీ అభివర్ణించారు. ''ఇండియాపై యుద్ధానికి దిగితే అందులో అంతిమ విజయం ఎవరిదో అందరికీ తెలుసు. ప్రత్యేకించి చెప్పాల్సిన అవసరం లేదు. ఎందుకంటే, భారత్ అనే భావనతో పోరాడే సత్తా ఎవరికీ లేదు. ఆ భావనను వ్యతిరేకించే, దానిపై పోరాడే వారికి ఏ గతి పడుతుందో కూడా అందరికీ తెలుసు'' అని ఆయనన్నారు. ''చరిత్రే ఇందుకు సాక్ష్యం. భారత్ అనే భావనతో ఎవరూ పోరాడలేకపోయారు. రాబోయే లోక్‌సభ ఎన్నికలు భారత్ అనే భావనకు, బీజేపీ అనే భావనకు మధ్య జరిగే పోరు. రాజ్యాంగాన్ని, దేశ ప్రజల గళాన్ని, భారత్ అనే భావనను కాపాడేందుకు పాటుపడుతున్నాం. అందుకే... మా పోరాటం 'ఇండియా' కూటమి వర్సెస్ బీజేపీ. ఇండియా వర్సెస్ మోదీ'' అని వివరించారు.

విపక్షాల బెంగళూరు భేటీ అత్యంత ఫలప్రదంగా జరిగినట్టు రాహుల్ వెల్లడించారు. 2024 ఎన్నికలే లక్ష్యంగా తక్షణం రంగంలోకి దిగాలని విపక్ష పార్టీలన్నీ నిర్ణయించినట్టు తెలిపారు. ''ఇందుకోసం అతి త్వరలో కార్యాచరణ ప్రణాళిక రూపొందించనున్నాం. కూటమి భావజాలం, కార్యక్రమాలు తదితరాలన్నీ త్వరలో నిర్ణయించి వెల్లడిస్తాం'' అని వివరించారు. బీజేపీ, వారి భావజాలంపై విపక్షాల ఉమ్మడి పోరాటానికి దీన్ని నాందిగా అభివర్ణించారు. ''వాళ్లు దేశంపై దాడి చేస్తున్నారు. నిరుద్యోగం పెచ్చరిల్లింది. కోట్లాది మంది నుంచి దేశ సంపదను లాక్కొని కొద్ది మంది మోదీ మిత్రులపరం చేస్తున్నారు'' అని మండిపడ్డారు.

ఆ పేరెలా వచ్చిందంటే...

మంగళవారం నాటి విపక్షాల మేధోమథనం సందర్భంగా కూటమికి ఇండియా అనే పేరు ఎలా వచ్చిందో రాహుల్ వివరించారు. ''జరుగుతున్నది రెండు భిన్న భావజాలాల మధ్య పోరాటం. అందుకే పోరాటం ఏమిటి, ఎవరి మధ్య అనే కీలకాంశాలపై మేం చర్చిస్తున్న క్రమంలో అనుకోకుండా ఇండియా అనే పేరు దానంతట అదే తెరపైకి వచ్చింది. ఎందుకంటే జరగబోయేది రెండు రాజకీయ కూటముల పోరాటం కాదు. భారత్ అనే భావనను కాపాడుకునేందుకు చేయబోయే యుద్ధమది. అందుకే ఇండియన్ నేషనల్ డెవలప్‌మెంటల్ ఇంక్లూజివ్ అలయన్స్–ఇండియా అనే పేరు ఖరారు చేశాం'' అని వెల్లడించారు. ''భారత్ మరోసారి ఏకమవుతుంది. 'ఇండియా' గెలుస్తుంది'' అంటూ అనంతరం రాహుల్ హిందీలో ట్వీట్ చేశారు.

కలిసి ఓడిస్తాం!

▶ మొదటి పేజీ తరువాయి

గంటల పాటు కూలంకషంగా చర్చించారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, అగ్ర నేతలు సోనియా గాంధీ, రాహుల్‌గాంధీతో పాటు తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి, పశ్చిమబెంగాల్ సీఎం మమతా బెనర్జీ, తమిళనాడు సీఎం, బిహార్ సీఎం నితీశ్‌కుమార్, డీఎంకే అధినేత ఎం.కె.స్టాలిన్, ఢిల్లీ సీఎం, ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్, ఆర్జేడీ అధినేత లాలూప్రసాద్, ఎన్సీపీ అధినేత శరద్ పవార్ తదితర దిగ్గజాలంతా భేటీలో పాల్గొన్నారు. విపక్ష కూటమికి ఇండియాగా నామకరణం చేశారు. కూటమి భాగస్వాముల మధ్య సమన్వయం, సహకారం తదితరాలకు 11 మంది సభ్యులతో కమిటీ వేయాలని నిర్ణయించారు.

ముంబై భేటీలో కీలక నిర్ణయాలు: ఖర్గే

ముంబైలో జరగబోయే విపక్షాల తర్వాతి భేటీలో కమిటీ కన్వీనర్ ఎంపికతో పాటు పలు ఇతర కీలక నిర్ణయాలుంటాయని ఖర్గే తెలిపారు. కూటమికి ఇండియాగా నామకరణం చేసినట్టు ఖర్గే ఈ సందర్భంగా వెల్లడించారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో కలసికట్టుగా పోరాడి ఘనవిజయం సాధించి తీరతామని ధీమా వెలిబుచ్చారు. విపక్షాలన్నా, తాజాగా పురుడు పోసుకున్న 26 విపక్షాల కూటమి అన్నా మోదీకి భయం పట్టుకుందని ఖర్గే ఎద్దేవా చేశారు. అయితే కూటమి సారథి ఎవరన్న ప్రశ్నకు మాత్రం ఖర్గే నేరుగా బదులివ్వలేదు. కాంగ్రెస్‌కు అధికారంపై గానీ, ప్రధాని పదవిపై గానీ ఆసక్తి లేదని చెప్పారు. రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని, లౌకికవాదాన్ని, సామాజిక న్యాయాన్ని పరిరక్షించడమే తమ లక్ష్యమని వెల్లడించారు. అందుకే కూటమిలో పలు పక్షాల మధ్య భేదాభిప్రాయాలున్నా విస్తృత ప్రయోజనాల కోసం, దేశ శ్రేయస్సు కోసం వాటన్నింటినీ పక్కన పెట్టి ఒక్కతాటిపైకి వచ్చామని చెప్పుకొచ్చారు. అనంతరం ఖర్గే సహా విపక్షాల నేతలంతా మీడియాతో మాట్లాడారు.

రాహుల్ మా ఫేవరెట్ : దీదీ

ఇండియా కూటమిని సవాలు చేసే దమ్ము బీజేపీకి ఉందా అని మీడియాతో మాట్లాడుతూ మమత నిలదీశారు. ''మా మాతృభూమి అంటే మాకు ప్రాణం. మేం దేశభక్తులం. మేం రైతులం, దళితులం. మేం మా దేశం కోసం, ప్రపంచం కోసం పాటుపడేవాళ్లం. కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీ చేస్తున్న పని ఒక్కటే. ప్రభుత్వాలను కొనడం, అమ్మడం!'' అంటూ విరుచుకుపడ్డారు. ''ఇండియా నెగ్గుతుంది. మన దేశం నెగ్గుతుంది. బీజేపీ ఓడుతుంది'' అని జోస్యం చెప్పారు. ''నేటి సంయుక్త డిక్లరేషన్ ద్వారా పాలక ఎన్డీఏ కూటమిపై మా విపక్ష కూటమి 420 సెక్షన్ విధిస్తోంది'' అని ప్రకటించారు. భారత శిక్షాస్మృతిలోని సెక్షన్ 420 మోసానికి సంబంధించిన కేసులకు వర్తిస్తుంది. రాహుల్ గాంధీ తమ ఫేవరెట్ అంటూ దీదీ ఈ సందర్భంగా అన్నారు.



శరద్ పవార్‌తో మాట్లాడుతున్న రాహుల్, నితీశ్

'ఇండియా' కూటమిలోని 26 పార్టీలు...

కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్, డీఎంకే, ఆమ్ ఆద్మీ పార్టీ, జేడీ(యూ), సమాజ్‌వాదీ పార్టీ, ఆర్జేడీ, జేఎంఎం, ఎన్సీపీ (శరద్ పవార్), సీపీఎం, సీపీఐ, శివసేన (యూబీటీ), నేషనల్ కాన్ఫరెన్స్, పీడీపీ, ఆరెల్డీ, ఎండీఎంకే, కేఎండీకే, వీసీకే, ఆరెస్పీ, సీపీఐ–ఎంఎల్ (లిబరేషన్), ఫార్వర్డ్ బ్లాక్, ఐయూఎంఎల్, కేరళ కాంగ్రెస్ (జోసెఫ్), కేరళ కాంగ్రెస్ (మణి), అప్నాదళ్ (కమెరవాదీ), ఎంఎంకే

దీదీ పెట్టిన పేరు!

విపక్ష కూటమికి ఇండియా అన్న పేరు తృణమూల్ అధినేత్రి మమతా బెనర్జీ సూచించినట్టు విశ్వసనీయ వర్గాల సమాచారం. దాని పూర్తి పేరు ఎలా ఉంటే బాగుంటుందని నేతలంతా లోతుగా చర్చించినట్టు చెబుతున్నారు.

ఎవరేమన్నారంటే...

మేం మా కుటుంబాల ప్రయోజనాల కోసమే పోరాడుతున్నామని కొందరంటున్నారు. కానీ వాళ్లు తెలుసుకోవాల్సింది ఏమిటంటే దేశమే మా కుటుంబం. ఆ కుటుంబం కోసమే మేం పోరాడుతున్నాం. మా పోరు ఒక వ్యక్తిపై కాదు. ఒక నియంతృత్వ పోకడపై. ఈ నియంతృత్వాన్ని చూసి దేశ ప్రజలు భయపడుతున్నారు. మై హూ నా (నేనున్నా) అని ఒక హిందీ సినిమా వచ్చింది. మేం కూడా హమ్ హైనా అని ప్రజలకు భరోసా ఇవ్వదలచాం

- మోదీపై ఉద్ధవ్ ఠాక్రే (శివసేన-యూబీటీ)

గత తొమ్మిదేళ్లలో దేశం కోసం ఎంతో చేసే గొప్ప అవకాశం ప్రధాని మోదీకి దక్కింది. కానీ ఏ రంగంలోనూ ఏమాత్రమూ అభివృద్ధి జరగలేదు

- అరవింద్ కేజ్రీవాల్

2024లో నూతన భారత ఆవిర్భావం

దేశంలో నియంతృత్వం సాగుతోంది. ప్రజాస్వామ్యం, లౌకికవాదం సంక్షోభంలో పడ్డాయి. కానీ 2024లో సరికొత్త భారత్ ఆవిర్భవించడం ఖాయం. పట్నా భేటీలో 15 పార్టీలుగా ఉన్న విపక్ష కూటమి బలం బెంగళూరు భేటీ నాటికి 26 పార్టీలకు విస్తరించడం రాబోయే మార్పుకు ప్రబల సంకేతం.

- స్టాలిన్

మోదీ నేతృత్వంలోనే ఎన్నికలకు

ఎన్డీఏ భేటీలో తీర్మానం

న్యూఢిల్లీ: ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంపై పూర్తి విశ్వాసముందని ఎన్డీఏ కూటమి పేర్కొంది. ఆయన నాయకత్వంలోనే ఐక్యంగా 2024 లోక్‌సభ ఎన్నికలకు వెళ్తామని మరోసారి ప్రకటించింది. మంగళవారం 39 భాగస్వామ్య పార్టీలతో భేటీ అనంతరం ఎన్డీఏ కూటమి ఈ మేరకు తీర్మానం ఆమోదించినట్టు పేర్కొంది. అందులో ఏం చెప్పిందంటే...

- విపక్షాలు ప్రాసంగికత కోల్పోయాయి. అస్తిత్వ సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్నాయి. ఎన్డీఏపై, కేంద్రంపై నిరాధార ఆరోపణలు చేస్తున్నాయి. కానీ దేశమంతా ఒక్కతాటిపైకి నిలిచి ఎన్డీఏ కూటమిపై విశ్వాసం వ్యక్తం చేస్తోంది.
- ప్రధాని మోదీ నాయకత్వంలో ఎన్డీఏ పాలనలో దేశం సాధించిన కనీవినీ ఎరగని అభివృద్ధిపై ఆయనను భాగస్వామ్య పక్షాలన్నీ ప్రశంసించాయి.

చంద్రయాన్-3 మూడో విడత కక్ష్య దూరం పెంపు

సూళ్లూరుపేట: భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) సతీష్ ధవన్ స్పేస్ సెంటర్ షార్ నుంచి ఈనెల 14న ప్రయోగించిన చంద్రయాన్-3 మిషన్‌కు మంగళవారం వేకువజామున మూడోసారి కక్ష్య దూరాన్ని పెంచే ప్రక్రియను విజయవంతంగా చేపట్టారు. ఎల్‌వీఎం3–ఎం4 ఉపగ్రహ వాహకనౌక ద్వారా చంద్రయాన్-3 మిషన్‌ను భూమికి దగ్గరగా 170 కిలోమీటర్లు, దూరంగా 36,500 కిలోమీటర్ల ఎత్తులో భూ మధ్యంతర కక్ష్యలోకి ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. మొదటి, రెండు విడుతల్లో భూమికి దగ్గరగా 173 కిలోమీటర్ల ఎత్తుకు, దూరంగా 42,000 కిలోమీటర్ల ఎత్తుకు పెంచిన విషయం తెలిసిందే. మూడో విడతలో భూమికి దగ్గరగా 224 కిలోమీటర్లు, దూరంగా 51,568 కిలోమీటర్ల ఎత్తుకు పెంచారు. ప్రపొల్షన్ మాడ్యూల్‌లో వున్న అపొజి ఇంధనాన్ని మంగళవారం ఒక్క నిమిషం పాటు మండించి ఈ ప్రక్రియను పూర్తి చేశారు.

ఎన్‌సీఎస్‌సీ చైర్‌పర్సన్ పదవికి సాంప్లా రాజీనామా

న్యూఢిల్లీ: షెడ్యూల్డ్ కులాల జాతీయ కమిషన్ చైరపర్సన్ పదవికి బీజేపీ నేత విజయ్ సాంప్లా(62) రాజీనామా చేశారు. రానున్న లోక్‌సభ ఎన్నికలకు గాను బీజేపీ ఆయనకు సంస్థాగత బాధ్యతలు అప్పగిస్తుందని భావిస్తున్నారు.

కేరళ మాజీ సీఎం ఊమెన్ చాందీ కన్నుమూత



తిరువనంతపురం/బనశంకరి: కాంగ్రెస్ సీనియర్ నేత, కేరళ సీఎంగా రెండు పర్యాయాలు పనిచేసిన ఊమెన్ చాందీ(79) కన్నుమూశారు. దీర్ఘకాలంగా అస్వస్థతతో బాధపడుతున్న ఊమెన్ చాందీ బెంగళూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో కొన్ని నెలలుగా చికిత్స పొందుతున్నారు. మంగళవారం ఉదయం 4.25 గంటలకు తుదిశ్వాస విడిచారని ఆయన కొడుకు చాందీ ఊమెన్ ఫేస్‌బుక్ ఖాతాలో పోస్ట్ చేశారు. చాందీ భౌతికకాయాన్ని బెంగళూరు ఇందిరానగర్‌లోని కర్ణాటక మాజీ మంత్రి టి.జాన్ నివాసంలో ఉంచారు. ప్రతిపక్షాల ఐక్య భేటీకి హాజరయ్యేందుకు బెంగళూరులో ఉన్న కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే, ఆపార్టీ నేతలు సోనియా గాంధీ, రాహుల్, తమిళనాడు సీఎం తదితరులు మంగళవారం ఉదయం ఊమెన్ చాందీ భౌతికకాయానికి నివాళులర్పించారు. అనంతరం భౌతిక కాయాన్ని తిరువనంతపురం విమానంలో తరలించారు. అక్కడి నుంచి రాష్ట్ర సెక్రటేరియట్ దర్బార్ హాల్, సెయింట్ జార్జ్ ఆర్థోడాక్స్ సిరియన్ కేథడ్రల్ చర్చి, కేపీసీసీ ప్రధాన కార్యాలయంలో అభిమానులు, ప్రజల సందర్శనార్థం ఉంచారు. బుధవారం చాందీ సొంతూరు కొట్టాయం జిల్లా పుత్తుప్పల్లికి తీసుకెళతారు. గురువారం అంత్యక్రియలు జరుగుతాయి. చాందీకి భార్య మరియమ్మ, కుమార్తెలు మరియా ఊమెన్, అచ్చు ఊమెన్, కొడుకు చాందీ ఊమెన్ ఉన్నారు. కేరళలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయడంలో సీనియర్ నేతలు ఊమెన్ చాందీ, వాయలార్ రవి, ఏకే ఆంటోనీల కృషి ఎంతో ఉంది. 1970లో మొదటిసారిగా పుత్తుప్పల్లి నియోజవర్గం నుంచి ఎమ్మెల్యే అయ్యారు. అప్పటి నుంచి రికార్డు స్థాయిలో 53 ఏళ్లపాటు అదే నియోజకవర్గం నుంచి ఓటమి అనేదే లేకుండా ప్రాతినిధ్యం వహించారు.

మళ్లీ గెలుస్తాం!

▶ మొదటి పేజీ తరువాయి

కూటములు కట్టింది. ప్రభుత్వాలను కూల్చేందుకే వాటిని దుర్వినియోగ పరిచింది. అధికారమే పరమావధిగా, వారసత్వం రాజకీయాలే పునాదిగా, కుల, ప్రాంతీయ రాజకీయాలు చేసే ప్రతికూల కూటములు విజయం సాధించలేవు' అన్నారు.

ఎన్డీఏ... రంగుల హరివిల్లు

ఎన్డీయే కూటమి ఇటీవలే పాతికేళ్లు పూర్తి చేసుకుందని మోదీ గుర్తు చేశారు. ''ఈ కాలంలో దేశ ప్రగతిని పరుగు పెట్టించడంతో పాటు ప్రజల ఆకాంక్షలను తీర్చింది. దేశంలోని భిన్న ప్రాంతాల ఆకాంక్షలను తనలో కలుపుకున్న రంగుల హరివిల్లు ఎన్డీయే. రాష్ట్రాల అభివృద్ధే దేశాభివృద్ధి. 'సబ్ కా ప్రయాస్' స్ఫూర్తితో అభివృద్ధి చెందిన భారత్ కోసం ఎన్డీఏ ముందు నిలిచి పాటుపడుతోంది. దేశ భద్రత, సాధికారతే పరమావధిగా పనిచేసింది. ఇక మీదటా చేస్తుంది కూడా'' అని అన్నారు. ''1998లో ఎన్డీయే ఏర్పడింది. ఎవరినో గద్దె దించేందుకో, ఎవరికో వ్యతిరేకంగానో కాదు. దేశంలో సుస్థిరతే ధ్యేయంగా ఏర్పడిన కూటమి. సుస్థిర ప్రభుత్వముంటేనే దేశ గతినే మార్చేలా ప్రభుత్వం సానుకూల నిర్ణయాలు తీసుకోగలదు. ఈ ప్రగతిని గతంలో అటల్‌జీ హయాంలో చూ శాం. మళ్లీ తొమ్మిదేళ్లుగా చూస్తున్నాం. స్థిరమైన ప్ర భుత్వం కారణంగానే భారత్‌పై ప్రపంచ దేశాలు పెట్టుకున్న నమ్మకం మరింత బలపడింది' అని అన్నారు.

విపక్షంలో ఉన్నా ప్రతికూల రాజకీయాలకు దూరం

ప్రతిపక్షంలో ఉన్నా నిర్మాణాత్మక రాజకీయాలే చేశాం. కుంభకోణాల్లో మునిగిన ప్రభుత్వాలను వ్యతిరేకించాం. అంతేగానీ ప్రజాతీర్పును ఏనాడూ తప్పుబట్టలేదు. ప్రభుత్వాన్ని విమర్శించేందుకు విదేశాల సాయం కోరలేదు'' అంటూ విదేశాల్లో రాహుల్ చేసిన వ్యాఖ్యలను పరోక్షంగా విమర్శించారు. '' ఎన్డీయే ప్రతిపక్షంలో ఉన్నా దేశ అభివృద్ధి పథంలో అవరోధాలు సృష్టించలేదు. ఇప్పుడు కేంద్ర పథకాలను విపక్ష పాలిత రాష్ట్రాల్లో అమలు చేయనివ్వడం లేదు. చేసినా నత్తనడకన సాగేలా కుట్ర పన్నుతున్నారు. అధికారమే ధ్యేయంగా, అవినీతే లక్ష్యంగా, వారసత్వ రాజకీయాలకు పట్టం కడుతూ, కుల, ప్రాంతీయ రాజకీయాలకు కొమ్ముకాసే కూటములు దేశానికి అత్యంత హానికరం' అన్నారు.

- ఎన్డీయే భేటీకి 38 పార్టీల కీలక నేతలు హాజరయ్యారు. బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా, శివసేన నేత, మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే, తమిళనాడు మాజీ సీఎం, అన్నాడీఎంకే నేత పళనిస్వామి, నాగాలాండ్ ముఖ్యమంత్రి నిఫ్యూ రియో, బిహార్ మాజీ ముఖ్యమంత్రి, హిందుస్తానీ అవామ్ మోర్చా నేత జితన్ రామ్ మాంఝీ తదితరులు భేటీలో మోదీకి స్వాగతం పలికారు.
- లోక్‌జనశక్తి (రాం విలాస్) నేత చిరాగ్ పాశ్వాన్ మోదీకి పాదాభివందనం చేయగా ఆయన్ను ప్రధాని ఆలింగనం చేసుకున్నారు.



మోదీకి గజమాలతో సత్కారం

ఎన్డీఏ భేటీలో పాల్గొన్న 38 పార్టీలు...

బీజేపీ, శివసేన (షిండే), ఎన్సీపీ (అజిత్), ఆరెల్జేపీ (పశుపతి), అన్నాడీఎంకే, అప్నాదళ్ (సోనేలాల్), నేషనల్ పీపుల్స్ పార్టీ, ఎన్డీపీపీ, ఆల్ జార్ఖండ్ స్టూడెంట్స్ యూనియన్, సిక్కిం క్రాంతికారీ మోర్చా, మిజో నేషనల్ ఫ్రంట్, ఇండిజినస్ పీపుల్స్ ఫ్రంట్ ఆఫ్ త్రిపుర, నాగా పీపుల్స్ ఫ్రంట్, రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (అథవాలే), ఏజీపీ, పీఎంకే, తమిళ మానిల కాంగ్రెస్, యునైటెడ్ పీపుల్స్ పార్టీ (లిబరల్), సుహేల్‌దేవ్ భారతీయ సమాజ్ పార్టీ, అకాలీదళ్ (సంయుక్త), ఎంజీపీ, జననాయక్ జనతా పార్టీ, ప్రహార్ జనశక్తి పార్టీ, రాష్ట్రీయ సమాజ్ పక్ష, జన సురాజ్య శక్తి పార్టీ, కుకీ పీపుల్స్ అలయన్స్, యునైటెడ్ డెమొక్రటిక్ పార్టీ (మేఘాలయ), హిల్ స్టేట్ పీపుల్స్ డెమొక్రటిక్ పార్టీ, నిషాద్ పార్టీ, ఆలిండియా ఎన్నార్ కాంగ్రెస్, హిందూస్తానీ ఆవామ్ మోర్చా, జనసేన పార్టీ, హరియాణా లోక్‌హిత్ పార్టీ, భారత్ ధర్మ జనసేన, కేరళ కామరాజ్ కాంగ్రెస్, పుదియ తమిళగం, లోక్ జనశక్తి (రాంవిలాస్ పాశ్వాన్), గూర్ఖా నేషనల్ లిబరేషన్ ఫ్రంట్.

కశ్మీర్‌లో నలుగురు ఉగ్రవాదులు హతం

జమ్మూ: జమ్మూకశ్మీర్‌లో భారీ విధ్వంసానికి ఉగ్రవాదులు చేసిన ప్రయత్నాన్ని భద్రతా బలగాలు భగ్నం చేశాయి. పూంచ్ జిల్లాలో మంగళవారం జరిగిన భీకర ఎన్‌కౌంటర్‌లో జవాన్ల తూటాలకు నలుగురు విదేశీ ఉగ్రవాదులు హతమయ్యారు. ఉగ్రమూకలు నియంత్రణ రేఖ వెంబడి చొరబాటుకు చేసిన యత్నాన్ని బలగాలు విజయవంతంగా తిప్పికొట్టిన మరునాడే ఈ ఘటన చోటుచేసుకోవడం గమనార్హం. పూంచ్ జిల్లా మెంధార్‌లో ఏప్రిల్ 20వ తేదీన ఉగ్రవాదులు జరిపిన దాడిలో అయిదుగురు జవాన్లు నేలకొరిగిన విషయం తెలిసిందే. అప్పటి నుంచి 'ఆపరేషన్ త్రినేత్ర' పేరుతో బలగాలు సురాన్‌కోట్ అటవీ ప్రాంతంలో జల్లెడపడుతున్నాయి. అనుమానాస్పద కదలికలున్నాయన్న నిఘా వర్గాల సమాచారం మేరకు పోలీసులు, ఆర్మీ ఈ నెల 17వ తేదీ నుంచి సురాన్‌కోట్‌లోని సిందారాహ్‌లో 'ఆపరేషన్ త్రినేత్ర 2' పేరుతో కార్డన్ సెర్చ్ చేపట్టాయి. ఉగ్రవాదులు ఎట్టి పరిస్థితుల్లోనూ తప్పించుకుపోయే అవకాశం ఇవ్వకుండా పక్కా వ్యూహంతో చేపట్టిన ఈ ఆపరేషన్‌లో సోమవారం ఉదయం నుంచి మంగళవారం ఉదయం 5 గంటల వరకు ఎదురుకాల్పులు కొనసాగాయి. ఉగ్రమూకల కాల్పులు నిలిచిపోవడంతో ఆ ప్రాంతంలో తనిఖీలు చేపట్టిన బలగాలు నలుగురు విదేశీ ఉగ్రవాదుల మృతదేహాలను కనుగొన్నాయి. చైనా తయారీ నాలుగు ఏకే రైఫిళ్లు, పాకిస్తాన్ గుర్తులున్న రెండు పిస్టళ్లు సహా భారీగా మందుగుండు సామగ్రి లభ్యమయ్యాయి. విదేశీ ఉగ్రవాదుల వద్ద ఉన్న ఆయుధాలను బట్టి వారు భారీ విధ్వంసానికి ప్రణాళిక వేసుకున్నట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయని ఆర్మీ తెలిపింది. ఉగ్రమూకల పని పట్టేందుకు తమకు ఎంతగానో సహాయ సహకారాలు అందించిన స్థానికులకు ఆర్మీ కృతజ్ఞతలు తెలిపింది.

సోనియా, రాహుల్ ప్రయాణిస్తున్న విమానం అత్యవసర ల్యాండింగ్

భోపాల్: కాంగ్రెస్ అగ్ర నేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీలు ప్రయాణిస్తున్న విమానం మంగళవారం సాయంత్రం భోపాల్ విమానాశ్రయంలో అత్యవసరంగా ల్యాండయింది. ఆ విమానం ఎటువైపు వెళుతోంది, అందులో తలెత్తిన సమస్య ఏమిటనే వివరాలు వెల్లడికాలేదు. రాత్రి 9.30 గంటల తర్వాత విమానం తిరిగి టేకాఫ్ అయ్యిందని భోపాల్ పోలీస్ కమిషనర్ హరినారాయణ్ చారి మిశ్రా చెప్పారు. సోమ, మంగళవారాల్లో జరిగిన విపక్ష భేటీకి సోనియా, రాహుల్ హాజరైన విషయం తెలిసిందే.

నేడు అఖిల పక్ష సమావేశం

న్యూఢిల్లీ: ఈ నెల 20వ తేదీ నుంచి పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు మొదలవుతున్న వేళ బుధవారం కేంద్ర ప్రభుత్వం అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసింది. పార్లమెంట్ సమావేశాలకు ముందుగా ప్రభుత్వం అన్ని పార్టీలతో సమావేశం కావడం రివాజుగా వస్తోంది.

మాది ప్రత్యామ్నాయ ఎ'జెండా'


ప్రజల ముందుంచుతున్నాం ● ఇండియా కూటమి జాయింట్ డిక్లరేషన్

బెంగళూరు: ప్రత్యామ్నాయ రాజకీయ, సామాజిక, ఆర్థిక ఎజెండాను దేశం ముందుంచుతామని కొత్తగా పురుడు పోసుకున్న విపక్షాల కూటమి 'ఇండియా' ప్రకటించింది. తమకు అవకాశమిస్తే పాలన ప్రజాస్వామికంగా, అందరి భాగస్వామ్యంతో కూడినదిగా ఉండేలా చూస్తామని ప్రజలకు హామీ ఇచ్చింది. రెండు రోజుల బెంగళూరు భేటీలో ఈ మేరకు సంయుక్త డిక్లరేషన్ (సామూహిక సంకల్పం' విడుదల చేసింది. తక్షణమే దేశవ్యాప్తంగా కుల గణన చేపట్టాలని కేంద్రాన్ని డిమాండ్ చేసింది. డిక్లరేషన్‌లో ఇంకా ఏం చెప్పిందంటే...

- మైనారిటీలపై జరుగుతున్న హింసాద్వేషలను తుడిచిపెట్టేందుకు, మహిళలు, దళితులు, గిరిజనులు, కశ్మీరీ పండిట్లపై పెరు గుతున్న నేరాలకు అడ్డుకట్ట వేసేందుకే మేం ఒక్కతాటిపైకి వచ్చాం. ఈ దిశగా తొలి అడుగు కింద కులగణన కోరుతున్నాం.
- దేశ రాజ్యాంగానికి మూలాధారాలైన లౌకిక ప్రజాస్వామ్యం, ఆర్థిక సార్వభౌమత్వం, సామాజిక న్యాయం, సమాఖ్య వ్యవస్థలను పద్ధతి ప్రకారం, అతి దారుణంగా కించపరుస్తున్నారు. తద్వారా దేశ సమాఖ్య నిర్మాణాన్ని సంపూర్ణంగా బలహీనపరిచేందుకు ఉద్దేశపూర్వక కుట్ర జరుగుతోంది. విపక్ష పాలిత రాష్ట్రాల గవర్నర్లు అన్ని రాజ్యాంగ నిబంధనలనూ అతిక్రమిస్తున్నారు'' అంటూ మండిపడింది. దేశ చరిత్రలో ప్రస్తుతం కీలక మలుపు వద్ద ఉన్నాం.
- ప్రత్యర్థులు, విపక్షాలపై దర్యాప్తు, నిఘా సంస్థలను కేంద్రంలోని బీజేపీ సర్కారు అడ్డంగా దుర్వినియోగం చేస్తోంది. త ద్వారా ప్రజాస్వామ్యాన్నే కించపరుస్తోంది.
- ఆర్థికసంక్షోభం, నిత్యావసరాల ధరల పెరుగుదల, నిరుద్యోగం తదితర ప్రధాన సమస్యలపై రాజీ లేకుండా పోరాడతాం.
- బలమైన ప్రభుత్వ రంగం, పోటాపోటీ ప్రైవేట్ రంగాలు నేటి తక్షణావసరాలు. కర్షకుడు, కార్మికుడు, కర్మభూమికి అత్యున్నత ప్రాధాన్యం దక్కాలి.
- సమస్యలపై ప్రధాని మౌనం దారుణం.
- మణిపూర్ కల్లోలం అత్యంత విషాదకరం. అక్కడ పరిస్థితి తక్షణం అదుపులోకి తేవాల్సిన బాధ్యత మోదీదే.

మూడు నెలలపాటు నడిసంద్రంలో..

పెంపుడు కుక్క సహా ఆస్ట్రేలియా వాసిని రక్షించిన మెక్సికో బోట్



మెక్సికో సిటీ: సుమారు మూడు నెలల పాటు సముద్రంలో నిస్సహాయ స్థితిలో పెంపుడు కుక్కతో గడిపిన ఓ వ్యక్తి ఎట్టకేలకు సురక్షితంగా ఒడ్డుకు చేరారు. నమ్మశక్యంకాని ఈ ఘటన తాజాగా వెలుగులోకి వచ్చింది. తిమోతీ లిండ్సే షడ్డక్(54) అనే ఆస్ట్రేలియా వాసి పెంపుడు కుక్క బెల్లాతో కేటమారన్ రకం పడవలో పసిఫిక్ సముద్రంలో విహరిస్తున్నాడు. ఆ సమయంలో ఆ పడవ మరమ్మతుకు గురయింది. అలా సముద్ర జలాల్లో తీరానికి 1,200 మైళ్ల దూరంలో ఆ ఇద్దరూ మూడు నెలలుగా ఉండిపోయారు. అనూహ్యంగా ఇటీవల అటుగా టునా చేపల వేటకు వెళ్లిన మెక్సికో వాసుల కంట పడ్డారు.

దక్షిణకొరియాలో అమెరికా అణు సబ్‌మెరైన్

సియోల్: నాలుగు దశాబ్దాల తర్వాత అమెరికా తన అణు జలాంతర్గామిని దక్షిణకొరియా జలాల్లో మోహరించింది. ఉత్తరకొరియా తరచూ అణు బెదిరింపులకు పాల్పడుతున్న దృష్ట్యా ఈ ఏడాది ఏప్రిల్‌లో దక్షిణకొరియాతో కుదిరిన పలు ఒప్పందాల్లో భాగంగానే అణు బాలిస్టిక్ క్షిపణులు కలిగిన సబ్‌మెరైన్‌ను అమెరికా పంపించింది. ఓహియో తరగతికి చెందిన యూఎస్ఎస్ కెంటకీ జలాంతర్గామి మంగళవారం మధ్యాహ్నం దక్షిణకొరియాలోని బుసాన్ రేవుకు చేరుకుంది.

సాక్షి హైదరాబాద్

బుధవారం । 19 । జూలై । 2023



చైన్ స్నాచర్ల అంతర్రాష్ట్ర ముఠా అరెస్ట్

ఒకే రోజు అయిదు నేరాలకు పాల్పడిన చైన్ స్నాచర్ల అంతర్రాష్ట్ర ముఠాను మాదాపూర్ పోలీసులు అరెస్టు చేశారు. వివరాలను డీసీపీ శిల్పవల్లి వెల్లడించారు. -8లో



త్రివేండ్రం 'సొత్తు'... నగరంలో తాకట్టు

దోచుకున్న సొత్తును హైదరాబాద్‌లో తాకట్టు పెట్టిన ఉమా ప్రసాద్‌ను త్రివేండ్రం పోలీసులు అరెస్టు చేశారు. బంగారం రికవరీ కోసం అతడిని నగరానికి తీసుకువచ్చారు. -8లో

రంగారెడ్డి జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ ఎస్.శశిధర్ రెడ్డి

రంగారెడ్డి కోర్టులు: జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సి.హరేకృష్ణ భూపతి పదవీ కాలం ఈ నెల 31న ముగియనుంది. దీంతో సంగారెడ్డి జిల్లా న్యాయమూర్తిగా ఉన్న జస్టిస్ ఎస్.శశిధర్ రెడ్డిని రంగారెడ్డి జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా నియమిస్తూ హైకోర్టు మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది.

జల్లంత.. తుళ్లింత



విసురుకున్న ముసురు

రోజంతా చిరు జల్లులు ఈదురు గాలులు..

అల్పపీడన ద్రోణి ప్రభావంతో నగరంలో సోమవారం రాత్రి నుంచి మంగళవారం రాత్రి వరకు ముసురు వర్షం కురుస్తూనే ఉంది. మధ్య మధ్యలో ఈదురు గాలులతో కూడిన వర్షం కురవడంతో పలు ప్రాంతాల్లో వృక్షాలు కూలిపోయాయి. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. చంపాపేట రాజీవ్‌గాంధీ నగర్‌లో వైర్లు తెగిపోయి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. యాకుత్‌పురా, విద్యానగర్, చిలకల గూడ, సైదాబాద్, మాసబ్‌ట్యాంక్, సికింద్రాబాద్ ప్రాంతాల్లో చెట్లు నేలవాలాయి. మంగళవారం ట్యాంక్‌బండ్‌పై ఈ దృశ్యాలు కనిపించాయి. మరో మూడ్రోజుల పాటు వర్షాలు కురుస్తాయని వాతావరణ కేంద్రం వెల్లడించింది. - సాక్షి, స్టాఫ్ ఫొటోగ్రాఫర్లు

సుమనోహర సాగరం





తోడుగా గొడుగు..

దేదో.. చుడువా..



చిటపట.. టకటకా..



న్యూస్‌రీల్

రైలు ఢీకొని డిగ్రీ విద్యార్థి మృతి

సికింద్రాబాద్: కళాశాలకు వెళ్లేందుకు ఇంటి నుంచి బయలుదేరిన విద్యార్థి రైలు ప్రమాదంలో మృతి చెందిన ఘటన మంగళవారం సికింద్రాబాద్ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. దేవరయాంజాల్‌కు చెందిన ఆటోడ్రైవర్ సంజీవ్‌కుమార్ కుమారుడు బుచ్చాల ప్రేంకుమార్ (22) డిగ్రీ రెండో సంవత్సరం విద్యార్థి. కళాశాలకు వెళ్లేందుకు ఇంటినుంచి బయలుదేరి అల్వాల్‌కు చేరుకున్న ప్రేంకుమార్.. అక్కడి రైల్వేస్టేషన్ అప్‌ట్రాక్ పట్టాలు దాటుతుండగా వేగంగా వచ్చిన మెదక్–కాచిగూడ ప్యాసింజర్ రైలు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ ప్రేంకుమార్ అక్కడికక్కడే మృతి చెందాడు. రైల్వే పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

120 కొత్త బీసీ గురుకుల పాఠశాలలు ప్రారంభించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్.కృష్ణయ్య

ముషీరాబాద్: బీసీ గురుకుల పాఠశాలల్లో దరఖాస్తు చేసిన ప్రతి విద్యార్థికి సీటు ఇవ్వాలని. ఇందుకోసం కొత్తగా 120 బీసీ గురుకుల పాఠశాలలు మంజూరు చేయాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. మంగళవారం బీసీ భవన్‌లో బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామకృష్ణ అధ్యక్షతన జరిగిన విద్యార్థుల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. బీసీ గురుకుల పాఠశాలల్లో సీట్లు లభించక విద్యార్థులు ఆఫీసుల చుట్టు తిరుగుతున్నారని, పాఠశాలల్లో అడ్మిషన్ల కోసం లక్షల సంఖ్యలో దరఖాస్తులు రాగా కేవలం 8 వేల మందికి మాత్రమే సీట్లు ఇచ్చారని తెలిపారు. వెంటనే 238 బీసీ గురుకుల పాఠశాలల్లో 5, 6, 7, 8 తరగతులకు అదనపు సెక్షన్లు ప్రారంభించాలని కోరారు. కార్యక్రమంలో నీల వెంకటేష్, సి.రాజేందర్, నర్సింహగౌడ్, రాందేవ్, భాస్కర్ ప్రజాపతి, బాసయ్య, రవి, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

రెండు వేర్వేరు కేసుల్లో అక్రమ బంగారం పట్టివేత

శంషాబాద్: రెండు వేర్వేరు కేసుల్లో అక్రమంగా తరలిస్తోన్న బంగారాన్ని శంషాబాద్ ఎయిర్‌పోర్టులో కస్టమ్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి.. సోమవారం అర్ధరాత్రి కువైట్ నుంచి బయలుదేరిన ప్రయాణికుడు వయా దుబాయ్ మీదుగా శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు చేరుకున్నాడు. అతడి కదలికలను అనుమానించిన కస్టమ్స్ అధికారులు క్షుణ్ణంగా లగేజీని తనిఖీ చేయడంతో 1225 గ్రాముల బంగారు ఆభరణాలు బయటపడ్డాయి. వీటి విలువ రూ.72.55 లక్షలు ఉంటుందని అధికారులు నిర్ధారించారు. అదే సమయంలో కువైట్ నుంచి వయా దోహా మీదుగా వచ్చిన మరో ప్రయాణికుడి లగేజీలో 500 గ్రాముల బంగారం బయటపడింది. దీని విలువ రూ.30.51 లక్షలుగా నిర్ధారించారు. ఈ మేరకు నిందితులిద్దరినీ అదుపులోకి తీసుకుని కేసు దర్యాప్తు చేస్తున్నారు.



'టెంపరరీ లైటింగ్'లో గోల్‌మాల్!

బోనాల పేరిట నిధుల ఫలహారం

- బల్దియాలో విద్యుత్ విభాగం అవినీతికి అంతేదీ ?
- లోపాలున్నా ఈఈఎస్‌ఎల్‌పై చర్యల లేమి



సాక్షి, సిటీబ్యూరో: ఎప్పటిలాగే.. ప్రతి పండగలాగే..బోనాల పండగ పేరిట జీహెచ్‌ఎంసీలోని విద్యుత్ విభాగం నిధులు ఖర్చు చేస్తోంది. పండగల పేరిట టెంపరరీ లైటింగ్ ఏర్పాట్ల కోసమంటూ ఏటా కోట్లు ఖర్చు చేస్తున్న జీహెచ్‌ఎంసీ బోనాల పండక్కి టెంపరరీ లైటింగ్ పేరిట దాదాపు రూ.1.35 కోట్లు వ్యయం చేసినట్లు తెలిసింది. ప్రతి పండగకూ టెంపరరీ లైటింగ్ పేరిట కోట్లు ఖర్చు చేసే బదులు జీహెచ్‌ఎంసీయే తాత్కాలిక పోల్స్, తదితర సామగ్రి కొనుగోలు చేసి ఖర్చు తగ్గించుకునే అవకాశమున్నా ఆపని చేయడం లేదు. అంతేకాదు.. జీహెచ్‌ఎంసీలో విద్యుత్ నిర్వహణ కాంట్రాక్టు ఏజెన్సీ అయిన ఈఈఎస్‌ఎల్ టెంపరరీ అవసరం రాకుండా పనులు చేయాల్సి ఉండగా, పనులు చేయడం లేదు. పండగ కోసమే ప్రత్యేక లైటింగ్ కోసం సిరీస్ లైట్ల వంటివేనా అంటే..సాధారణ బల్బులు తాత్కాలిక పోల్స్ ఏర్పాటు వంటివి సైతం ఉన్నాయి.

పేరుకే లైటింగ్..

టెంపరరీ లైటింగ్ పేరిట నిధులు భారీగా ఖర్చు చేస్తున్నప్పటికీ, ఆమేరకు నిజంగానే లైటింగ్ ఏర్పాట్లు చేస్తున్నారా అంటే అదీ లేదు. ఆ పేరిట లోకల్ లీడర్లు, కాంట్రాక్టర్లు, అవినీతి మరిగిన అధికారులు జేబులు నింపుకుంటున్నారనే ఆరోపణలున్నాయి. విశ్వసనీయ సమాచారం మేరకు.. రికార్డుల్లో చూపే టెంపరరీ లైటింగ్స్ అన్నీ ఏర్పాటు చేయరు. ఉదాహరణకు తమ ప్రాంతంలో వెయ్యిబల్బులు కావాలని కోరే లీడర్లే తీరా మంజూరయ్యాక, వాటిల్లో వంద మాత్రం ఏర్పాటు చేస్తే చాలని, మిగతా వాటికయ్యే సొమ్ములో సగం మీరు తీసుకోండి.. మిగతా సగంలో కాంట్రాక్టరు సగం, మేం సగం తీసుకుంటామని సంబంధిత అధికారితో అవగాహన ఒప్పందానికొస్తారు. ఒప్పుకోకుంటే మీపైనే ఫిర్యాదులు చేసి బదిలీ చేయిస్తామని బెదిరించి ఒప్పుకొనేలా చేస్తారని తెలుస్తోంది.

ఎస్సీ, ఎస్టీలపై ప్రేమ కాదు..

చాలామంది లీడర్లు తమ ప్రాంతంలోని పనులు ఎస్సీ, ఎస్టీ కాంట్రాక్టర్లకు ఇవ్వాలని డిమాండ్ చేస్తారు. ఎస్సీ, ఎస్టీలపై వారికెంత ప్రేమో అనుకుంటే పొరపాటే. నిబంధనల మేరకు పనులకయ్యే వ్యయంలో 15 శాతం పనుల్ని ఎస్సీ, ఎస్టీ కాంట్రాక్టర్లకు ఇవ్వాల్సి ఉంటుంది. వారంతా సిండికేట్ అయి ఎక్కువ లెస్‌కు వేయరు. కేవలం 0. 5 నుంచి 1 శాతం లోపు లెస్‌కే వెళ్తారు. తద్వారా ఎక్కువ గిట్టుబాటవుతుంది. అదే వేరే కాంట్రాక్టర్లయితే 50–70 శాతం వరకు ఎక్కువ లెస్‌కు వెళ్తారు. ఎంత లెస్‌కు వెళ్లినా అసలు పనులే చేయరు కాబట్టి ఎంత మిగిలినా చాలనుకుంటారు.

ఎలక్ట్రికల్ పనులు ఇతర ఇంజినీర్లతో..

మరోవైపు కొన్ని సర్కిళ్లలో విద్యుత్ పనుల్ని ఎలక్ట్రికల్ ఇంజినీర్లకు కాకుండా మెకానికల్ ఇంజినీర్లకు అప్పగించారు. అలా ఎలక్ట్రికల్ ఇంజినీర్ లేని సికింద్రాబాద్ సర్కిల్‌లోనే గతంలో జోనల్ కార్యాలయంలో విద్యుత్ ప్రమాదం జరగడంతోపాటు ఇటీవల సికింద్రాబాద్ మహంకాళి జాతర సందర్భంగా స్ట్రీట్ లైట్ పోల్ షాక్ కొట్టి ఓ వ్యక్తి మరణించాడు. అందుకు బాధ్యులైన అధికారులెవరో, వారిపై చర్యలు తీసుకున్నారో, లేదో తెలియదు. విద్యుత్ విభాగంలో పనిచేసే డీఈఈలకు ఏటా దాదాపు రూ.35 లక్షలు జీతభత్యాలు, వాహన సదుపాయం పేరిట చెల్లిస్తున్నారనే ఆరోపణలున్నాయి. అర్హులైన ఎలక్ట్రికల్ ఇంజినీర్లు చేయాల్సిన పనుల్ని వారికెందుకిస్తున్నారో అంతుపట్టదు. కాసులకు కక్కుర్తిపడే ఉన్నతాధికారులే ఇందుకు కారణమనే ఆరోపణలున్నాయి.

ఇలా టెంపరరీ లైటింగ్ పేరిట అందే నిధులతో కాంట్రాక్టర్లు, లోకల్ లీడర్లు 'పండగ' చేసుకుంటారు. బోనాల పేరిట వివిధ దేవాలయాల పరిసరాల్లో హాలోజెన్ బల్బులు, సిరీస్ ల్యాంప్‌లు, పవర్‌ఫ్యాన్స్, ఎల్‌ఈడీ బల్బులు, ప్రత్యేక ఆర్చిల పేరిట నిధులు ఖర్చు చేశారు. ఆర్చిలు సైతం రికార్డులోని వాటికి, వాస్తవంగాఏర్పాటు చేసేవాటికి పొంతన ఉండదని ఈ వ్యవహారాల గురించి తెలిసిన వారు చెబుతున్నారు.

ఈఈఎస్‌ఎల్ నిర్వహణ అధ్వానం..

ఈఈఎస్‌ఎల్ నిర్వహణ అధ్వానంగా ఉన్నా, వీధిలైట్లు వెలగకున్నా పట్టించుకోవడం లేదు. రెండు రోజుల్లోగా సమస్యలన్నీ పరిష్కారం కాకుంటే చర్యలు తప్పవని మేయర్ హెచ్చరించి పదిరోజులైనా ఏం చర్యలు తీసుకున్నారో వారికే తెలియాలి.

ఔటర్‌పై డేంజర్ బెల్స్



బండిని 'అదుపు' చేయలేకపోవడంతోనే ప్రమాదాలు

- దీనిపై 120 కిలోమీటర్ల వేగం ప్రామాణికమే
- చర్చనీయాంశంగా మారిన ఆరుగురి మృత్యువాత
- వేగం కంటే వాహనంపై నియంత్రణ కోల్పోతేనే ముప్పు
- రహదారి భద్రతపై అవగాహన లేకపోవడమూ ఓ కారణమే: నిపుణులు

ఇటీవల ఔటర్‌పై ప్రమాదాలు..

- ఈ ఏడాది జనవరి 31న హిమాయత్‌సాగర్ వద్ద కారు, లారీ ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు మృతి చెందారు. మరో నలుగురు గాయపడ్డారు.
- ఫిబ్రవరి 5న కీసర ఇంటర్‌ఛేంజ్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందగా, మరో ఏడుగురు గాయపడ్డారు.
- మార్చి 2న కొల్లూరు వద్ద ముగ్గురు వలస కూలీలు దుర్మరణం పాలయ్యారు.
- జూన్ 6న శంషాబాద్ వద్ద ఒక వ్యక్తి మృతి చెందగా, మరో ఐదుగురు గాయపడ్డారు.
- జూలై 6న శంషాబాద్ వద్ద జరిగిన మరో ప్రమాదంలో ఇద్దరు మహిళలు చనిపోయారు.

సాక్షి, సిటీబ్యూరో: ఔటర్ మరోసారి హడలెత్తించింది. రహదారులు రక్తసిక్తమయ్యాయి. ఔటర్‌పై వాహనాల వేగాన్ని గంటకు 100 నుంచి 120 కిలోమీటర్లకు పెంచిన కొద్ది రోజుల్లోనే ఏకంగా మూడు చోట్ల జరిగిన ప్రమాదాల్లో సోమవారం ఆరుగురు వ్యక్తులు మృత్యువాత పడడంతో ఔటర్‌పై రహదారి భద్రత మరోసారి చర్చనీయాంశమైంది. నిజానికి ఔటర్‌పై వేగంతో నిమిత్తం లేకుండానే తరచూ ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. 158 కి.మీ మార్గంలో ఎక్కడో ఒక చోట అదుపు తప్పుతూనే ఉన్నాయి. కేవలం వాహనదారుల్లో సరైన అవగాహన లేకపోవడం, ఏమరుపాటుగా బండి నడపడం వల్లే తీవ్రమైన ప్రమాదాలు చోటుచేసుకుంటున్నట్లు రవాణాశాఖ అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా నిర్మించిన ఎక్స్‌ప్రెస్ హైవేలపై గంటకు 120 నుంచి 140 కి.మీ వరకు కూడా పరుగులు తీయవచ్చు. ఆధునిక సాంకేతికతతో రూపొందించిన కార్లు, ఇతర వాహనాలు కూడా సమర్థంగానే ఉన్నాయి. భారీ, తేలికపాటి రవాణా వాహనాలు మొదలుకొని కార్లు నడిపే డ్రైవర్లు అనుభవం, నైపుణ్యాన్ని కలిగే ఉంటారు. కానీ కేవలం అప్రమత్తతను కోల్పోవడం వల్లే వేగంగా వెళ్లే వాహనాలను 'అదుపు' చేయలేకపోతున్నట్లు రహదారి భద్రతా నిపుణులు విశ్లేషిస్తున్నారు. రోడ్డు భద్రతపైన వాహనదారుల్లో అవగాహన కల్పించేందుకు ప్రత్యేకమైన కార్యక్రమాలు లేకపోవడం, ఔటర్‌పైన నిరంతర నిఘా కొరవడడంతోనూ వరుస ప్రమాదాలు జరుగుతున్నాయి.



మోటారు వాహన నిబంధనల మేరకు వాహనాల వేగం గంటకు ఇలా ఉండాలి..

వాహనం	ఎక్స్‌ప్రెస్ హైవే	జాతీయ రహదారి	రాష్ట్ర రహదారి	మున్సిపల్ రోడ్డు
9 సీట్ల సామర్థ్యం	120	100	70	70
10 సీట్ల కంటే ఎక్కువ	100	90	60	60
సరుకు రవాణా వాహనాలు	80	80	60	60
బైక్‌లు	80	80	60	60



ఏమరుపాటుగా ఉండకపోవడంతోనే పెద్ద ప్రమాదం..

- ఔటర్‌పై ప్రతి రోజు 80 వేల నుంచి సుమారు లక్ష వరకు వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. వీటిలో 40 శాతం వరకు వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భారీ, మధ్యతరహా సరుకు రవాణా వాహనాలు ఉంటే 60 శాతానికి పైగా కార్లే ఉన్నాయి. ప్రస్తుతం అన్ని వాహనాల్లో స్పీడ్ పెరిగింది. భారీ వాహనాలు, లారీలు, తదితర వాహనాల్లో వేగ నియంత్రణకు స్పీడ్ గవర్నర్‌లు సైతం ఉంటాయి. కానీ వెయ్యి కిలోల నుంచి 1500 కిలోల వరకు బరువు కలిగిన కార్లు మాత్రమే అపరిమితమైన వేగంతో దూసుకెళ్లేవిధంగా డిజైన్ చేశారు. 8 లేన్‌లతో, 20 చోట్ల ఇంటర్‌ఛేంజ్‌లతో కూడిన ఔటర్‌పై వంద కి.మీ కనీస వేగంతో వెళ్లే వాహనాలు ఒక సెకన్‌కు 40 మీటర్ల చొప్పున 3 సెకన్లలో 120 మీటర్ల వరకు వెళ్తాయి.
- ఈ లెక్కన ఒక వాహనానికి మరో వాహనానికి మధ్య 3 సెకన్ల దూరం ఉంటుంది. కేవలం ఈ మూడు సెకన్ల కాలంలో ఏ మాత్రం నిర్లక్ష్యంగా ఉన్నా వాహనాలు ఢీకొనే అవకాశం ఉంటుంది. మొబైల్ ఫోన్‌లో ఏదైనా మెసేజ్ చూడడం, వాటర్ బాటిల్ చేతిలోకి తీసుకోవడం, బండి జీపీఎస్‌ను గమనించడం, వెనుక సీట్లో ఉన్న ప్రయాణికుల వైపు తిరిగి చూడడం వంటి ఏ చిన్న పొరపాట్లు జరిగినా డ్రైవర్లు తాము నడిపే వాహనంపైన అదుపు తప్పే అవకాశం ఉంటుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. 'బండి నడిపే సమయంలో ప్రతి సెకన్‌కు సీన్ మారుతుంది. రోడ్డుపై చిన్న గుంత ఉండవచ్చు. వాహనాలను ఓవర్‌టేక్ చేయాల్సిరావచ్చు. మరేదైనా ఆటంకం ఉండొచ్చు. వాటిని గమనించకపోతే ముప్పు ముంచుకొచ్చినట్లే'నని ఉప రవాణా కమిషనర్, రహదారి భద్రతా నిపుణులు డాక్టర్ పుప్పాల శ్రీనివాస్ తెలిపారు. ఇటీవల కాలంలో మద్యం తాగి నడపడం, మొబైల్ ఫోన్లలో మాట్లాడడం, కునికిపాట్లు పడుతూ బండి నడపడం వంటి నిర్లక్ష్యం కారణంగానే ఎక్కువ ప్రమాదాలు జరిగినట్లు తమ అధ్యయనంలో వెల్లడైందన్నారు.

ఏ రోడ్డుపైన ఎంత వేగం..

మోటారు వాహన నిబంధనల మేరకు వాహనం బరువు, రోడ్డు ప్రమాణాలను బట్టి వేగం మారుతుంది. డ్రైవర్‌తో పాటు 8 సీట్ల సామర్థ్యం కలిగిన వాహనాలు ఎక్స్‌ప్రెస్ హైవేలపై గంటకు 120 కి.మీ వేగంతో వెళ్లవచ్చు. డ్రైవర్‌తో పాటు 9 సీట్ల కంటే ఎక్కువ ఉన్న వాహనాలు 100 కి.మీ వేగానికి పరిమితం కావాలి. సరుకు రవాణా చేసే డీసీఎంలు, లారీలు తదితర వాహనాలు 80 కి.మీ వేగంతో వెళ్లాలి, బైక్‌లు కూడా గంటకు 80 కి.మీ వేగంతో వెళ్లవచ్చు. జాతీయ, రాష్ట్ర, నగర రహదారులపై ఈ వేగం ఇంకా తగ్గుతుంది.

అప్రమత్తంగా ఉంటే చాలు



ఎప్పుడైనా సరే ప్రమాదాలు రెప్పపాటు క్షణంలోనే జరుగుతాయి. బండి నడిపే సమయంలో ఆ రెప్పపాటు క్షణమే ఎంతో కీలకమైంది. ప్రతి క్షణం అప్రమత్తంగా ఉంటే ప్రమాదాల బారిన పడకుండా ఉండొచ్చు.

- డాక్టర్ పుప్పాల శ్రీనివాస్, ఉప రవాణా కమిషనర్

భారీగా డీసీల బదిలీలు

26 మందికి స్థానచలనం



సాక్షి, సిటీబ్యూరో: త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా జీహెచ్‌ఎంసీలో బదిలీల పరంపర కొనసాగుతోంది. ఇప్పటికే కమిషనర్, జోనల్ కమిషనర్ల బదిలీలు జరగ్గా.. తాజాగా సర్కిళ్ల డిప్యూటీ కమిషనర్ల (డీసీ) అంతర్గత బదిలీలు జరిగాయి. ఈ మేరకు కమిషనర్ రోనాల్డ్‌రాస్ ఉత్తర్వులు జారీ చేశారు. డీసీల ప్రస్తుత స్థానాలు బదిలీ అయిన స్థానాల వివరాలిలా ఉన్నాయి. కాప్రా సర్కిల్ డీసీగా ఉన్న ఎన్.శంకర్‌ను బేగంపేట డీసీగా బదిలీ చేశారు. బేగంపేట డీసీగా ఉన్న ముకుందరెడ్డి చందానగర్‌కు బదిలీ అయ్యారు. చందానగర్ డీసీ సుధాంశ్ సికింద్రాబాద్ సర్కిల్‌కు, సికింద్రాబాద్‌లో ఉన్న టి.దశరథ్‌ను ఎల్‌బీనగర్ సర్కిల్ డీసీగా బదిలీ చేశారు. ఉప్పల్ డీసీగా ఉన్న అరుణకుమారిచరణ్‌ను సరూర్‌నగర్ డీసీగా బదిలీ చేశారు. హయత్‌నగర్ డీసీగా ఉన్న ఎ.మారుతీ దివాకర్‌ను అంబర్‌పేటకు బదిలీ చేశారు. చార్మినార్ డీసీ ఎస్.సూర్యకుమార్‌ను అల్వాల్‌కు, రాజేంద్రనగర్ డీసీ డి.జగన్‌ను మెహిదీపట్నంకు, కార్వాన్ డీసీ బి.శ్రీనివాస్‌ను ఉప్పల్‌కు బదిలీ చేయడంతోపాటు కాప్రా సర్కిల్‌కు ఎఫ్ఏసీగా కూడా నియమించారు. జూబ్లీహిల్స్ డీసీ జి.రజనీకాంత్‌రెడ్డిని శేరిలింగంపల్లికి, యూసుఫ్‌గూడ డీసీ ఎ.రమేశ్‌ను మూసాపేటకు బదిలీ చేశారు. అక్కడ ఉన్న కె.రవికుమార్‌ను రాజేంద్రనగర్ డీసీగా బదిలీ చేశారు. రామచంద్రాపురం–పటాన్‌చెరు డీసీ డి.బాలయ్యను గోషామహల్‌కు, అక్కడ ఉన్న డి.డాకు నాయక్‌ను చార్మినార్ డీసీగా, కూకట్‌పల్లి డీసీ పి.రవీంద్రకుమార్‌ను హయత్‌నగర్‌కు బదిలీ చేశారు. గాజుల రామారం డీసీ వి.ప్రశాంతిని జూబ్లీహిల్స్‌కు బదిలీ చేశారు. ఎల్‌బీనగర్ డీసీ హెచ్. కృష్ణయ్యను కూకట్‌పల్లి సర్కిల్‌కు బదిలీ చేశారు. శేరిలింగంపల్లి జోన్‌లో జాయింట్ కమిషనర్‌గా ఉన్న ఎల్‌పీ మల్లయ్యను గాజుల రామారం డీసీగా నియమించారు.

ఇతర ప్రాంతాల నుంచి బల్దియాలోకి వచ్చిన వారికి..

పోచారం మున్సిపల్ కమిషనర్‌గా ఉంటూ ఇటీవల జీహెచ్‌ఎంసీకి తిరిగి వచ్చిన ఎ.సురేష్‌ను రామచంద్రాపురం–పటాన్‌చెరు డీసీగా, ఇబ్రహీంపట్నం మున్సిపల్ కమిషనర్‌గా ఉంటూ జీహెచ్‌ఎంసీకి బదిలీ అయిన మహ్మద్‌యూసుఫ్‌ను కార్వాన్ డీసీగా, జీహెచ్‌ఎంసీకి బదిలీపై వచ్చిన సంగారెడ్డి మున్సిపల్ కమిషనర్ చంద్రశేఖర్‌ను యూసుఫ్‌గూడ డీసీగా, నార్సింగి నుంచి జీహెచ్‌ఎంసీకి బదిలీ అయిన సి.సత్యబాబును కుత్బుల్లాపూర్ డీసీగా నియమించారు.

సర్కిళ్ల నుంచి ప్రధాన కార్యాలయానికి..

అంబర్‌పేట డీసీ కె. వేణుగోపాల్, అల్వాల్ డీసీ నాగమణి, మెహిదీపట్నం డీసీ ఎంకేఐ అలీలతో పాటు మరో డీసీ ఎం.మంగతాయారును ప్రధాన కార్యాలయానికి బదిలీ చేస్తూ కమిషనర్‌కు రిపోర్టు చేయాల్సిందిగా పేర్కొన్నారు.

జిల్లా ఎన్నికల అధికారిగా జీహెచ్‌ఎంసీ కమిషనర్

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారిగా గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్‌ఎంసీ) కమిషనర్ రొనాల్డ్ రాస్ నియమితులయ్యారు. మంగళవారం ఎన్నికల సంఘం (ఈసీ) ఈ మేరకు అధికారులను నియమిస్తూ నోటిఫికేషన్ జారీ చేసింది. రంగారెడ్డి, మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలకు ఎన్నికల అధికారులుగా ఆయా జిల్లాల కలెక్టర్లు వ్యవహరించనున్నారు. అదనపు కలెక్టర్లు, ఆర్డీఓలు, జీహెచ్‌ఎంసీ డిప్యూటీ కమిషనర్లు, మున్సిపల్ కమిషనర్లు, డిప్యూటీ కలెక్టర్లు ఈఆర్వోలుగా వ్యవహరించనున్నట్లు ఈసీ ఉత్తర్వుల్లో పేర్కొంది.

మనోజ్ కస్టడీకి కోర్టు అనుమతి

శామీర్‌పేట్: ఎయిర్ గన్ కాల్పుల ఘటనలో నిందితుడు మనోజ్ కస్టడీకి కోర్టు అనుమతి ఇచ్చింది. ఈ నెల 15న శామీర్‌పేట పరిధిలోని సెలెబ్రిటీ విల్లాలో స్మిత మాజీ భర్త సిద్ధార్థ్ దాస్‌పై సినీనటుడు మనోజ్ ఎయిర్‌గన్‌తో కాల్పులు జరిపిన విషయం తెలిసిందే. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన శామీర్‌పేట పోలీసులు గత ఆదివారం న్యాయమూర్తి ముందు హాజరుపర్చగా కోర్టు 14 రోజుల రిమాండ్ విధించింది. తదుపరి విచారణ నిమిత్తం శామీర్‌పేట పోలీసులు మేడ్చల్ న్యాయస్థానంలో అనుమతి కోరగా, మూడు రోజుల రిమాండ్ అనుమతిని ఇస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో శామీర్‌పేట పోలీసులు బుధవారం మనోజ్‌ను చర్లపల్లి జైలు నుంచి కస్టడీకి తీసుకొని విచారణ జరపనున్నారు.

65 ఏళ్ల మహిళకు అరుదైన శస్త్ర చికిత్స



ఎముకకు స్టెంట్ వేసిన కిమ్స్ వైద్యులు

గచ్చిబౌలి: నగర వైద్య చరిత్రలోనే తొలిసారిగా 65 ఏళ్ల మహిళకు వెన్నెముకలో స్టెంటింగ్ వేశారు. కొండాపూర్‌లోని కిమ్స్ ఆస్పత్రి వైద్యులు. ప్రముఖ వెన్నెముక శస్త్రచికిత్స నిపుణులు డాక్టర్ కృష్ణచైతన్య ఈ అరుదైన చికిత్స చేశారు. అచ్చం గుండెకు స్టెంట్ వేసినట్లే ఎముకకు సైతం మెటల్ స్టెంట్ వేయడం ద్వారా రోగికి ఊరట కల్పించారు. కిమ్స్ ఆస్పత్రి కన్సల్టెంట్ స్పైన్ సర్జన్ డాక్టర్ కృష్ణచైతన్య మాట్లాడుతూ.. గత నెలలో ఓ మహిళ ఇంట్లో నేలపై పడిపోయింది. విపరీతంగా వెన్నునొప్పితో బాధ పడుతూ.. కనీసం నడిచే స్థితిలో లేకపోవడంతో స్థానిక వైద్యుల వద్దకు వెళ్లగా దీర్ఘకాలం విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. దాంతో ఆమెకు గ్యాస్ట్రైటిస్, ఊపిరి అందకపోవడం లాంటి సమస్యలు వచ్చాయి. ఆ సమయంలో కిమ్స్ ఆస్పత్రిలోని కన్సల్టెంట్ గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్ డాక్టర్ సృజన్ వద్దకు వెళ్లగా.. ఆయన తన వద్దకు పంపడంతో వెన్నెముక విరిగిన విషయం గుర్తించానని డాక్టర్ కృష్ణచైతన్య చెప్పారు. బాధితురాలికి మత్తు మందు ఇచ్చి ఆపరేషన్ చేయడం ముప్పుతో కూడుకున్నదని, సెడేషన్ మాత్రం ఇచ్చి స్టెంటింగ్ చేయాలని నిర్ణయించామన్నారు. ఆస్టియోపోరోటిక్ ఫ్రాక్చర్లు, ఇతర చిన్నపాటి సమస్యలు ఉన్న పెద్ద వయసువారికి వెన్నెముకలోని ఎముకలు విరిగితే ఈ చికిత్స చాలా ఉపయోగకరమన్నారు. సాధారణంగా శస్త్ర చికిత్స చేసే 3–4 గంటలు పట్టడంతో పాటు రక్తస్రావం కూడా ఎక్కువగా ఉంటుందన్నారు. అలాంటి శస్త్ర చికిత్సల్లో అయితే స్క్రూలు బిగిస్తామన్నారు, దాని వల్ల కోలుకోవడానికి కూడా చాలా నెలలు పడుతుందన్నారు. కానీ ఈ ప్రక్రియలో స్టెంట్‌ను కేవలం ఒక చిన్న ఇంజెక్షన్ రంధ్రం ద్వారా పంపించినట్లు ఆయన తెలిపారు. ఇది లోపలకు వెళ్లి ఎముక వద్ద విస్తరిస్తుందన్నారు. దానివల్ల ఎముక తన సాధారణ స్థితికి వచ్చేస్తుందన్నారు. ఎలాంటి నొప్పి కూడా లేకపోవడంతో ఆపరేషన్ అయిన కొద్ది గంటలకే రోగి లేచి నడవగలిగారని వివరించారు.

త్రివేండ్రం 'సొత్తు'... నగరంలో తాకట్టు!

- దైవ దర్శనానికి వెళ్లి రెక్కీ చేసిన ఉమా ప్రసాద్
- మరో 'ట్రిప్'లో రెండు ఇళ్లల్లో భారీ దొంగతనం
- చోరీ సొత్తులో కొంత సికింద్రాబాద్‌లో విక్రయం
- నిందితుడిని అరెస్టు చేసిన తిరువనంతపురం కాప్స్
- రికవరీ కోసం ఇక్కడకు తీసుకువచ్చిన పోలీసులు



సాక్షి, సిటీబ్యూరో: అతడి పేరు సంపతి ఉమా ప్రసాద్. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఇతగాడికి పరశురాముడు అంటే మహా ప్రీతి. కేరళలో ఉన్న ఆ ఆలయానికి వెళ్లిన ఇతడి కన్ను రెండు ఇళ్లపై పడింది. రెండోసారి తీరిగ్గా విమానంలో అక్కడకు చేరుకుని ఆ రెండింటిలోనూ పంజా విసిరాడు. ఆ సొత్తులో కొంత హైదరాబాద్ తీసుకువచ్చి తాకట్టు పెట్టాడు. 'కాపుకాసి' ప్రసాద్‌ను అరెస్టు చేసిన త్రివేండ్రం పోలీసులు చోరీ బంగారం రికవరీ కోసం సోమవారం నగరానికి తీసుకువచ్చారు. సికింద్రాబాద్‌లోని ఓ వ్యాపారి నుంచి 457 గ్రాములు సీజ్ చేసి మంగళవారం తిరిగి వెళ్లారు.

దైవ దర్శనానికి వెళ్లి రెక్కీ చేసి...

తూర్పుగోదావరి జిల్లాకు చెందిన ఉమా ప్రసాద్ ఇంటర్మీడియట్ వరకే చదివాడు. పరశురాముడిని అమితంగా ఆరాధించే ప్రసాద్ తిరువల్లంలో పరశురాముడి గుడి ఉందని తెలుసుకుని..ఈ ఏడాది మే 28న మొదట త్రివేండ్రం వెళ్లాడు. దర్శనం అనంతరం తిరిగి వస్తుండగా అక్కడి మనకాడ్, మంచియూర్ ప్రాంతాల్లో ఉన్న రెండు ఇళ్లపై కన్ను పడింది. ఖరీదైన ప్రాంతంలో ఉన్న వాటిలో చోరీ చేయడం చాలా తేలికని భావించాడు. దీంతో వాటి చుట్టుపక్కల ప్రాంతాల్లో రెక్కీ చేసుకుని విమానంలో గత నెల 2న హైదరాబాద్ చేరుకున్నాడు.

నాలుగు రోజుల్లోనే మళ్లీ వెళ్లి...

సికింద్రాబాద్‌లోని ఓ లాడ్జిలో బసచేసిన ఇతడు ఆ రెండు ఇళ్లల్లోనూ చోరీ చేయడానికి గత నెల 6న విమానంలో త్రివేండ్రం వెళ్లాడు. అక్కడ విమానాశ్రయం సమీపంలో ఉన్న ఓ హోటల్‌లో బస చేశాడు. అదును చూసుకుని జూన్ 19న ఒక ఇంట్లో, 28న మరో ఇంట్లో పంజా విసిరాడు. రెండు సందర్భాల్లోనూ జాకెట్, టోపీ, గ్లౌజులు వాడటంతో పోలీసులకు ఎలాంటి క్లూ లభించలేదు. ఆ ఇళ్లకు సమీపంలో అనేక సీసీ కెమెరాలను వడపోసినా ఆశించిన ఫలితం రాలేదు. దాదాపు రూ.60 లక్షల విలువైన బంగారు, వజ్రాభరణాలు చోరీ చేసిన ప్రసాద్ వాటిలో కొన్ని త్రివేండ్రంలోనే ఓ బంగారం వ్యాపారికి విక్రయించి హోటల్ బిల్లుల చెల్లింపు, ఇతర ఖర్చులు కోసం వాడుకున్నాడు. మరికొంత అక్కడి విమానాశ్రయం సమీపంలో ఉన్న ఓ వంతెన కింద గోయ్యి తవ్వి దాచాడు.

క్లూ ఇచ్చిన 'భవిష్యత్తు ప్రణాళిక'...

ఈ రెండు కేసులనూ సవాల్‌గా తీసుకున్న త్రివేండ్రం పోలీసులు వివిధ కోణాల్లో దర్యాప్తు చేశారు. ఘటనాస్థలికి దాదాపు రెండు కిలోమీటర్ల పరిధిలో ఉన్న సీసీ కెమెరాల్లో నమోదైన ఫీడ్ సేకరించి విశ్లేషించారు. ఈ నేపథ్యంలోనే ప్రసాద్ మంచియూర్‌లో చోరీ చేసిన ఇంటికి కొంత దూరంలో ఓ ఆటో ఎక్కినట్లు కనిపించింది. ఆటో నెంబర్ ఆధారంగా డ్రైవర్‌ను గుర్తించి ప్రశ్నించారు. అతడు ప్రసాద్ బస చేసిన హోటల్ వద్దకు పోలీసులకు తీసుకువెళ్లాడు. నకిలీ గుర్తింపులతో బస చేయడంతో చోరుడికి సంబంధించి ఎలాంటి ఆధారాలు పోలీసులకు చిక్కలేదు. అయితే తాను హైదరాబాద్ వెళ్తున్నానని, జూలై 5న మరోసారి హోటల్‌లో బస చేయడానికి వస్తానని, ఫోన్ చేయగానే విమానాశ్రయానికి కారు పంపాలని తమకు చెప్పినట్లు దాని నిర్వాహకులు క్లూ ఇచ్చారు.

ఎయిర్‌పోర్టులో మాటు వేసి అరెస్టు..

దీంతో త్రివేండ్రం పోలీసులు ఈ నెల 5న అక్కడి విమానాశ్రయంలో హోటల్ సిబ్బందితో కలిసి మాటు వేశారు. హైదరాబాద్ నుంచి వచ్చిన విమానంలో దిగిన ప్రసాద్‌ను గుర్తించి పట్టుకున్నారు. ఇతడు త్రివేండ్రంలో అమ్మిన, వంతెన కింద పాతి పెట్టిన సొత్తు స్వాధీనం చేసుకున్నారు. చోరీ సొత్తులో 457 గ్రాముల బంగారాన్ని సికింద్రాబాద్‌కు చెందిన వ్యాపారి వద్ద తాకట్టు పెట్టినట్లు విచారణలో బయటపెట్టాడు. దీంతో ప్రసాద్‌ను తీసుకుని సిటీకి వచ్చిన త్రివేండ్రం పోలీసులు ఆ సొత్తునూ రికవరీ చేశారు. త్రివేండ్రం ఫోర్ట్ పోలీసుస్టేషన్ ఇన్‌స్పెక్టర్ జె.రాకేష్ 'సాక్షి'తో మాట్లాడుతూ... 'ఆ రెండు ఇళ్లను చూసే వరకు ప్రసాద్‌కు చోరీ చేయాలనే ఆలోచన లేదు. వాటిలో కనిపించిన లోపాలు ఇతడిని ఆకర్షించాయి. జూన్ 6న హైదరాబాద్ నుంచి వచ్చిన ఇతడు తన వెంట ఐరన్ కట్టర్, రాడ్, కత్తి తదితరాలు తన వెంట తెచ్చుకున్నాడు. మరో ఇంట్లో చోరీ చేయడానికే ఈ నెల 5న మరోసారి వచ్చి ఉంటాడని అనుమానిస్తున్నాం' అని పేర్కొన్నారు.

చైన్ స్నాచర్ల అంతర్రాష్ట్ర ముఠా అరెస్ట్

- ఒకే రోజు ఐదు నేరాలు
- రూ.5.75 లక్షల సొత్తు స్వాధీనం



స్నాచింగ్ కేసు వివరాలను వెల్లడిస్తున్న మాదాపూర్ డీసీపీ శిల్పవల్లి

గచ్చిబౌలి: ఒకే రోజు ఐదు నేరాలకు పాల్పడిన చైన్ స్నాచర్ల అంతర్రాష్ట్ర ముఠాను అరెస్ట్ చేసినట్లు మాదాపూర్ డీసీపీ శిల్పవల్లి తెలిపారు. మంగళవారం గచ్చిబౌలిలోని మాదాపూర్ డీసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేసు ఆమె వివరాలను వెల్లడించారు. ప్రేమ్‌నగర్, జోగేశ్వరీ ఈస్ట్, ముంబైకి చెందిన ఆటో డ్రైవర్ అమ్జద్ ఇక్బాల్ షేక్ (36), స్విగ్గీ డెలివరీ బాయ్ నురైన్ షౌకత్ హుస్సేన్ ఖాన్(36)లు జూలై 13న ఆర్సీపురం పీఎస్ లిమిట్స్‌లో ఉదయం 11.30 గంటల సమయంలో పల్సర్ బైక్ చోరీ చేశారు. అదే బైక్‌పై నురైన్ డ్రైవ్ చేస్తుండగా వెనకాల అమ్జద్ ఇక్బాల్ షేక్ ఉన్నాడు. మధ్యాహ్నం 12.30 గంటల సమయంలో మియాపూర్ పీఎస్‌పరిధిలోని దీప్తిశ్రీనగర్‌లో టెంపుల్‌కు వెళ్లి వస్తున్న మహిళ మెడలో గొలుసు లాగేందుకు ప్రయత్నింగా చేతికి చిక్కలేదు. మధ్యాహ్నం 1.15 గంటలకు చందానగర్ పీఎస్ పరిధిలోని హుడా ట్రేడ్ సెంటర్ వద్ద స్కూల్ నుంచి మనువరాలిని తీసుకొస్తుండగా వృద్ధురాలి మెడలోని 5 తులాల బంగారు పుస్తెలతాడును లాక్కెళ్లారు. అక్కడి నుంచి నేరుగా సంగారెడ్డికి వెళ్లి.. సాయంత్రం 6.30 గంటలకు చైన్ స్నాచింగ్‌కు యత్నించగా ఫలించలేదు. అక్కడి నుంచి నేరుగా మియాపూర్ డిమార్ట్ వైపు వచ్చారు. రాత్రి 7.30 గంటల సమయంలో నడుచుకుంటూ వెళుతున్న మహిళ మెడలోని 3 తులాల బంగారు గొలుసులాక్కెళ్లారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు బైక్ చోరీ చేసిన వారే స్నాచింగ్‌లకు పాల్పడినట్లుగా గుర్తించారు. సీసీ ఫుటేజీల ఆధారంగా ఏ1 అమ్జద్ ఇక్బాల్, ఏ2 నురైన్ షౌకత్ హుస్సేన్‌లను అరెస్ట్ చేశారు. చోరీ సొత్తును కొనుగోలు చేసిన ముంబైకి చెందిన విజయ్ కమల్‌కాంత్ యాదవ్(36), స్నాచింగ్‌ల కోసం నిందితులను తీసుకొచ్చిన సంగారెడ్డిలో నివాసముండే ముంబైకి చెందిన అంబ్రాయిడరీ వర్క్ చేసే తన్వీర్ ఖాన్(37)లను అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపారు. నిందితుల నుంచి రూ.8.75 లక్షల విలువైన 8 తులాల బంగారు ఆభరణాలు, పల్సర్ బైక్, స్కూటీలను స్వాధీనం చేసుకున్నారు. విలేకరుల సమావేశంలో అడిషనల్ డీసీపీ నంద్యాల నర్సింహారెడ్డి, ఏసీపీ నర్సింహారావు, సీఐలు శ్రీనివాస్ రావు, పాలవెల్లి, ప్రేమ్‌కుమార్, వెంకటేశం, నరేందర్ రెడ్డి, కాంతారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిందితులంతా పాత నేరస్తులే....

ఏ1 అమ్జద్ ఇక్బాల్ షేక్‌పై అత్యాచారం కేసుతో పాటు 14 కేసులు ఉండగా హైదరాబాద్‌లో 2, మహారాష్ట్రలో 12 కేసుల్లో నిందితునిగా ఉన్నాడు. నురైన్ షౌకత్ హుస్సేన్ ఖాన్‌పై 2021లో అఫ్జల్‌గంజ్ పీఎస్‌లో కేసు నమోదైంది. తన్వీర్ ఖాన్, విజయ్ కమల్‌కాంత్ యాదవ్‌పై ముంబైలో మర్డర్ కేసు ఉంది. తాజాగా చందానగర్‌లో ఒకటి, మియాపూర్‌లో రెండు, ఆర్సీపురం, సంగారెడ్డిలో ఒక్కో కేసు నమోదైంది.

గాజుల వ్యాపారం ముసుగులో గంజాయి తరలింపు

ముఠాను అరెస్టు చేసిన పోలీసులు



వివరాలు తెలుపుతున్న డీసీపీ జగదీశ్వర్‌రెడ్డి

రాజేంద్రనగర్: గాజుల వ్యాపారం ముసుగులో గంజాయిని తరలిస్తున్న ఓ ముఠాను మైలార్‌దేవ్‌పల్లి పోలీసులు, రాజేంద్రనగర్ ఎస్‌ఓటీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 80 కిలోల ఎండు గంజాయి, ఐదు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. రాజేంద్రనగర్ డీసీపీ జగదీశ్వర్‌రెడ్డి మంగళవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఒడిశాలోని బీరంపూర్ ప్రాంతానికి చెందిన యేశోరిబాయ్ గంజాయి స్మగ్లర్. ఒడిశాలోని వివిధ ప్రాంతాల్లో సాగు చేసే గంజాయిని కొనుగోలు చేసి ఇతర రాష్ట్రాలకు సరఫరా చేస్తుంటుంది. ఈ క్రమంలో పరిచయమైన మహారాష్ట్రలోని బీడ్ జిల్లాకు చెందిన అప్పాగులాబ్ పాండే(22)తో జతకట్టి వీరిద్దరు గాజుల వ్యాపారం పేరుతో గంజాయిని స్మగ్లింగ్ చేస్తున్నారు. ఈమేరకు ఒక కుటుంబం వలే ఇద్దరు మహిళలు, ముగ్గురు పురుషులు కలిసి 80 కిలోల గంజాయిని నాలుగు సంచుల్లో ప్యాక్ చేసి పైన మొత్తం గాజులను ఉండేలా ప్యాక్ చేశారు. పూర్తిగా బస్సు, రైలు మార్గం గుండా కాకుండా ఒడిశా నుంచి లారీలు, డీసీఎంలు, ఆర్టీసీ బస్సులు మారుతూ నగరానికి చేరారు. మంగళవారం ఉదయం డీసీఎం వాహనంలో కాటేదాన్ ప్రాంతంలో గులాబ్ పాండేతో పాటు అర్జున్ అలియాస్ ఆశోక్, సంతోష్ శివాజీ పాండే, సల్మాబేగం, స్వప్న గంగాధర్‌లు గంజాయి సంచులతో రోడ్డు పక్కన నిలబడి ఉండగా సమాచారం అందుకున్న రాజేంద్రనగర్ ఎస్‌ఓటీ, మైలార్‌దేవ్‌పల్లి పోలీసులు వారిని పట్టుకుని తనిఖీ చేయగా గంజాయి రవాణా చేస్తున్నట్లు వెల్లడైంది. దీంతో స్టేషన్‌కు తీసుకువచ్చి పరిశీలించగా రెండేసి కిలోల చొప్పున ప్యాక్ చేసిన 40 గంజాయి ప్యాకెట్లు, ఐదు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఐదుగురిని అరెస్టు చేసి మంగళవారం రిమాండ్‌కు తరలించారు.

మరో కేసులో...

మరో ఘటనలో..ఏపీలోని అల్లూరి సీతారామరాజు జిల్లా ముచ్చంగపుట్ మండలానికి చెందిన బి.సురేంద్ర, ఆనంద్‌రావులు జతకట్టి అక్రమంగా డబ్బు సంపాదించాలనే యోచనతో గంజాయితో తయారు చేసే హష్ ఆయిల్‌ను నగరానికి తీసుకువచ్చి విక్రయిస్తున్నారు. ఇందులో భాగంగా సురేంద్ర హైదరాబాద్‌లోని వ్యక్తికి హష్ ఆయిల్‌తో పాటు గంజాయిని అందించాలని చెప్పగా ఆనంద్‌రావు అదే ప్రాంతానికి చెందిన ఎం.రాధాకృష్ణ, ఎస్.బాలకృష్ణతో కలిసి సురేంద్ర నుంచి రెండు లీటర్ల హష్ ఆయిల్, ఎండు గంజాయిని తీసుకోని సోమవారం రాత్రి బయలుదేరాడు. మంగళవారం తెల్లవారుజామున రాజేంద్రనగర్ ఓఆర్ఆర్ ప్రాంతానికి చేరుకున్నారు. విషయం తెలుసుకున్న రాజేంద్రనగర్ ఎస్‌ఓటీ, రాజేంద్రనగర్ పోలీసులు ఓఆర్ఆర్ వద్ద ముగ్గురుని అదుపులోకి హష్ ఆయిల్, ఎండు గంజాయి స్వాధీనం చేసుకున్నారు.

తిరుమలగిరి ఠాణాలో ఏసీబీ దాడులు

- ఇన్‌స్పెక్టర్ శ్రవణ్‌కుమార్‌ను విచారించిన బృందం
- సీఆర్పీసీ 41ఏ నోటీసులు జారీ చేసిన అధికారులు

రసూల్‌పుర: ఉత్తర మండల పరిధిలోని తిరుమలగిరి పోలీసుస్టేషన్‌పై అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు మంగళవారం దాడి చేశారు. తుపాకీ లైసెన్స్ రెన్యువల్ విషయంలో ఇన్‌స్పెక్టర్ బి.శ్రవణ్ కుమార్ లంచం డిమాండ్ చేశారన్న ఆరోపణపై ఆయన్ను విచారించారు. సాయంత్రం మొదలైన ఈ విచారణ, సోదాలు రాత్రి వరకు కొనసాగాయి. ఏసీబీ చట్టం ప్రకారం నమోదైన కేసులో శ్రవణ్‌ను నిందితుడిగా పరిగణించిన అధికారులు ఆయనకు సీఆర్పీసీ 41ఏ సెక్షన్ కింద నోటీసులు జారీ చేశారు. తిరుమలగిరిలో నివసించే రవి అనే వ్యక్తికి గన్‌లైసెన్స్ ఉంది. దీని గడువు ఏప్రిల్‌లో ముగియడంతో రెన్యువల్ కోసం ఆయన ప్రయత్నిస్తున్నారు. ప్రస్తుతం నగర కమిషనరేట్‌లో తుపాకీ లైసెన్సుల రెన్యువల్ విధానాన్ని ఉన్నతాధికారులు కట్టుదిట్టం చేశారు. రవి దాదాపు నెల రోజుల క్రితం రెన్యువల్ కోసం స్థానిక ఠాణాలో దరఖాస్తు చేసుకున్నారు. దీన్ని ఉన్నతాధికారులకు ఫార్వర్డ్ చేయడానికి శ్రవణ్ రూ.20 వేలు లంచం డిమాండ్ చేశారన్నది ప్రధాన ఆరోపణ. ఈ అంశంపై ఇరువురి మధ్యా పలుమార్లు బేరసారాలు కూడా జరిగాయి. దీనికి సంబంధించిన ఆడియో, వీడియోలను రవి రికార్డు చేశారు. వీటి ఆధారంగా అవినీతి నిరోధక శాఖకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు అవినీతి నిరోధక చట్టం కింద కేసు నమోదు చేసుకున్న ఏసీబీ అధికారులు దర్యాప్తు చేపట్టారు. ఇందులో భాగంగా మంగళవారం సాయంత్రం ఏసీబీ డీఎస్పీ శ్రీకాంత్ నేతృత్వంలోని బృందం తిరుమలగిరి పోలీసుస్టేషన్‌పై దాడి చేసింది. ఠాణాను తమ ఆధీనంలోని తీసుకున్న అధికారులు రవికి సంబంధించిన ఫైలుతో పాటు ఇతర రికార్డులు పరిశీలించారు. ఆడియో, వీడియో ఆధారాలు ఉండటంతో శ్రవణ్‌ను విచారించారు. తాను లైసెన్సు రెన్యువల్ ఫైల్‌ను గతంలోనే ఉన్నతాధికారులకు పంపినట్లు ఆయన ఏసీబీ అధికారులకు చెప్పారు. దీంతో ఆ తేదీలు, లంచం డిమాండ్ చేసిన తేదీలు తదితరాలను పరిశీలించి పంచనామా రాశారు. సుదీర్ఘ విచారణ అనంతరం శ్రవణ్‌కు నోటీసులు జారీ చేశారు. ఏసీబీ అధికారులు ఆయన ఫోన్, ల్యాప్‌టాప్ తదితరాలను పరిశీలించారు.

గంధపు చెక్కల విక్రేతల అరెస్టు

రాజేంద్రనగర్: గంధపు చెక్కలను విక్రయించేందుకు ప్రయత్నిస్తున్న ఇద్దరు వృద్ధులతో పాటు ఓ యువకుడిని మైలార్‌దేవ్‌పల్లి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 20 కిలోల గంధపు చెక్కలను స్వాధీనం చేసుకున్నారు. లక్ష్మీగూడకు చెందిన యాదగిరి, శ్రీనివాస్, ఫజల్‌ల వద్ద గంధపు చెక్కలు ఉన్నాయని పోలీసులకు సమాచారం అందింది. దీంతో మంగళవారం ఉదయం వారిని అదుపులోకి తీసుకోని 20 కిలోల గంధపు చెక్కలను స్వాధీనం చేసుకున్నారు. ఎక్కడ నుంచి తెచ్చారు, ఎవరికి విక్రయించారు తదితర వాటిపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

జాతీయ పోటీలకు ఎంపికైన విద్యార్థినికి అభినందన



సాక్షి, సిటీబ్యూరో: జాతీయ ఆర్చరీ స్పోర్ట్స్ మీట్‌కు ఎంపికైన కంచన్‌బాగ్‌లోని కేంద్రీయ విద్యాలయం విద్యార్థిని కర్నాటి అక్షిత గౌడ్‌ను మంత్రి డాక్టర్ వి.శ్రీనివాస్ గౌడ్ అభినందించారు. ఈ నెల 14 నుంచి 15 వరకు జరిగిన 52వ కేవీఎస్ రీజనల్ స్పోర్ట్స్ మీట్–2023 ఆర్చరీ చాంపియన్‌షిప్‌లో 20, 30 మీటర్ల విభాగంలో విజేతగా నిలిచిన అక్షిత తన తండ్రితో కలిసి మంగళవారం సచివాలయంలో మంత్రిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గౌడ సంఘం అధ్యక్షులు పల్లె లక్ష్మణ్ రావు గౌడ్, అఖిల భారత గౌడ సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు కురెళ్ళ వేములయ్య గౌడ్, అనంత రాజు గౌడ్, గౌడ సంఘం రాష్ట్ర నాయకులు అనిల్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

23న గ్లోబల్ ఎడ్యుకేషన్ ఫెయిర్

సాక్షి, సిటీబ్యూరో : విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసించాలనుకునే విద్యార్థుల కోసం 'యుని ఎక్స్‌పర్ట్స్' సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 23వ తేదీన నగరంలోని వివంతా వేదికగా 'గ్లోబల్ ఎడ్యుకేషన్ ఫెయిర్ 2023'ను నిర్వహించనున్నారు. యూఎస్ఏ, యూకే, ఆస్ట్రేలియా, కెనడా, దుబాయ్, జర్మనీ తదితర దేశాల్లోని 60కి పైగా విశ్వ విద్యాలయాల్లో అవకాశాలను కల్పించడమే లక్ష్యంగా ఈ గ్లోబల్ ఎడ్యుకేషన్ ఫెయిర్‌ను ఏర్పాటు చేస్తున్నామని మంగళవారం సంస్థ సహ వ్యవస్థాపకులు, కంట్రీహెడ్ ఇతియాజ్ బన్నూరు ప్రకటించారు. నగరంతో పాటు అహ్మదాబాద్, కొచ్చి, విశాఖపట్నం, విజయవాడలలో గ్లోబల్ ఫెయిర్ నిర్వహిస్తున్నామని, విదేశీ విశ్వవిద్యాలయాలు, కళాశాలలో ప్రవేశం కోరుకునే గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్ విద్యార్థులకు అగ్రశ్రేణి అధ్యయన అవకాశాలను ప్రదర్శించనున్నామని అన్నారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన మరింత సమాచారం కోసం https://bit.ly/3COPsfYOసైట్‌ను సందర్శించాలని సూచించారు.

జీఎంఆర్ కార్గో ద్వారా పుణేకు రోడ్డు ఫీడర్

శంషాబాద్: పుణే– హైదరాబాద్ మధ్య ఎగుమతి, దిగుమతి సౌకర్యాన్ని మరింత పెంపొందించేందుకు జీఎంఆర్ కార్గో రోడ్డు రవాణా సర్వీసు ప్రారంభించినట్లు వెల్లడించింది. ఎనిమిదికి పైగా పారిశ్రామిక ప్రాంతాలను కలిగిన పుణేకు 5600 మెట్రిక్ టన్నుల సామర్థ్యం కలిగిన ట్రక్కులను అందుబాటులోకి తీసుకొచ్చారు. ఇవి కేవలం 11 గంటల సమయంలో జీఎంఆర్ కార్గో నుంచి పుణేలోని పింప్రి, చించ్‌వాడ్ చాకన్, భోసారి, రాజ్ నంగ్‌గావ్, హడస్పార్, షిర్వాల్, షిక్రపూర్ వూడే పారిశ్రామికవాడలకు చేరుకుంటాయన్నారు. ఈ సర్వీసులతో ఫార్మా, ఆటోమొబైల్, ఇంజినీరింగ్ తదితర వాణిజ్యరంగాల వ్యాపారాభివృద్ధి తోడ్పడుతుందన్నారు.

పనిఒత్తిడితో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి అదృశ్యం



భగవాన్ (ఫైల్)

భాగ్యనగర్‌కాలనీ: పనిఒత్తిడి కారణంగా ఓ వ్యక్తి ఇంట్లో నుంచి బయటకు వెళ్లి తిరిగిరాని సంఘటన కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం దయాల్‌గూడ ఎలైట్ ఎన్‌క్లేవ్‌లో నివాసముంటున్న భగవాన్ నానక్‌రాంగూడలోని ఓ ప్రముఖ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నాడు. ఇతనికి ఆరు నెలల క్రితమే వివాహమైంది. అయితే ఈ నెల 14వ తేదీన ఉదయం 10 గంటలకు ఇంటి నుంచి బయటకు వెళ్లిన భగవాన్ తిరిగి ఇంటికి రాలేదు. కుటుంబ సభ్యులు చుట్టు పక్కల ప్రాంతాలతో పాటు తెలిసిన వారి వద్ద విచారించినా ఫలితం లేదు. దీంతో కూకట్‌పల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పోలీసు అవుతాడనుకుంటే..

- కానిస్టేబుల్ పరీక్షలో ఉత్తీర్ణుడైన వరప్రసాద్
- బీరు బాటిళ్ల విషయమై కత్తిపోట్లకు గురై మృతి
- కన్నీరుమున్నీరైన తల్లిదండ్రులు, బంధువులు
- నిందితులను శిక్షించాలంటూ మృతదేహంతో రాస్తారోకో



సాయి వరప్రసాద్ (ఫైల్)



ఆదివారం అర్ధరాత్రి ఓ హోటల్ వద్ద సాయి వరప్రసాద్‌పై దాడి చేస్తున్న దృశ్యం (సీసీఫుటేజీ)

మీర్‌పేట: ఎలాగైనా ప్రభుత్వం ఉద్యోగం సాధించి కుటుంబానికి అండగా ఉండాలని కష్టపడి చదివి పోలీసు కానిస్టేబుల్ పరీక్ష రాసి ఉత్తీర్ణుడయ్యాడు.. డాక్యుమెంట్ వెరిఫికేషన్ పూర్తయింది.. త్వరలో ప్రకటించే తుది జాబితాలో కుమారుడు ఎలాగైనా ఉద్యోగం సాధించి ఆసరాగా ఉంటాడనుకున్న ఆ తల్లిదండ్రులకు చివరికి శోకమే మిగిలింది. రోజంతా కళ్లముందే ఉన్న కొడుకు బయటకు వెళ్లిన కాసేపటికే తిరిగిరాని లోకాలకు చేరడంతో వారి వేదనకు అంతులేకుండా పోయింది.

ఏం జరిగిందంటే..

మీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధి సర్వోదయనగర్ కాలనీకి చెందిన కృష్ణ, నాగమణి దంపతులు. కృష్ణ ప్లంబర్‌గా, నాగమణి ఓ పాఠశాలలో ఆయాగా పనిచేస్తున్నారు. వీరికి ఇద్దరు కుమారులు. పెద్ద కొడుకు సాయి వరప్రసాద్ (22) గత సంవత్సరం డిగ్రీ పూర్తి చేయగా, చిన్న కొడుకు సాయి నితిన్ ప్రస్తుతం డిగ్రీ చదువుతున్నాడు. సాయి వరప్రసాద్ ఇటీవల పోలీసు కానిస్టేబుల్ ఉద్యోగానికి సంబంధించి పరీక్ష రాసి ఉత్తీర్ణుడయ్యాడు. ఆదివా రం రాత్రి 12 గంటలకు తన స్నేహితుడైన సాయి యాదవ్‌తో కలిసి మద్యం తెచ్చుకునేందుకు నందనవనం వైపు వెళ్లి తిరిగి వస్తుండగా జిల్లెలగూడ స్వాగత్‌గ్రాండ్ వద్ద ఉన్న నితీష్‌గౌడ్, మహేందర్‌రెడ్డి, మనోహర్, కిరణ్‌తో పాటు మరికొందరు అడ్డగించారు. బీర్ బాటిళ్లు తమకు ఇవ్వాలని వారించడంతో వాగ్వాదం జరిగింది. దీంతో నితీష్‌గౌడ్ తన వద్ద ఉన్న కత్తితో వరప్రసాద్‌పై దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం ఓవైసీ ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ సోమవారం అర్ధరాత్రి మృతి చెందాడు.

మృతదేహంతో కుటుంబ సభ్యుల ధర్నా..

మృతుడి కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు మంగళవారం సాయంత్రం జిల్లెలగూడ స్వాగత్‌గ్రాండ్ చౌరస్తా వద్దకు చేరుకుని మృతదేహంతో రోడ్డుపై బైఠాయించారు. వరప్రసాద్ మృతికి కారకులైన వారిని వెంటనే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. దాదాపు రెండు గంటల పాటు వాహనాలు నిలిచిపోయి ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. పోలీసులు, స్థానిక నాయకులు నచ్చజెప్పినా బంధువులు భీష్మించి కూర్చున్నారు. విషయం తెలుసుకున్న మంత్రి సబితారెడ్డి బంధువులతో ఫోన్‌లో మాట్లాడి మృతికి కారకులైన వారికి శిక్ష పడేలా చుస్తామని హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు. సంఘటనకు సంబంధించి నితీష్‌గౌడ్, మహేందర్‌రెడ్డి, మనోహర్, కిరణ్‌ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

తల్లిని హత్య చేసిన కుమారుడికి జీవిత ఖైదు



హత్యకు గురైన సంగీత



నిందితుడు సంతోష్

అమీర్‌పేట: డబ్బుల కోసం తల్లిని అత్యంత దారుణంగా హత్య చేసిన కుమారుడికి న్యాయస్థానం జీవిత ఖైదు విధించింది. గంజాయికి బానిసై కసాయి తల్లిని కత్తితో పొడిచి దారుణంగా హతమార్చాడు. ఎస్ఆర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని బల్కంపేటలో 2021 జనవరి 9న ఈ సంఘటన చోటు చేసుకుంది. కర్నాటక రాష్ట్ర బీదర్ జిల్లాలోని నిడుగొంది గ్రామానికి చెందిన సంగీత (52) వీరప్ప దంపతులు బతుకుదెరువు కోసం చాలా కాలం క్రితం నగరానికి వచ్చి బల్కంపేటలో ఉండేవారు. వీరికి ముగ్గురు కొడుకులు, ఇద్దరు ఆడ కూతుళ్లు ఉన్నారు. భర్త వీరప్ప అనారోగ్యంతో మృతి చెందడంతో ఇళ్లల్లో పనిచేసి కుటుంబాన్ని పోషించేది. నాలుగో సంతానమైన 27 ఏళ్ల సంతోష్ అలియాస్ బంటి వ్యసనాలకు అలవాటు పడ్డాడు. డబ్బుల కోసం తల్లిని పదే పదే వేధించేవాడు. హత్య జరిగిన రోజు ఇళ్లలో పని ముగించుకుని మధ్యాహ్నం ఇంటికి వచ్చిన తల్లిని ఎప్పటిలాగే డబ్బులు ఇవ్వాలని అడగ్గా అందుకు నిరాకరించడంతో తల్లితో గొడవపడ్డాడు. అడ్డు వచ్చిన చెల్లెలు మహేశ్వరిపై దాడి చేసేందుకు ప్రయత్నించడంతో ఆమె తప్పించుకుని ఇంట్లో నుంచి బయటకు వెళ్లిపోయింది. ఆ తరువాత లోపలి నుంచి తలుపులకు గడియవేసి కూరగాయలు కోసే కత్తితో అత్యంత దారుణంగా పొడిచి హత్య చేశాడు. సంతోష్ చాలా కాలం నుండి మాదక ద్రవ్యాలకు అలవాటు పడ్డాడు. ఓసారి ఖర్చుల కోసం తల్లి డబ్బులు ఇవ్వకపోతే పంజగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓ ఇంట్లో దొంగతనం చేసి పోలీసులకు చిక్కి జైలుకు వెళ్లాడు. తల్లి హత్య చేసిన కేసులో ప్రస్తుతం జైల్లోనే ఉంటున్నాడు. ప్రాసిక్యూషన్ నేరం నిరూపించడంతో దోషి సంతోష్‌కు న్యాయస్థానం జీవిత ఖైదు శిక్ష విధించింది. రెండేళ్ల కాలవ్యవధిలో దోషికి శిక్ష పడేలా ఆధారాలు సమర్పించిన ఎస్.ఆర్.నగర్ పోలీసులను అధికారులు అభినందించారు.

క్లుప్తంగా...

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

వెంగళరావునగర్ : చికోటి గార్డెన్స్, ఎర్రగడ్డ 11 కేవీ ఫీడర్లు ఎయిర్‌పోర్ట్, జనప్రియ సబ్‌స్టేషన్ల పరిధిలో జరుగుతున్న మరమ్మతుల కారణంగా బుధవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ప్రకాశ్‌నగర్, రాహుల్ బజాజ్ వెనుకవైపు, చికోటి గార్డెన్, బి.ఎస్.పు రికాలనీ, సుల్తాన్‌నగర్, శంకర్‌లాల్‌నగర్, నట రాజ్‌నగర్, నేతాజీనగర్ ప్రాంతాల్లో విద్యుత్ సర ఫరాను నిలిపివేయనున్నట్లు గ్రీన్‌లాండ్స్ సీబీడీ ఏడీఈ కిశోర్‌కుమార్ మంగళవారం ఓ ప్రకట నలో తెలిపారు. అదేవిధంగా టోపాజ్‌బిల్డింగ్, సోమాజిగూడ, డీఎస్‌ఎం కాలనీ, బంజారాన గర్ 11 కేవీ ఫీడర్లు కుందన్‌బాగ్, గ్రీన్‌లాండ్స్, లోధ, బోరబండ సబ్‌స్టేషన్ల పరిధిల్లో జరుగు తున్న మరమ్మతుల కారణంగా టోపాజ్ బిల్డింగ్, నవదుర్గ జ్యువెలరీస్, ఏరియాల్ టవర్స్, సౌత్ ఇండియా షాపింగ్‌మాల్, మా టీవీ బిల్డింగ్, మా టీవీ లైన్, బిందు ప్రెస్, పుల్లారెడ్డి, స్నేహలత బిల్డింగ్, డీఎస్‌ఎం కాలనీ, అశోక్ కాలనీ, సనత్‌నగర్, ఎస్‌ఆర్‌టీ కొంతభాగం, టీవీఎస్ షో రూం లైన్, మెథడిస్ట్ చర్చి లైన్, డి-మార్ట్ ఎదురు గల్లీ, బోరబండ బంజారా నగర్, ఎస్‌ఆర్‌టీ నగర్, వినాయకరావునగర్, శివాజీనగర్, ఆర్.కె.నగర్ ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ ఉండదన్నారు.

కాలనీలు, బస్తీల్లో పర్యటించండి

కార్పొరేటర్లకు మంత్రి తలసాని సూచన



కార్పొరేటర్లు, నాయకులతో చర్చిస్తున్న మంత్రి తలసాని

సనత్‌నగర్: ప్రజా సమస్యలపై వారంలో రెండు రోజులు తమ తమ డివిజన్లలోని కాలనీలు, బస్తీల్లో పర్యటించేలా కార్యాచరణ రూపొందించుకోవాలని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ సూచించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో మంగళవారం ఆయన సనత్‌నగర్ నియోజకవర్గ పరిధిలోని కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లతో సమావేశం నిర్వహించారు. 50, 60 ఏళ్లలో జరగని అభివృద్ధి పనులను గడిచిన తొమ్మిదేళ్లలో పూర్తి చేశామన్నారు. నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను అడిగి తెలుసుకోవాలని, వాటిని తన దృష్టికి తీసుకువస్తే వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని మంత్రి వివరించారు. అదే విధంగా ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలనూ ప్రజల్లోకి తీసుకువెళ్లాలని పిలుపునిచ్చారు. సొంత స్థలం ఉండి ఇల్లు నిర్మించుకోలేని పేదలకు ఇంటి నిర్మాణం కోసం ప్రభుత్వం రూ.3 లక్షల ఆర్థిక సహాయం అందించేందుకు గృహలక్ష్మి పథకం త్వరలో ప్రారంభం కానుందన్నారు. ఇప్పటికే ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి అర్హులకు లబ్ధి చేకూరేలా కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో కార్పొరేటర్లు కొలను లక్ష్మీబాల్‌రెడ్డి, మహేశ్వరిశ్రీహరి, హేమలత, మాజీ కార్పొరేటర్లు శేషుకుమారి, ఆకుల రూప, అరుణగౌడ్ కిరణ్మయి, బీఆర్‌ఎస్ నాయకులు శ్రీనివాస్‌గౌడ్ కొలను బాల్‌రెడ్డి, పవన్‌కుమార్‌గౌడ్ శ్రీనివాస్‌గౌడ్, ఆకుల హరికృష్ణ, వెంకటేష్, రాజు, హన్మంతరావు పాల్గొన్నారు.

నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలి

అమీర్‌పేట: విద్యార్థి దశ నుంచే నాయకత్వాన్ని అందిపుచ్చుకోవాలని కల్నల్ రాకేష్‌కుమార్ సూచించారు. అమీర్‌పేట ధరంకరం రోడ్డులోని ఎస్‌ఆర్‌నగర్ రవీంద్రభారతి స్కూల్‌లో మంగళవారం నిర్వహించిన ఇన్వెస్టిచర్ సెర్‌మనీ కార్యక్రమానికి ఆయన హాజరై స్కూల్, క్లాస్ లీడర్లుగా ఎన్నికైన విద్యార్థులకు బ్యాడ్జీలను అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ.. ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా విద్యార్థులలో నాయకత్వ బాధ్యతలు పెరుగుతాయన్నారు. డీన్ శ్రీదేవి, ప్రిన్సిపాల్ సరిత, డి.ఐ. రాజేష్ పాల్గొన్నారు.

భావి తరాలను దృష్టిలో ఉంచుకోండి

- 30 ఏళ్ల పాటు సమస్యలు లేని విధంగా డీపీఆర్ రూపొందించాలి
- అధికారులకు ఎమ్మెల్యే దానం సూచన



జలమండలి అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ఎమ్మెల్యే దానం....

బంజారాహిల్స్: భావి తరాలను దృష్టిలో ఉంచుకుని ఖైరతాబాద్ నియోజక వర్గ పరిధిలో మరో 30 ఏళ్ల పాటు ఎటువంటి సమస్యలు లేని విధంగా, డ్రైనేజీ, మంచినీటి సమస్యలు లేకుండా ఉండేలా డీపీఆర్(డీటెయిల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్)ను రూపొందించాలని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ జలమండలి అధికారులను ఆదేశించారు. మంగళవారం జూబ్లీహిల్స్‌లోని క్యాంప్ కార్యాలయంలో జలమండలి జీఎం హరి శంకర్, వివిధ సెక్షన్ల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎప్పటికప్పుడు పెరుగుతున్న కాలనీలు, బస్తీల్లోని నివాసాలకు అనుగుణంగా రూ. కోట్లు ఖర్చు చేస్తున్నా సమస్యలకు తాత్కాలిక పరిష్కారం మాత్రమే చూపగలుగుతున్నామన్నారు. రెండు, మూడేళ్లు గడిచిన తర్వాత మళ్లీ రోడ్లు తవ్వి లైన్లు వేయాల్సి వస్తుందన్నారు.

ఏజెన్సీకి బాధ్యతలు అప్పగించాలి

డీపీఆర్ రూపకల్పనకు నిపుణులతో కూడిన ఏజెన్సీకి బాధ్యతలు అప్పగించాలన్నారు. అందుకు తగినట్లు చర్యలు తీసుకోవాలని జలమండలి ఎండీ దాన కిషోర్‌కు ఫోన్ చేసి మాట్లాడారు. సమీక్షలో పాల్గొన్న జీఎం హరిశంకర్‌కు కూడా ఈ విషయాన్ని సూచించారు. నియోజక వర్గానికి సీవరేజీ వాటర్ పైప్‌లైన్ల కోసం రూ. 2.25 కోట్లు మంజూరయ్యాయని వెంటనే పనులు ప్రారంభించేందుకు ఆదేశాలు జారీ చేయాలని ఎండీని కోరారు. ఇప్పటికే రూ. 6 కోట్ల పనులకు సంబంధించిన ప్రతిపాదనలు పెండింగ్‌లో ఉన్న విషయాన్ని గుర్తు చేశారు. ఎమ్మెల్యే నిధుల నుంచి జలమండలికి నిధులు మంజూరు చేసేందుకు త్వరలోనే సచివాలయానికి వెళ్తున్నానని ఆ పనులు కూడా త్వరలోనే ప్రారంభమవుతాయని తెలిపారు. పెండింగ్ పనులకు మాత్రం నిధులు వెంటనే విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో సెక్షన్ డీజీఎం శ్రీనివాసులతో పాటు మేనేజర్లు రాంబాబు, శ్రీహరి, పవన్, కార్పొరేటర్లు కవితారెడ్డి, వెంకటేష్, సంగీతా యాదవ్ పాల్గొన్నారు.

ప్రాధాన్యతా క్రమంలో పనులు చేయాలి...

జలమండలికి రూ. 2.25 కోట్లు నిధులు మంజూరైన నేపథ్యంలో వివిధ డివిజన్లలో పెండింగ్‌లో ఉన్న పనులను ప్రాధాన్యతా క్రమంలో పూర్తి చేయాలని ఎమ్మెల్యే అధికారులకు సూచించారు. మరో రూ.3 కోట్లు నిధుల అవసరం ఉందని వాటిని, త్వరలోనే ఉన్నతాధికారులతో మాట్లాడి మంజూరు చేయిస్తానని ఆయన అధికారులకు వివరించారు. ఆయా డివిజన్లలో స్థానికంగా ఉండే కార్పొరేటర్లతో సమన్వయం చేసుకుని పనులను ప్రారంభించి సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలని సూచించారు.

ప్రతి ఒక్కరికి ఇళ్లు నిర్మించి ఇస్తాం



గురుబ్రహ్మనగర్‌లో బస్తీవాసులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దానం..

ఫిలింనగర్: జూబ్లీహిల్స్ డివిజన్ పరిధిలోని నందగిరిహిల్స్ పక్కనే ఉన్న గురుబ్రహ్మనగర్ బస్తీలో ప్రతి ఒక్కరికి ఇళ్లు నిర్మించే ఇచ్చే బాధ్యత తనదేనని ఈ విషయంలో ఏ మాత్రం సందేహం అవసరం లేదని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అన్నారు. మంగళవారం గురుబ్రహ్మనగర్ బస్తీలో ఆయన పర్యటించిన ఆయన బస్తీవాసులతో మాట్లాడారు. గతంలో తాను మంత్రిగా ఉన్నసమయంలో బస్తీకి ముఖ్యమంత్రిని సైతం తీసుకొచ్చానని గుర్తు చేశారు. త్వరలోనే బస్తీలో డిజిటల్ సర్వే నిర్వహించి ప్రతి ఒక్కరికి ఇళ్లు నిర్మించి ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. మంత్రి కేటీఆర్‌తో మాట్లాడి ప్రతి ఒక్కరికి జీవో 58 కింద పట్టాలు ఇప్పించి అందరికీ సమానంగా స్థలం కొలిచి ఇస్తామన్నారు. బస్తీ దవాఖానా, కమ్యూనిటీ హాల్, పార్కు నిర్మాణానికి చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్, సీనియర్ నేత మామిడి నర్సింగ్‌రావు, బస్తీ అధ్యక్షుడు మామిడిచెట్ల వెంకటస్వామి, ఈశ్వరయ్య, ఆంజనేయులు, నర్సింహ, నిరంజన్, భీమేష్, గోపాల్ నాయక్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

గెస్ట్ లెక్చరర్ల నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

పంజగుట్ట: ఖైరతాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపకులకోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.రాజేంద్ర కుమార్ తెలిపారు. 2023-24 విద్యా సంవత్సరానికి గాను 27 మంది అతిథి అధ్యాపకుల పోస్టుల కోసం ఈ నెల 22 లోగా ఖైరతాబాద్ లోని కాలేజీలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇంగ్లిష్ 4, సంస్కృతం 2, వాణిజ్యశాస్త్రం (కామర్స్ 03), బీబీఏ 3, డాటాసైన్స్ 01, మ్యాథమిటిక్స్ 01, స్టాటిస్టిక్స్ 02, న్యూట్రీషన్ 01, అరబిక్ 01, కంప్యూటర్ సైన్స్ 08, టాక్సేషన్ 01, పోస్టులు ఉన్నాయన్నారు. సబ్జెక్టుల్లో 55 శాతం మార్కులతో పాటు నెట్, స్లెట్ లేదా పీహెచ్‌డీ ఉన్న అభ్యర్థులకు ప్రాధాన్యత ఉంటుందన్నారు. అర్హులైన అభ్యర్థులు ఈ నెల 25న కాలేజీలో ఇంటర్వ్యూకు హాజరుకావాలని సూచించారు.

దృష్టి మరల్చి నగదు చోరీ

వెంగళరావునగర్ : ఏటీఎంలో డబ్బులు డ్రా చేసుకునేందుకు వెళ్లిన వ్యక్తి దృష్టి మరల్చి ఓ అగంతకుడు నగదు కాజేసిన సంఘటన మధురానగర్ పోలీసుస్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఎల్లారెడ్డిగూడకు చెందిన బి.లక్ష్మణ్ గత నెల 29న ఉదయం మధురానగర్ సమీపంలోని కేకే టవర్స్ వద్ద ఉన్న యూనియన్ బ్యాంక్ ఏటీఎంకు వచ్చాడు. అదే సమయంలో ముఖానికి ముసుగు వేసుకున్న యువకుడు అక్కడికి వచ్చాడు. అతడిని గమనించకుండా లక్ష్మణ్ నగదు డ్రా చేసుకునే క్రమంలో కార్డు ఏటీఎంలో పెట్టి పిన్ నంబర్ టైప్ చేశాడు. నగదు రావడానికి కొంత సమయం పట్టడంతో పక్కనే ఉన్న వ్యక్తి హడావుడి చేస్తూ త్వరగా కార్డు తీసుకోండి లేకపోతే బ్లాక్ అవుతుందని చెప్పి అతనే కార్డు తీసి ఇచ్చాడు. ఆ తర్వాత కొద్ది సేపటికి లక్ష్మణ్ అకౌంట్ నుంచి రూ.23,500 నగదు డ్రా చేసినట్లుగా మెసేజ్ వచ్చింది. అగంతకుడు తనకు డూప్లికేట్ కార్డు ఇచ్చినట్లు గుర్తించిన లక్ష్మణ్ మంగళవారం మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

వెంగళ్‌రావు పార్కులో టిఫిన్ బైటక్



టిఫిన్ బైఠక్ కార్యక్రమంలో పాల్గొన్న బీజేపీ నేతలు, కార్యకర్తలు...

బంజారాహిల్స్: మహాజన్ సంపర్క్ అభియాన్‌లో భాగంగా మంగళవారం వెంకటేశ్వరకాలనీ డివిజన్ బీజేపీ ఆధ్వర్యంలో వెంగళ్‌రావు పార్కులో టిఫిన్ బైఠక్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యకర్తలు, నేతలు ఎవరికి వారే తమ ఇళ్ల నుంచి టిఫిన్ బాక్సులు తీసుకుని వచ్చి ఇక్కడ కూర్చొని పార్టీ బలోపేతంపై చర్చించారు. ఇప్పటి వరకు ప్రధాని మోదీ నేతృత్వంలో సాధించిన విజయాలు, ప్రగతిపై మాట్లాడారు. ఖైరతాబాద్ మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డితో పాటు పలువురు నేతలు కార్యక్రమంలో పాల్గొన్నారు.

మందుబాబులకు జైలు

బంజారాహిల్స్: మద్యం సేవించి వాహనాలు నడుపుతూ జూబ్లీహిల్స్ ట్రాఫిక్ పోలీసుల తనిఖీల్లో పట్టుబడ్డ 22 మంది వాహనదారులను మంగళవారం నాంపల్లిలోని ఎనిమిదవ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపరిచారు. మోతాదుకు మించి మద్యం సేవించి వాహనాలు నడిపిన భాను ప్రకాశ్, సురేష్‌లకు రెండు రోజుల చొప్పున, శివనాథ్‌గౌడ్‌కు నాలుగు రోజుల జైలు శిక్ష రూ. 3300 జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు ఇచ్చారు. మిగతా 18 మందికి రూ. 2100 చొప్పున జరిమానా విధించారు. జరిమానాల రూపంలో రూ. 49,800 వసూలు అయినట్లు జూబ్లీహిల్స్ ట్రాఫిక్ సీఐ వినోద్‌కుమార్ తెలిపారు.

వార్డు కార్యాలయంలో చోరీకి యత్నం

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్ నెం7లోని వెంకటేశ్వరకాలనీ డివిజన్ వార్డు కార్యాలయంలో గుర్తు తెలియని వ్యక్తులు తాళాలను పగలగొట్టి చోరీకి యత్నించిన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. కార్యాలయం లోపల టేబుళ్ల సొరుగులకు ఉన్న తాళాలను కూడా పగలగొట్టారు. మంగళవారం ఉదయం డ్యూటీకి వచ్చిన వార్డు పరిపాలనాధికారి ఉప్పలయ్య బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మహిళ అదృశ్యం

బంజారాహిల్స్: ఓ మహిళ అదృశ్యమైన సంఘన మంగళవారం బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఫస్ట్‌ల్యాన్సర్ సయ్యద్‌నగర్‌కు చెందిన షేక్ ఇర్ఫాన్ ఆటో డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఈ నెల 17 అతని భార్య ఫాతిమా బేగం ఎవరికీ చెప్పకుండా బయటికి వెళ్లి తిరిగి రాలేదు. ఆమె కోసం గాలించినా ఫలితం లేకపోయింది. ఆమె హర్త ఇర్ఫాన్ ఫిర్యాదు మేరకు బంజారాహిల్స్ పోలీసులు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

భార్యను వేధిస్తున్న భర్తపై కేసు

బంజారాహిల్స్: ప్రేమించి పెళ్లి చేసుకున్న కొద్ది రోజులకే కొద్ది నీపై మోజు తీరిపోయింది. నిన్ను పెళ్లి చేసుకోకపోతే వరకట్నం రూపంలో డబ్బు వచ్చేదంటూ భార్యను వేధింపులకు గురి చేస్తున్న వ్యక్తిపై బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళితే..బంజారాహిల్స్ రోడ్ నెంబరు 11 లెక్‌వ్యూ అపార్ట్‌మెంట్‌లో ఉంటున్న దీపారావు, కాజాగూడకు చెందిన అస్సెం తివారీ 2010లో బెంగళూరు ఆర్యసమాజ్‌లో ప్రేమ వివాహం చేసుకున్నారు. కుమారుడు పుట్టిన తర్వాత అస్సెం తివారీ తరచూ భార్యను వేధిస్తున్నాడు. ఆమెను పెళ్లి చేసుకుని ఉండకపోతే కట్నంగా రూ.లక్షలు వచ్చేవంటూ ఆమెను హింసించేవాడు. అతడి వేధింపులు తట్టుకోలేక దీపారావు గత జనవరిలో కుమారుడిని తీసుకుని నగరంలో ఉంటున్న తల్లిదండ్రుల వద్దకు వచ్చింది. పోలీసులకు ఫిర్యాదు చేస్తే పరువు పోతుందని బయటకు చెప్పలేదు. ఇటీవల నగరానికి వచ్చిన అస్సెం తివారీ కొద్ది రోజులుగా భార్యకు మెసెజ్‌లు పెడుతూ వేధించడం మొదలు పెట్టాడు. దీంతో బాధితురాలు బంజారాహిల్స్ పోలీసులను ఆశ్రయించింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బీఆర్‌ఎస్ నేతలపై కేసులు నమోదు

- పరస్పరం ఫిర్యాదు చేసుకున్న నాయకులు
- శ్రీధర్‌రెడ్డిపై కార్పొరేటర్, ఎమ్మెల్యే పీఏపై గణేష్ ఫిర్యాదు

వెంగళరావునగర్ : బీఆర్‌ఎస్ పార్టీలోని ఇరువురు నాయకులు పరస్పరం పోలీసులకు ఫిర్యాదు చేసుకున్న సంఘటన మధురానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఈనెల 16న బోనాల సందర్భంగా జవహర్‌నగర్‌లో అమ్మవారి దేవాలయంలో జరిగిన కార్యక్రమానికి విద్యాశాఖ మౌళిక సదుపాయాల సంస్థ చైర్మన్ రావుల శ్రీధర్‌రెడ్డి హాజరయ్యారు. ఈ క్రమంలో అక్కడే ఉన్న వెంగళరావునగర్ కార్పొరేటర్ దేదీప్య ముందుగా తనకు సమాచారం అందించి ఉంటే తగిన ఏర్పాట్లు చేసేవారమన్నారు. దీంతో ఆగ్రహించిన శ్రీధర్‌రెడ్డి కార్పొరేటర్‌ను దూషించారు. గతంలోనూ అతను ఇదే తరహాలో తనను బెదిరించినట్లు కార్పొరేటర్ మధురానగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు మంగళవారం శ్రీధర్‌రెడ్డితో పాటు మరి కొందరిపై కేసు నమోదు చేశారు. ఇదిలా ఉండగా టీఆర్‌ఎస్ నాయకుడు గణేష్ ప్రసాద్‌సింగ్ కూడా పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. ఈనెల 16న జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ అతని అనుచరులు తన ఇంటికి వచ్చి దూషించారని, దీనిని ప్రశ్నించిన తన తండ్రిపై ఎమ్మెల్యే పీఏ తదితరులు దాడికి చేశారని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎమ్మెల్యే పీఏ సుబ్బరాజుతో పాటు మరికొందరిపై కేసులు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ వివరించారు.

ప్రభువు చూపిన బాటలో నడవాలి



బిషప్ సెబాస్టియన్‌కు శుభాకాంక్షలు తెలియజేస్తున్న మహిళాపాస్టర్లు, చిన్నారులు

వెంగళరావునగర్ : మానవులు ఒకరినొకరు ప్రేమించుకుంటూ ప్రభువు చూపిన బాటలో నడవాలని ఇండియన్ బిలీవర్స్ పార్టీ వ్యవస్థాపకులు, ఆలిండియా ఇండిపెండెంట్ చర్చిస్ డయాలసిస్ ఆర్చ్‌బిషప్ డాక్టర్ హ్యారీ సెబాస్టియన్ అన్నారు. బిషప్ సెబాస్టియన్ జన్మదిన వేడుకలు మంగళవారం ఏఐఐసీడీ ప్రధాన చర్చిలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హ్యారీ సెబాస్టియన్ మాట్లాడుతూ నేటి యువతకు క్రీస్తు బోధనలు ఎంతో అవసరమన్నారు. చిన్నతనం నుంచే మంచి నడవడికను నేర్పించాలని సూచించారు. తొలుత క్వయర్ సిబ్బంది భక్తి గీతాలను ఆలపించారు. పలువురు పాస్టర్లు దైవ సందేశాన్ని వినిపించారు. అనంతరం ఆయన కేక్‌ను కట్ చేసి పంపిణీ చేశారు. కార్యక్రమంలో నగరంలోని పలువురు పాస్టర్లు, బిషప్‌లు, చర్చిల ప్రతినిధులు పాస్టర్ డేవిడ్, పాస్టర్ ఐజయ్య, బిషప్ దేవదాస్, రెవరెండ్ కళావతి, పాస్టర్ స్వామిదాస్, రెవరెండ్ దాస్, రెవరెండ్ ప్రభుదాస్, బిషప్ నూనె వినోద్, బిషప్ అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

రాహుల్ గాంధీపై కేటీఆర్ విమర్శలు అర్థరహితం



కేటీఆర్ దిష్టి బొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ నేతలు..

బంజారాహిల్స్: కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత రాహుల్ గాంధీపై మంత్రి కేటీఆర్ చేసిన వ్యాఖ్యలకు నిరసనగా మంగళవారం ఖైరతాబాద్ నియోజక వర్గంలో కాంగ్రెస్ శ్రేణులు ఆందోళన చేపట్టాయి. ఖైరతాబాద్ డీసీసీ అధ్యక్షుడు సి. రోహిణ్ రెడ్డి ఆధ్వర్యంలో ఫిలింనగర్‌లోని మహనీయుల చౌరస్తాలో సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ దిష్టి బొమ్మలు దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాహుల్‌పై కేటీఆర్ వ్యాఖ్యలు అర్థరహితమన్నారు. తక్షణమే కేటీఆర్ రాహుల్‌కు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, సోమాజిగూడ డివిజన్ అధ్యక్షులు కాటూరి రమేష్, గొల్యాల రాజు, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ సమస్య పరిశీలన

వెంకటేశ్వరకాలనీ: బంజారాహిల్స్ రోడ్‌నెం.14లోని ఓల్డ్ వెంకటేశ్వరనగర్ బస్తీలో తరచూ డ్రైనేజీ ఓవర్ ఫ్లో అవుతుండటంతో ఇబ్బందులు పడుతున్నామని ఆయా ప్రాంతాల వాసులు ఫిర్యాదు చేయడంతో కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి మంగళవారం బస్తీలో పర్యటించారు. సంబంధిత అధికారులతో కలిసి సమస్యను పరిశీలించారు. ప్రస్తుత పైప్‌లైన్ స్థానంలో కొత్త సీవరేజీ పైప్‌లైన్ వేయాల్సిన అవసరం ఉందని ఆమె అధికారులకు సూచించారు. ఇందుకోసం ప్రతిపాదనలు రూపొందించాలన్నారు.



ఓల్డ్ వెంకటేశ్వరనగర్‌లో పర్యటిస్తున్న కార్పొరేటర్ కవితారెడ్డి...

గజ్జలమ్మ ఆలయంలో ఎమ్మెల్యే పూజలు



పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే దానం నాగేందర్

ఖైరతాబాద్: ఖైరతాబాద్‌లోని గజ్జలమ్మ దేవాలయంలో మంగళవారం నిర్వహించిన అన్నదాన కార్యక్రమానికి ఎమ్మెల్యే దానం నాగేందర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. బోనాల పండుగ సందర్భంగా ఏర్పాటు చేసిన ఈ అన్న దాన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో గజ్జల ఆనంద్, వెంకటేష్ యాదవ్, రవికాంత్, శ్రీకాంత్, మహేష్‌యాదవ్, మహేందర్‌బాబు, చందు తదితరులు పాల్గొన్నారు.

ఏటా బొడ్రాయి పండుగ చేయాలి



ఇందిరానగర్ పోచమ్మ దేవాలయంలో భవిష్యవాణి వినిపిస్తున్న మధులత

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్ నెం. 2లోని ఇందిరానగర్‌లో కొలువుదీరిన పోచమ్మ దేవాలయంలో మంగళవారం రంగం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి ఘనంగా పూజలు నిర్వహించి సంతోష పెడితే వర్షాలు సమృద్ధిగా కురుస్తాయని వెల్లడించారు. బస్తీవాసులు బొడ్రాయి పండుగ చేయాలని కోరారు. మూడేళ్లకోసారి కాదని ఏటా పండుగ చేస్తే బస్తీవాసులు సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉంటారని తెలిపింది. ఐదు వారాల పాటు అమ్మవారికి సాక పెట్టాలని, సమీపంలోని కట్టమైసమ్మ గుడికి సమయం ఆసన్నమైందని అది కూడా త్వరలోనే కడతారని అమ్మ ఆశీస్సులు బస్తీవాసులకు ఉంటాయన్నారు. బోనాల పండుగను బాగా చేశారని కొనియాడారు.

ఘనంగా బోనాల వేడుకలు



గురుబ్రహ్మనగర్‌లో పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే దానం నాగేందర్

ఫిలింనగర్: బోనాల పండుగ వేడుకలు మంగళవారం పలు ప్రాంతాల్లో ఘనంగా నిర్వహించారు. జూబ్లీహిల్స్ గురుబ్రహ్మనగర్ బస్తీలో నిర్వహించిన వేడుకల్లో ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ పాల్గొని అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. బంజారాహిల్స్ రోడ్ నెం.4 లోని సుఖ్‌దేవ్‌నగర్ పోచమ్మ గుడిలో జరిగిన పూజల్లో సీఎల్పీ నేత భట్టి విక్రమార్క పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.



పూజలు నిర్వహిస్తున్న రోహిణ్‌రెడ్డి



సుఖ్‌దేవ్‌నగర్‌లో మల్లు భట్టి విక్రమార్క

రోజంతా ముసురే..



ఖైరతాబాద్‌లో..



బంజారాహిల్స్ రోడ్ నెం. 3లో నిలిచిన వరద నీరు ..





బంజారాహిల్స్: తుపాను ప్రభావంతో మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు కురిసిన వర్షంతో రహదారులు జలమయమయ్యాయి. క్షణం కూడా తీరికలేకుండా ముసురు కురవడంతో వాహనదారులు, బాటసారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. బంజారాహిల్స్, జూబ్లీహిల్స్ రహదారులపై వాహనాలు మెల్లగా కదలడంతో రోడ్లన్నీ కిక్కిరిసిపోయి కనిపించాయి.

పోషకాహారాన్ని సమతుల్యం చేయడంలో వంట నూనెల పాత్ర కీలకం




సదస్సుకు హాజరైన నిపుణులు

సనత్‌నగర్: పోషకాహారాన్ని సమతుల్యం చేయడంలో ఎడిబుల్ ఆయిల్ (వంట నూనె) ఎంతో అవసర మని పలువురు ఆరోగ్య నిపుణులు స్పష్టం చేశారు. వంట నూనెలపై ఉన్న అపోహలు, నూనెల వల్ల కలిగే ప్రయోజనాలపై మంగళవారం బేగంపేటలోని ఐటీ సీ కాకతీయ హోటల్‌లో చర్చావేదిక నిర్వహించారు. ఫ్రీడమ్ ఆయిల్ నాలెడ్జ్ సిరీస్‌లో భాగంగా 'వంట నూనెల పట్ల ఉన్న అపోహలను పోగొట్టుకోండి' అనే అంశంపై సాగిన చర్చా కార్యక్రమానికి ఆహార, ఆరోగ్య, వైద్య, పాకశాస్త్ర నిపుణులు హాజరై తమ అభిప్రాయాలను వెల్లడించారు.అపోలో ఆస్పత్రి చీఫ్ డైటీషియన్ హరిత బత్తిన మాట్లాడుతూ.. అన్ని రకాల వంట నూనెలతో బరువు పెరుగుతుంది అనేది కేవలం అపోహ మాత్రమేనన్నారు. సమతూల్య ఆహారంలో నూనె ముఖ్యమైన భాగమని ప్రతి రకమైన నూనె దాని ప్రత్యేక ప్రయోజనాలు, లక్షణాలు కలిగి ఉంటాయన్నారు. రైస్ బ్రాన్ ఆయిల్‌లో యాంటీ ఆక్సిడెంట్లు, విటమిన్-ఈ పుష్కలంగా ఉంటాయన్నారు. అపోలో ఆస్పత్రి కార్డియాలజీ విభాగం సీనియర్ కన్సల్టెంట్ డాక్టర్ కల్నల్ మంత్రిప్రగడ సీతారాం మాట్లాడుతూ.. రైస్ బ్రాన్ ఆయిల్ బహుళ ప్రయోజకరమైన లక్షణాలను కలిగి ఉండడంతో పాటు వంటకు వినియోగించడానికి ఉత్తమమైనదిగా పరిశోధనల్లో తేలిందన్నారు. మదీనా డిగ్రీ అండ్ పీజీ కాలేజ్ ఫర్ ఉమెన్ హెచ్ఓడీ న్యూట్రిషన్ డాక్టర్ నస్రీన్ మాట్లాడుతూ.. వంట నూనెలు శరీరానికి అవసరమైన కొవ్వు ఆమ్లాలు, కొవ్వులో కరిగే విటమిన్లు, ఇతర ముఖ్యమైన పోషకాలను అందిస్తాయన్నారు. దత్తాత్రే హాస్పటాలిటీ కన్సల్టెన్సీ సర్వీసెస్ చెఫ్ కన్సల్టెంట్ అండ్ సీఈఓ కిరణ్ జోషి, జెమిని ఎడిబుల్స్ అండ్ ఫ్యాట్స్ ఇండియా లిమిటెడ్ సేల్స్ అండ్ మార్కెటింగ్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్ రెడ్డి హాజరై నూనెల ప్రాముఖ్యతను వివరించారు.

క్లుప్తంగా...

‘షెడ్యూల్ 5’పై ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు

తదుపరి విచారణ 4 వారాలకు వాయిదా



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో షెడ్యూల్ 5 అమలుకు సంబంధించి దాఖలైన పిటిషన్‌లో కౌంటర్ వేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు జారీ చేసింది. రాజ్యాంగంలోని 5వ షెడ్యూల్ ప్రకారం...జెడ్పీటీసీ, డైరెక్టర్లు, కో–ఆపరేటివ్ చైర్మన్లు సహా అన్ని పోస్టులను గిరిజనులకే కేటాయించాలని, ఆ మేరకు రాష్ట్ర ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ కొత్తగూడెం జిల్లాకు చెందిన లంబాడి హక్కుల పోరాట సమితి ప్రధాన కార్యదర్శి భుక్యా దేవనాయక్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై తాత్కాలిక ప్రధాన న్యాయ మూర్తి జస్టిస్ అభినంద్‌కుమార్ షావిలి, జస్టిస్ నామవరపు రాజేశ్వర్‌రావు ధర్మాసనం మంగళవారం విచారణ చేపట్టింది. రాష్ట్రంలో 12% గిరిజన జనాభా ఉందని, సామాజికంగా, ఆర్థికంగా, విద్యాపరంగా వెనుకబడిన వీరి అభ్యున్నతి కోసం...గిరిజన ప్రాంతాల్లో వారినే స్థానిక సంస్థలు, ఇతర పదవుల్లో నియమించాలని పిటిషనర్ న్యాయవాది వాదనలు వినిపించారు. వాదనలు విన్న ధర్మాసనం ...ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, గిరిజన సంక్షేమ శాఖ ముఖ్యకార్యదర్శి, కమిషనర్లకు నోటీసులు జారీ చేస్తూ, విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది.

వర్సిటీల పాలకమండలి సభ్యుల పదవీ కాలం పొడిగింపు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని తొమ్మిది విశ్వవిద్యాలయాలకు సంబంధించిన క్లాస్–2 పాలక మండలి సభ్యుల పదవీ కాలాన్ని మరో ఏడాది పెంచుతూ మంగళవారం విద్యాశాఖ కార్యదర్శి వాకాటి కరుణ ఉత్తర్వులు జారీ చేశారు. వీరి పదవీ కాలం ఏప్రిల్‌తో ముగియడంతో..పాలకమండలి సభ్యులుగా యూనివర్సిటీకి చెందిన సీనియర్ ప్రొఫెసర్, ప్రిన్సిపల్, ప్రభుత్వం నామినేట్ చేసే ముగ్గురు సభ్యులు ఉంటారు.

పెండింగ్ బిల్లులు మంజూరు చేయండి

సాక్షి, హైదరాబాద్: ఉపాధ్యాయులకు 14 నెలలుగా పెండింగ్‌లో ఉన్న వివిధ రకాల బిల్లులను తక్షణమే మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని పీఆర్‌టీయూటీఎస్ డిమాండ్ చేసింది. ఆ సంఘం అధ్యక్షుడు పింగిలి శ్రీపాల్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి బీరెల్లి కమలాకర్‌రావు, ఎమ్మెల్సీ కూర రఘోత్తం రెడ్డి ఈమేరకు ప్రభుత్వానికి లేఖ రాశారు.

ఏపీ విద్యా విధానాలపై ఐరాస అభినందనలు

బాలికా విద్యకు ఏపీ సీఎం జగన్ ప్రోత్సాహం బాగుంది

ఐరాస లక్ష్య సాధనకు కృషి చేస్తున్నారని ప్రశంసలు

సాక్షి, అమరావతి: ఐక్యరాజ్య సమితి లక్ష్యాలైన అందరికీ విద్య, వైద్యం, పేదరిక నిర్మూలన కోసం నవరత్నాలు, నాడు – నేడు, సంక్షేమ పథకాల ద్వారా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని ఐరాస ఎకనామిక్, సోషల్ కౌన్సిల్ అంతర్జాతీయ అధ్యక్షురాలు లచ్చెజర స్టోవ్ ప్రశంసించారు. ఐరాస ప్రధాన కార్యాలయమైన న్యూయార్క్‌లో ఆర్థిక, సామాజిక మండలి నేతృత్వంలో సుస్థిరాభివృద్ధిపై జూలై 17న జనరల్ అసెంబ్లీ హాలులో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నాడు – నేడు, విద్యారంగంలో పథకాలకు సంబంధించి ప్రత్యేక స్టాల్‌ను ఏర్పాటు చేశారు. జగనన్న విద్యాకానుక కిట్లు, విద్యా దీవెన, అమ్మ ఒడి, వసతి దీవెన, విద్యార్థులకు ఇచ్చే ఇతర ప్రోత్సాహకాల పోస్టర్లను ప్రదర్శించారు. ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ ఎడ్యుకేషన్‌లో భాగంగా ఏర్పాటు చేస్తున్న ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్ బోర్డులు, అటల్ టింకరింగ్ ల్యాబ్స్, స్మార్ట్ బోర్డ్స్, బైజూస్ ట్యాబ్స్ నమూనాలను ప్రదర్శించారు. ఐరాస స్పెషల్ కన్సల్టేటివ్ స్టేటస్ మెంబర్ వున్నవ షకిన్ కుమార్ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపట్టిన విద్యారంగ సంస్కరణలు, వివిధ పథకాల ద్వారా విద్యార్థులు ఉన్నత చదువులు అభ్యసించేలా సీఎం జగన్ ప్రోత్సహిస్తున్న తీరు, డిజిటల్ బోధన, డిజిటల్ క్లాస్ రూమ్స్ గురించి వివరించారు. నాడు – నేడు స్టాల్‌ని సందర్శించిన ఎకనామిక్ సోషల్ కౌన్సిల్ ప్రపంచ అధ్యక్షురాలు లచ్చెజర స్టోవ్ ఆసక్తిగా వివరాలు అడిగి తెలుసుకున్నారు. సీఎం జగన్ బాలికల విద్యను ప్రోత్సహిస్తూ ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టడాన్ని అభినందించారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు టోఫెల్ ట్రైనింగ్, సబ్జెక్ట్ టీచర్ కాన్సెప్ట్, బైలింగ్యువల్ డిక్షనరీలు, గోరుముద్ద, ఆణిముత్యాల పథకాన్ని ప్రత్యేకంగా ప్రశంసించారు. పేద విద్యార్థులను గ్లోబల్ లీడర్లుగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న కృషిని షకిన్ కుమార్ ఆమెకు వివరించారు. డిజిటల్ ఇండియా దిశగా అడుగులు వేస్తున్న ఆంధ్రప్రదేశ్ విద్యా విధానాలను కేంద్ర పర్యాటక శాఖ మంత్రి కిషన్‌రెడ్డి ప్రశంసించారు.

ఏపీ స్టాల్‌పై పలు దేశాల ఆసక్తి

టాంజానియా ఆర్థిక శాఖా మంత్రి నటూ వాంబా ఏపీ స్టాల్‌ను సందర్శించి విద్యాభివృద్ధికి సీఎం జగన్ చేస్తున్న కృషిని అభినందించారు. అమెరికా పర్మినెంట్ అబ్జర్వర్ మిషన్ టూ యునైటెడ్ నేషన్స్ ప్రొఫెసర్ ఒట్టో ఫీజిన్ బ్లాట్, అమెరికన్ డిప్లొమాటిక్ అకాడమి రిప్రజెంటేటివ్ టు యునైటెడ్ నేషన్స్ ప్రెసిడెంట్ బిల్ గ్రాహమ్ తదితరులు ఏపీ విద్యా విధానాలను తెలుసుకుని అభినందించారు. ఈ కార్యక్రమంలో సునీత చిట్టూమూరి తదితరులు పాల్గొన్నారు.



నాడు-నేడు స్టాల్‌ను సందర్శించిన ఐక్యరాజ్యసమితి ఎకనామిక్ అండ్ సోషల్ కౌన్సిల్ ప్రపంచ అధ్యక్షురాలు లచ్చెజర స్టోవ్

‘మార్గదర్శి’ కేసు విచారణ వాయిదా

- 56 వేల పేజీల డిపాజిటర్ల వివరాలు అందజేసిన సంస్థ
- అన్ని పక్షాలు రెండు పేజీల నోట్ దాఖలు చేయండి
- సెప్టెంబరు 26కు వాయిదా వేసిన సుప్రీంకోర్టు



సాక్షి, న్యూఢిల్లీ : ఆర్‌బీఐ నిబంధనలకు విరుద్ధంగా డిపాజిట్లు సేకరించారంటూ మార్గదర్శి ఫైనాన్షియర్స్ మీద దాఖలైన పిటిషన్లకు సంబంధించిన విచారణను సుప్రీంకోర్టు వాయిదా వేసింది. 72 వాల్యూమ్‌లతో 56వేల పేజీల డిపాజిటర్ల వివరాలను సంస్థ మంగళవారం కోర్టుకు అందజేయగా దానిని పరిగణనలోకి తీసుకుంటున్నట్లు న్యాయస్థానం పేర్కొంది. మార్గదర్శి ఫైనాన్షియర్స్‌పై ఉండవల్లి అరుణ్‌కుమార్, ఏపీ ప్రభుత్వం దాఖలు చేసిన వేర్వేరు పిటిషన్లు మంగళవారం జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ దీపాంకర్ దత్తాలతో కూడిన ధర్మాసనం విచారించింది. ఈ కేసులో ఏపీ ప్రభుత్వానికి పిటిషన్ దాఖలు చేసే అర్హతలేదని సంస్థ తరఫు సీనియర్ న్యాయవాది హరీశ్ సాల్వే ఆరోపించారు. దీన్ని పార్టీ ఇన్‌పర్సన్ ఉండవల్లి అరుణ్ కుమార్, న్యాయవాది రమేశ్ అల్లంకి, ఏపీ ప్రభుత్వం తరఫు సీనియర్ న్యాయవాది సీఎస్ వైద్యనాథన్ విభేదించారు. ఏపీ, తెలంగాణ ఇద్దరినీ పార్టీ చేసినట్లు ఉండవల్లి కోర్టుకు తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం ఇంకా కౌంటరు దాఖలు చేయలేదని న్యాయవాదులు ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు. ఏపీ ప్రభుత్వం రిజాయిండరు దాఖలు చేసినట్లు వైద్యనాథన్ తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం కౌంటరు దాఖలు చేయాలని తదుపరి విచారణలోగా అన్ని పార్టీలు ప్లీడింగ్స్ పూర్తిచేయాలని ధర్మాసనం ఆదేశించింది. తదుపరి విచారణ సెప్టెంబరు 26కు వాయిదా వేసింది. ఈలోగా 2 పేజీల నోట్ సమర్పించాలని అన్ని పక్షాలను కోర్టు ఆదేశించింది.

ఏపీ పిటిషన్ మరో ధర్మాసనానికి..

మరోవైపు.. తెలంగాణ హైకోర్టులో మార్గదర్శి ఫైనాన్షియర్స్‌కు సంబంధించిన కేసులు ఏపీ హైకోర్టుకు బదిలీ చేయాలన్న ఏపీ ప్రభుత్వ పిటిషన్ మంగళవారం జస్టిస్ అనిరుద్ధ బోస్, జస్టిస్ ఎస్. వెంకటనారాయణ భట్టిల ధర్మాసనం ముందుకొచ్చింది. ఈ పిటిషన్‌ను తాను సభ్యుడుగా లేని ధర్మాసనం ముందు జాబితా చేయాలని జస్టిస్ ఎస్. వెంకటనారాయణ భట్టి కోరారు. ఈ మేరకు రిజిస్ట్రీని ధర్మాసనం ఆదేశించింది.

నిలిచిన వైద్యుల పదోన్నతులు

- పదోన్నతుల ప్రక్రియలో ఉద్రిక్తత
- ఖాళీలను చూపకపోవడంపై డాక్టర్ల అభ్యంతరం.. డీఎంఈ కార్యాలయంలో నిలిచిన కౌన్సెలింగ్

సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్లను అసోసియేట్ ప్రొఫెసర్లుగా పదోన్నతి కల్పించేందుకు నిర్వహించే కౌన్సెలింగ్ ప్రక్రియలో మంగళవారం ఉద్రిక్తత నెలకొంది. వైద్యుల ఆందోళనలతో కౌన్సెలింగ్ నిలిచిపోయింది. తదుపరి కౌన్సెలింగ్ ఎప్పుడన్న అంశంపై అధికారులు స్పష్టత ఇవ్వలేదు.

● రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ మెడికల్, డెంటల్ కాలేజీల్లో పనిచేస్తున్న క్లినికల్, నాన్ క్లినికల్, సూపర్ స్పెషాలిటీస్ సహా డెంటల్ అసిస్టెంట్ ప్రొఫెసర్లకు అసోసియేట్ ప్రొఫెసర్లుగా పదోన్నతి కల్పిస్తూ వైద్య విద్యా సంచాలకుడు(డీఎంఈ) డాక్టర్ రమేశ్‌రెడ్డి ఇటీవల ఉత్తర్వులు జారీచేశారు. మొత్తం 190 మంది డాక్టర్లకు పదోన్నతులు కల్పిస్తూ జాబితా విడుదల చేశారు. వారికి మంగళవారం ఉదయం 10 గంటలకు డీఎంఈ కార్యాలయంలో కౌన్సెలింగ్ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. కానీ ఖాళీలన్నీ చూపకుండా కేవలం అభ్యర్థుల సంఖ్య ప్రకారమే చూపడంపై విమర్శలు వెల్లువెత్తాయి. రాష్ట్ర స్థాయిలో 900 ఖాళీలుండగా, అభ్యర్థుల సంఖ్య ప్రకారమే ఖాళీలు చూపించడం ఏంటని డాక్టర్లు ప్రశ్నించారు. కేవలం తెలంగాణ వచ్చిన తర్వాత ఏర్పడిన కొత్త కాలేజీల్లోనే ఖాళీలు చూపించారని, పాత కాలేజీల్లో ఎందుకు చూపడం లేదని నిలదీశారు. ఉస్మానియా, గాంధీ వంటి మెడికల్ కాలేజీల్లో ఉన్న అన్ని ఖాళీలు ఎందుకు చూపడంలేదని ప్రశ్నించారు.దీనిపై ఉద్రిక్తత నెలకొనడంతో కౌన్సెలింగ్ వాయిదా పడింది.

ఖాళీలను చూపిస్తే హైదరాబాద్‌కే ప్రాధాన్యం..

అన్ని కాలేజీల్లో ఖాళీలను చూపిస్తే పదోన్నతులు పొందిన వారంతా కూడా హైదరాబాద్ లేదా సమీపంలోని మెడికల్ కాలేజీలకే ప్రాధాన్యం ఇస్తారని డీఎంఈ వర్గాలు చెబుతు న్నాయి. కొత్త కాలేజీలకు అసోసియేట్ ప్రొఫెసర్ల అవసరం చాలా ఉందని, దాంతో వాటిని ప్రభుత్వం పదోన్నతుల ద్వారా భర్తీ చేయాలని నిర్ణయించినట్టు చెబుతున్నారు.

అందరూ అలానే అడగరంటున్న వైద్యుల సంఘం

అందరూ ఉస్మానియా, గాంధీ మెడికల్ కాలేజీలనే అడగడం లేదని, అన్ని అసోసియేట్ ప్రొఫెసర్ ఖాళీలు చూపిస్తే వచ్చే నష్టమేమి లేదని తెలంగాణ బోధనా ప్రభుత్వ వైద్యుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ అన్వర్, ప్రధాన కార్యదర్శి జలగం తిరుపతిరావు, ఉపాధ్యక్షుడు డాక్టర్ కిరణ్ మాదల అంటున్నారు.

నిబంధనల మేరకే కౌన్సెలింగ్

జాతీయ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసీ) నిబంధనల ప్రకారం కొత్త మెడికల్ కాలేజీలలో పోస్టుల భర్తీకి మొదటి ప్రాధాన్యం ఇవ్వాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని డీఎంఈ రమేష్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ కళాశాలల్లో అభ్యర్థుల లభ్యత, అవసరాల ఆధారంగా ఖాళీల మ్యాట్రిక్స్ తయారు చేశామన్నారు. కొందరు అనవసరంగా గందరగోళం సృష్టించి కౌన్సెలింగ్ ప్రక్రియను అడ్డుకుంటున్నారని ఆయన ఆరోపించారు. ప్రభుత్వం వివిధ జిల్లాల్లోని కాలేజీల్లో సేవలు చేయాలని కోరుకుంటోందన్నారు.

ఉస్మానియాలో జనరల్ సర్జరీలో 31 మంది, పీడియాట్రిక్స్‌లో 55 మంది, ఓబీజీలో 55 మంది, ఆర్థోలో 19 మంది, అనస్థీషియాలో 25 మంది, జనరల్ మెడిసిన్‌లో 27 మంది, గాంధీలో 23 మంది జనరల్ మెడిసిన్, 26 మంది జనరల్ సర్జరీ, 31 మంది అనస్థీషియా ఫ్యాకల్టీలున్నారని వివరించారు. మిగిలిన చోట్ల నింపాల్సిన అవసర ముందన్నారు. నిలిచిన కౌన్సెలింగ్ ప్రక్రియపై ప్రభుత్వంతో చర్చించి తదుపరి నిర్ణయం తీసుకుంటామని రమేష్ రెడ్డి వివరించారు.

11 ఎకరాలు ఎలా కేటాయించారు?

- కోకాపేటలో విలువైన భూమిని కేబినెట్ అనుమతి లేకుండానే అధికారపార్టీకి కట్టబెట్టారా?
- ప్రభుత్వానికి, బీఆర్ఎస్ పార్టీకి హైకోర్టు నోటీసులు
- కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశం.. విచారణ వాయిదా

సాక్షి, హైదరాబాద్: రంగారెడ్డి జిల్లా గండిపేట మండలం కోకాపేట సర్వే నంబర్ 239, 240లో అత్యంత విలువైన 11 ఎకరాల భూమిని భారత రాష్ట్ర సమితి(బీఆర్ఎస్)కు కేటాయించడంపై రాష్ట్ర ప్రభుత్వానికి, ఆ పార్టీకి హైకోర్టు నోటీసులు జారీ చేసింది. కేబినెట్ అనుమతి లేకుండానే కేటాయించారా అని ప్రశ్నించింది. కేటాయింపుపై కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది. తదుపరి విచారణను ఆగస్టు 16కు వాయిదా వేసింది. బీఆర్ఎస్‌కు 11 ఎకరాల కేటాయింపును సవాల్ చేస్తూ ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ (ఎన్‌జీవో) కార్యదర్శి ఎం.పద్మనాభరెడ్డి హైకోర్టులో పిల్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఎకరం దాదాపు రూ.50 కోట్ల మార్కెట్ విలువైన స్థలాన్ని.. కేవలం రూ.3,41,25,000కే ప్రభుత్వం ముట్టజెప్పిందని.. అలా 11 ఎకరాలకు గానూ దాదాపు రూ.500 కోట్లు ప్రభుత్వానికి నష్టమని పేర్కొన్నారు. దీనిపై మంగళవారం తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అభినంద్‌కుమార్ షావిలి, జస్టిస్ నామవరపు రాజేశ్వర్‌రావు ధర్మాసనం విచారణ చేపట్టింది.

ఇంకా కేబినెట్ నిర్ణయం తీసుకోలేదన్న ప్రభుత్వం

ప్రభుత్వం తరఫున అడిషనల్ అడ్వొకేట్ జనరల్ (ఏఏజీ) జె.రామచందర్‌రావు వాదనలు వినిపిస్తూ.. కోకాపేట్‌లోని 11 ఎకరాల స్థలాన్ని బీఆర్ఎస్ కార్యాలయ నిర్మాణానికి కేటాయించడంపై కేబినెట్ ఇంకా నిర్ణయం తీసుకోలేదన్నారు. కేబినెట్ నిర్ణయం తీసుకున్న తర్వాత ప్రొసీడింగ్ కాపీని పబ్లిక్ డొమైన్‌లో అందుబాటులో ఉంచుతామని చెప్పారు. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది సత్యంరెడ్డి వాదనలు వినిపిస్తూ.. ఎలాంటి టెండర్లు లేకుండానే బీఆర్ఎస్ పార్టీకి అత్యంత విలువైన ప్రాంతంలో భూమిని ప్రభుత్వం కేటాయించిందన్నారు. భూమి కేటాయించి.. నిర్మాణం చేపట్టినా ఇప్పటివరకు పబ్లిక్ డొమైన్‌లో ఆ వివరాలను ఉంచలేదని సత్యంరెడ్డి వెల్లడించారు. దీనికి సంబంధించిన ప్రొసీడింగ్స్ కాపీని అందజేసేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరారు. వాదనలు విన్న ధర్మాసనం .. నాలుగు వారాల్లో కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, హెచ్ఎండీఏ కమిషనర్, భూ పరిపాలన చీఫ్ కమిషనర్, రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌తో పాటు బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శికి నోటీసులు జారీ చేసింది.

నగర వార్తలు

రైతు ఉత్పత్తి సేవా కేంద్రాలు బలోపేతం కావాలి



సమావేశంలో మాట్లాడుతున్న జైపాల్‌రెడ్డి

నాంపల్లి: రైతు ఉత్పత్తిదారుల సేవా కేంద్రాలు మధ్యలోనే నిలిచిపోకుండా నిరంతరాయంగా అటు రైతులకు, ఇటు వినియోగదారులకు వెన్నుదన్నుగా నిలవాల్సిన అవసరం ఉందని రైతు ఉత్పత్తిదారుల సంఘం రాష్ట్ర డైరెక్టర్ జైపాల్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర స్టేట్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నాంపల్లి పబ్లిక్ గార్డెన్స్‌లోని ద అగ్రి హార్టికల్చరల్ సొసైటీ ప్రాంగణంలో రైతు ఉత్పత్తిదారుల సంఘాల చైర్మన్లు, సీఈవోస్, డైరెక్టర్ల సమావేశం జరిగింది.

ఈ సందర్భంగా జైపాల్‌రెడ్డి మాట్లాడుతూ రైతాంగం ఇంకా నిర్మాణాత్మక దశలోనే ఉందని, రైతులు పండించిన ఉత్పత్తులకు గిట్టుబాటు ధరలు లేకుండా పోయిందన్నారు. రాష్ట్రంలో ఎఫ్‌పీఓలను బలోపేతం చేయాలని కోరారు. రాజకీయాలకు అతీతంగా బలమైన వ్యవస్థను రూపొందించాలని సూచించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఏర్పడిన సంఘాలన్నీ వరాహముఖి ఫెడరేషన్‌ను అనుసంధానంగా పని చేస్తాయని తెలిపారు. ఎన్‌సీడీసీ, భారత కిసాన్ సంఘ్, నాబార్డు, నాప్కాన్స్ సంస్థల ప్రోత్సాహం మరింత ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎన్‌సీడీసీ రీజినల్ డైరెక్టర్ వంశీ, భారత కిసాన్ సంఘ్ రాష్ట్ర అధ్యక్షులు జె.శ్రీ రంగరావు, రైతు ఉత్పత్తిదారుల సంఘాల డైరెక్టర్లు సాయిరెడ్డి, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా మాన్‌సూన్ రెగట్టా



సాక్షి, సిటీబ్యూరో: దేశ వ్యాప్తంగా వివిధ రాష్ట్రాలకు చెందిన సెయిలర్స్ నగరంలోని హుస్సేన్‌సాగర్ వేదికగా జరుగుతున్న మాన్‌సూన్ రెగట్టా రేసుల్లో సత్తా చాటుతున్నారు. సాగర్‌లో మంగళవారం వైఏఐ మాన్‌సూన్ రెగట్టా 14వ ఎడిషన్ పోటీలు ఘనంగా ప్రారంభమయ్యాయి. పోటీల్లో భాగంగా అండర్ 19 ఇంటర్నేషనల్ 420 మిక్స్‌డ్ క్లాస్, నేషనల్ ర్యాంకింగ్ అండర్ 15 ఫ్లీట్ ఆఫ్ ఆప్టిమిస్ట్‌ల కోసం 3 రేసులను పూర్తి చేశారు. ఈ రెండు ఫ్లీట్లలో భోపాల్ జట్లు పోటీపడి అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. ఐరాజ్ సెంధవ్–నాన్సీ రాయ్ బృందం, ఏకలవ్య బాథమ్ అగ్రస్థానంలో నిలిచారు. బాలికల విభాగంలో నగరానికి చెందిన దీక్షిత కొమరవెల్లి టాప్ 8 ఫినిషింగ్‌లతో చార్టులో అగ్రస్థానంలో నిలిచింది. ఆమె తర్వాతి స్థానాల్లో భోపాల్‌కు చెందిన షాగున్ ఝా, తమిళనాడుకు చెందిన శ్రేయ కృష్ణ నిలిచారు. 420 మిక్స్‌డ్ క్లాస్‌లో భాగంగా ప్రమాదాలు చోటు చేసుకున్నాయి, కొందరు సెయిలర్లు 7 కంటే ఎక్కువ సార్లు పడిపోయారు. అయినప్పటికీ ప్రతికూల వాతావరణ పరిస్థితులను ఎదుర్కొంటూ రేసులను ముగించారు. టాప్ సీడ్ ధరణి లావేటి రెండో స్థానంలో నిలలవగా, నేవీ బాయ్ స్పోర్ట్స్ స్కూల్–గోవాకు చెందిన వడ్ల మల్లేష్ తన బృందంతో కలిసి మిక్స్‌డ్ క్లాస్‌లో తిరిగి అగ్రస్థానానికి చేరుకోవడానికి నేడు మరికొన్ని రేస్ పాయింట్లు పొందాల్సి ఉంది. 12 ఏళ్లలోపు సెయిలర్లు లైట్ ఫ్లీట్ సెషన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా భోపాల్‌కు చెందిన నాన్సీ రాయ్ మాట్లాడుతూ., తాను సురక్షితంగా రేస్ ముగించానని, తన కోచ్ అనిల్ శర్మ సలహాలతో మంచి రేస్‌ను కొనసాగించినట్లు తెలిపాడు. నగరానికి చెందిన ది యాచ్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ ఆధ్వర్యంలోని అలర్ట్ సేఫ్టీ టీమ్‌లు ఆపదలో ఉన్న పడవలకు సహాయం అందించాయి.

మొదలైన 14వ ఎడిషన్ పోటీలు..

- సాగర్ వేదికగా పోటీల్లో పాల్గొంటున్న వివిధ రాష్ట్రాల సెయిలర్స్ ..
- అండర్ 19 ఇంటర్నేషనల్ 420 తదితర విభాగాల్లో రేసులు..

దేశంలోనే అత్యధిక సీసీ కెమెరాలు నగరంలోనే

మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్..

సనత్‌నగర్: దేశంలోనే అత్యధిక సీసీ కెమెరాలను ఏర్పాటు చేసిన నగరంగా హైదరాబాద్‌కు గుర్తింపు ఉందని రాష్ట్ర పశు సంవర్ధక, మత్స్య, పాడి పరిశ్రమలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. నగరంలోనే అత్యధిక సీసీ కెమెరాలను సనత్‌నగర్ నియోజకవర్గంలో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నియోజకవర్గ పరిధిలోని పోలీసు అధికారులతో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ తెలంగాణ సచివాలయంలోని తన ఛాంబర్‌లో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణలో సీసీ కెమెరాల పాత్ర కీలకమన్నారు. సనత్‌నగర్ నియోజకవర్గ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు కోసం తన అసెంబ్లీ నియోజకవర్గ అభివృద్ధి నిధుల నుంచి రూ.1.5 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. 100 మంది పోలీసులు చేయగల పని ఒక్క సీసీ కెమెరా చేస్తుందన్నారు. సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని పలు కాలనీలు, బస్తీల నుంచి విజ్ఞప్తులు వస్తున్నాయని, నియోజకవర్గ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో నూటికి నూరు శాతం సీసీ కెమెరాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. ప్రస్తుతం ఉన్న సీసీ కెమెరాల పనితీరును తరచూ పర్యవేక్షించాలని పోలీసు అధికారులను ఆదేశించారు. సమావేశంలో జాయింట్ కమిషనర్ గజారావు భూపాల్, ఐటీ విభాగం ఏసీపీ చాంద్‌పాషా, ఇన్‌స్పెక్టర్ విశాల్, నార్త్ జోన్ డీసీపీ చందనాదీప్తి, ఏసీపీలు రమేష్, పృథ్వీధర్‌రావు, మోహన్‌కుమార్, విజయపాల్‌రెడ్డి, గాంధీనగర్, సనత్‌నగర్ ఎస్‌హెచ్ఓలు మోహన్‌రావు, బాలరాజ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి తలసాని

నిర్బంధ చట్టాలను వ్యతిరేకించాలి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: దేశంలో అమలు చేస్తున్న నిర్బంధ చట్టాలు, రాజ్యహింసను వ్యతిరేకించాలని ప్రొఫెసర్ హరగోపాల్ అన్నారు. మంగళవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో అమరుల బంధుమిత్రుల సంఘం 21వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా అక్రమ కేసులు, రాజ్యహింసకు వ్యతిరేకంగా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడుతూ దేశంలో రోజు రోజుకు నిర్బంధ చట్టాలను ప్రవేశపెడుతూ ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. హక్కుల నేతలు, మేధావులు, ఉపాధ్యాయులు, న్యాయవాదులు తదితరులపై ఉపా కేసులను బనాయించి దేశద్రోహం కింద కేసులు నమోదు చేసి భయాందోళనకు గురి చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇటీవల తెలంగాణ రాష్ట్రంలో 152 మంది పై ఉపా కేసులను పెట్టారని తెలిపారు. ఇలాంటి కేసులతో ప్రజల హక్కుల కోసం పోరాడుతున్న వారిని భయపెట్టలేరన్నారు. పీఓడబ్ల్యూ జాతీయ అధ్యక్షురాలు సంధ్య మాట్లాడుతూ ప్రజలను మతం పేరుతో నిలువునా చీల్చి గొడవలు సృష్టిస్తున్నారని. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దమన నీతి, దోపిడీ విధానాలను ప్రశ్నిస్తున్న మేధావులు, రచయితలపై నిర్బంధ చట్టాలను ఉపయోగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం ఆనంద్ స్మృతి రచనలు సంపుటి దండకారణ్యం, అతడి చిరునామా, ఎల్ఎస్ఎన్‌మూర్తి స్మృతి రచనల సంకలనం శరత్‌చంద్రిక పుస్తకాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ సుజాత, లక్ష్మణరావు, సత్య, భవానీ, పానీ, కాకరాల, ఎస్.రవి, పద్మకుమారి, అంజమ్మ, అరసవిల్లి కృష్ణ, జగదీశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.



పుస్తకాలను ఆవిష్కరిస్తున్న అతిథులు

యువ శాస్త్రవేత్తలు వ్యవసాయ రంగ అభివృద్ధికి తోడ్పడాలి

నాబార్డ్ ఛైర్మన్ కేవీ షాజీ

ఏజీవర్సిటీ: దేశంలో వ్యవసాయ రంగంతో పాటు వ్యవసాయ అనుబంధ రంగాల అభివృద్ధికి యువ శాస్త్రవేత్తలు నిరంతర పరిశోధనలు చేయాలని నాబార్డ్ చైర్మన్ కే.వీ షాజీ అన్నారు. మంగళవారం రాజేంద్రనగర్‌లోని నేషనల్ అకాడమీ అగ్రికల్చరల్ రీసెర్చ్ మేనేజ్‌మెంట్ (నార్మ్స్)లో 113 ఏఆర్ఎస్ ఫౌండేషన్ కోర్సు (అగ్రికల్చర్ రీసెర్చ్ సర్వీస్) ప్రారంభమైంది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన నాబార్డ్ చైర్మన్ ప్రొబేషనరీ వ్యవసాయ శాస్త్రవేత్తలను ఉద్దేశించి మాట్లాడారు. పంట దిగుబడి పెంచాలని, నష్టాలను తగ్గించడానికి నూతన సాంకేతికతను అందుబాటులోకి తీసుకురావాలన్నారు. సాంకేతిక ఫలాలు రైతులకు సరైన సమయంలో అందేలా చూడాలన్నారు. ఆర్‌బీఐ ద్వారా భారత ప్రభుత్వం నిధులు, రుణాల పంపిణీ రైతుల ప్రయోజనాల కోసం వ్యవసాయ రంగ సమగ్రతపై ఆయన వివరించారు. నారమ్స్ డైరెక్టర్ సీహెచ్ శ్రీనివాస్‌రావు ప్రొబెషనరీ శాస్త్రవేత్తల ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో నారమ్స్ జాయింట్ డైరెక్టర్ జి వెంకటేశ్వర్లు, డాక్టర్ ఎస్.విజయ్, అధ్యాపకులు, శాస్త్రవేత్తలు, అధికారులు పాల్గొన్నారు.

కృష్ణ ఆదిత్య బాధ్యతల స్వీకరణ



కృష్ణ ఆదిత్య

సనత్‌నగర్: తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి సభ్య కార్యదర్శిగా కృష్ణ ఆదిత్య మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు సభ్య కార్యదర్శిగా పని చేసిన నీతూ ప్రసాద్.. కృష్ణ ఆదిత్యకు బాధ్యతలు అప్పగించారు. కార్యక్రమంలో టీఎస్‌పీసీబీ చైర్మన్ రాజీవ్‌శర్మ తదితరులు పాల్గొన్నారు. కృష్ణ ఆదిత్య ములుగు జిల్లా కలెక్టర్‌గా పని చేసి బదిలీపై వచ్చిన విషయం విదితమే.

టీచర్ పోస్టులు వెంటనే భర్తీ చేయాలి

పాఠశాల విద్యాశాఖ కార్యాలయం ముట్టడి



ముట్టడిలో పాల్గొన్న నీల వెంకటేష్ తదితరులు

ఖైరతాబాద్: ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న 44వేల టీచర్ పోస్టులను భర్తీ చేసి, విద్యా ప్రమాణాలు పెంచాలని డిమాండ్ చేస్తూ మంగళవారం నిరుద్యోగ జేఏసీ చైర్మన్ నీల వెంకటేష్ ఆధ్వర్యంలో పాఠశాల విద్యాశాఖ కార్యాలయాన్ని ముట్టడించారు. ఈ సందర్భంగా నీల వెంకటేష్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో 24వేల టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నా భర్తీ చేయకుండా ప్రభుత్వం విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేస్తుందన్నారు. పర్మనెంట్ టీచర్ పోస్టులను భర్తీ చేయకుండా తాత్కాలిక పద్ధతుల్లో టీచర్లను నియమించి విద్యా వ్యవస్థను పాడు చేస్తున్నారన్నారు. సర్కారు విద్యను ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కులాల విద్యార్థులకు విద్యను దూరం చేసేందుకు ప్రభుత్వం కుట్ర చేస్తుందన్నారు. రాష్ట్రంలో 7లక్షల మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ కులాలకు చెందిన బీఈడీ, డీఈడీ అభ్యర్థులు ఉన్నారన్నారు. వీరందరికి ఉద్యోగ అవకాశాలు లేకుండా చేసి వారి ఆత్మగౌరవాన్ని దెబ్బ తీసేందుకు ప్రభుత్వం కుట్ర చేస్తుందన్నారు. కార్పొరేట్ విద్యాసంస్థలు ప్రజలను దోచుకుని అప్పుల పాలు చేస్తున్నాయన్నారు. కార్యక్రమంలో బీఎడ్ టీచర్స్ రాష్ట్ర అధ్యక్షుడు రామ్మోహన్‌రావుతో పాటు రాష్ట్ర బీసీ యువజన సంఘం నాయకులు పాల్గొన్నారు. ముట్టడిలో పాల్గొన్న వారిని పోలీసులు అరెస్ట్ చేయడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది.

ట్రైనీ ఐపీఎస్ అధికారుల క్షేత్రస్థాయి పర్యటన

బంజారాహిల్స్: నేషనల్ పోలీస్ అకాడమీలో శిక్షణ పొందుతున్న ఇద్దరు ఐపీఎస్ అధికారులు మంగళవారం వెస్ట్‌జోన్ పరిధిలోని పోలీస్ స్టేషన్లను సందర్శించారు. ఫిర్యాదులను స్వీకరిస్తున్న విధానం, ఎఫ్ఐఆర్‌లు, చార్జిషీట్‌లు తదితర అంశాలను తెలుసుకున్నారు. అనంతరం వారు బంజారాహిల్స్ రోడ్ నెం. 2లోని ఇందిరానగర్ పోచమ్మ దేవాలయం వద్ద బోనాల పండుగ, రంగం కార్యక్రమాన్ని తిలకించారు. అనంతరం అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ వేడుకల సందర్భంగా పోలీసు బందోబస్తు తీరుతెన్నులను పరిశీలించారు.



బీజేపీ, బీఆర్ఎస్‌ల మధ్య లోపాయికారి ఒప్పందం

మాజీ ఎంపీ రేణుకా చౌదరి

కీసర: కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని బీఆర్ఎస్ పార్టీలు రెండూ ఒక్కటేనని మాజీ కేంద్ర మంత్రి రేణుకాచౌదరి అన్నారు. మంగళవారం కీసరలోని లక్ష్మీగార్డెన్‌లో నిర్వహించిన మేడ్చల్ నియోజకవర్గ మహిళా కాంగ్రెస్ నేతల ఆత్మీయ సమేళనంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని బీఆర్ఎస్ ప్రభుత్వాలు లోపాయికారి ఒప్పందంతోనే ముందుకెళ్తున్నాయన్నారు. అటు కేంద్ర ప్రభుత్వం, ఇటు రాష్ట్ర ప్రభుత్వం పేదలకు చేసిందేమీ లేదన్నారు. బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రంలో మహిళల జీవితాలు దుర్భరంగా మారాయన్నారు. డ్వాక్రా సంఘాల మహిళలకు సున్నా వడ్డీ కింద రావాల్సిన నిధులను బీఆర్ఎస్ ప్రభుత్వం విడుదల చేయడం లేదని ఆరోపించారు. మేడ్చల్ నియోజకవర్గ పరిధిలోని 3389 డ్వాక్రా గ్రూపులకు ఒక్కో గ్రూపునకు రూ. 5.4 లక్షలు అందాల్సి ఉందన్నారు. కాంగ్రెస్ పాలనలో అన్నివర్గాల ప్రజలకు న్యాయం జరిగిందని, పేదలు, మహిళలకు ప్రత్యేక పథకాలను అమలు చేశామన్నారు. డ్వాక్రా సంఘాల మహిళలకు సున్నా వడ్డీ రుణాలు అందించిన ఘనత కాంగ్రెస్ పార్టీకి దక్కుతుందన్నారు. త్వరలో జరిగే ఎన్నికల్లో దేశంలో ఇటు రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే మహిళల సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తామన్నారు. రూ 500కే వంట గ్యాస్ అందిస్తామన్నారు. త్వరలో ప్రకటించే మహిళా డిక్లరేషన్‌లో మహిళ సంక్షేమానికి కాంగ్రెస్ అమలు చేయనున్న పథకాలను తెలియజేస్తామన్నారు . రాష్ట్ర మహిళా కాంగ్రెస్ కార్యదర్శి పాలడుగుల పద్మ, మేడ్చల్ నియోజకవర్గ ఏ, బి, బ్లాక్ మహిళ అధ్యక్షురాలు, అనంతలక్ష్మి, బి.అనిత మాట్లాడుతూ కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపుకోసం కష్టపడి పనిచేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో టీపీసీసీ అధికార ప్రతినిధి సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి, మేడ్చల్ నియోజకవర్గ బిబ్లాక్ అధ్యక్షుడు మహేష్‌గౌడ్, వివిధ మండలాల నాయకులు, మహిళా నేతలు, తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌మేకర్

చేతిలో పలుగూ పార
నెత్తిన పచ్చగడ్డి
నుదుటిన ఎప్పుడూ దొర్లే చెమట...
కాని గుండెల నిండా చదువు పూర్తి చేయాలన్న
సంకల్పం.
మహా మహా సౌకర్యాలు ఉండి కూడా
పీహెచ్‌డీ కల నెరవేర్చుకోలేని వారు
చకితమయ్యేలా-
ఏ సౌకర్యాలూ లేని వాళ్లు
కొండంత స్ఫూర్తి పొందేలా
వ్యవసాయ కూలీ భారతి
మొన్న (సోమవారం)
పీహెచ్‌డీ పట్టా అందుకుంది.
అనంతపురంలో
ఈ అద్భుతం జరిగింది.

ఈమె డాక్టర్ భారతి ఎందరికో స్ఫూర్తి


గడ్డిమోపు తెస్తున్న భారతి


డాక్టరేట్ పట్టాతో భారతి

సాకే భారతి రెండు రోజుల క్రితం ఆంధ్రప్రదేశ్ గవర్నర్ అబ్దుల్ నజీర్ చేతుల మీదుగా అనంతపురం ఎస్.కె.యూనివర్సిటీలో రసాయన శాస్త్రంలో పీహెచ్‌డీ పట్టా తీసుకుంది. ఆమె పుట్టి పెరిగిన సామాజిక వర్గం (ఎరుకల)లో, ఆమె నివసిస్తున్న శింగనమల మండలం నాగుల గుడ్డం గ్రామంలో ఆమె సాధించింది ఎంత పెద్ద ఘనకార్యమో చాలా మందికి తెలియదు. అసలు సాకే భారతి చదువుకుంటూ ఉంటేనే 'చదువెందుకు' అని చాలామంది స్త్రీలు ఆశ్చర్యపోయేవారు. 'మేము ఏం చదివామని సుబ్రంగా కాపురాలు చేస్తున్నాం' అని కూడా అనేవారు. కాని చదువు తెచ్చే వెలుతురు భారతికి బాగా తెలుసు. ఈ మెట్టు తర్వాత తనకు ప్రొఫెసర్‌గానో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గానో ఉద్యోగం వస్తే మారబోయే తన జీవితమూ తెలుసు. తనను చూసైనా తన వర్గంలో తనలాంటి సామాజిక వర్గాల్లో స్ఫూర్తి రావాలని ఆమె కోరిక.

■ ముగ్గురు ఆడపిల్లలు

తల్లిదండ్రులకు పుట్టిన ముగ్గురు ఆడపిల్లల్లో సాకే భారతి రెండో సంతానం. తండ్రికి చదువు లేదు. పైగా ముగ్గురూ ఆడపిల్లలే పుట్టారని, అబ్బాయి పుట్టలేదని భార్యను ఇబ్బంది పెట్టేవాడు. తను కూడా చాలా అస్థిమితంగా ఉండేవాడు. ఇంట్లో వాతావరణం ఏమీ బాగుండేది కాదు. అప్పుడు భారతి తాత భారతితో అన్నమాట ఆమె జీవితాన్ని మలుపు తిప్పింది- అమ్మా... నా కూతుర్ని మీ నాన్నకు ఇస్తే ఇలా ఇబ్బంది పెడుతున్నాడు. ఆడపిల్లకు ఏం తక్కువ? బాగా చదువుకుంటే ఎన్నో గొప్ప పనులు చేయవచ్చు. నువ్వు బాగా చదువుకుని మీ నాన్న కళ్లు తెరిపియ్యాలి' అన్నాడు. ఆ రోజు నుంచి భారతి గట్టిగా చదువుకోవాలనుకుంది. ఇవాళ్టికీ చదువుకుంటూనే ఉంది.

2016లో పీహెచ్‌డీ సీటు

2016లో సాకే భారతి ఎస్.కె. యూనివర్శిటీలో ప్రొఫెసర్ ఎం.సి.ఎస్ శోభ దగ్గర ఆర్గానిక్ కెమిస్ట్రీలో పిహెచ్.డి ప్రవేశం పొందింది. పిహెచ్.డిలో చేరడంతో ప్రభుత్వం నుంచి వచ్చే ఉపకార వేతనం భారతి చదువుకు సహాయపడింది. దీంతోపాటు కూలి పనులకు వెళ్తూ 2023 సంవత్సరానికి పట్టా పొందింది. స్లిప్పర్లతో, అతి సాదా బట్టలతో స్నాతకోత్సవంలో పట్టా అందుకోవడానికి భారతి స్టేజీ ఎక్కితే ఆడిటోరియం అంతా చప్పట్లతో మార్మోగిపోయింది.


భర్త, కుమార్తెతో రేకుల ఇంట్లో భారతి

■ ఎన్నో కష్టాలు

భారతి మూడో క్లాసుకు వచ్చేసరికి చిన్న చెల్లెలు పుట్టింది. తల్లిదండ్రులు ఇద్దరూ కూలికి వెళ్లాలి. అక్క బడికెళ్లాలి. చెల్లెల్ని ఎవరు చూసుకోవాలి? రెండేళ్లు బడి మానేసి ఇంట్లో చెల్లెల్ని చూసుకుంటూ ఉండిపోయింది భారతి. ఆ తర్వాత పదో క్లాస్‌లో పెళ్లి చేశారు. అప్పుడు కూడా ఒక సంవత్సరం చదువు సాగలేదు. పెళ్లయ్యాక నివాసానికి ఇల్లు లేకపోవడంతో రేకుల షెడ్డు వేసుకుని అందులోనే ఉన్నారు. అక్కడే ఒక రోజు కాలేజీకి వెళుతూ ఒకరోజు కూలి పనికి వెళుతూ చదువుకుంది భారతి. ఇంటర్ (ఎం.పి.సి.)లో రోజు కూలి పాతిక రూపాయలు, డిగ్రీ (బిఎస్సీ)లో రోజు కూలి యాభై రూపాయలు వచ్చేది. ఈ లోపు కూతురు పుట్టింది. పాటలంటే చాలా ఇష్టమున్న భారతి తన కూతురికి 'గాయని' అని పేరు పెట్టింది. పెళ్లి, సంసారం వల్ల చదువు మీద శ్రద్ధ ఉండటం లేదని భారతి బాధ పడుతుంటే భర్త ఏరికుల శివప్రసాద్ ఇంటర్ చదువు కొనసాగేలా ప్రోత్సహించాడు. పామిడిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్, అనంతపురం ఎస్ఎస్‌బీఎన్ డిగ్రీ కళాశాలలో బీఎస్సీ, అనంతపురంలోనే ఎమ్మెస్సీ పూర్తి చేసింది. గ్రామం నుంచి కళాశాలకు పోవడానికి రవాణా సౌకర్యం లేకపోవడంతో రోజూ ఎనిమిది కిలోమీటర్లు గార్లదిన్నెకు నడుచుకుంటూ వెళ్లి అక్కడ నుంచి ఆర్టీసీ బస్సులో అనంతపురం వెళ్లి చదువుకుంది. డిగ్రీలో భారతి ఫస్ట్ క్లాస్ తెచ్చుకుంది. ఆ తర్వాత ఎమ్మెస్సీ పూర్తి చేసింది.

■ ఇల్లు లేదు.. ఉద్యోగం లేదు

భారతి నివసిస్తున్న ఇల్లు అసంపూర్ణ స్థితిలో ఉంది. గతంలో ఇందిరమ్మ ఇల్లు శాంక్షన్ అయితే డబ్బులేక నిర్మాణం సగంలోనే ఆపేయాల్సి వచ్చింది. ప్రొఫెసర్ కావాలన్నదే భారతి కోరిక. 'ప్రొఫెసర్ ఉద్యోగం వస్తే నేను నేర్చుకున్న జ్ఞానాన్ని మరి కొంతమంది విద్యార్థులకు పంచి చదువులో రాణించే విధంగా కృషి చేస్తాను' అంది భారతి. పీహెచ్‌డీ పట్టా వచ్చాక దానిని ఇంట్లో పెట్టి కూలి పనికి వెళుతోంది భారతి. టొమాటో చేనులో, బెండకాయ చేనులో పని చేస్తోంది. ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 2 వరకు పని చేస్తే 150 రూపాయలు వస్తున్నాయి.

– రుషింగప్పగారి మునెప్ప,
శింగనమల, సాక్షి

పచ్చని సంసారానికి.. ఆకుపచ్చని ఆర్మీ

పచ్చని సంసారానికి గ్రీన్ ఆర్మీ కావాలి అంటున్నారు వారణాసిలోని కుషియారి గ్రామ వాసులు. ఈగ్రామంలో దళితులు, గిరిజనులు, వెనుకబడిన కులాల వాళ్లే ఎక్కువ. నిరుపేదలు కావడంతో విద్యాగంధం ఉన్న వాళ్లు తక్కువ. ఆర్థిక పరిస్థితులు అంతంతమాత్రమే. చాలా కుటుంబాల్లో.. పెద్దరికం వహించాల్సిన భర్తలు తాగుడు, మత్తుపదార్థాలకు బానిసలై భార్యలను కొట్టడం, తిట్టడం, ఇంట్లో ఖర్చులకు డబ్బులు అడిగితే తన్ని తరిమేయడం సర్వసాధారణమైంది. గత కొన్నేళ్లుగా భర్తల తీరుతో విసిగిపోయిన గ్రామ మహిళలకు రవి మిశ్రా అనే టీచర్ చుక్కానిలా దారిచూపుతున్నాడు.

భర్త బాధితురాలైన ఆశాదేవిని కలిసిన మిశ్రా... సమస్యలు ఆమె ఒక్కదానికే కాదు, ఆమె ఇరుగు పొరుగు వారి పరిస్థితులు కూడా అలానే ఉన్నాయని తెలుసుకున్నాడు. మీరంతా కలసికట్టుగా ఉంటే ఇవేమీ పెద్ద సమస్యలు కాదని చెప్పి, ఆశాదేవితోపాటు మరికొంతమంది మహిళలను కూడగట్టుకుని 2014లో 'గ్రీన్‌ఆర్మీ'ని ప్రారంభించారు. వ్యసనాలకు బానిసలైన భర్తలకు కౌన్సెలింగ్ ఇచ్చి సరైన దారిలో నడిపించడమే ఈ ఆర్మీ ముఖ్య ఉద్దేశ్యం. ఆర్మీలోని సభ్యులు పచ్చని రంగు చీర కట్టుకుని, కర్రలు పట్టుకుని ఎవరైనా ఇంట్లో భర్తలు తాగి గొడవచేస్తుంటే వెళ్లి ఆ వ్యక్తికి కౌన్సెలింగ్ ఇచ్చి సాధారణ స్థితికి తీసుకొస్తారు. లిక్కర్, మత్తుపదార్థాలకు బానిసలైన వారికి రకరకాలుగా కౌన్సెలింగ్ ఇచ్చి మంచి మనుషులుగా మార్చడానికి కృషిచేస్తోంది.


తాగుడుకు బానిసైన వ్యక్తికి కౌన్సెలింగ్ ఇస్తున్న గ్రీన్ ఆర్మీ

భర్తలతోపాటు.. గ్రామాభివృద్ధికి

ప్రస్తుతం ఈ ఆర్మీలో 1800 మంది సభ్యులు ఉన్నారు. ఈ ఆర్మీ చేస్తోన్న కార్యకలాపాలు చూసిన ఎంతోమంది ఇతర గ్రామాల్లో గులాబీ గ్యాంగ్ వంటి రకరకాల పేర్లతో ఆర్మీలను ఏర్పాటు చేసి సమస్యలను పరిష్కరించుకుంటున్నారు. మహిళలు తమను తాము రక్షించుకొనేందుకు ఆత్మరక్షణ విద్యలలో ప్రత్యేకంగా శిక్షణ ఇస్తున్నారు. వారణాసి, మీర్జాపూర్ జిల్లాల్లోని చాలామంది మహిళలు ఈ ఆర్మీ ద్వారా భర్తలను మార్చుకుని సంతోషంగా జీవిస్తున్నారు. మూర్ఖపు భర్తలను మార్చడంతోపాటు, గృహహింస, వరకట్నం, మూఢాచారాలు నిర్మూలించేందుకు ఆర్మీలు కృషి చేస్తున్నాయి. ఈ ఆర్మీల వల్ల కుటుంబ పరిస్థితులు మెరుగుపడడమేగాక, గ్రామాలు అభివృద్ధి బాటలో నడుస్తున్నాయి.


సెల్ఫ్ డిఫెన్స్‌లో శిక్షణ

''నా పేరు ఆశాదేవి. పద్నాలుగేళ్లకే పెళ్లి అయ్యింది. ఐదుగురు పిల్లలు. నా భర్త ఎప్పుడూ కొట్టేవాడు. గర్భవతినని కూడా చూడకుండా హింసించేవాడు. పిల్లలు ఎదిగే కొద్దీ ఖర్చులు కూడా పెరిగాయి. కానీ ఆయన మాత్రం తాగడం మానలేదు. నన్ను కొట్టడం ఆపలేదు. ఆయన కొట్టిన దెబ్బలకు రాత్రులకు నిద్రపట్టేది కాదు.


గ్రీన్ ఆర్మీ సభ్యులతో రవి మిశ్రా

మూలుగుతూ పడుకున్న నన్ను మళ్లీ మళ్లీ కొట్టేవాడు. చలికాలం ఇంటి బయటకు నెట్టేసేవాడు. బాధలు తట్టుకోలేక చచ్చిపోదామని నిప్పు అంటించుకున్నాను. కానీ వేరేవాళ్లు కాపాడడంతో ప్రాణాలు రవి మిశ్రా హోప్ వెల్ఫేర్ ట్రస్ట్‌వాళ్లతో కలసి మా గ్రామానికి వచ్చారు. అప్పుడు నా పరిస్థితి, పిల్లలు స్కూలుకు కూడా వెళ్లడంలేదని తెలుసుకున్నారు. నేను నా బాధల గురించి వివరించాను. వారు ఇచ్చిన కౌన్సెలింగ్‌తో ఆయన తాగడం మానేశాడు. ఎనిమిదేళ్లుగా మంచి వ్యక్తిగా మారి, నన్ను పిల్లల్ని బాగా చూసుకుంటున్నాడు. ఆ తరువాతే నాలాంటి మహిళలను ఆదుకునేందుకు మిశ్రా తో కలిసి గ్రీన్ ఆర్మీని ఏర్పాటు చేశాము.'' ఆశా దేవిలాంటి వందలమంది మహిళలు గ్రీన్ ఆర్మీ ద్వారా సంసారాలను చక్కబెట్టుకుని ఆనందంగా జీవిస్తున్నారు.

కిచెన్‌టిప్స్

పకోడీలు, బజ్జీలు క్రిస్పీగా రావాలంటే...

● పిండిని కలిపేటప్పుడు ఉండలు లేకుండా చక్కగా కలుపుకోవాలి. ● అరగంట ముందే పిండిని చల్లని నీటితో కలిపి పక్కన పెట్టుకోవాలి. ● పకోడీలు, బజ్జీలను నూనెలో వేసి డీప్‌ఫ్రై చేసేటప్పుడు పదేపదే తిప్పకూడదు. ఎక్కువగా తిప్పితే మెత్తగా మారతాయి. అవసరాన్ని బట్టి అప్పుడప్పుడు మాత్రమే తిప్పుతూ ఫ్రైచేయాలి. ● పచ్చిమిర్చి, పాలకూర, వంకాయ, అరటికాయ, బంగాళ దుంప వంటివాటితో బజ్జీలు వేసేముందు శుభ్రంగా కడిగి, కాటన్ గుడ్డతో తడిలేకుండా తుడిచి ఫ్యాన్ గాలికింద ఆరబెట్టాలి. తరువాత పిండిలో ముంచితే ముక్కలకు పిండి చక్కగా అంటుకుని బజ్జీలు క్రిస్పీగా, క్రంచీగా వస్తాయి.



యూత్ పల్స్

పాఠం కోసం ఫారిన్ వెళదాం చలోచలో!


ప్రతీకాత్మక చిత్రం

ఇంగ్లాండ్‌లో అడుగు పెడుతూనే 'ఎలాగో జ్ఞాపకం పెట్టుకొని కుడికాలే పెట్టాను. నిజానికి అదృష్టం బాగుంటే ఏ కాలు పెట్టినా ఇబ్బంది లేదు. బాగుండకపోతే ఏ కాలు పెట్టినా ఒక్కటే' అనుకుంటాడు పార్వతీశం. బారిష్టరు చదువు కోసం చిన్న పల్లెటూరు నుంచి ఇంగ్లాండ్‌కు వెళ్లిన పార్వతీశం తెలియని భాష, మనుషులు, సంస్కృతుల వల్ల ఎన్నో ఇబ్బందులు పడుతూ మనల్ని తెగ నవ్విస్తాడు. కాలం మారినంత మాత్రాన, చదువు కోసం వెళ్లినవారికి దేశం కాని దేశంలో సమస్యలు ఉండవని కాదు. అవి వేరే రకంగా ఉండవచ్చు. అవి ఏ రకంగా ఉన్నా సరే... యూత్ వాటిని లైట్‌గా తీసుకుంటుంది. విదేశీ యూనివర్శిటీలలో చదువుపై బోలెడు లవ్వు చూపుతోంది...

విదేశీ చదువు అనేది ఒకప్పుడు సంపన్న వర్గాల వారికి మాత్రమే పరిమితమైన విషయం. అయితే ఇప్పుడు దృశ్యం మారింది. ఆర్థికస్థాయి, చిన్నా, పెద్దా పట్టణాలు అనే తేడా లేకుండా ఎంతోమంది విద్యార్థులు విదేశాలకు వెళుతున్నారు. ఎనభైలలో ఫారిన్ యూనివర్శిటీ అంటే ఎక్కువమందికి అమెరికాలోని యూనివర్శిటీలు మాత్రమే. ఇప్పుడు అమెరికా, ఆస్ట్రేలియా, కెనడాలతో పాటు రిమోట్ ఈస్ట్ యూరోపియన్ దేశాలపై కూడా యువత ఆసక్తి ప్రదర్శిస్తోంది.

'ఎందుకు ఇలా?' అనే ప్రశ్నకు రకరకాల సమాధానాలు వినిపిస్తాయి. అందులో ఒకటి...

'పాఠ్యపుస్తకాలను, తరగతి గదినీ దాటి మన విద్యావ్యవస్థ బయటికి రాలేకపోతోంది. పాఠ్యాంశం యూత్‌కు దగ్గర కాలేపోతోంది'

దిల్లీకి చెందిన పద్దెనిమిది సంవత్సరాల శ్రేయకు ఎన్విరాన్‌మెంటల్ టెక్నాలజీ అంటే ఆసక్తి. ఆ ఆసక్తి ఆమెను అమెరికాలోని 'జార్జియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ' వరకు తీసుకువచ్చింది. 'ఈ యూనివర్శిటీ డిగ్రీ మాత్రమే ఇవ్వదు. ఎంతో అనుభవ జ్ఞానాన్ని ఇస్తుంది' అంటుంది శ్రేయ. ఫ్లెక్సిబుల్ కరికులమ్ నుంచి ప్రపంచంలోనే అత్యున్నతమైన బోధన సిబ్బంది వరకు ఆ యూనివర్శిటీ గురించి చెప్పుకోదగిన అంశాలను ప్రస్తావిస్తుంది శ్రేయ.

'విద్యార్థులు తమను తాము వ్యక్తీకరించుకునే అనుభవ జ్ఞానాన్ని విదేశీ విశ్వవిద్యాలయాలు ఇస్తాయి' అంటున్నారు దిల్లీ యూనివర్శిటీ మాజీ వైస్-ఛాన్సలర్ దినేష్ సింగ్. అయితే 'అత్యున్నత ప్రమాణాలతో కూడిన చదువు' మాత్రమే మన విద్యార్థులు దేశం దాటడానికి కారణం కావడం లేదు.

'భిన్నమైన సాంస్కృతిక వాతావరణంలో గడపడం, ఇతర దేశాల విద్యార్థులతో కలిసి చదువుకొనే అవకాశం దానికదే ఒక ఎడ్యుకేషన్' అనే అభిప్రాయం కూడా విదేశీ విశ్వవిద్యాలయాలపై ఆసక్తికి కారణం అవుతుంది.

'విదేశీ యూనివర్శిటీలలో చదువుకోవడం అనేది మన విద్యావ్యవస్థను తక్కువ చేయడం కాదు. మన పరిధిని విస్తృతం చేసుకోవడం మాత్రమే' అంటుంది పుణెకు చెందిన సుమన.

దిల్లీకి చెందిన 19 సంవత్సరాల సైబా బజాజ్ కెనడాలోని 'యూనివర్శిటీ ఆఫ్ మనిటోబ'లో కంప్యూటర్ సైన్స్ చదువుతోంది.

'విదేశాలలో చదువు అనేది డిగ్రీలను మించినది. ఇది ఒక రకంగా సెల్ఫ్-జర్నీ' అంటుంది సైబా.

బెంగళూరుకు చెందిన ప్రతిభా జైన్ గ్రాఫిక్ డిజైనింగ్ కోర్సు చేయడానికి యూకేకు వెళ్లాలనుకుంటోంది. ఈ మాత్రం దానికి అక్కడిదాకా వెళ్లాలా! అనిపిస్తుందిగానీ ప్రతిభ వెర్షన్ వేరు.

'యూకేకు వెళ్లాలనుకోవడానికి కారణం... అక్కడి యూనివర్శిటీ ఫర్ ది క్రియేటివ్ ఆర్ట్స్‌కి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ విషయంలో ప్రపంచంలో పెద్ద పేరు ఉండడం ఒక కారణం అయితే, సాంస్కృతిక వైవిధ్యం, గ్లోబల్ ఎక్స్‌పోజర్ అనేది రెండో కారణం. మూడోకారణం ఒకేరకమైన అభిరుచులు ఉన్న వారితో, సబ్జెక్ట్‌కు సంబంధించిన నిపుణులతో కలిసి నెట్‌వర్క్‌గా ఏర్పడే అవకాశం ఉండడం' అంటుంది ప్రతిభ.

జాబ్ మార్కెట్‌లో సులువుగా విజయం సాధిస్తారు అనే ధీమా వల్ల, మల్టీ కల్చరల్ యూనివర్శిటీలలో తమ పిల్లలను చదివించడానికి పేరెంట్స్ ఆసక్తి చూపుతున్నారు.

పక్కా ఫైనాన్స్ ప్లానింగ్, ఎడ్యుకేషన్ లోన్‌ల వల్ల పిల్లలను విదేశీ యూనివర్శిటీలలో చదివించడం చాలామంది పేరెంట్స్‌కు పెద్ద సమస్య కావడం లేదు. తల్లిదండ్రుల ఆసక్తిని గమనించి నాన్-బ్యాంకింగ్ ఫైనాన్స్ కంపెనీ(ఎన్‌బీఎఫ్‌సీ)లు ఎడ్యుకేషన్ లోన్స్‌పై ప్రత్యేక దృష్టి పెడుతున్నాయి. మరోవైపు 'అబ్రాడ్ ఎడ్యుకేషన్ లోన్స్'కు బెస్ట్ ఎన్‌బీఎఫ్‌సీలు ఏమిటి? అని తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నారు పేరెంట్స్.

టెస్ట్-ప్రిపేరేషన్, కంట్రీ, కోర్సు, యూనివర్శిటీ ఎంపిక, డాక్యుమెంటేషన్ ప్లానింగ్... మొదలైన వాటిలో స్టడీ అబ్రాడ్ కన్సల్టెన్సీలపై ఆధారపడుతోంది యూత్.

జపాన్ అయినా ఓకే

అబ్రాడ్ ఎడ్యుషన్ అనగానే అమెరికా, కెనడా, ఆస్ట్రేలియా, జర్మనీ... మొదలైన దేశాలు గుర్తుకు వస్తాయి తప్ప జపాన్ గుర్తుకు రావడం జరగదు. అయితే గణాంకాల ప్రకారం జపాన్ యూనివర్శిటీలలో చదివే మన విద్యార్థుల సంఖ్య పెరుగుతోంది. కొన్ని సంవత్సరాల క్రితం జపాన్‌లోని 20 యూనివర్శిటీల ప్రతినిధులు దిల్లీ, పుణె, చెన్నైలలో హైస్కూల్, కాలేజీలలో నిర్వహించిన ఎడ్యుకేషన్ ఫెయిర్‌కు మంచి స్పందన లభించింది.




స్పానిష్ బోలో

ప్రపంచ ప్రఖ్యాత భాషలలో స్పానిష్ ఒకటి. సుసంపన్నమైన సాంస్కృతిక చరిత్ర ఉన్న భాష ఇది. స్పానిష్‌ను సెకండ్ లాంగ్వేజ్‌గా తీసుకోవడానికి విద్యార్థులు ఆసక్తి చూపుతున్నారు. ఎన్నో దేశాలలో ప్రజలతో కమ్యూనికేషన్ చేయడంలో, ఉద్యోగ అవకాశాల విషయంలో ఈ భాష ఉపయోగపడుతుంది. చదువు కోసం విదేశాలకు వెళ్లాలనుకుంటున్న విద్యార్థులు, ఇతరులను దృష్టిలో పెట్టుకొని వారికి స్పానిష్ నేర్పించడానికి హైదరాబాద్‌కు చెందిన సుభాష్ యాదవ్ 'స్పానిష్ బోలో' అనే వెబ్‌సైట్‌ను నిర్వహిస్తున్నాడు.

కళ

చిత్రవిందు


అను చౌహాన్



పంజాబీ-కెనడియన్ అను చౌహాన్ ఇలస్ట్రేటర్, వీడియో గేమ్ ఆర్టిస్ట్. సాంస్కృతిక-సాహిత్య వైభవాన్ని కళలోకి తీసుకువచ్చే ప్రయత్నం చేస్తోంది అను. ఆమె చిత్రాల్లో ఎన్నడూ చూడని మొక్కల నుంచి గ్లోబల్ ఫ్యాషన్ వరకు కనువిందు చేస్తాయి...

కెనడాలో పుట్టి పెరిగిన అను చౌహాన్‌కు చిన్నప్పటి నుంచి బొమ్మలు వేయడం అంటే ఇష్టం. నాలుగు సంవత్సరాల వయసులో స్క్రీన్స్‌పై కనిపిస్తున్న డిస్నీ కార్టూన్‌ను చూస్తూ బొమ్మ వేయడానికి ప్రయత్నించింది. హైస్కూల్ రోజులకు వచ్చేసరికి ఇలస్ట్రేషన్‌ను సీరియస్‌గా తీసుకుంది. ఆ సమయంలోనే ఇలస్ట్రేటర్ కావాలని బలంగా అనుకుంది. అను అభిరుచికి తల్లిదండ్రులు ఎంతో ప్రోత్సాహం ఇచ్చేవారు.

ఇంటరాక్టివ్ ఆర్ట్స్ అండ్ టెక్నాలజీలో డిగ్రీ చేసి, యానిమేషన్ సబ్జెక్ట్ చదువుకున్న అను చౌహాన్ తనలోని సృజనాత్మకతను కాపాడుకోవడానికి నిత్యనూతనంగా ఆలోచించేది. చిత్రకళలో తనదైన శైలిని రూపొందించుకునే ప్రయత్నం చేసేది.

చదువు పూర్తయిన తరువాత మొబైల్ గేమ్ ఆర్టిస్ట్‌గా ప్రస్థానం మొదలుపెట్టింది. అంతర్జాలంలో పోస్ట్ చేసిన ఆమె ఆర్ట్ వర్క్స్‌కు మంచి స్పందన లభించేది. కొద్ది కాలంలోనే ఆమె ఫాలోవర్స్ సంఖ్య వందలు దాటి వేలల్లోకి వచ్చింది.

'నా ప్రతి చిత్రం ఒక కథ చెప్పాలనే లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకున్నాను. నా కథలోని పాత్రలు దక్షిణ ఆసియాకు చెందినవి. ఎక్కడో ఆకాశం నుంచి ఊడిపడినట్లు కాకుండా ఆ పాత్రలు మనకు సుపరిచితమైనవి అన్నట్లుగా ఉండాలి. బొమ్మల ద్వారా కూడా స్త్రీ సాధికారతకు సంబంధించిన విషయాలను ప్రచారం చేయవచ్చు' అంటుంది అను. ప్రపంచంలో ఏ మూల ఏ కొత్త డిజైన్ వచ్చినా దాన్ని లోతుగా అధ్యయనం చేస్తుంటుంది అను. 1960– 1970లలో వచ్చిన ఫ్యాషన్ అండ్ ఆర్ట్ వర్క్స్ అంటే ఆమెకు చాలా ఇష్టం.

'వీడియో గేమ్స్, డిస్నీ, బాలీవుడ్...ఇలా ఎన్నో అంశాలు నా ఆర్ట్‌పై ప్రభావం చూపాయి' అంటున్న అను చౌహాన్ తన చుట్టూ ఉన్న వాతావరణం నుంచి కూడా స్ఫూర్తి పొందుతుంది. న్యూయార్క్ టైమ్స్ బెస్ట్‌సెల్లింగ్ బుక్ 'అరు షా అండ్ ది ఎండ్ ఆఫ్ టైమ్' గ్రాఫిక్ ఎడాప్షన్ కోసం వేసిన చిత్రాలు ఆకట్టుకున్నాయి. మహక్ జైన్ రాసిన 'భరతనాట్యం ఇన్ బాలెట్ షూస్' పుస్తకానికి అను చౌహాన్ వేసిన బొమ్మలు ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. పిల్లల కోసం అను రూపొందించిన 'ఏ దుపట్టా ఈజ్' 'హెన్నా ఈజ్' పుస్తకాలు సూపర్‌హిట్ అయ్యాయి.

'క్రియేటివ్ వర్క్ ద్వారా జీవితాన్ని సంతోషంగా గడపాలనేది నా కోరిక. వెబ్‌కామిక్ చేయాలనేది నా కల. జీవితం ఎప్పుడు, ఎక్కడ, ఎలా ముగుస్తుందో తెలియదు అనే ఎరుకతో చిత్రకళ ద్వారా ప్రతి క్షణం ఉత్సాహంగా ఉండడానికి ప్రయత్నిస్తాను' అంటుంది అను.



బంగ్లాదేశ్‌తో నేడు భారత్ రెండో వన్డే

సిరీస్‌లో నిలవాలంటే తప్పనిసరిగా గెలవాల్సిన స్థితిలో... బంగ్లాదేశ్ మహిళల జట్టుతో నేడు జరిగే రెండో వన్డే మ్యాచ్‌లో భారత జట్టు బరిలోకి దిగనుంది. హర్మన్‌ప్రీత్ కౌర్ సారథ్యంలోని టీమిండియా మిర్పూర్‌లోనే జరిగిన తొలి వన్డేలో 40 పరుగుల తేడాతో ఓడిపోయింది. వన్డే ఫార్మాట్‌లో బంగ్లాదేశ్ చేతిలో భారత్‌కిదే తొలి ఓటమి. నేటి మ్యాచ్‌లో భారత్ నెగ్గాలంటే సమష్టి ప్రదర్శన చేయాల్సిన అవసరం ఉంది. బ్యాటర్లు స్మృతి, ప్రియా పూనియా, జెమీమా రోడ్రిగ్స్‌తోపాటు హర్మన్ రాణించడంపై భారత విజయావకాశాలు ఆధార పడి ఉంటాయి.

ఆరో ర్యాంక్‌లో స్మృతి మంధాన

అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ మహిళల వన్డే ర్యాంకింగ్స్‌లో భారత స్టార్ ఓపెనర్ స్మృతి మంధాన ఒక స్థానం మెరుగుపర్చుకుంది. తాజా ర్యాంకింగ్స్‌లో స్మృతి 704 రేటింగ్ పాయింట్లతో ఆరో స్థానంలో నిలిచింది. భారత కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ రెండు స్థానాలు పడిపోయి 702 పాయింట్లతో ఎనిమిదో ర్యాంక్‌కు చేరుకుంది. బౌలర్ల ర్యాంకింగ్స్‌లో రాజేశ్వరి గైక్వాడ్ తొమ్మిదో ర్యాంక్‌లో, ఆల్‌రౌండర్ల ర్యాంకింగ్స్‌లో దీప్తి శర్మ ఏడో ర్యాంక్‌లో ఉన్నారు.



సింధు ర్యాంక్ 17



న్యూఢిల్లీ: ఈ ఏడాది ఒక్క టైటిల్ కూడా నెగ్గలేకపోయిన భారత స్టార్ బ్యాడ్మింటన్ ప్లేయర్ పీవీ సింధు ప్రదర్శన ఆమె ర్యాంకింగ్స్‌పై ప్రభావం చూపిస్తోంది. గతవారం యూఎస్ ఓపెన్‌లో క్వార్టర్ ఫైనల్లో ఓడిపోయిన పీవీ సింధు... మంగళవారం విడుదల చేసిన ప్రపంచ బ్యాడ్మింటన్ సమాఖ్య (బీడబ్ల్యూఎఫ్) ర్యాంకింగ్స్‌లో ఐదు స్థానాలు పడిపోయింది. గతవారం 12వ ర్యాంక్‌లో నిలిచిన సింధు తాజాగా 17వ ర్యాంక్‌కు చేరుకుంది. గత పదేళ్లలో సింధు అత్యల్ప ర్యాంక్ ఇదే కావడం గమనార్హం. సింధు చివరిసారి 2013 జనవరిలో 17వ ర్యాంక్‌లో నిలిచింది. ఈ ఏడాది ఇప్పటి వరకు 12 టోర్నీలు ఆడిన సింధు మాడ్రిడ్ మాస్టర్స్ టోర్నీలో రన్నరప్‌గా నిలిచింది. మలేసియా మాస్టర్స్ టోర్నీ, కెనడా ఓపెన్‌లో సెమీ ఫైనల్‌కు చేరుకుంది. ప్రస్తుతం కొరియా ఓపెన్ టోర్నీలో సింధు బరిలో ఉంది.

కొత్త కోచ్‌గా హాఫీజ్ హషీమ్

పారిస్ ఒలింపిక్స్ క్వాలిఫయింగ్ ప్రారంభం కావడంతో పీవీ సింధు కొత్త వ్యక్తిగత కోచ్‌ను నియమించుకుంది. 2003 ఆల్ ఇంగ్లండ్ చాంపియన్, మలేసియా మాజీ ప్లేయర్ మొహమ్మద్ హాఫీజ్ హషీమ్ తన వ్యక్తిగత కోచ్‌గా వ్యవహరిస్తాడని మంగళవారం సింధు ట్విటర్ వేదికగా ప్రకటించింది.

2026 కామన్వెల్త్ గేమ్స్‌కు ఆతిథ్యమివ్వలేం: ఆస్ట్రేలియా



మెల్‌బోర్న్: ఆస్ట్రేలియా ప్రతిష్టాత్మక కామన్వెల్త్ క్రీడల ఆతిథ్యం నుంచి వైదొలగింది. 12 రోజుల క్రీడల కోసం ఏకంగా రూ. 39 వేల కోట్లు (7 బిలియన్ ఆస్ట్రేలియన్ డాలర్లు) వెచ్చించడం తగదని నిర్ధారించుకున్న విక్టోరియా రాష్ట్రం కామన్వెల్త్ గేమ్స్‌ను నిర్వహించలేమని కామన్వెల్త్ గేమ్స్ సమాఖ్య (సీజీఎఫ్)కు స్పష్టం చేసింది. బిడ్డింగ్‌లో పాల్గొని 2026 ఆతిథ్య హక్కుల్ని ఆస్ట్రేలియా పొందింది. ఆ సమయంలో రూ. 14 వేల కోట్లు (2.6 బిలియన్ ఆస్ట్రేలియన్ డాలర్లు) బడ్జెట్ సరిపోతుందని భావించిన ఆస్ట్రేలియాకు తాజా బడ్జెట్ అంచనా తలకిందులు చేసింది. దీంతో అంత బడ్జెట్‌తో వచ్చే లాభం కన్న ఆర్థిక నష్టమే ఎక్కువని భావించిన ఆస్ట్రేలియా కామన్వెల్త్‌కు బైబై చెప్పింది. 2006లో విక్టోరియా రాష్ట్రంలోని మెల్‌బోర్న్‌లో కామన్వెల్త్ గేమ్స్ జరిగాయి. బర్మింగ్‌హామ్–2022 కామన్వెల్త్ గేమ్స్‌కు ముందు 2018లో ఆస్ట్రేలియాలోని గోల్డ్‌కోస్ట్ నగరం ఆతిథ్యమిచ్చింది.

‘గిన్నిస్’లోకి సాత్విక్ స్మాష్...

బ్యాడ్మింటన్‌లో భారత డబుల్స్ స్టార్ రికార్డు



సొకా (జపాన్): తెలుగుతేజం సాత్విక్ సాయిరాజ్ రాంకీ రెడ్డి ఇన్నాళ్లూ ఇంటాబయటా డబుల్స్ టైటిల్స్‌తో పతాక శీర్షికల్లో నిలిచాడు. తాజాగా ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఈ బ్యాడ్మింటన్ స్టార్ ‘గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు’ల్లోకెక్కాడు. చిరాగ్ శెట్టితో కలిసి అతను ఇటీవల ఇండోనేసియా ఓపెన్‌లో పురుషుల డబుల్స్ టైటిల్ గెలిచాడు. మేటి డబుల్స్ షట్లర్‌గా రాటుదేలిన సాత్విక్‌కు టైటిళ్లు కొత్తేం కాదు. అయితే తాజాగా బ్యాడ్మింటన్ చరిత్రలో అత్యంత వేగవంతమైన స్మాష్‌తో సాత్విక్ రికార్డు సృష్టించాడు. జపాన్‌కు చెందిన ప్రముఖ క్రీడా ఉపకరణాల సంస్థ యోనెక్స్ తమ ఫ్యాక్టరీలో ఇటీవల నిర్వహించిన టెస్టులో సాత్విక్ రాకెట్ వేగంతో స్మాష్ కొట్టాడు. సాత్విక్ స్మాష్‌కు షటిల్ గంటకు 565 కిలోమీటర్ల వేగంతో దూసుకెళ్లింది. ఫార్ములావన్ సర్క్యూట్‌లో రయ్ రయ్‌మని రాకెట్ వేగంతో దూసుకెళ్లే కారు వేగం (గంటకు 372.6 కి.మీ.) కంటే కూడా సాత్విక్ స్మాష్ వేగమే ఎక్కువ! బ్యాడ్మింటన్‌లో ఇది అసాధారణ వేగం. దీంతో దశాబ్దం క్రిందట మలేసియన్ షట్లర్ తన్ బూన్ హియాంగ్ (2013లో) గంటకు 493 కి.మీ. వేగంతో కొట్టిన స్మాష్ రికార్డును సాత్విక్ బద్దలుకొట్టాడు. తద్వారా ‘ఫాస్టెస్ట్ స్మాష్’ రికార్డును సాత్విక్ సాయిరాజ్ తన పేరిట గిన్నిస్ బుక్‌లో లిఖించుకున్నాడు. మహిళల విభాగంలో మలేసియా షట్లర్ తన్ పియర్లీ గంటకు 438 కి.మీ. వేగంతో కొట్టిన స్మాష్ రికార్డు కూడా గిన్నిస్ బుక్‌లో చోటు దక్కించుకుంది.

ప్రిక్వార్టర్స్‌లోకి ప్రవేశం

ప్రస్తుతం కొరియా ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్–500 టోర్నీలో ఆడుతున్న సాత్విక్ సాయిరాజ్–చిరాగ్ శెట్టి జోడీ శుభారంభం చేసింది. మంగళవారం జరిగిన పురుషుల డబుల్స్ తొలి రౌండ్‌లో సాత్విక్–చిరాగ్ ద్వయం 21–16, 21–14తో సుపక్ జోమ్కో–కిటినిపోంగ్ కెద్రెన్ (థాయ్‌లాండ్) జంటను ఓడించి ప్రిక్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించింది. భారత్‌కే చెందిన ఎం.ఆర్.అర్జున్–ధ్రువ్ కపిల జోడీ తొలి రౌండ్‌లోనే నిష్క్రమించింది.

ధనుశ్ శ్రీకాంత్ జట్టుకు స్వర్ణ పతకం

- ఉమామహేశ్‌కు కాంస్యం
- ప్రపంచ జూనియర్ షూటింగ్ చాంపియన్‌షిప్



స్వర్ణ పతకాలతో పార్థ్ మానె, అభినవ్ షా, ధనుశ్ శ్రీకాంత్



కాంస్యంతో ఉమామహేశ్

చాంగ్వాన్ (కొరియా): గురి తప్పని ప్రదర్శనతో భారత యువ షూటర్లు ప్రపంచ జూనియర్ షూటింగ్ చాంపియన్‌షిప్‌లో తమ పతకాల వేటను కొనసాగిస్తున్నారు. మంగళవారం భారత్‌కు ఒక స్వర్ణం, రెండు రజతాలు, ఒక కాంస్య పతకం లభించాయి. పురుషుల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ టీమ్ విభాగంలో తెలంగాణకు చెందిన బధిర షూటర్ ధనుశ్ శ్రీకాంత్, అభినవ్ షా, పార్థ్ రాకేశ్ మానెలతో కూడిన భారత బృందం పసిడి పతకం గెల్చుకుంది. ధనుశ్ శ్రీకాంత్, అభినవ్, పార్థ్ బృందం మొత్తం 1886.7 పాయింట్లు స్కోరు చేసి అగ్ర స్థానంలో నిలిచింది. మహిళల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ టీమ్ విభాగంలో గౌతమి భానోత్, సోనమ్ మస్కర్, స్వాతి చౌదరీలతో కూడిన భారత జట్టు 1886.8 పాయింట్లతో రెండో స్థానంలో నిలిచి రజత పతకం దక్కించుకుంది.

10 మీటర్ల ఎయిర్ రైఫిల్ వ్యక్తిగత విభాగంలో భారత్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న ఆంధ్రప్రదేశ్ షూటర్ మద్దినేని ఉమామహేశ్ కాంస్య పతకం సాధించాడు. ఎనిమిది మంది షూటర్ల మధ్య ఎలిమినేషన్ పద్ధతిలో జరిగిన ఫైనల్లో విజయవాడకు చెందిన ఉమామహేశ్ 229 పాయింట్లు స్కోరు చేసి మూడో స్థానంలో నిలిచాడు. రొమైన్ అఫ్రెరె (ఫ్రాన్స్; 251.2 పాయింట్లు) స్వర్ణం, హాంగ్‌హావో వాంగ్ (చైనా; 251 పాయింట్లు) రజతం సాధించారు. ఉమామహేశ్‌తోపాటు ఫైనల్లో పోటీపడ్డ అభినవ్ షా 207.2 పాయింట్లతో నాలుగో స్థానంలో, ధనుశ్ శ్రీకాంత్ 164.9 పాయింట్లతో ఆరో స్థానంలో నిలిచారు. 64 మంది షూటర్లు పోటీపడ్డ క్వాలిఫయింగ్‌లో అభినవ్ షా 631.4 పాయింట్లతో తొలి స్థానంలో, ధనుశ్ శ్రీకాంత్ 629.9 పాయింట్లతో మూడో స్థానంలో, ఉమామహేశ్ 627.9 పాయింట్లతో ఎనిమిదో స్థానంలో నిలిచి ఫైనల్‌కు అర్హత సాధించారు.

మరోవైపు జూనియర్ మహిళల స్కీట్ ఈవెంట్‌లో భారత షూటర్ రైజా ధిల్లాన్ రజత పతకం సాధించింది. ఆరుగురు షూటర్లు పాల్గొన్న ఫైనల్లో రైజా, మిరోస్లావా హకోవా (స్లొవేకియా) 51 పాయింట్లతో సంయుక్తంగా అగ్రస్థానంలో నిలిచారు. అయితే స్వర్ణ, రజత పతకాల కోసం ‘షూట్ ఆఫ్’ నిర్వహించగా మిరోస్లావా రెండు పాయింట్లు స్కోరు చేసి స్వర్ణం ఖరారు చేసుకోగా... ఒక పాయింట్ సాధించిన రైజాకు రజతం దక్కింది. ప్రస్తుతం భారత్ 4 స్వర్ణాలు, 3 రజతాలు, 3 కాంస్యాలతో కలిపి మొత్తం 10 పతకాలతో రెండో స్థానంలో ఉంది.

జర్మనీ చేతిలో భారత్ ఓటమి

వీస్‌బాడెన్ (జర్మనీ): ఆసియా క్రీడలకు సన్నాహాల్లో భాగంగా జర్మనీలో పర్యటిస్తున్న భారత మహిళల హాకీ జట్టు ఓటమితో సిరీస్‌ను ఆరంభించింది. రెండు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా జర్మనీతో మంగళవారం జరిగిన తొలి మ్యాచ్‌లో సవితా పూనియా సారథ్యంలోని భారత జట్టు 1–4 గోల్స్ తేడాతో ఓడిపోయింది. భారత్ తరఫున వైష్ణవి విఠల్ ఫాల్కే (29వ ని.లో) ఏకైక గోల్ చేసింది. జర్మనీ జట్టుకు నైకీ లోరెంజ్ (6వ, 59వ ని.లో), జెటీ ఫ్లెషిట్జ్ (14వ, 43వ ని.లో) రెండు గోల్స్ చొప్పున అందించారు.

బ్రిజ్‌భూషణ్‌కు బెయిల్... బజరంగ్, వినేశ్‌లకు బెర్త్‌లు

- నేరుగా ఆసియా క్రీడల జట్టులోకి భారత స్టార్ రెజ్లర్ల ఎంపిక



న్యూఢిల్లీ: రెజ్లర్లపై లైంగిక వేధింపుల కేసులో భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్‌ఐ) అధ్యక్షుడు, బీజేపీ ఎంపీ బ్రిజ్‌భూషణ్ శరణ్ సింగ్‌కు ఢిల్లీ కోర్టు రెండు రోజుల మధ్యంతర బెయిల్ ఇవ్వగా... డబ్ల్యూఎఫ్‌ఐ అడ్‌హక్ కమిటీ స్టార్ రెజ్లర్లు బజరంగ్ పూనియా, వినేశ్ ఫొగాట్‌లకు నేరుగా ఆసియా క్రీడల బెర్త్‌లు ఖరారు చేసింది. మరోవైపు ఈ ఇద్దరు రెజ్లర్లకు కమిటీ ఇచ్చిన మినహాయింపుపై విమర్శలు వస్తున్నాయి. ఇదిలా ఉంటే సర్వోన్నత న్యాయస్థానం (సుప్రీం కోర్టు) డబ్ల్యూఎఫ్‌ఐ ఎన్నికలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. జస్టిస్ అనిరుధ బోస్, జస్టిస్ ఎస్వీ భట్టిలతో కూడిన ద్విసభ్య బెంచ్ గతంలో గువాహటి హైకోర్టు విధించిన ‘స్టే’ను కొట్టివేసింది. వెంటనే ఎన్నికల ప్రక్రియను మొదలు పెట్టాల్సిందిగా డబ్ల్యూఎఫ్‌ఐని ఆదేశించింది. అడిషనల్ చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ హర్జీత్ సింగ్ రూ.. 25 వేల పూచీకత్తుపై బ్రిజ్‌భూషణ్‌కు, డబ్ల్యూఎఫ్‌ఐ సహాయక కార్యదర్శి వినోద్ తోమర్‌కు మధ్యంతర బెయిల్ మంజూరు చేసి విచారణను గురువారానికి వాయిదా వేశారు.

నేరుగా ఆసియా క్రీడలకు...

రెజ్లింగ్ చీఫ్ బ్రిజ్‌భూషణ్‌పై పోరాటానికి దిగిన ఒలింపిక్ పతక విజేత బజరంగ్, ఆసియా గేమ్స్ చాంపియన్ వినేశ్ ఫొగాట్ ట్రయల్స్ లేకుండానే బెర్త్‌లు పొందారు. పురుషుల 65 కేజీల కేటగిరీలో బజరంగ్... మహిళల 53 కేజీల విభాగంలో వినేశ్ చైనాలో జరిగే ఆసియా క్రీడల్లో పోటీ పడతారు. అయితే ఈ విభాగాల్లోనూ ట్రయల్స్ నిర్వహించి విజేతలను స్టాండ్‌బైగా అక్కడికి తీసుకెళ్తారు.

షకీల్ అజేయ డబుల్ సెంచరీ



పాక్ జట్టుకు 149 పరుగుల ఆధిక్యం

గాలె: శ్రీలంక జట్టుతో జరుగుతున్న తొలి టెస్టులో పాకిస్తాన్ జట్టుకు 149 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం లభించింది. ఆట మూడో రోజు ఓవర్‌నైట్ స్కోరు 221/5తో తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన పాకిస్తాన్ 121.2 ఓవర్లలో 461 పరుగుల వద్ద ఆలౌటైంది. ఓవర్‌నైట్ బ్యాటర్ సౌద్ షకీల్ (361 బంతుల్లో 208 నాటౌట్; 19 ఫోర్లు) అజేయ డబుల్ సెంచరీ సాధించాడు. ఆగా సల్మాన్ (83; 9 ఫోర్లు, 1 సిక్స్)తో కలిసి షకీల్ ఆరో వికెట్‌కు 177 పరుగులు జోడించాడు. లంక బౌలర్లలో రమేశ్ మెండిస్ ఐదు వికెట్లు, ప్రభాత్ జయసూర్య మూడు వికెట్లు పడగొట్టారు. 149 పరుగులతో వెనుకబడి రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన శ్రీలంక ఆట ముగిసే సమయానికి వికెట్ కోల్పోకుండా 14 పరుగులు చేసింది.

సినిమా


కీర్తీ సురేశ్

బాలీవుడ్ కబురు?

హీరోయిన్ కీర్తీ సురేష్‌కు బాలీవుడ్ నుంచి కబురు అందినట్లు తెలుస్తోంది. వరుణ్ ధావన్ హీరోగా తమిళ దర్శకుడు అట్లీ ఓ సినిమా నిర్మించనున్న సంగతి తెలిసిందే. తమిళ దర్శకుడు కాలిస్ ఈ చిత్రాన్ని తెరకెక్కించనున్నారు. కాగా ఈ చిత్రంలోని హీరోయిన్ పాత్రకు చిత్ర యూనిట్ కీర్తీ సురేష్‌ను సంప్రదించినట్లు బాలీవుడ్‌లో ప్రచారం సాగుతోంది. ఒకవేళ ఈ వార్త నిజమైతే కీర్తికి బాలీవుడ్‌లో ఇదే తొలి చిత్రం అవుతుంది. ఈ సంగతి ఇలా ఉంచితే.. నిజానికి కీర్తీ సురేష్ బాలీవుడ్ ఎంట్రీ ఎప్పుడో జరగాల్సింది. అజయ్ దేవగన్ హీరోగా నటించిన ‘మైదాన్’కు తొలుత హీరోయిన్‌గా ఆమెనే తీసుకున్నారు. కొన్ని కారణాలవల్ల ‘మైదాన్’ చిత్రం నుంచి కీర్తీ తప్పుకోవాల్సి వచ్చింది. ఆ పాత్రను ప్రియమణి చేశారు. ఇలా కీర్తీ సురేష్ బాలీవుడ్ ఎంట్రీ వాయిదా పడింది. ఇక ‘మైదాన్’ చిత్రం ఇంకా రిలీజ్ కాని సంగతి తెలిసిందే.

కొత్త ప్రపంచంపై నమ్మకంతో...


దీపికా పదుకోన్

ఆమె కళ్లు ఎటో తీక్షణంగా చూస్తున్నాయి. దీర్ఘాలోచనలో ఉన్నట్లు కనబడుతోందామె. ‘ప్రాజెక్ట్ కె’లో దీపికా పదుకోన్ చేస్తున్న పాత్ర లుక్ ఇది. ‘‘ఆమె కళ్లల్లో కొత్త ప్రపంచంపై నమ్మకం కనిపిస్తోంది’’ అంటూ దీపికా లుక్‌ని విడుదల చేసింది చిత్ర యూనిట్. ప్రభాస్ హీరోగా నాగ్ అశ్విన్ దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం ‘ప్రాజెక్ట్ కె’. ఈ చిత్రం ద్వారా బాలీవుడ్ బ్యూటీ దీపికా పదుకోన్ తెలుగు చిత్ర పరిశ్రమకు కథానాయికగా పరిచయమవుతున్నారు. సైన్స్ ఫిక్షన్ నేపథ్యంలో సి. అశ్వనీదత్ నిర్మిస్తున్న ఈ చిత్రంలో అమితాబ్ బచ్చన్, కమల్‌హాసన్, దిశా పటానీ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ‘ప్రాజెక్ట్ కె’ టైటిల్, ట్రైలర్, సినిమా విడుదల తేదీని ఈ నెల 20న అమెరికాలోని ‘శాన్ డియాగో కామిక్– కాన్ 2023’ వేడుకలో లాంచ్ చేస్తారు. ఈ వేడుకకు ప్రభాస్, కమల్‌హాసన్, దీపికా పదుకోన్, నాగ్ అశ్విన్, అశ్వనీదత్ హాజరు కానున్నారు.


ఎన్టీఆర్


మహేశ్ బాబు

ప్రతీ క్యారెక్టర్ సవాల్‌గా అనిపించకపోవచ్చు. అయితే కొన్ని క్యారెక్టర్స్ మాత్రం చాలెంజ్ చేస్తాయి. మంచి మేకోవర్‌ని డిమాండ్ చేస్తాయి. అలాంటి క్యారెక్టర్స్‌ని చాలెంజ్‌గా తీసుకుని మేకోవర్ అయిపోతుంటారు స్టార్స్. ఇప్పుడు కొందరు స్టార్స్ కొత్త మేకోవర్ కోసం షూటింగ్స్ నుంచి కొంత గ్యాప్ తీసుకుని, స్పెషల్‌గా ట్రైన్ కావాలనుకుంటున్నారు. ఆ స్టార్స్ గురించి తెలుసుకుందాం.

కొత్త మేకోవర్... కొంత గ్యాప్

ఫారెస్ట్‌లో యాక్షన్

దాదాపు మూడు నెలల పాటు మహేశ్‌బాబు ప్రత్యేక శిక్షణ తీసుకోనున్నారని తెలుస్తోంది. మహేశ్‌బాబు హీరోగా రాజమౌళి దర్శకత్వంలో అంతర్జాతీయ స్థాయిలో ఒక సినిమా తెరకెక్కనున్న సంగతి తెలిసిందే. ఆఫ్రికన్ ఫారెస్ట్ బ్యాక్‌డ్రాప్‌లో సాగే యాక్షన్ అడ్వెంచరస్ ఫిల్మ్ ఇది. ఈ సినిమా షూటింగ్‌ను వచ్చే ఏడాది ప్రారంభంలో స్టార్ట్ చేయాలనుకుంటున్నారు. ప్రస్తుతం ఈ సినిమాకు సంబంధించిన స్క్రిప్ట్‌కు తుది మెరుగులు దిద్దుతున్నారు దర్శక–రచయిత విజయేంద్రప్రసాద్. ఈ చిత్రంలో హీరో మహేశ్‌బాబు సరికొత్త సర్‌ప్రైజింగ్ లుక్‌లో కనిపించనున్నారట. ఇందుకోసం మహేశ్ మూడు నెలల కఠోర శ్రమతో కూడిన ప్రత్యేక శిక్షణ తీసుకోనున్నారన్నది ఫిల్మ్‌నగర్ సర్కిల్స్‌లో వినిపిస్తున్న మాట. ప్రస్తుతం మహేశ్‌బాబు ‘గుంటూరు కారం’ సినిమాతో బిజీగా ఉన్నారు. ‘అతడు’, ‘ఖలేజా’ చిత్రాల తర్వాత మహేశ్‌బాబు, త్రివిక్రమ్ కాంబినేషన్‌లో వస్తున్న ఫిల్మ్ ఇది. ఈ సినిమా షూటింగ్ మొత్తం ఓ కొలిక్కి వచ్చిన తర్వాత కొన్నాళ్లు గ్యాప్ తీసుకుంటారట మహేశ్. ఈ గ్యాప్‌లో రాజమౌళి సినిమా కోసం ప్రత్యేక శిక్షణ తీసుకుంటారని తెలిసింది.

వార్ ట్రైనింగ్

ఏ పాత్రలోనైనా లీనమైపోతారు ఎన్టీఆర్. ఇందుకోసం ఆయన ఎంతటి రిస్క్ అయినా తీసుకుంటారు. క్లిష్టమైన వర్కౌట్స్ చేయడానికి కూడా వెనకాడరు. ‘అరవింద సమేత వీర రాఘవ’, ‘ఆర్ఆర్ఆర్’ వంటి సినిమాల కోసం ఎన్టీఆర్ కష్టపడి ఎలా మేకోవర్ అయ్యారో తెలిసిందే. ఎన్టీఆర్ మరోసారి మేకోవర్ అయ్యేందుకు రెడీ అవుతున్నారు. హిందీలో యశ్‌రాజ్ చోప్రా బ్యానర్‌పై స్పై యూనివర్స్‌లో భాగంగా ఆదిత్యా చోప్రా ‘వార్ 2’ చిత్రం నిర్మించనున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రంలో హృతిక్ రోషన్, ఎన్టీఆర్ మెయిన్ లీడ్ రోల్స్ చేయనున్నారు. ఈ కథ రీత్యా ఎన్టీఆర్ పాత్రలో కాస్త నెగటివ్ షేడ్స్ ఉంటాయనే ప్రచారం జరుగుతోంది. ‘వార్ 2’ సినిమా షూటింగ్‌ను ఈ ఏడాది చివర్లో ప్రారంభించాలనుకుంటున్నారు. ఈ సినిమాలోని తన రోల్, లుక్ కోసం ఎన్టీఆర్ ప్రత్యేక శిక్షణ తీసుకోనున్నారనే టాక్ వినిపిస్తోంది. ప్రస్తుతం కొరటాల శివ దర్శకత్వంలో ‘దేవర’ సినిమాలో ఎన్టీఆర్ నటిస్తున్నారు. ఈ సినిమా షూటింగ్‌ని సెప్టెంబరు చివరికల్లా పూర్తి చేసి, ఆ తర్వాత కొంత గ్యాప్ తీసుకుని ‘వార్ 2’ ట్రైనింగ్‌లో బిజీ అయిపోయి, డిసెంబరులో షూటింగ్‌లో జాయిన్ అవ్వాలన్నది ఎన్టీఆర్ ప్లాన్ అట.


అల్లు అర్జున్

మరో సర్‌ప్రైజ్

‘పుష్ప’ చిత్రంలో అల్లు అర్జున్ మేకోవర్ ప్రేక్షకులను ఆశ్చర్యపరిచింది. మరోసారి ఆడియన్స్ వావ్ అనేలా అల్లు అర్జున్ మేకోవర్, లుక్ ఉండబోతున్నాయనే టాక్ వినిపిస్తోంది. ‘జులాయి’, ‘సన్నాఫ్ సత్యమూర్తి’, ‘అల.. వైకుంఠపురములో..’ చిత్రాల తర్వాత హీరో అల్లు అర్జున్, దర్శకుడు త్రివిక్రమ్ కాంబినేషన్‌లో మరో సినిమా తెరకెక్కనుంది. ఈ చిత్రంలో అల్లు అర్జున్ గెటప్ కొత్తగా ఉంటుందని, ఈ గెటప్ మేకోవర్ కోసం అల్లు అర్జున్ కొంత టైమ్ తీసుకోవాలనుకుంటున్నారని సమాచారం. ప్రస్తుతం సుకుమార్ దర్శకత్వంలో ‘పుష్ప’ మలి భాగం ‘పుష్ప: ది రూల్’తో బిజీగా ఉన్నారు అల్లు అర్జున్. ఈ సినిమా తర్వాత త్రివిక్రమ్ సినిమా కోసం వర్కౌట్ చేస్తారని తెలుస్తోంది.


సాయిధరమ్ తేజ్


ఆరు నెలల విరామం

దాదాపు ఆరు నెలలు బ్రేక్ తీసుకోవాలనుకుంటున్నారు సాయిధరమ్ తేజ్. ఫిజికల్‌గా ఇంకొంచెం స్ట్రాంగ్‌గా అవ్వాలనుకుంటున్నానని, ఇందు కోసం ఆరు నెలల సమయం పడుతుందనీ సాయిధరమ్ ఇటీవల ఓ ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. సాయిధరమ్ తర్వాతి చిత్రం సంపత్ నంది దర్శకత్వంలో ఉంటుంది. భారీ బడ్జెట్ యాక్షన్ ఫిల్మ్‌గా ఈ సినిమా తెరకెక్కనుంది. సో.. ఆరు నెలల బ్రేక్‌లో సాయిధరమ్ ఫిట్‌నెస్ కోసం చేసే వర్కౌట్స్ ఈ సినిమాకు కూడా ఉపయోగపడతాయని, తను సరికొత్త మాస్ లుక్‌లో కనిపించే అవకాశం ఉందని భోగట్టా.

ఇలా షూటింగ్స్ నుంచి కొంత గ్యాప్ తీసుకుని తమ కొత్త సినిమాల గెటప్‌ల కోసం ట్రైనింగ్ తీసుకోవడానికి మరికొందరు స్టార్స్ కూడా రెడీ అవుతున్నారు.

రీల్స్

మీ ప్రేమ చూపిస్తూనే ఉండాలి


విజయ్ దేవరకొండ

‘‘బేబీ’ని సాయి రాజేష్ నిజాయతీగా తీశాడు. అందుకే ప్రేక్షకులు ఇంత పెద్ద విజయం అందించారు. ఆనంద్‌కి వచ్చిన సక్సెస్‌కు గర్వంగా ఉంది. విరాజ్, వైష్ణవిలకు కూడా మంచి పేరొచ్చింది. ‘బేబీ’ చిత్రంపై మీ (ప్రేక్షకులు) ప్రేమ చూపిస్తూ ఉండాలి’’ అని హీరో విజయ్ దేవరకొండ అన్నారు. ఆనంద్ దేవరకొండ, వైష్ణవీ చైతన్య, విరాజ్ అశ్విన్ లీడ్ రోల్స్‌లో సాయి రాజేష్ దర్శకత్వం వహించిన చిత్రం ‘బేబీ’. ఎస్‌కేఎన్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 14న విడుదలైంది. ఈ సందర్భంగా నిర్వహించిన ‘కల్ట్ బ్లాక్ బస్టర్ సెలబ్రేషన్స్’కి ముఖ్య అతిథులుగా విజయ్ దేవరకొండ, నిర్మాతలు అల్లు అరవింద్, వై. రవిశంకర్, బన్నీ వాసు హాజరయ్యారు. ‘బేబీ’ యూనిట్ నుంచి ఆనంద్ దేవరకొండ, విరాజ్ అశ్విన్, వైష్ణవి, ఎస్‌కేఎన్, సాయిరాజేశ్ పాల్గొన్నారు.

ఆశ్చర్యపోతారు...


అనిల్ కన్నెగంటి

అశ్విన్‌బాబు, నందితా శ్వేత జంటగా అనిల్ కన్నెగంటి దర్శకత్వం వహించిన చిత్రం ‘హిడింబ’. అనిల్ సుంకర సమర్పణలో గంగపట్నం శ్రీధర్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 20న విడుదల కానుంది. ఈ సందర్భంగా అనిల్ మాట్లాడుతూ– ‘‘ఫిక్షనల్ హిస్టారికల్ టచ్ ఉన్న ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్ ‘హిడింబ’. ఈ సినిమాలో హిడింబాసురుడి లక్షణాలు ఉన్న ఓ తెగ గురించిన ప్రస్తావించాం. అందుకే ‘హిడింబ’ టైటిల్ పెట్టాం. స్క్రీన్‌ప్లే ప్రస్తుత కాలంలోనే జరుగుతుంది. అయితే కథకు 1908 నాటి టచ్ ఉంటుంది. కథలో ఉన్న ఓ షాకింగ్ పాయింట్ ప్రేక్షకులను ఆశ్చర్యపరుస్తుంది’’ అన్నారు.

మాస్ ఎంటర్‌టైనర్


ఇవానా, ఆశిష్

‘రౌడీ బాయ్స్’ ఫేమ్ ఆశిష్ హీరోగా నటిస్తున్న రెండో చిత్రం ‘సెల్ఫిష్’. కాశీ విశాల్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో ఇవానా హీరోయిన్. సుకుమార్ రైటింగ్స్‌తో కలిసి ‘దిల్’ రాజు, శిరీష్ నిర్మిస్తున్నారు. యూత్‌ఫుల్ మాస్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతోన్న ఈ సినిమా షూటింగ్ ప్రస్తుతం హైదరాబాద్‌లో జరుగుతోంది. ఈ చిత్రానికి కెమెరా: ఆచార్య వేణు, సంగీతం: మిక్కీ జె. మేయర్.

ప్రేమ.. అభిమానం


అర్జున్ దాస్, దుషారా

అర్జున్ దాస్, దుషారా విజయన్ జంటగా నటించిన చిత్రం ‘బ్లడ్ అండ్ చాక్లెట్’. ఎస్ పిక్చర్స్‌పై ప్రముఖ దర్శకుడు శంకర్ సమర్పణలో రూపొందిన ఈ సినిమా తెలుగు, తమిళ భాషల్లో ఈ నెల 21న విడుదలకానుంది. ఈ మూవీని తెలుగులో ఎస్ఆర్‌డీఎస్ సంస్థపై దేవసాని శ్రీనివాసరెడ్డి రిలీజ్ చేస్తున్నారు. ‘‘ఈ సినిమాలో ప్రేమ, అభిమానం, మంచి ఎమోషన్స్ ఉంటాయి’’ అన్నారు వసంత బాలన్.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
205	38
66,795	19,749

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (సోమ రెండు రాత్రి 11.30 గంటలకు)

నాస్‌డాక్	14,328	▲	83
డోజోన్స్	34,889	▲	304
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,454	▲	47
డాక్స్	16,125	▲	57
పాంగ్‌షై	3,198	▽	12
నికాయ్	32,494	▲	103

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై

బంగారం (24 క్యారట్)		
59,440	▲	170
బంగారం (22 క్యారట్)		
59,202	▲	169
వెండి (కిలో)		
75,181	▲	115

పాన్ పనిచేయకపోతే అధికారులను సంప్రదించాలి

ఎన్‌ఆర్‌ఐలకు ఆదాయపన్ను శాఖ సూచన



న్యూఢిల్లీ: ఎన్‌ఆర్‌ఐలు, విదేశీ పౌరసత్వం కలిగిన భారతీయులు తమ పాన్ ఇన్‌ఆపరేటివ్‌గా (పనిచేయకపోతే) మారిపోతే, నివాస ధ్రువీకరణ పత్రాలతో అసెసింగ్ అధికారులను సంప్రదించాలని ఆదాయపన్ను శాఖ సూచించింది. తమ పాన్‌లు పనిచేయకుండా పోవడం పట్ల కొందరు ఎన్‌ఆర్‌ఐలు, విదేశీ పౌరసత్వం కలిగిన భారతీయుల (ఓసీఐలు) నుంచి ఆందోళన వ్యక్తమైనట్టు తెలిపింది. గడిచిన మూడు ఆర్థిక సంవత్సరాల్లో ఐటీఆర్ దాఖలు చేసిన వారి స్టేటస్ వివరాలను తామే జురిస్‌డిక్షనల్ అసెసింగ్ ఆఫీసర్‌లకు పంపించినట్టు స్పష్టం చేసింది. గడిచిన మూడు ఆర్థిక సంవత్సరాల్లో రిటర్నులు దాఖలు చేయని లేదా తమ నివాస హోదాను అప్‌డేట్ చేయని వారి పాన్‌లు పనిచేయకుండా పోయినట్టు ఆదాయపన్ను శాఖ తెలిపింది.

సెన్సెక్స్ @ 67,000

- 19,750 స్థాయి చేరువలో నిఫ్టీ
- నాలుగోరోజూ కొత్త రికార్డులు
- రాణించిన ఐటీ షేర్లు

ముంబై: ఐటీ షేర్లు రాణించడంతో స్టాక్ సూచీల కొత్త రికార్డుల ర్యాలీ నాలుగోరోజూ కొనసాగింది. అమెరికా, యూరప్ మార్కెట్ల సానుకూల ట్రేడింగ్ కలిసొచ్చింది. విదేశీ ఇన్వెస్టర్ల వరస కొనుగోళ్లు ఉత్సాహాన్నిచ్చాయి. ఫలితంగా సూచీలు ఇంట్రాడే, ముగింపులోనూ సరికొత్త రికార్డులను నమోదు చేశాయి. ఉదయం సెన్సెక్స్ 239 పాయింట్ల లాభంతో 66,829 వద్ద, నిఫ్టీ 77 పాయింట్లు పెరిగి 19,788 వద్ద మొదలయ్యాయి. ట్రేడింగ్ ప్రారంభంలో ఐటీ, టెక్, విద్యుత్, పారిశ్రామిక, యుటిలిటీ రంగాల షేర్లకు డిమాండ్ నెలకొంది. ఫలితంగా సెన్సెక్స్ 417 పాయింట్లు బలపడి 67,007 వద్ద, నిఫ్టీ 108 పాయింట్లు పెరిగి 19,819 వద్ద జీవితకాల గరిష్టాలను నమోదు చేసాయి. అయితే ద్వితీయార్థంలో ప్రభుత్వరంగ బ్యాంకులు, మెటల్ షేర్లలో లాభాల స్వీకరణతో సూచీల లాభాలు సగానికి పైగా హరించుకుపోయాయి. చివరికి సెన్సెక్స్ 205 పాయింట్ల లాభంతో 67 వేల దిగువన



66,795 వద్ద ముగిసింది. నిఫ్టీ 38 పాయింట్లు బలపడి 19,749 వద్ద స్థిరపడింది. విదేశీ ఇన్వెస్టర్లు రూ.2,115 కోట్ల షేర్లను కొనుగోలు చేశారు. సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.1,317 కోట్ల షేర్లను విక్రయించారు. అమెరికా రిటైల్ అమ్మకాలు, పారిశ్రామికోత్పత్తి డేటా వెల్లడికి ముందు ప్రపంచ ఈక్విటీ మార్కెట్లు స్వల్ప లాభాల్లో కదలాడుతున్నాయి. 'అమెరికా డాలర్ ఇండెక్స్ అనూహ్య పతనం, పదేళ్ల కాలపరిమితి బాండ్లపై రాబడులు తగ్గడంతో వర్ధమాన దేశాల మార్కెట్లలో విదేశీ ఇన్వెస్టర్లు పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపుతున్నారు. ముఖ్యంగా చైనా ఆర్థిక డేటా నిరాశపరచడం, అమెరికా మార్కెట్ అవుట్‌లుక్ వృద్ధి అంశాలు భారత ఈక్విటీకు డిమాండ్ పెరిగింది. సాంకేతికంగా ఇంట్రాడే కరెక్షన్ ఫార్మేషన్ స్వల్ప కాలం పాటు పరిమితి శ్రేణి ట్రేడింగ్‌ను సూచిస్తుంది. అయితే అధిక వ్యాల్యుయేషన్ల ఆందోళనల నేపథ్యంలో ద్వితీయార్థంలో కొంత అనిశ్చితి ఏర్పడింది' అని కోటక్ సెక్యూరిటీస్ రీసెర్చ్ హెడ్ శ్రీకాంత్ చౌహాన్ తెలిపారు.

మార్కెట్లో మరిన్ని సంగతులు

- మ్యాట్రెస్‌లను తయారు చేసే షీలా ఫోమ్ కంపెనీ షేరు నాలుగు శాతం లాభపడి రూ.1236 వద్ద స్థిరపడింది. కర్లాన్ ఎంటర్‌ప్రైజెస్‌లో 94.66% వాటాలు కొనుగోలు చేస్తుండటంతో ఈ షేరుకు డిమాండ్ నెలకొంది. ట్రేడింగ్‌లో 15% ర్యాలీ చేసి రూ.1,364 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని తాకింది.
- రెండు బిలియన్ డాలర్ల విలువ ఏఐ డీల్ దక్కించుకోవడంతో ఐటీ దిగ్గజం ఇన్ఫోసిస్ షేరు 4% లాభపడి రూ.1475 వద్ద స్థిరపడింది. సెన్సెక్స్, నిఫ్టీ సూచీల్లో అత్యధిక లాభపడిన షేరు ఇదే.
- రెండు రోజుల ర్యాలీ తర్వాత ప్రభుత్వరంగ బ్యాంకుల షేర్లలో లాభాల స్వీకరణ చోటు చేసుకుంది. ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ 3%, సెంట్రల్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ బరోడా, కెనరా బ్యాంక్ షేర్లు 2%, ఎస్‌బీఐ, యూకో బ్యాంక్ షేర్లు 1.5% పతనమయ్యాయి. పీఎన్‌బీ, మహారాష్ట్ర బ్యాంక్, పీఎస్‌బీ, బ్యాంక్ ఆఫ్ ఇండియా 1% నష్టపోయాయి.

ఆర్‌ఐఎల్ కౌంటర్లో ప్రత్యేక ట్రేడింగ్

- కొత్త పద్ధతిలో చేపట్టనున్న ఎన్‌ఎస్‌ఈ
- గురువారం ప్రత్యేక ప్రీఓపెన్ సెషన్‌కు సై



న్యూఢిల్లీ: స్టాక్ ఎక్స్ఛేంజీ దిగ్గజం ఎన్‌ఎస్‌ఈ.. ప్రయివేట్ రంగ దిగ్గజం రిలయన్స్ ఇండస్ట్రీస్(ఆర్‌ఐఎల్) కౌంటర్లో ప్రత్యేక ట్రేడింగ్‌కు తెరతీస్తోంది. ఫైనాన్షియల్ సర్వీసెస్ బిజినెస్‌ను రిలయన్స్ స్ట్రాటజిక్ ఇన్వెస్ట్‌మెంట్స్ లిమిటెడ్ పేరుతో ప్రత్యేక కంపెనీగా ఆర్‌ఐఎల్ విడదీయనుంది. తదుపరి జియో ఫైనాన్షియల్ సర్వీసెస్‌గా మార్పు చేయనుంది. దీనిలో భాగంగా ఆర్‌ఐఎల్ వాటాదారులకు తమవద్ద గల ప్రతీ షేరుకూ ఒక ఫైనాన్షియల్ సర్వీసెస్ షేరును కేటాయించనుంది. ఇందుకు రికార్డ్ డేట్ జూలై 20కాగా.. అదే రోజు కొత్త విధానంలో ప్రత్యేక ప్రీఓపెన్ సెషన్‌ను ఎన్‌ఎస్‌ఈ నిర్వహించనుంది. దీని ప్రకారం నిఫ్టీ ఇండెక్స్‌లో ఆర్‌ఐఎల్ కొనసాగనుంది.

19 ఇండెక్సులలో..: జియో ఫైనాన్షియల్‌ను తాత్కాలికంగా నిఫ్టీ–50లో కొనసాగించడంతోపాటు.. 19 ఇండెక్సులలో చోటు కల్పించనుంది. దీంతో జూలై 20 నుంచి కనీసం మూడు రోజులపాటు నిఫ్టీకి తాత్కాలికంగా 51 షేర్లు ప్రాతినిధ్యం వహించనున్నాయి. జియో ఫైనాన్షియల్ లిస్టయిన రోజు నుంచి మూడు రోజులు(T+3) పూర్తయ్యాక ఇండెక్సుల నుంచి తొలగించనున్నట్లు తెలుస్తోంది. ఇదంతా నిఫ్టీ ఇండెక్సుల కొత్త విధానం ప్రకారం ఎన్‌ఎస్‌ఈ చేపట్టనుంది. ఏప్రిల్‌లో ఎన్‌ఎస్‌ఈ ఇండైసెస్ లిమిటెడ్ కొన్ని సవరణల ద్వారా కొత్త విధానానికి తెరతీసింది. కంపెనీల విడదీతసహా కార్పొరేట్ చర్యలకు అనుగుణంగా తాజా విధానానికి రూపకల్పన చేసినట్లు ఎన్‌ఎస్‌ఈ పేర్కొంది. దీనిలో భాగంగా ఎన్‌ఎస్‌ఈ ప్రత్యేక ప్రీఓపెన్ సెషన్‌ను నిర్వహిస్తే నిఫ్టీలో విడదీత కంపెనీకి చోటు కల్పించవచ్చు.

రికార్డ్ డేట్ ఎఫెక్ట్..

అనుబంధ సంస్థ జియో ఫైనాన్షియల్ సర్వీసెస్ విడదీతకు రికార్డ్ డేట్ జూలై 20 కాగా.. 19 నాటికి రిలయన్స్ ఇండస్ట్రీస్‌లో ఇన్వెస్ట్ చేసిన వాటాదారులకు జియో ఫైనాన్షియల్ షేర్లు పొందేందుకు వీలుంటుంది. ఇక గురువారం (20న) ఎన్‌ఎస్‌ఈ రెగ్యులర్ ట్రేడింగ్ కంటే ముందుగా ప్రత్యేక ప్రీ–ఓపెన్ సెషన్‌ను నిర్వహిస్తోంది. ఉదయం 9–10 మధ్య జియో ఫైనాన్షియల్ షేరు ధర నిర్ణయానికి ఇది సహకరించనున్నట్లు ఎన్‌ఎస్‌ఈ పేర్కొంది. దీనికి సంబంధించి బ్రోకింగ్ సంస్థ ప్రభుదాస్ లీలాధర్ ఇచ్చిన ఉదాహరణను చూద్దాం.. 19న (టీ–1) ఆర్‌ఐఎల్ ముగింపు ధర రూ. 2,800 అనుకుంటే.. 20న రూ. 2,600 ధర పలికిందనుకుందాం.. వెరసి జియో ఫైనాన్షియల్ షేరు ధరను రూ. 200గా పేర్కొనవచ్చు.

అత్యుత్తమ ప్రమాణాలు పాటిస్తున్నాం

- ఇప్పుడు మరింత పటిష్టంగా ఉన్నాం
- అదానీ గ్రూప్ చీఫ్ గౌతమ్ అదానీ స్పష్టీకరణ



న్యూఢిల్లీ: వ్యాపార నిర్వహణ, కీలక వివరాల వెల్లడి విషయంలో అత్యుత్తమ ప్రమాణాలను పాటిస్తున్నామని వ్యాపార దిగ్గజం అదానీ గ్రూప్ చీఫ్ గౌతమ్ అదానీ స్పష్టం చేశారు. తమ బ్యాలెన్స్ షీట్, అసెట్స్, నిధుల లభ్యత ఇప్పుడు మరింత పటిష్టమయ్యాయని ఆయన చెప్పారు. దేశ, విదేశాల్లో తాము కుదుర్చుకున్న భాగస్వామ్యాలే తమ గవర్నెన్స్ ప్రమాణాలకు నిదర్శనమని వార్షిక సర్వసభ్య సమావేశంలో అదానీ పేర్కొన్నారు. ఈ సందర్భంగా అమెరికన్ షార్ట్ సెల్లింగ్ సంస్థ హిండెన్‌బర్గ్‌పై ఆయన మరోసారి విమర్శలు గుప్పించారు. తప్పుడు సమాచారం, ఆరోపణలతో భారతీయ సంస్థల ప్రతిష్టను దెబ్బతీసేందుకు సరిగ్గా భారత గణతంత్ర దినోత్సవం సందర్భంగా హిండెన్‌బర్గ్ తప్పుడు నివేదికను ప్రచురించిందని అదానీ వ్యాఖ్యానించారు. అయితే, భారతదేశం, భారతీయ సంస్థల ప్రతిష్టను దెబ్బతీసేందుకు ఎవరెంతగా కుట్రలు పన్నినా 'మాతృభూమి' భవిష్యత్తు ఉజ్వలంగానే ఉండబోతోందని ఆయన స్పష్టం చేశారు. 2030 కన్నా ముందే ప్రపంచంలోనే మూడో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా, 2050 నాటికి రెండో పెద్ద ఎకానమీగా మారుతుందనడంలో ఎలాంటి సందేహం అక్కర్లేదని చెప్పారు. దేశ అభివృద్ధే.. తమ వ్యాపార వృద్ధికి కూడా తోడ్పాటు అందించగలదని ఆయన తెలిపారు. షేర్లు, అకౌంట్లపరంగా అదానీ గ్రూప్ సంస్థలు మోసాలకు పాల్పడుతున్నాయంటూ హిండెన్‌బర్గ్ రీసెర్చ్ జనవరిలో నివేదిక ప్రచురించడం, దానితో అదానీ కంపెనీల షేర్లు కుదేలవడం తెలిసిందే. ఆ నివేదికతో అదానీ గ్రూప్ లిస్టెడ్ కంపెనీల మార్కెట్ విలువ దాదాపు 150 బిలియన్ డాలర్ల మేర కరిగిపోయింది.

సహారా డిపాజిటర్లకు చెల్లింపుల ప్రక్రియ షురూ

ముందుగా రూ. 10,000 వరకు ఇన్వెస్ట్ చేసిన వారికి చెల్లింపు

న్యూఢిల్లీ: సహారా గ్రూప్‌నకు చెందిన నాలుగు కోఆపరేటివ్ సొసైటీల్లో ఇరుక్కుపోయిన దాదాపు రూ. 5,000 కోట్ల మొత్తాన్ని తిరిగి డిపాజిటర్లకు అందజేసే ప్రక్రియను కేంద్ర ప్రభుత్వం మంగళవారం ప్రారంభించింది. దీనితో చాలా కాలంగా తమ కష్టార్జితం కోసం ఎదురుచూస్తున్న కోట్ల మంది చిన్న ఇన్వెస్టర్లకు ఊరట లభించనుంది. ఇందుకోసం సీఆర్‌సీఎస్–సహారా రీఫండ్ పోర్టల్‌ను కేంద్ర సహకార శాఖ మంత్రి అమిత్ షా ప్రారంభించారు. దీనితో ఒక కోటి మంది డిపాజిటర్లకు ప్రయోజనం చేకూరగలదని ఆయన పేర్కొన్నారు. ముందుగా రూ. 10,000 వరకు ఇన్వెస్ట్ చేసిన కోటి మంది ఇన్వెస్టర్లకు చెల్లింపులు జరపనున్నట్లు మంత్రి చెప్పారు. నాలుగు సొసైటీల (సహారా క్రెడిట్ కోఆపరేటివ్ సొసైటీ, సహారాయాన్ యూనివర్సల్ మల్టీపర్పస్ సొసైటీ, హమారా ఇండియా క్రెడిట్ కోఆపరేటివ్ సొసైటీ, స్టార్స్ మల్టీపర్పస్ కోఆపరేటివ్ సొసైటీ) మొత్తం డేటా సీఆర్‌సీఎస్–సహారా రీఫండ్ పోర్టల్‌లో ఉందని, దాని



ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఇందుకోసం ఇన్వెస్టర్లు ఆధార్ కార్డు వారి మొబైల్ నంబరు, బ్యాంకు ఖాతాలకు అనుసంధానమై ఉండాలని తెలిపారు. దరఖాస్తు చేసుకున్న 45 రోజుల్లోగా వారికి రావాల్సిన సొమ్ము వారి ఖాతాల్లో జమవుతుందని చెప్పారు. రూ. 5,000 కోట్ల చెల్లింపులు పూర్తయిన తర్వాత ఇతర ఇన్వెస్టర్లకు చెందిన డబ్బును కూడా తిరిగి చెల్లించేందుకు అనుమతుల కోసం సుప్రీం కోర్టును కోరనున్నట్లు ఆయన తెలిపారు. సహారా–సెబీ రీఫండ్ ఖాతా నుంచి రూ. 5,000 కోట్ల మొత్తాన్ని సెంట్రల్ రిజిస్ట్రార్ ఆఫ్ కోఆపరేటివ్ సొసైటీస్ (సీఆర్‌సీఎస్)కు బదలాయించాలంటూ గతంలో సుప్రీం కోర్టు ఆదేశించింది. నాలుగు సహకార సంఘాలకు చెందిన 10 కోట్ల మంది ఇన్వెస్టర్లకు 9 నెలల్లోగా డిపాజిట్ మొత్తాలను వాపసు చేస్తామంటూ మార్చి 29న కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది.

ఇండస్‌ఇండ్ లాభం జూమ్

- క్యూ1లో రూ. 2,124 కోట్లు
- మొండిబకాయిల తగ్గుదల



ముంబై: ప్రయివేట్ రంగ దిగ్గజం ఇండస్‌ఇండ్ బ్యాంక్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2023–24) తొలి త్రైమాసికం(క్యూ1)లో ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన క్యూ1(ఏప్రిల్–జూన్)లో నికర లాభం వార్షికంగా 30 శాతం జంప్‌చేసి రూ. 2,124 కోట్లను తాకింది. గతేడాది(2022–23) ఇదే కాలంలో రూ. 1,631 కోట్లు మాత్రమే ఆర్జించింది. ఇందుకు మొండి రుణాలు తగ్గడం, వడ్డీ ఆదాయం పుంజుకోవడం సహకరించాయి. మొత్తం ఆదాయం రూ. 10,113 కోట్ల నుంచి రూ. 12,939 కోట్లకు ఎగసింది. నికర వడ్డీ ఆదాయం 18 శాతం పుంజుకుని రూ. 4,867 కోట్లను తాకింది. నికర వడ్డీ మార్జిన్లు నామమాత్రంగా మెరుగుపడి 4.29 శాతానికి చేరాయి. ఇతర ఆదాయం 14 శాతం వృద్ధితో రూ. 2,210 కోట్లుగా నమోదైంది. ప్రొవిజన్లు రూ. 1,251 కోట్ల నుంచి రూ. 991 కోట్లకు తగ్గాయి. స్థూల మొండిబకాయిలు(ఎన్‌పీఏలు) 2.35 శాతం నుంచి 1.94 శాతానికి దిగివచ్చాయి. నికర ఎన్‌పీఏలు 0.67 శాతం నుంచి 0.58 శాతానికి తగ్గాయి.

ఫలితాల నేపథ్యంలో ఇండస్‌ఇండ్ షేరు నామమాత్రంగా తగ్గి రూ. 1,390 వద్ద క్లోజైంది.

జాబ్ పాయింట్

కొచ్చిన్ షిప్‌యార్డులో 300 వర్క్‌మ్యాన్ పోస్టులు

కొచ్చిలోని కొచ్చిన్ షిప్‌యార్డ్ లిమిటెడ్(సీఎస్ఎల్).. కాంట్రాక్ట్ ప్రాతిపదికన వర్క్‌మ్యాన్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 300
» ట్రేడ్‌లు:షీట్ మెటల్ వర్కర్, వెల్డర్,ఫిట్టర్, మెకానిక్ డీజిల్, మెకానిక్ మోటార్ వెహికల్, ప్లంబర్,పెయింటర్, ఎలక్ట్రీషియన్, ఎలక్ట్రానిక్ మెకానిక్,ఇన్‌స్ట్రుమెంట్ మెకానిక్, షిప్ రైట్ వుడ్.
» అర్హత: ఎస్ఎస్ఎల్‌సీ, సంబంధిత ట్రేడులో ఐటీఐ ఉత్తీర్ణతతోపాటు పని అనుభవం ఉండాలి. వయసు: 30 ఏళ్లు మించకూడదు.
» వేతనం: నెలకు రూ.23,300 నుంచి రూ.24,800 చెల్లిస్తారు.
» ఎంపిక విధానం: ఫేజ్ 1–ఆబ్జెక్టివ్ టైప్ ఆన్‌లైన్ టెస్ట్, ఫేజ్2–ప్రాక్టికల్ టెస్ట్ ఆధారంగా ఎంపిక చేస్తారు.
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:28.07.2023.
» వెబ్‌సైట్: https://cochinshipyard.in

ఐఐటీ హైదరాబాద్‌లో రీసెర్చ్ అసోసియేట్ పోస్టులు

హైదరాబాద్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీ).. రీసెర్చ్ అసోసియేట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» అర్హత: బీఈ/బీటెక్/ఎమ్మెస్సీ/ఎంఈ/పీహెచ్‌డీ ఉత్తీర్ణులవ్వాలి.
» వయసు: 30 నుంచి 40 ఏళ్లు ఉండాలి.
» వేతనం: నెలకు రూ.47,000 చెల్లిస్తారు.
» ఎంపిక విధానం: షార్ట్‌లిస్టింగ్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» దరఖాస్తు విధానం: ఈమెయిల్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» ఈమెయిల్: ashok@mae.iith.ac.in
» దరఖాస్తులకు చివరితేది: 26.07.2023.
» వెబ్‌సైట్: iith.ac.in

ఐఐటీ హైదరాబాద్‌లో రీసెర్చ్ స్టాఫ్ పోస్టులు

హైదరాబాద్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీ).. రీసెర్చ్ అసోసియేట్, జూనియర్ రీసెర్చ్ ఫెలో పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» విభాగాలు: మైక్రోఎలక్ట్రానిక్స్/నానో ఎలక్ట్రానిక్స్/నానో టెక్నాలజీ/నానో బయోటెక్నాలజీ/మెటీరియల్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ తదితరాలు.
» అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత స్పెషలైజేషన్‌లో ఎమ్మెస్సీ/ఎంఈ/ఎంటెక్ /పీహెచ్‌డీ ఉత్తీర్ణులవ్వాలి. వయసు: 28 నుంచి 35 ఏళ్లు ఉండాలి.
» వేతనం: నెలకు రూ.31,000 నుంచి రూ.47,000 చెల్లిస్తారు.
» ఎంపిక విధానం: షార్ట్‌లిస్టింగ్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» దరఖాస్తు విధానం: ఈమెయిల్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» ఈమెయిల్: fendlabiith@gmail.com
» దరఖాస్తులకు చివరితేది: 20.07.2023.
» వెబ్‌సైట్: iith.ac.in

ఐసీఎంఆర్-ఎన్ఐఎన్, హైదరాబాద్‌లో 116 పోస్టులు

హైదరాబాద్‌లోని ఐసీఎంఆర్–నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్(ఎన్ఐఎన్).. వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 116
» పోస్టుల వివరాలు: టెక్నికల్ అసిస్టెంట్–45, టెక్నీషియన్–33, ల్యాబొరేటరీ అటెండెంట్–38
» టెక్నికల్ అసిస్టెంట్: వేతనం: నెలకు రూ.35,400 నుంచి రూ.1,12,400 చెల్లిస్తారు.
» టెక్నీషియన్: వేతనం: నెలకు రూ.19,900 నుంచి రూ.63,200 చెల్లిస్తారు.
» ల్యాబొరేటరీ అటెండెంట్: వేతనం: నెలకు రూ18,000 నుంచి రూ.56,900 చెల్లిస్తారు.
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
» ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభ తేది:24.07.2023.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:14.08.2023.
» వెబ్‌సైట్: www.nin.res.in

సీఎస్ఐఆర్-సీఐఎంఏపీ, హైదరాబాద్‌లో ప్రాజెక్ట్ స్టాఫ్ పోస్టులు

హైదరాబాద్‌లోని సీఎస్ఐఆర్–సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ అండ్ ఏరోమాటిక్ ప్లాంట్స్(సీఐఎంఏపీ).. ప్రాజెక్ట్ స్టాఫ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 04
» పోస్టుల వివరాలు: ప్రాజెక్ట్ అసోసియేట్–03, ప్రాజెక్ట్ అసిస్టెంట్–01.
» అర్హత: పోస్టును అనుసరించి బీఈ/బీటెక్/బీఎస్సీ/ఎంఎస్సీ/ఎంఫార్మసీ ఉత్తీర్ణులవ్వాలి. వయసు: 35 నుంచి 50 ఏళ్లు ఉండాలి.
» వేతనం: నెలకు రూ.20,000 నుంచి రూ.35,000 చెల్లిస్తారు.
» ఎంపిక విధానం: ఇంటర్వ్యూలో మెరిట్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» ఇంటర్వ్యూ వేదిక: సీఎస్ఐఆర్–సీఐఎంఏపీ, రీసెర్చ్ సెంటర్, స్ట్రీట్ నెం.1, అన్నపూర్ణ కాలనీ, బోడుప్పల్, హైదరాబాద్–500092,తెలంగాణ.
» ఇంటర్వ్యూ తేది: 26.07.2023.
» ఇంటర్వ్యూ సమయం: ఉదయం 9.30.
» వెబ్‌సైట్: https://cimap.res.in

ప్రీవియస్ పేపర్స్.. ప్రిపరేషన్ కింగ్

» పోటీ పరీక్షల విజయంలో కీలకంగా ప్రీవియస్ పేపర్స్
» పరీక్ష శైలి, ప్రశ్నల తీరుపై అవగాహనకు అవకాశం
» అభ్యర్థులు స్వీయ సామర్థ్యాలు తెలుసుకునే వీలు
» కొన్నిసార్లు నేరుగా పాత ప్రశ్నలు అడుగుతున్న వైనం

సివిల్స్, గ్రూప్స్, బ్యాంక్స్, జేఈఈ, నీట్.. ఇలా పరీక్ష ఏదైనా.. ప్రిపరేషన్‌లో కీలకంగా మారుతున్నాయి.. ప్రీవియస్ పేపర్స్!! ఆయా పరీక్షలకు సంబంధించి గత ప్రశ్న పత్రాలను పరిశీలించడం ద్వారా ప్రశ్న శైలిపై అవగాహన వస్తుంది. అంతేకాదు సదరు నియామక సంస్థ అభ్యర్థి నుంచి ఏం కోరుకుంటుందో తెలుస్తుంది. దీంతోపాటు పరీక్ష కోణంలో ముఖ్యమైన టాపిక్స్‌ను గుర్తించే వీలవుతుంది. కొన్నిసార్లు గత ప్రశ్నలను నేరుగా అడుగుతున్నారు. ఈ నేపథ్యంలో.. పోటీ పరీక్షల్లో పాత ప్రశ్న పత్రాల సాధన ఆవశ్యకత గురించి తెలుసుకుందాం..

'ప్రీవియస్ పేపర్స్ ప్రాక్టీస్ చేయడం ఎంతో ఉపకరించింది. పాత ప్రశ్న పత్రాలను అనుసరించడం పరీక్షలో విజయానికి దోహదం చేసింది'. –పోటీ పరీక్షల విజేతలు చెప్పే మాటలు ఇవి! దీన్ని బట్టి పోటీ పరీక్షల ప్రిపరేషన్‌లో గత ప్రశ్న పత్రాల ప్రాధాన్యాన్ని అర్థం చేసుకోవచ్చు అంటున్నారు నిపుణులు.



పోటీ పరీక్షల ప్రత్యేకం

ప్రిపరేషన్ ప్రారంభానికి ముందే

పోటీ పరీక్షలకు సంబంధించి అభ్యర్థులు ప్రిపరేషన్ ప్రారంభానికి ముందే ప్రీవియస్ పేపర్లను పరిశీలించడం లాభిస్తుంది. వాస్తవానికి ఎక్కువ మంది సిలబస్‌పై అవగాహన ఏర్పరచుకుని ప్రిపరేషన్‌కు ఉపక్రమిస్తారు. కాని సిలబస్‌పై అవగాహనతో పాటు ప్రీవియస్ పేపర్లను కూడా పరిశీలిస్తే.. ఏ టాపిక్‌కు ఎంత వెయిటేజీ లభిస్తుందో తెలుస్తుంది. దానికి అనుగుణంగా ప్రిపరేషన్ సమయంలో ఆయా అంశాలకు ఇవ్వాల్సిన ప్రాధాన్యతపై స్పష్టత లభిస్తుంది.

ప్రశ్నల తీరుపై అవగాహన

ప్రీవియస్ కొశ్చన్ పేపర్స్ పరిశీలిస్తే.. ప్రశ్నలు అడుగుతున్న తీరు తెలుస్తుంది. ఒక అంశంపై ఎన్ని రకాలుగా ప్రశ్నలు వస్తున్నాయో అవగాహన వస్తుంది. దాని ఆధారంగా సదరు టాపిక్‌ను చదివేటప్పుడు.. అన్ని కోణాల్లో సబ్జెక్టుపై పట్టు పెంచుకునే ప్రయత్నం చేయొచ్చు. సొంతంగా ప్రశ్నలు రూపొందించుకుని సమాధానాలు ప్రాక్టీస్ చేయడానికి కూడా ఉపకరిస్తుంది.

స్వీయ సామర్థ్యంపై స్పష్టత

ప్రీవియస్ పేపర్లు సాధన చేయడం ద్వారా ఆయా టాపిక్ లేదా సబ్జెక్ట్‌పై అభ్యర్థులు తమకున్న సామర్థ్య స్థాయిపై స్పష్టత తెచ్చుకునే అవకాశం లభిస్తుంది. ప్రీవియస్ పేపర్స్‌ను ప్రాక్టీస్ చేసి.. ఫలితాన్ని విశ్లేషించుకోవడం ద్వారా.. పొరపాటు సమాధానాలకు కారణాలను గుర్తించొచ్చు. ఫలితంగా సదరు విభాగంలో ఇంకా పట్టు సాధించాల్సిన అంశాలు, అందుకు అనుసరించాల్సిన విధానంపైనా స్పష్టత వస్తుంది.

కనీసం అయిదేళ్ల పేపర్లు

కనీసం గత అయిదేళ్ల ప్రశ్న పత్రాలను సాధన చేయాలని నిపుణులు సూచిస్తున్నారు. పోటీ పరీక్షల్లో గత ప్రశ్న పత్రాల నుంచి 20 శాతం వరకు ప్రశ్నలు పునరావృతం అయ్యే అవకాశం ఉందంటున్నారు. సదరు ప్రశ్న అన్ని పరీక్షల్లో ఒకే విధంగా ఉండకపోయినా.. నిర్దిష్టంగా ఒక అంశం నుంచి వేరే రూపంలో ప్రశ్నలు పునరావృతం అవుతున్నాయని చెబుతున్నారు. ముఖ్యంగా గ్రూప్స్, సివిల్ సర్వీసుల పరీక్షల్లో సైన్స్ అండ్ టెక్నాలజీ, ఎకాలజీ, ఎన్విరాన్‌మెంట్ తదితర సబ్జెక్ట్‌లకు సంబంధించి కోర్ అంశాల నుంచి ప్రశ్నలు రిపీట్ అవుతున్నాయి.

ప్రాక్టీస్ పలు విధాలుగా

- ప్రిపరేషన్ సమయంలో ప్రీవియస్ పేపర్లను ప్రాక్టీస్ చేసే విషయంలోనూ పలు వ్యూహాలను అనుసరించాలని నిపుణులు సూచిస్తున్నారు. టాపిక్ వారీగా, సబ్జెక్ట్ వారీగా ప్రీవియస్ పేపర్లలోని కొశ్చన్స్‌ను ప్రాక్టీస్ చేయాలి. అదే విధంగా ప్రిపరేషన్ పూర్తి చేసుకున్న అంశాలకు సంబంధించిన ప్రశ్నలను సాధనం చేయాలి. ఫలితంగా సదరు సబ్జెక్ట్ లేదా టాపిక్‌పై పరీక్షకు అవసరమైన అన్ని కోణాల్లో పట్టు సాధించొచ్చని చెబుతున్నారు.
- ప్రీవియస్ పేపర్లను సాధన చేసే క్రమంలో ఉపకరించే మరో వ్యూహం.. వీక్లీ ప్రాక్టీస్. అంటే.. ప్రతి వారం చివరలో.. ఆ వారంలో తాము చదివిన టాపిక్స్, యూనిట్స్, సబ్జెక్ట్‌లకు సంబంధించి ప్రీవియస్ పేపర్లలోని కొశ్చన్స్‌ను సాధన చేయాలి. దీనివల్ల నిరంతర అవగాహనతో పాటు.. అనుసంధాన విధానంలో ఉండే ప్రశ్నలను, వాటికి సంబంధించిన సబ్జెక్ట్‌లను తెలుసుకునే వీలు లభిస్తుంది.

వాస్తవ పరీక్ష మాదిరిగానే

ప్రీవియస్ పేపర్లను ప్రాక్టీస్ చేసే అభ్యర్థులు.. వాటిని వాస్తవ పరీక్షగానే భావించి సాధన చేయడం మేలు చేస్తుంది. పరీక్షలో సదరు పేపర్‌కు అందుబాటులో ఉండే సమయాన్నే.. ప్రీవియస్ పేపర్స్ సాధనకు కేటాయించాలి. నిర్దిష్ట సమయంలోపే పేపర్‌లోని అన్ని ప్రశ్నలకు సమాధానం ఇవ్వాలి. ఆ తర్వాత వాటి సమాధానాలను సరిచూసుకోవాలి. ఈ విశ్లేషణ ఆధారంగా.. స్వీయ బలాలు, బలహీనతలపై అవగాహన లభిస్తుంది. వాస్తవ పరీక్ష మాదిరిగానే భావించి ప్రాక్టీస్ చేయడం ద్వారా నిర్దేశిత సమయంలో ఎన్ని ప్రశ్నలకు సమాధానాలు గుర్తించగలిగాం. మిగిలిపోయిన ప్రశ్నలెన్ని? దానికి కారణం సమయాభావమా.. లేదా సమాధానాలు తెలియకపోవడమా.. వంటి కోణాల్లో విశ్లేషించుకోవచ్చు. దానికి అనుగుణంగా సమయ పాలన పరంగా వేగం పెంచుకోవడం, సబ్జెక్ట్ పరంగా లోపాలు ఉంటే సరిదిద్దుకోవడం వంటివి చేయొచ్చు.

డిస్క్రిప్టివ్‌కు సమయపాలన

- డిస్క్రిప్టివ్ విధానంలో ఉండే పరీక్షలకు ప్రీవియస్ పేపర్స్ సాధనలో సమయ పాలనను తప్పనిసరిగా పాటించాలి. ఉదాహరణకు.. సివిల్ సర్వీసెస్ మెయిన్ పరీక్ష లేదా గ్రూప్–1 మెయిన్ ఎగ్జామినేషన్‌నే పరిగణనలోకి తీసుకుంటే.. ప్రతి ప్రశ్నకు సగటున 10 నుంచి 12 నిమిషాల సమయం అందుబాటులో ఉంటుంది. ప్రీవియస్ పేపర్స్ ప్రాక్టీస్ చేసేటప్పుడు ప్రతి ప్రశ్నకు సమయ పరిమితి విధించుకోవాలి. ఆ సమయం దాటిన తర్వాత సదరు ప్రశ్నకు సమాధానాన్ని ముగించి, వేరే ప్రశ్నకు సమాధానం రాయాలి.
- ఇలా వాస్తవ పరిస్థితుల్లో అన్ని ప్రశ్నలకు సమాధానాలు రాయడం పూర్తి చేసుకున్న తర్వాత విశ్లేషణ చేసుకోవాలి. సమాధానాల్లో ముఖ్యాంశాలను పొందుపర్చామా.. ఎగ్జామినర్ ఆశించిన తీరులోనే జవాబులు ఉన్నాయా.. సమాధానాన్ని అసంతృప్తిగా ఎందుకు ముగించాల్సి వచ్చింది? ఇలా భిన్న కోణాల్లో పరిశీలించాలి. అంతేకాకుండా తాము రాసిన సమాధానాలను వీలైతే సబ్జెక్ట్ నిపుణులతో మూల్యాంకన చేయించుకోవాలి.
- ఈ విశ్లేషణల ఫలితంగా సమయ పాలనతో పాటు సమాధానం రాసే విధానాన్నీ మెరుగుపరచుకునే వీలవుతంది. చక్కటి చేతిరాత, పాయింట్స్ వారీగా సమాధానాలు రాయడం వంటి నైపుణ్యాలు లభిస్తాయి.

పది రెట్లు ప్రయోజనం

ప్రీవియస్ పేపర్లను ప్రాక్టీస్ చేయడం, వాటిని విశ్లేషించుకోవడం ద్వారా రైటింగ్ స్కిల్స్, ప్రజెంటేషన్ నైపుణ్యాలు మెరుగుపడతాయి. పదిసార్లు చదివిన దానికంటే.. ఒకసారి రాసిన విషయం ఎక్కువగా కాలం గుర్తుంటుందని నిపుణులు పేర్కొంటున్నారు. నిరంతర రాయడం ద్వారా రీడింగ్ స్పీడ్ కూడా పెరుగుతుందని చెబుతున్నారు.

సరి పోల్చుకుంటూ

ప్రస్తుతం పలు మార్గాల ద్వారా ప్రీవియస్ పేపర్లకు నిపుణుల సమాధానాలు అందుబాటులో ఉన్నాయి. అభ్యర్థులు ఆ మార్గాలను వినియోగించుకోవాలి. ఆయా ప్రశ్నలకు సంబంధించి తమ సమాధానాలు, నిపుణుల జవాబులు పోల్చుకోవాలి. నిపుణులు పొందుపర్చిన సమాధానాల్లోని ముఖ్య అంశాలను నోట్ చేసుకోవాలి. తమ ప్రజెంటేషన్, నిపుణుల ప్రజెంటేషన్ మధ్య వ్యత్యాసాలను గుర్తించాలి. తాము రాయని, నిపుణులు రాసిన అంశాలను నోట్ చేసుకోవాలి. అదే విధంగా.. ఆయా అంశాలకు సంబంధించి తాము చదివిన మెటీరియల్‌లో లేని, నిపుణులు ఉదహరించిన అంశాలను ప్రత్యేకంగా గుర్తించాలి.

ప్రీవియస్ పేపర్లు.. ముఖ్యాంశాలు

- పోటీ పరీక్షల విషయంలో పూర్తి అవగాహన కల్పించే ప్రీవియస్ పేపర్లు.
- సబ్జెక్టులు, టాపిక్స్‌కు లభిస్తున్న వెయిటేజీని తెలుసుకునే అవకాశం.
- కనీసం అయిదేళ్ల ప్రశ్న పత్రాల సాధనతో ఆయా అంశాలపై అవగాహన.
- గత ప్రశ్న పత్రాల నుంచి దాదాపు 20 శాతం ప్రశ్నలు పునరావృతం
- నిరంతర స్వీయ సామర్థ్యాలను తెలుసుకునేందుకు అవకాశం కల్పించే ప్రీవియస్ కొశ్చన్ పేపర్లు.

ఈ నెల 29న మొహర్రం

నెలవంక నిర్ధారణ కమిటీ నిర్ణయం

సాక్షి, హైదరాబాద్: నెలవంక మంగళవారం కనబడకపోవడంతో ఈ నెల 29వ తేదీన మొహర్రం జరుపుకోవాలని నెలవంక నిర్ధారణ కమిటీ ప్రతినిధి ముఫ్తీ ఖలీల్ అహ్మద్ తెలిపారు. మంగళవారం నెలవంక నిర్ధారణ కమిటీ కార్యాలయంలో ముఫ్తీ ఖలీల్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా నెలవంక నిర్ధారణ కోసం ఏర్పాట్లు చేసిన వివిధ కమిటీల ద్వారా సమాచారం సేకరించిన అనంతరం ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. దేశవ్యాప్తంగా ఎక్కడా నెలవంక కనబడినట్లు సమాచారం రాలేదన్నారు. దీంతో గురువారం నుంచి ఇస్లామియా మొదటి నెల మొహర్రం ప్రారంభమవుతుందని తెలిపారు. షియా ముస్లింలు ఈ నెల 20వ తేదీ నుంచి 68 రోజులపాటు సంతాప దినాలుగా పాటిస్తారని పేర్కొన్నారు.

మంత్రి శ్రీనివాస్ గౌడ్‌తో విదేశీ పారిశ్రామికవేత్తల భేటీ



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఉన్న వ్యాపార అవకాశాలు, తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలు, వారసత్వ సంపదపై అధ్యయనానికి వచ్చిన విదేశీ యువ పారిశ్రామికవేత్తలు.. రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి వి.శ్రీనివాస్ గౌడ్‌ను మంగళవారం కలిశారు. యూత్ అంబాసిడర్స్ ప్రోగ్రాం(వైఏపీ)లో భాగంగా ఆస్ట్రియా, జర్మనీ, ఇటలీ, డెన్మార్క్, ఫిన్లాండ్, నెదర్లాండ్, బెల్జియం దేశాలకు చెందిన 13 మంది యువ పారిశ్రామికవేత్తలు 15 రోజుల పర్యటనకు వచ్చారు. ఇందులో భాగంగా మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌ని సచివాలయంలోని ఆయన కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. తెలంగాణ ప్రాముఖ్యత, చారిత్రక, వారసత్వ సంపద, రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న నూతన ఇండస్ట్రియల్ పాలసీ, ఐటీ, ఫార్మా పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వం అందిస్తున్న సహకారం వంటి విషయాలను వారికి మంత్రి వివరించారు. కార్యక్రమంలో యూత్ అంబాసిడర్స్ కో-ఆర్డినేటర్ నవీన్ మల్వేతో పాటు ఆయా దేశాలకు చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు.

కళాశాలల సిబ్బంది బదిలీలకు వినతి

సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పనిచేస్తున్న రెగ్యులర్ టీచింగ్, నాన్-టీచింగ్ ఉద్యోగుల బదిలీలు చేపట్టాలని తెలంగాణ ఇంటర్మీడియట్ గవర్నమెంట్ లెక్చరర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎం.రామకృష్ణ గౌడ్ విజ్ఞప్తి చేశారు.



గ్రామీణ భారతంలో సగటు వేతన జీవులు ఉసూరుమంటున్నారు..
అత్తెసరు వేతన ఆదాయంతో బతుకుబండిని భారంగా లాగుతున్నారు..
పల్లెల్లో చాలీచాలని ఆదాయంతో సర్దుకుంటున్నారు. కేంద్ర గణాంక శాఖ పరిధిలోని నేషనల్ శాంపిల్ సర్వే కార్యాలయం 2023-24 ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికానికి సంబంధించి విడుదల చేసిన పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే (పీఎల్ఎఫ్ఎస్) నివేదిక ఇదే విషయాన్ని స్పష్టం చేసింది. ఈ సర్వే ప్రకారం దేశంలోని గ్రామీణ ప్రాంతాల్లో వేతన జీవి సగటు ఆదాయం గత ఏడాదిన్నర నుంచి రూ. 14,700 వద్దే నిలిచిపోయింది. మరోవైపు ఓ ప్రైవేటు సంస్థ చేపట్టిన మరో అధ్యయనం ప్రకారం ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో పట్టణ ప్రాంత ఉద్యోగి సగటు ఆదాయం రూ. 21,647గా నమోదైంది.

18 నెలలుగా పెరగనే లేదు!

సాక్షి, హైదరాబాద్

దేశవ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాలకు చెందిన ఉద్యోగుల సగటు వేతన ఆదాయంలో పెరుగుదల కనిపించడం లేదని పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే (పీఎల్ఎఫ్ఎస్) తెలిపింది. 2023-24 ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంతో ముగిసిన 18 నెలల కాలంలో వారి వేతనంలో ఎలాంటి ఎదుగుదల లేదని పేర్కొంది. రూ. 14,700 దగ్గరే ఆగిపోయినట్లు వివరించింది. అయితే పట్టణ ప్రాంతాల్లో సగటు ఉద్యోగి (శాలరీడ్ పర్సన్) నెలవారీ సగటు వేతనం మాత్రం రూ. 20,030 నుంచి 7.5 శాతం పెరిగి రూ. 21,647కు చేరుకున్నట్లు ఐసీఐసీఐ సెక్యూరిటీస్ నివేదిక తెలిపింది. పీఎల్ఎఫ్ఐ డేటా ప్రకారం చూస్తే గ్రామీణ ప్రాంతాల్లోని దినసరి కూలీ లేదా వేతనం 2021-22 ఆర్థిక సంవత్సరంలో ఉన్న రూ. 302తో పోలిస్తే 2023-24 తొలి త్రైమాసికంలో రూ. 368కు పెరిగింది. అదే పట్టణ ప్రాంతాల్లోని క్యాజువల్ లేబర్ రోజుకూలీ రూ. 385 నుంచి రూ. 464కు పెరిగింది. దేశంలోని కార్మికశక్తిలో 46 శాతం మంది వ్యవసాయ దిగుబడులపై ఆధారపడి ఉన్నారని... కానీ ఈ ఏడాది తీవ్ర వాతావరణ మార్పులు వారికొచ్చే నెలసరీ ఆదాయాలపై ప్రతికూల ప్రభావం చూపొచ్చని నివేదిక అభిప్రాయపడింది. ప్రధానంగా గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయం, నిర్మాణ రంగాల్లో... పట్టణాల్లో ఉత్పత్తి, సర్వీసెస్, ఇతర రంగాల్లో ఉద్యోగులు కేంద్రీకృతమైనట్లు పీఎల్ఎఫ్ఎస్ నివేదిక వెల్లడించింది.

గ్రామీణ ఉద్యోగి సగటు వేతన ఆదాయం రూ.14,700 వద్దే నిలిచిపోయిన వైనం

- పట్టణ ఉద్యోగి సగటు వేతనం రూ. 21,647
- దినసరి కార్మికుల రోజు కూలీలో నామమాత్ర పెరుగుదల
- రూ. 302 నుంచి రూ. 368 వరకు మాత్రమే పెంపు నమోదు
- పట్టణ కూలీల రోజువారీ వేతనం రూ. 385 నుంచి రూ. 464కి జంప్
- పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వేలో వివిధ అంశాలు వెల్లడి

పట్టణ ప్రాంతాల్లోని ఉద్యోగులు ప్రైవేటు రంగంలోని ఐటీ, స్టార్టప్ సెక్టార్లలో ఎక్కువగా పని చేస్తున్నారు. ప్రస్తుతం ప్రతికూల పరిస్థితుల కారణంగా ఈ ఉద్యోగులకు అవకాశాలు దక్కకపోవడంతో ఉపాధిలేమి కూడా వెంటాడుతోందని నిపుణులు చెబుతున్నారు.


ప్రైవేటులో ఉపాధిలేమి..

గతేడాదితో పోలిస్తే 'నెలవారీ హైరింగ్ ట్రెండ్స్' దాదాపు 7 శాతం తగ్గిపోయినట్లు 'ఫౌండిట్ ఇనసైట్స్ ట్రాకర్' వెల్లడించింది. బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసెస్ అండ్ ఇన్సూరెన్స్ (బీఎఫ్ఎస్ఐ) రంగంలోని మొత్తం 27 పరిశ్రమల్లో 10 శాతం ఉద్యోగాల కల్పన తగ్గినట్లు ట్రాకర్ పేర్కొంది.

ఫౌండిట్ ఇన్‌సైట్స్ ట్రాకర్ అధ్యయనం ప్రకారం... గతేడాది నుంచి పరిశీలిస్తే కేవలం 9 రంగాల్లో మాత్రమే ఈ-రిక్రూట్‌మెంట్ కార్యకలాపాలు పెరిగాయి. ఇందులోనూ షిప్పింగ్/మెరైన్ పరిశ్రమ అత్యధికంగా 45 శాతం వృద్ధిని నమోదు చేసింది. డేటా ఆధారంగా వ్యూహాలు

ఏయే రంగాల్లో వృద్ధి...

రూపొందించుకొనే అడ్వర్టయిజింగ్, మార్కెటింగ్-పీఆర్ పరిశ్రమలు 28 శాతం రిక్రూట్‌మెంట్ యాక్టివిటీ పెరుగుదల సాధించాయి. రిటైల్, ట్రావెల్, టూరిజం రంగాలు గతేడాదితో పోల్చితే 27 శాతం వృద్ధిని నమోదు చేశాయి.






డి.పాపారావు, ఆర్థికరంగ విశ్లేషకులు

ద్రవ్యోల్బణం పెరుగుదలే కారణం...

దేశంలో ద్రవ్యోల్బణం పెరుగుదలతో గ్రామీణ ప్రాంతాల్లో వేతనాలు పెరగట్లేదు. దీంతో ఈ ప్రాంతాల్లోని ఉద్యోగుల నిజ వేతనాలు (రియల్ వేజ్) పెరగక ఇబ్బందిపడుతున్నారు. పట్టణ ప్రాంతాలోన్లూ అదే పరిస్థితి నెలకొంది. పైకి చూస్తే వేతనం ద్వారా నిర్ణీత ఆదాయం వస్తున్నట్లు కనిపిస్తున్నా గత నెలతో పోలిస్తే ద్రవ్యోల్బణం పెరుగుదల ప్రభావం స్పష్టంగా కనిపిస్తోంది. జనం చేతుల్లో డబ్బుల్లేక వారి కొనుగోలు శక్తి తగ్గుతోంది. దీనికితోడు ఉపాధి హామీ పనిదినాలు తగ్గడం గ్రామీణ ప్రాంత దినసరి కూలీలపై మరింత ప్రభావం చూపుతోంది.



కొందరు దించిన తల ఎత్తరు.. మరికొందరు అర్ధరాత్రయినా.. అదే పనిగా అందులో మునిగితేలుతుంటారు.. సోషల్ మీడియా మాయ ఇది.. ఒక అధ్యయనం ప్రకారం ప్రపంచవ్యాప్తంగా రోజుకు సగటున 2 గంటల 27 నిమిషాల సమయం సామాజిక మాధ్యమాల కోసం వెచ్చిస్తున్నట్లు తేలింది. దేశాలవారీగా చూస్తే.. ఈ జాబితాలో ఫిలిప్పీన్స్ మొదటి స్థానంలో ఉంది.. అక్కడి ప్రజలు రోజుకు సగటున 4 గంటల 6 నిమిషాల సమయం ఇదే పనిలో ఉంటున్నారట. అమెరికాలో ఇది 2 గంటల 14 నిమిషాలుగా ఉంటే.. మన దేశంలో 2 గంటల 36 నిమిషాలుగా ఉంది. ఇంతకీ మీరెంత సమయం సోషల్ మీడియా చూస్తూ.. గడిపేస్తున్నారు.. 2.36 గంటలేనా.. అంతకు మించా??

–సాక్షి, సెంట్రల్ డెస్క్

బోరు బావిలో ఇరుక్కున్న మహిళ

- నాలుగు గంటలు శ్రమపడి సురక్షితంగా బయటకు తీసిన పోలీసులు, స్థానికులు
- సోలిపేట్ గ్రామంలో ఘటన

బొమ్మలరామారం: వరి నాటు వేసేందుకు వెళ్లిన మహిళ ప్రమాదవశాత్తూ బోరు బావిలో ఇరుక్కుపోయింది. నాలుగు గంటల పాటు శ్రమించి ఆమెను సురక్షితంగా బయటకు తీశారు. యాదాద్రి భువనగిరి జిల్లా బొమ్మలరామారం మండలం సోలిపేట్ గ్రామానికి చెందిన వ్యవసాయకూలీ అయినబోయిన పద్మ స్థానిక గోలిపల్లి వెంకట్‌రెడ్డి వ్యవసాయ క్షేత్రం వద్దకు మంగళవారం వరి నాటు వేసేందుకు వెళ్లింది. రైతు వెంకట్‌రెడ్డి తన పొలం వద్ద గతంలో బోరు బావిని తవ్వించగా.. నీరు పడకపోవడంతో వదిలేశాడు. ఆ భూమిలోనే కొత్తగా మడిని చేసి అందులో వరి నాటు వేయడానికి దుక్కి దున్నాడు. ఆ మడిలో మహిళా కూలీలు నాటు వేస్తుండగా పద్మ కాలు పాత బోరు బావి కేసింగ్‌లో పడింది. ఆమె నడుము వరకు అందులో కూరుకుపోయింది. అప్రమత్తమైన తోటి కూలీలు, యజమాని ఇచ్చిన సమాచారంతో ఎస్ఐ శ్రీనివాస్ రెడ్డి తన సిబ్బందితో హుటాహుటిన అక్కడికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. గ్రామస్తులు, జేసీబీ సహాయంతో కేసింగ్‌కు సమాంతరంగా గోతిని తీసి 4గంటల పాటు శ్రమించారు. చివరికి బోరు బావి కేసింగ్ ధ్వంసం చేసి పద్మను కాపాడారు. అనంతరం పద్మను చికిత్స నిమిత్తం భువనగిరి జిల్లా ఆసుపత్రికి తరలించారు.



బోరు బావి కేసింగ్‌లో ఇరుక్కున్న పద్మ

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.